
ఈనాడు


విజయవాడ 15-2-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 186
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00 పేజీలు 18+28
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru





అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో బడ్జెట్ ప్రతులను చంద్రబాబుకు అందిస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్. చిత్రంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్


ఎన్టీఆర్ భరోసా 27,719 కోట్లు


అమరావతి నిర్మాణం 6,000 కోట్లు



వైద్యం, ఆరోగ్యం 19,306 కోట్లు



పాఠశాల విద్య రూ. 32,308 కోట్లు


పోలవరం 6,105 కోట్లు


పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 22,941 కోట్లు


రోడ్లు, ఎయిర్ పోర్టులు, పోర్టులు: 13,546 కోట్లు


జల జీవన్ 4,000 కోట్లు


రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ 30,000 కోట్లు

సవాళ్లున్నా సంక్షేమం అభివృద్ధే సంకల్పం

ప్రజలకు సంక్షేమం అందించాలి.. రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించాలి.. ఆర్థిక సుడిగుండం నుంచి గట్టెక్కించాలి.. ఆంధ్రప్రదేశ్‌కు ఈ మూడింటినీ సాధించే బడ్జెట్ కావాలి.. ఇందుకు సొంత వనరులతోపాటు కేంద్ర సాయమూ కలిసిరావాలి. రాష్ట్ర ప్రభుత్వం శనివారం శాసనసభకు సమర్పించిన బడ్జెట్ అచ్చంగా ఈ ఆకాంక్షలనే ప్రతిఫలించింది.

పేదలకు వివిధ రూపాల్లో లబ్ధి రూ.51,883 కోట్లు

- పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం... తదితరాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు రూ.91,527 కోట్లు
- సాగునీటి రంగానికి రూ.18,223 కోట్లు
- రూ.3,32,205 కోట్ల అంచనాతో రాష్ట్ర బడ్జెట్
- ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు - అమరావతి

ఒకటీ ఒకటీ కలిస్తే ప్రతిసారీ రెండే కానక్కర్లేదు.. ఒక్కోసారి అనూహ్యంగా ఎన్నో రెట్ల బలం సమకూరొచ్చు... 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి రాష్ట్రంలో అఖండ విజయం సాధించడంతోపాటు అటు కేంద్రంలోనూ కీలక భాగస్వామిగా మారడం అలాంటిదే. ఆ పరపతితో.. మన సత్తువకు కేంద్ర బలాన్ని జోడించి, పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఆర్థిక నావను గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శతథా ప్రయత్నిస్తోంది. సంక్షేమంతోపాటు అభివృద్ధిలోనూ సొంత వనరులతోపాటు కేంద్ర పథకాలు చేదోడుగా ముందుకెళుతోంది. ఈ క్రమంలో కేంద్ర బడ్జెట్ కన్నా ముందే ప్రణాళికలు రూపొందించుకుంది. మన ఆకాంక్షలు, అవసరాలపై దిల్లీ పెద్దలతో నిరంతరం సంప్రదిస్తోంది. తాజా కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించిన పథకాలను రాష్ట్రానికి ఎలా తెచ్చుకోవాలో, ఛాలెంజ్ మోడ్‌లో ఎక్కువ నిధులు ఎలా సాధించుకోవాలో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. (మిగతా 2లో)

క్వాంటమ్ కంప్యూటింగ్ సౌకర్యాలకు రూ.638 కోట్లు

చేనేత కార్మికులకు ఆర్థిక సాయం రూ.245 కోట్లు

చాలా మెరుగైన బడ్జెట్


వైకాపా సృష్టించిన విధ్వంసం నుంచి కోలుకుంటూ. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో చాలా మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. ఇప్పుడిప్పుడే ఇబ్బందులు అధిగమించి ట్రాక్ ఎక్కుతున్నాం. రానున్న రెండు మూడేళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ వస్తుంది, అమరావతికి ఒక రూపు వస్తుంది. రాబోయే కాలంలో రాష్ట్రం అభివృద్ధి విషయంలో పరుగులు పెడుతుంది. అప్పుడు సంక్షేమం మరింత పెరుగుతుంది.

\- ముఖ్యమంత్రి చంద్రబాబు

సమగ్రాభివృద్ధికి బలమైన పునాది

స్వర్ణాంధ్ర సాధన దిశగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బలమైన పునాది వేసేలా రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టాం. విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన, యువత, మహిళా సాధికారత, సాంకేతికత ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే గ్రోత్ మోడల్‌గా ఈ బడ్జెట్ ఉంది.

\- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



రైతుకు 'రాజ' మార్గం

వ్యవసాయ, అనుబంధ శాఖలకు రూ.53,752 కోట్లు 3లో

ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం సబ్సిడీకి రూ.13,722 కోట్లు

బడ్జెట్‌పై ప్రత్యేక కథనాలు 3, 5, 6, 7 పేజీల్లో

రూ.లక్ష కోట్లతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్

- నగరాల పునర్నిర్మాణానికి కేంద్ర సాయం
- ఐదేళ్లలో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు
- మార్కెట్ అనుసంధానంగా పట్టణాభివృద్ధి
- అస్సాంలో నదీగర్భంలో రైలు-రోడ్డు వంతెన
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

ఈనాడు, దిల్లీ: నగరాలను ఆర్థిక వృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్ది వాటిని వర్తమాన అవసరాలకు తగ్గట్టు పునర్నిర్మించడానికి రూ.లక్ష కోట్ల 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద చేపట్టే ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 25% ఆర్థిక వనరుల్ని సాయంగా సమకూరుస్తాయి. మిగిలిన 50% మొత్తాన్ని మార్కెట్ నుంచి సమీకరించుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు రాబోయే ఐదేళ్లలో నగరాలకు రానున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన శుక్రవారం రాత్రి జరిగిన క్యాబినెట్ సమావేశంలో దీంతోసహా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అస్సాంలో బ్రహ్మపుత్ర నదీ గర్భంలో దేశంలోనే తొలిసారిగా రైలు-రోడ్డు వంతెనను సొరంగంలో నిర్మించాలనేది దానిలో ఒకటి. వీటి వివరాలను (మిగతా 2లో)

ఈశాన్య భారతంలో చరిత్రాత్మక ఘట్టం

అస్సాంలో తొలి 'ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ' ప్రారంభం

జాతీయ రహదారిపై దిగిన ప్రధాని మోదీ విమానం 16లో

రన్‌వేను తాకి వెళ్లిన సుఖోయ్, రఫేల్ యుద్ధ విమానాలు



దిబ్రూగఢ్ జిల్లాలో జాతీయ రహదారి-37పై ఏర్పాటు చేసిన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై ఫైటర్ జెట్ విన్యాసాలను వీక్షిస్తున్న ప్రధాని మోదీ, భారత వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్



క్రికెట్ ప్రపంచం స్తంభించిపోయే సమయం వచ్చేసింది. ఆ దేశం ఈ దేశం అని తేడా లేదు.. క్రికెట్ ఉనికి ఉన్న ప్రతి చోటా తెరలన్నీ ఆ పోరుతో నిండిపోవాల్సిందే. భారత్, పాకిస్థాన్‌ల్లో అయితే.. సాయంత్రం నుంచి వీధులన్నీ మూగబోతే ఆశ్చర్యమేమీ లేదు. ఉత్కంఠను తార స్థాయికి తీసుకెళ్లే చిరకాల ప్రత్యర్థుల పోరుకు ఇంకొన్ని గంటలే మిగిలున్నాయి.

భారత్, పాకిస్థాన్ మ్యాచ్ అంటే ఎప్పుడూ అమితాసక్తే. అందులోనూ ఈసారి ప్రత్యేక పరిస్థితుల్లో తలపడబోతున్నాయి రెండు జట్లూ. నిరుడు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాక రెండు జట్లూ తొలిసారి ప్రపంచకప్‌లో తలపడబోతున్నాయి.

ఐసీసీ టోర్నీల్లో పాక్ మ్యాచ్ అనగానే రెచ్చిపోయి ఆడే టీమ్‌ఇండియా, ఘనమైన రికార్డును కొనసాగించాలని చూస్తుంటే.. ఇటీవలి ఫామ్‌ను కొనసాగిస్తూ, కసితో ఆడి భారత్‌ను దెబ్బ తీయాలని చూస్తోంది పాక్. కాబట్టి మ్యాచ్ హోరాహోరీగా సాగడం.. అభిమానుల్లో భావోద్వేగాలు పతాక స్థాయికి చేరుకోవడం ఖాయం.

చాంపియన్స్

టీ20 ప్రపంచకప్‌లో ఈనాడు

వెస్టిండీస్ × నేపాల్	వేదిక: ముంబయి, ఉ॥ 11.00
అమెరికా × నమీబియా	వేదిక: చెన్నై, మ॥ 3.00
భారత్ × పాకిస్థాన్	వేదిక: కొలంబో, రా॥ 7.00

రాత్రి 7 నుంచి

క్రికెట్ యుద్ధానికి సిద్ధమా!

నేడే భారత్, పాకిస్థాన్ పోరు

టీ20 ప్రపంచకప్‌లో అమీతుమీ


సూర్యకుమార్


ఆఘా

8 — టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో భారత్ ఆడిన మ్యాచ్‌లు. 7 విజయాలు సాధించిన టీమ్‌ఇండియా.. 2021 ప్రపంచకప్‌లో, ఒక్కసారి మాత్రమే ఓటమి పాలైంది.

కొలంబో

క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సమయం రానే వచ్చింది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ ఆదివారం టీ20 ప్రపంచకప్‌లో భాగంగా గ్రూప్-ఎ పోరులో తలపడబోతున్నాయి. నిరుడు ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు ఆతిథ్య పాకిస్థాన్‌కు వెళ్లని నేపథ్యంలో ఈ టోర్నీలో తన మ్యాచ్‌లను పాకిస్థాన్ కొలంబోలో ఆడుతున్న సంగతి తెలిసిందే. అక్కడే ఆ జట్టును భారత్ ఢీకొనబోతోంది. ఇప్పటికే ఆ వేదికలో రెండు మ్యాచ్‌లు ఆడి గెలిచిన ఉత్సాహంలో పాక్ ఉండగా.. ఐసీసీ టోర్నీల్లో పాక్‌పై తిరుగులేని రికార్డును కొనసాగిస్తూ మరో విజయాన్ని ఖాతాలో వేసుకోవాలని భారత్ చూస్తోంది. కొన్ని నెలల ముందు ఆసియా కప్‌లో పాక్‌తో తలపడ్డ మూడుసార్లూ టీమ్ ఇండియా గెలవడం విశేషం. కాబట్టి ఈ మ్యాచ్‌లోనూ సూర్యకుమార్ సేనే ఫేవరెట్. కానీ ఇటీవల మెరుగ్గా ఆడుతున్న పాక్‌ను మరీ తేలిగ్గా తీసుకుంటే కష్టమే.

అభిషేక్ ఆడుతున్నట్లేనా?: ప్రస్తుత భారత జట్టులో అతి పెద్ద స్టార్ అనదగ్గ అభిషేక్ శర్మ.. పాక్‌తో మ్యాచ్‌లో ఆడతాడా లేదా అని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా ఆసుపత్రి పాలైన అతను.. నమీబియాతో గత మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు. అయితే అభిషేక్ కోలుకున్నాడని, ప్రాక్టీస్‌లో కూడా పాల్గొన్నాడని జట్టు వర్గాలు చెబుతున్నాయి. విలేకరుల సమావేశంలో సూర్య మాట్లాడుతూ.. జట్టుకు సంబంధించి సమస్యలేమీ లేవన్నాడు. కాబట్టి అభిషేక్ ఆడబోతున్నట్లే భావించాలి. అతను బరిలోకి దిగితే సంజు శాంసన్ డగౌట్‌కు పరిమితమవుతాడు. నిరుడు ఆసియా కప్‌లో చెలరేగి ఆడిన అభిషేక్.. పాక్ బౌలర్లను బెదరగొట్టాడు. కానీ ఫైనల్లో అతను విఫలమవడంతో భారత్ ఒత్తిడిని ఎదుర్కొంది. కాబట్టి షహీన్ అఫ్రిది బృందం మరోసారి అతణ్ని లక్ష్యంగా చేసుకుంటుందనడంలో సందేహం లేదు. అభిషేక్ పవర్ ప్లేలో నిలిచాడంటే భారీ స్కోరుకు బాటలు పడ్డట్లే. మరో ఓపెనర్ ఇషాన్ సైతం దూకుడైన బ్యాటరే. వీరి తర్వాత ఆసియా కప్ ఫైనల్లో అదరగొట్టిన తిలక్ వర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, రింకు సింగ్‌లతో భారత బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. మరి పాక్‌తో పోరులో ఎవరు హీరో అవుతారో చూడాలి. పాకిస్థాన్ జట్టు ఓపెనర్లు ఫర్హాన్, అయూబ్‌లతో పాటు ఆఘా, బాబర్, షాదాబ్‌ల మీద ఆశలు పెట్టుకుంది. ఉస్మాన్ ఖాన్, ఫహీమ్ అష్రాఫ్ కూడా ప్రమాదకర ఆటగాళ్లే.


అభిషేక్


తారిఖ్

మిస్టరీ స్పిన్నర్ల పోరు: కొలంబో అంటే స్పిన్నర్లకు బాగా సహకరించే మైదానం. రెండు జట్లలోనూ స్పిన్ బలానికి లోటు లేదు. భారత్‌కు వరుణ్ చక్రవర్తి రూపంలో మిస్టరీ స్పిన్నర్ ఉండగా.. పాకిస్థాన్ ఉస్మాన్ తారిఖ్‌ను తురుపుముక్కలా చూస్తోంది. వరుణ్ కొన్ని నెలల కిందట ఆసియా కప్‌లో పాక్ బ్యాటర్లను బాగా ఇబ్బంది పెట్టాడు. నెదర్లాండ్స్‌తో గత మ్యాచ్‌లో వరుణ్.. 2 ఓవర్లలో 7 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీశాడు. వరుణ్‌కు తోడు అక్షర్, కుల్‌దీప్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు. పిచ్‌ను దృష్టిలో ఉంచుకుని ఒక పేసర్ (అర్ష్‌దీప్)ను తగ్గించుకుని కుల్‌దీప్‌ను ఆడించే అవకాశాలున్నాయి. బుమ్రాకు తోడు ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్య, శివమ్ దూబె పేస్ అవసరాలు తీరుస్తారు. పాకిస్థాన్ జట్టులో ఇప్పుడు అందరి దృష్టీ ఉస్మాన్ తారిఖ్ మీదే ఉంది. బంతిని వదిలేముందు కొంచెం ఆగి విసిరే తన శైలి బ్యాటర్లను అయోమయానికి గురి చేస్తోంది. అతడితో పాటు అబ్రార్, ఆల్‌రౌండర్లు షాదాబ్ ఖాన్, సయిమ్ అయూబ్‌ల స్పిన్‌ను ఎదుర్కోవడంలో భారత బ్యాటర్లు జాగ్రత్త వహించాల్సిందే. మరో స్పిన్నర్ నవాజ్‌ను పక్కన పెట్టి షహీన్ అఫ్రిది, ఫహీమ్ అష్రాఫ్‌లకు తోడుగా ఇంకో పేసర్ సల్మాన్ మీర్జాను పాక్ బరిలోకి దించనున్నట్లు సమాచారం.

"కొలంబో మాకిప్పుడు సొంత మైదానం. మా మ్యాచ్‌లను ఇక్కడే ఆడుతున్నాం. కాబట్టి ప్రతి మ్యాచ్ గెలిచేస్తామని కాదు. ఇది సానుకూలతా అంటే చెప్పలేను. వేదిక ఏదైనా మెరుగైన క్రికెట్ ఆడడం, ప్రణాళికలను సరిగ్గా అమలు చేయడం కీలకం''
– సల్మాన్ ఆఘా, పాకిస్థాన్ కెప్టెన్

"భారత్, పాకిస్థాన్ మ్యాచ్ అంటే అదొక పెద్ద సందర్భం. ప్రతిభను చాటడానికి గొప్ప వేదిక. ఇది కూడా మిగతా మ్యాచ్‌ల్లాగే అని చెప్పొచ్చు. కానీ దీని ప్రాధాన్యమేంటో ఆడేవాళ్లకు తెలుసు. ఎందుకంటే పాక్‌తో తరచూ తలపడం''
– సూర్యకుమార్, భారత కెప్టెన్

మ్యాచ్‌కు వర్షం ముప్పు

భారత్, పాక్ మ్యాచ్ సజావుగా జరుగుతుందా లేదా అన్నది వరుణుడి కరుణ మీదే ఆధారపడింది. ఈ మ్యాచ్‌కు వేదికైన కొలంబోలో ఆదివారం వర్షం పడే అవకాశాలు 70 శాతం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా. మ్యాచ్ రద్దయితే ఇరు జట్లకు చెరో పాయింట్ ఇస్తారు. ప్రపంచకప్‌లో సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లకు మాత్రమే రిజర్వ్ డే ఉంది.

తుది జట్లు (అంచనా)... భారత్: అభిషేక్/సంజు, ఇషాన్, తిలక్, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, దూబె, రింకు, అక్షర్, కుల్‌దీప్, వరుణ్, బుమ్రా; **పాకిస్థాన్:** ఫర్హాన్, అయూబ్, ఆఘా (కెప్టెన్), బాబర్, షాదాబ్, ఉస్మాన్, ఫహీమ్, నవాజ్/సల్మాన్ మీర్జా, షహీన్, అబ్రార్, తారిఖ్.

కరచాలనం ఉంటుందా?

భారత్, పాకిస్థాన్ మ్యాచ్ టాస్ సమయంలో కెప్టెన్లు, మ్యాచ్ అనంతరం రెండు జట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకుంటారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. గత ఏడాది పహల్గాం ఉగ్రదాడి అనంతరం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆసియా కప్‌లో సూర్యతో పాటు భారత ఆటగాళ్లు ఎవ్వరూ.. ప్రత్యర్థులతో చేతులు కలపలేదు. దీనిపై పాక్ జట్టు ఎంత రాద్ధాంతం చేసినా.. టీమ్‌ఇండియా పట్టించుకోలేదు. ఇటీవల అండర్-19 ప్రపంచకప్‌లో జూనియర్ జట్టు సైతం సీనియర్ల బాటలోనే నడిచింది. మరి ఆదివారం ఏం జరుగుతుందన్నది ఆసక్తికరం. ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి, తర్వాత వెనక్కి తగ్గిన పాక్.. ఐసీసీ ప్రతినిధి వద్ద కరచాలన వ్యవహారం గురించి ప్రస్తావించిందని, క్రీడా స్ఫూర్తిని పాటిస్తూ భారత ఆటగాళ్లు చేతులు కలిపేలా చూడాలని చెప్పినట్లు వార్తలు వచ్చాయి. విలేకరుల సమావేశంలో ఈ విషయమై భారత సారథి సూర్యకుమార్ వద్ద ప్రస్తావిస్తే.. "ఇంకో 24 గంటలు ఆగండి. మేం ఇక్కడికి క్రికెట్ ఆడడానికి వచ్చాం. మెరుగైన క్రికెట్ ఆడతాం. మంచి తిండి తిని, నిద్రపోండి. ఏం చేయాలన్నది రేపు నిర్ణయిస్తాం'' అన్నాడు.


కెప్టెన్సీ నుంచి వైదొలగాలని ధోనీతో చెప్పాం


పరాంజపే

దిల్లీ: ధోని 2017లో హఠాత్తుగా ఓ రోజు పరిమిత ఓవర్ల జట్టు కెప్టెన్‌గా వైదొలిగాడు. కోహ్లి అన్ని ఫార్మాట్లకు సారథి అయిపోయాడు. అయితే ధోని తనంతట తానే పగ్గాలు వదులుకున్నాడని అప్పట్లో అంతా భావించారు. కానీ బీసీసీఐ సెలక్షన్ కమిటీ చెప్పడంతోనే అతడు బాధ్యతల నుంచి తప్పుకొన్నట్లు అప్పటి సెలక్టర్ జతిన్ పరాంజపే తెలిపాడు. "ధోని నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్నాడు. అప్పటికి గంట అయింది. ఎమ్మెస్కే, నేను ఒకరి ముఖాలు ఒకరం చూసుకుంటున్నాం. అత్యంత గౌరవంగా ఈ విషయం అతడికి చెప్పడం కోసం మేం సన్నద్ధమయ్యాం. మేం అతడి దగ్గరకు వెళ్లాం. 'మహి, మార్పునకు ఇదే సరైన సమయం' అని చెప్పాం. తర్వాత మహి.. ఎమ్మెస్కేతో 'అన్నా, ఇది సరైన నిర్ణయం. నా నుంచి ఏం కోరుకుంటున్నారో చెప్పండి' అన్నాడు. అప్పుడు ఎమ్మెస్కే 'బాధ్యతల నుంచి వైదొలగాలని అనుకుంటున్నట్లు నువ్వు లిఖితపూర్వకంగా చెప్పాలి' అన్నాడు. 'సరే అలాగే చేస్తా' అని ధోని చెప్పాడు" అని పరాంజపే తెలిపాడు. ఆ రోజు రాత్రే ధోని.. తమకు మెయిల్ చేశాడని, తాను కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలనుకుంటున్నట్లు అందులో పేర్కొన్నాడని అతడు చెప్పాడు.

ప్రమోద్ సిక్సర్

ఆరోసారి ప్రపంచ టైటిల్ సొంతం



ప్రమోద్ భగత్

మనామా (బహ్రెయిన్): భారత పారా షట్లర్ ప్రమోద్ భగత్ చరిత్ర సృష్టించాడు. ప్రపంచ పారా బ్యాడ్మింటన్‌లో ఆరుసార్లు సింగిల్స్ విజేతగా నిలిచిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. శనివారం ఎస్ఎల్3 విభాగం పురుషుల సింగిల్స్ ఫైనల్లో అతడు 21-12, 21-18తో మహ్మద్ ఇమ్రాన్ (ఇండోనేసియా)ను ఓడించాడు. అతడికిది వరుసగా నాలుగో ప్రపంచ టైటిల్. ప్రమోద్ 2009, 2015, 2019, 2022, 2024లోనూ టైటిల్ సొంతం చేసుకున్నాడు. సాధారణ షట్లర్లలో అత్యధిక టైటిళ్ల రికార్డు చైనాకు చెందిన లిన్ డాన్ (5) పేరిట ఉంది. పురుషుల డబుల్స్‌లోనూ ప్రమోద్ టైటిల్ అందుకున్నాడు. ఫైనల్లో ప్రమోద్, సుకాంత్ కదం ద్వయం 21-11, 21-11తో జగదీశ్ దిల్లీ, నవీన్ శివకుమార్ జోడీపై విజయం సాధించింది. డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా 18 నెలలు సస్పెన్షన్‌కు గురైన ప్రమోద్ పునరాగమనంలో సాధించిన పెద్ద విజయం ఇదే. 2024 పారిస్ పారాలింపిక్స్‌కూ అతడు దూరమయ్యాడు.

శ్రీవల్లి జోడీకి టైటిల్


అంకిత, రష్మిక

పుణె: శ్రీవల్లి రష్మిక భమిడిపాటి, అంకిత రైనా జోడీ ఐటీఎఫ్ మహిళల టెన్నిస్ టోర్నమెంట్ టైటిల్ గెలిచింది. శనివారం మహిళల డబుల్స్ ఫైనల్లో 7-6 (7-3), 6-3తో విజయం సాధించింది. రష్మిక ఐటీఎఫ్ మహిళల టైటిల్ గెలవడం ఇది తొమ్మిదోసారి.



ఆమె కోసం ఓ టాటూ



దిల్లీ: భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఒంటి మీద ఓ కొత్త పచ్చబొట్టు చేరింది. ప్రేయసి మహికా శర్మతో అనుబంధానికి గుర్తుగా హార్దిక్.. తన మెడపై రెండు చిరుత చిత్రాలతో పాటు వాటి మధ్యలో 'ఎం' అనే అక్షరాన్ని పచ్చబొట్టు వేయించుకున్నాడు. ఒక చిరుత పైకి కనిపిస్తుండగా.. మరో చిరుత దాని నీడలా వెనుక ఉంది. సెలబ్రిటీ టాటూ ఆర్టిస్ట్ సన్నీ భానుశాలీ ఈ పచ్చబొట్టు చిత్రించాడు.

పదో తరగతి పరీక్షల కోసం..


సూర్యవంశీ

పట్నా: మైదానంలో బౌలర్లను చితగ్గా కొట్టే యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి పెద్ద పరీక్ష. అతడు ఈ పరీక్షను ఎదుర్కొనేది మైదానంలో కాదు! 14 ఏళ్ల వైభవ్.. బ్యాట్ వదిలి పెన్ను పట్టి ఈనెల 17న ఆరంభమయ్యే పదో తరగతి పరీక్షలకు హాజరు కాబోతున్నాడు. "అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదిగినా.. వైభవ్ ఇంకా విద్యార్థే. మా పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయనున్నాడు. అతడు ఎప్పుడు వస్తాడా అని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా వేచి చూస్తున్నారు. వైభవ్ సెలబ్రిటీ కావడంతో భద్రతా ఏర్పాట్లు చేశాం" అని పొదార్ అంతర్జాతీయ స్కూల్ ప్రిన్సిపాల్ నీల్ కిశోర్ తెలిపారు. ఇటీవల భారత అండర్-19 జట్టు ప్రపంచకప్ గెలవడంలో వైభవ్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

దక్షిణాఫ్రికా హ్యాట్రిక్

- న్యూజిలాండ్‌పై ఘనవిజయం
- సత్తాచాటిన మార్క్రమ్, యాన్సెన్


యాన్సెన్ 4/40

అహ్మదాబాద్: టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా దాదాపుగా సూపర్ 8 చేరినట్లే. టోర్నీలో ఆ జట్టు వరుసగా మూడో విజయాన్నందుకుంది. మార్క్రమ్ (86 నాటౌట్; 44 బంతుల్లో 8×4, 4×6) మెరవడంతో శనివారం గ్రూప్-డి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. మ్యాచ్‌లో సఫారీ జట్టు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. చాప్‌మన్ (48; 26 బంతుల్లో 6×4, 2×6), డరిల్ మిచెల్ (32; 24 బంతుల్లో 2×4, 1×6) రాణించడంతో మొదట కివీస్ 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' యాన్సెన్ (4/40) ఆ జట్టును దెబ్బతీశాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. అలెన్ (31; 17 బంతుల్లో 4×4, 2×6) దూకుడుతో 5.1 ఓవర్లలో 57/1తో మెరుగ్గానే కనిపించింది. కానీ ఏడు పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. 64/4తో నిలిచిన న్యూజిలాండ్‌ను చాప్‌మన్, మిచెల్ జంట ఆదుకుంది. అయిదో వికెట్‌కు 74 పరుగులు జోడించింది. వీళ్లిద్దరూ ఔటయ్యాక నీషమ్ (23 నాటౌట్) రాణించాడు. మార్క్రమ్ జోరుతో లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 17.1 ఓవర్లలో 3 వికెటే కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఫోర్లు, సిక్స్‌లతో చెలరేగిన మార్క్రమ్.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. డికాక్ (20), రికెల్టన్ (21), బ్రెవిస్ (21), మిల్లర్ (24 నాటౌట్)ల సహకారంతో పని పూర్తి చేశాడు.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫర్ట్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 13; అలెన్ (సి) మార్క్రమ్ (బి) యాన్సెన్ 31; రచిన్ (సి) మిల్లర్ (బి) యాన్సెన్ 13; ఫిలిప్స్ (బి) మహరాజ్ 1; చాప్‌మన్ (సి) రికెల్టన్ (బి) యాన్సెన్ 48; మిచెల్ (సి) స్టబ్స్ (బి) (బి) ఎంగిడి 32; శాంట్నర్ (సి) రికెల్టన్ (బి) బాష్ 4; నీషమ్ నాటౌట్ 23; హెన్రీ నాటౌట్ 9; ఎక్స్‌ట్రాలు 1 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 175; **వికెట్ల పతనం:** 1-33, 2-57, 3-58, 4-64, 5-138, 6-141, 7-145; **బౌలింగ్:** ఎంగిడి 4-0-34-1; రబాడ 4-0-27-0; యాన్సెన్ 40-0-40-4; కేశవ్ 3-0-24-1; బాష్ 4-0-34-1; మార్క్రమ్ 1-0-15-0

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్క్రమ్ నాటౌట్ 86; డికాక్ (బి) ఫెర్గ్యూసన్ 20; రికెల్టన్ (సి) మిచెల్ (బి) నీషమ్ 21; బ్రెవిస్ (సి) మిచెల్ (బి) రచిన్ 21; మిల్లర్ నాటౌట్ 24; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (17.1 ఓవర్లలో 3 వికెట్లకు) **178; వికెట్ల పతనం:** 1-62, 2-102, 3-131; **బౌలింగ్:** మ్యాట్ హెన్రీ 4-0-38-0; ఫెర్గ్యూసన్ 3.1-0-33-1; డఫీ 3-0-50-0; శాంట్నర్ 4-0-33-0; నీషమ్ 2-0-15-1; రచిన్ 1-0-9-1

బెల్జియం చేతిలో భారత్ ఓటమి

రవూర్కెలా: ఎఫ్ఐహెచ్ ప్రో హాకీ లీగ్‌లో రవూర్కెలా అంచెలో భారత జట్టుకు మరో పరాజయం ఎదురైంది. తొలి మ్యాచ్‌లో 0-8తో అర్జెంటీనా చేతిలో చిత్తయిన హర్మన్‌ప్రీత్ బృందం.. శనివారం 2-4తో బెల్జియం చేతిలో ఓడింది. అలెగ్జాండర్ హెండ్రిక్స్ (14వ, 17వ), హ్యూగో (11వ), ఆర్థర్ స్లోవర్ (15వ) బెల్జియం విజయంలో కీలకపాత్ర పోషించారు. భారత్ తరఫున ఆదిత్య (24వ), హర్మన్‌ప్రీత్ సింగ్ (37వ) మాత్రమే సఫలమయ్యారు. ఆదివారం చివరి మ్యాచ్‌లో అర్జెంటీనాతో భారత్ తలపడనుంది.

స్నేహిత్ పరాజయం

చెన్నై: ప్రపంచ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ టోర్నమెంట్‌లో తెలుగు కుర్రాడు స్నేహిత్ సూరావజ్జుల ప్రయాణం ముగిసింది. అతడు ప్రిక్వార్టర్స్‌లో 1-3 (6-11, 12-10, 13-15, 13-11)తో టాప్ సీడ్ జన్‌సంగ్ (కొరియా) చేతిలో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో హర్మీత్ దేశాయ్, యశస్వినీ గోర్పడే జోడీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో 3-0 (11-9, 11-6, 11-9)తో పయాస్ జైన్, సిండ్రెలా దాస్ ద్వయాన్ని ఓడించింది. సత్యన్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. అతడు ప్రిక్వార్టర్స్‌లో 3-2 (9-11, 11-3, 10-12, 11-7, 11-5)తో లోన్‌స్క్యూపై గెలిచాడు.

ఆస్ట్రేలియా × భారత్

మహిళల తొలి టీ20 నేడు ● మ॥ 1.45 నుంచి

సిడ్నీ: వన్డే ప్రపంచకప్ గెలుచుకున్న భారత మహిళల జట్టు.. టీ20 ప్రపంచకప్‌నకు తమ సన్నాహాల్లో కీలక దశను ప్రారంభించనుంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగే తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను ఢీకొంటుంది. రెండో టీ20 కాన్‌బెర్రాలో, మూడో టీ20 అడిలైడ్‌లో జరుగుతుంది. ఈ ఏడాది భారత మహిళలకు ఇదే తొలి టీ20 సిరీస్. ప్రపంచ నంబర్ 3గా ఆ జట్టు సిరీస్‌లో అడుగుపెడుతోంది. మహిళల ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. ఈ పర్యటనలో టీమ్‌ఇండియా.. ఆసీస్‌తో మూడు వన్డేలు, ఓ టెస్టు మ్యాచ్ కూడా ఆడనుంది. టీ20 ప్రపంచకప్ జూన్-జులైలో ఇంగ్లాండ్‌లో జరగనుంది.

టకర్ విధ్వంసం

ఐర్లాండ్ చేతిలో ఒమన్ చిత్తు


టకర్ 94 నాటౌట్

కొలంబో: ఐర్లాండ్ అదరగొట్టింది. శనివారం గ్రూప్-బి మ్యాచ్‌లో ఒమన్‌ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసి టోర్నీలో గెలుపు బోణీ కొట్టింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ లార్కన్ టకర్ (94 నాటౌట్; 51 బంతుల్లో 10×4, 4×6), గారెత్ డెలానీ (56; 30 బంతుల్లో 3×4, 4×6), జార్జ్ డాక్రెల్ (35 నాటౌట్; 9 బంతుల్లో 5×6) విధ్వంసంతో మొదట ఐర్లాండ్ 5 వికెట్లకు 235 పరుగుల భారీ స్కోరు సాధించింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇది రెండో అత్యధిక స్కోరు. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ (3/33) ఒక్కడే రాణించాడు. భారీ ఛేదనలో ఒమన్ చతికిలపడింది. 18 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌటైంది. ఆమిర్ కలీమ్ (50; 29 బంతుల్లో 5×4, 2×6), హమ్మద్ మీర్జా (46; 37 బంతుల్లో 6×4, 1×6) పోరాడారు. జోష్ లిటిల్ (3/16), మాథ్యూ హంఫ్రీస్ (2/27) ప్రత్యర్థికి కళ్లెం వేశారు. 42 పరుగులకు చివరి 8 వికెట్లు చేజార్చుకుని ఒమన్ పరాభవాన్ని మూటగట్టుకుంది. కలీమ్, హమ్మద్, సుఫియాన్ (10) మినహా బ్యాటర్లెవరూ రెండంకెల స్కోరు చేయలేదు.

పది ఓవర్ల తర్వాత..: ఐర్లాండ్ అంత స్కోరు సాధించిందంటే ఆశ్చర్యపోవాల్సిందే. ఆ జట్టు తొలి ఓవర్లోనే టిమ్ టెక్టార్ (5) వికెట్ కోల్పోయింది. రాస్ అడైర్ (14), హ్యారీ టెక్టార్ (14) ఎంతోసేపు నిలవలేదు. పవర్‌ప్లేలో 47/3తో, పది ఓవర్లకు 79/4తో ఓ మోస్తరు స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించింది. కానీ 10వ ఓవర్ తర్వాత ఆ జట్టు ఆట హైలైట్స్‌ను తలపించింది. గారెత్ డెలానీ, టకర్ 11వ ఓవర్లో చెరో సిక్సర్ బాదారు. ఇద్దరూ పోటీపడి బౌండరీలు బాదారు. 35 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన టకర్ ఆ తర్వాత మరింత రెచ్చిపోయాడు. మరోవైపు 17 ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్స్ బాదిన డెలానీ 28 బంతుల్లో 50 పూర్తి చేసుకుని అదే ఓవర్లో అయిదో బంతికి ఔటయ్యాడు. టకర్, డెలానీ అయిదో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 18 ఓవర్లో మహ్మద్ నదీమ్‌కు టకర్ చుక్కలు చూపించాడు. 6, 4, 4, 6, 0, 6తో 26 పరుగులు రాబట్టాడు. ఇన్నింగ్స్ చివరి మూడు బంతుల్ని డాక్రెల్ సిక్సర్లుగా మలిచి జట్టు స్కోరును 230 దాటించాడు. ఐర్లాండ్ చివరి నాలుగు ఓవర్లలో 86 పరుగులు రాబట్టింది.

సంక్షిప్త స్కోర్లు: ఐర్లాండ్: 235/5 (టకర్ 94 నాటౌట్, డెలానీ 56, డాక్రెల్ 35 నాటౌట్, షకీల్ అహ్మద్ 3/33)

ఒమన్: 18 ఓవర్లలో 139 ఆలౌట్ (కలీమ్ 50, హమ్మద్ 46, జోష్ లిటిల్ 3/16, హంఫ్రీస్ 2/27, మెకార్తీ 2/32)

బాంటన్ మెరుపులు

స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ గెలుపు


బాంటన్ 63 నాటౌట్

కోల్‌కతా: టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ గాడిలో పడింది. గత మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో ఓడిన ఆ జట్టు.. బలంగా పుంజుకుంది. శనివారం గ్రూప్-సి మ్యాచ్‌లో బ్రూక్ సేన 5 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను ఓడించింది. మొదట స్కాట్లాండ్ 19.4 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌటైంది. రిచీ బెరింగ్టన్ (49; 32 బంతుల్లో 5×4, 2×6), మైకేల్ జోన్స్ (33; 20 బంతుల్లో 5×4, 1×6) రాణించారు. రషీద్ (3/36), ఆర్చర్ (2/24), డాసన్ (2/34) ప్రత్యర్థికి కళ్లెం వేశారు. టామ్ బాంటన్ (63 నాటౌట్; 41 బంతుల్లో 4×4, 3×6) మెరుపులతో ఇంగ్లాండ్ 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. జాకబ్ బెతెల్ (32), సామ్ కరన్ (28) విజయంలో తమ వంతు పాత్ర పోషించారు. 3 మ్యాచ్‌ల్లో ఇంగ్లాండ్‌కు ఇది రెండో విజయం. అన్నే మ్యాచ్‌లు ఆడిన స్కాట్లాండ్ 2 మ్యాచ్‌ల్లో ఓడి.. ఒకటి గెలిచింది.

బాంటమ్ నిలిచాడు: లక్ష్యం పెద్దదేమీ కాదు.. అయినా ఇంగ్లాండ్ ఆరంభంలో ఇబ్బంది పడింది. 13 పరుగులకే ఆ జట్టు ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (2), బట్లర్ (3) ఔటైపోయారు. ఈ స్థితిలో టామ్ బాంటన్ నిలిచాడు. బెతెల్ జోడీగా స్కోరు పెంచాడు. మెక్‌ములన్ వేసిన అయిదో ఓవర్లో బెతెల్ వరుసగా 6, 4, 4 కొట్టడంతో ఇంగ్లాండ్ స్కోరు వేగాన్ని అందుకుంది. మరోవైపు వాట్ (9వ ఓవర్) బౌలింగ్‌లో బాంటన్ రెచ్చిపోయి మూడు సిక్స్‌లు బాదేశాడు. 9 ఓవర్లకు 76/2తో ఇంగ్లాండ్ మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే బెతెల్, కెప్టెన్ బ్రూక్ (4) వరుస ఓవర్లలో ఔట్ కావడం, తర్వాత రెండు ఓవర్లు ఒక్క బౌండరీ కూడా రాకపోవడంతో ఇంగ్లాండ్ కాస్త ఒత్తిడికి గురైంది. ఈ స్థితిలో సామ్ కరన్ దూకుడుగా ఆడాడు. 36 బంతుల్లో 44 పరుగులు చేయాల్సిన స్థితిలో లియాస్క్, వాట్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు బాదడంతో సమీకరణం తేలికైంది. సామ్ ఔటైనా.. విల్ జాక్స్ (16 నాటౌట్) తోడుగా బాంటన్ పని పూర్తి చేశాడు. అంతకుముందు స్కాట్లాండ్‌ను ఇంగ్లాండ్ బౌలర్లు కట్టడి చేశారు. ఆ జట్టు 42 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినా.. కెప్టెన్ రిచీ బెరింగ్టన్ ఆదుకున్నాడు. టామ్ బ్రూస్ (24), డేవిడ్‌సన్ (20 నాటౌట్) రాణించడంతో స్కాట్లాండ్ స్కోరు 150 దాటింది.

స్కాట్లాండ్: 152 (రిచీ బెరింగ్టన్ 49, మైకేల్ జోన్స్ 33, టామ్ బ్రూస్ 24, డేవిడ్‌సన్ 20 నాటౌట్; రషీద్ 3/36, డాసన్ 2/34, ఆర్చర్ 2/24)

ఇంగ్లాండ్: 18.2 ఓవర్లలో 155/5 (టామ్ బాంటన్ 63 నాటౌట్, బెతెల్ 32, సామ్ కరన్ 28, జాక్స్ 16 నాటౌట్)

ఉత్తరాఖండ్ × కర్ణాటక, జమ్ముకశ్మీర్ × బెంగాల్ ● నేటి నుంచే రంజీ సెమీస్ ● ఉ. 9 గంటల నుంచి



ఈనాడు



విజయవాడ 15-2-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 186

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కొత్త పథకాలు, కార్యక్రమాలు



ఈనాడు, అమరావతి: రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం పలు కొత్త పథకాలు, కార్యక్రమాలను ప్రకటించింది. ఇంద్రధనుస్సు కార్యక్రమం కింద దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనుంది. వారికి రాయితీ పథకాల పునరుద్ధరణ, క్రీడా శిక్షణ, గృహ నిర్మాణం, వినికిడిలోపం ఉన్నవారికి ప్రత్యేక డిగ్రీ కళాశాల, దివ్యాంగుల భవనాల నిర్మాణం చేపట్టనుంది.

- రూ.30 వేల కోట్లతో రాయలసీమ రీజియన్‌ను అంతర్జాతీయ ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.
- పోలీసు శాఖకు కొత్తగా మూడు వేల వాహనాల కొనుగోలుకు బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఆన్‌లైన్ మోసాలు వంటి నేరాలను ఎదుర్కొనేందుకు జిల్లాకో ప్రత్యేక సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు నిర్ణయించింది.



- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకం పునరుద్ధరణ. అందుకోసం రూ.51.15 కోట్లు ప్రకటించింది.
- ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటు చేసి, రాష్ట్ర సంపదను పెంపొందించేందుకు కొత్త విధానాన్ని తీసుకొచ్చింది.
- వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి దశలో కొత్తగా 100 న్యాయస్థానాల ఏర్పాటుకు ప్రతిపాదించింది.
- చేనేత కార్మికులకు ఏడాదికి రూ.25 వేల చొప్పున ఆర్థికసాయం. దీనికి రూ.245 కోట్లు ఇవ్వనుంది.
- వచ్చే ఏప్రిల్ నుంచి చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించనుంది.



- వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీ జీ రామ్ జీ) కార్యక్రమానికి రాష్ట్ర వాటాగా రూ.3,346 కోట్లు.
- పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు రూ.1,500 కోట్లు, వసతి గృహాల్లో రూ.300 కోట్లతో సౌకర్యాలు కల్పించనుంది.

విద్యకు రూ.34,875 కోట్లు

ఇందులో పాఠశాలలకు రూ.32,308.31 కోట్లు • చదువులకు 11% నిధులు



ఈనాడు, అమరావతి: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మొత్తం బడ్జెట్‌లో విద్యకు రూ.34,875 కోట్లు (11శాతం) కేటాయించింది. ఇందులో పాఠశాల విద్యకు రూ.32,308 కోట్లు కేటాయించింది. గతేడాది (2025-26)తో పోలిస్తే ఒక్క పాఠశాల విద్యకే రూ.502.66 కోట్లు అదనంగా ఇచ్చింది. పాఠశాల విద్యలో జీతభత్యాలకే అధికంగా ఖర్చవుతోంది. ఉన్నత విద్యకు రూ.2,566.80 కోట్లు ఇచ్చింది. యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రాధాన్యమిచ్చింది. ఇందుకు రూ.1,231.91 కోట్లు కేటాయించింది. సమగ్ర శిక్షా అభియాన్‌కు కేంద్ర ప్రభుత్వం 60% నిధులు ఇస్తుండగా.. రాష్ట్రం 40% నిధులను సమకూర్చాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు కలిపి ఈ ఏడాది రూ.2,946 కోట్లుగా ఉండొచ్చని బడ్జెట్‌లో పేర్కొంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు అందించే విద్యార్థి మిత్ర కిట్లకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.654 కోట్లు కేటాయించింది. అన్ని విశ్వవిద్యాలయాలకు కలిపి రూ.1,232.26 కోట్లు ఇవ్వనుంది.

పథకాల వారీగా..(రూ.కోట్లలో)

- తల్లికి వందనం పథకం: **9,668**
- సమగ్ర శిక్షా అభియాన్: **2,946**
- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం: **2,161**
- పీఎంశ్రీ పాఠశాలలు: **707**
- సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు: **654**

శాఖల వారీగా కేటాయింపులు (రూ.కోట్లలో)

విభాగం	2024-25	2025-26	2025-26 (సవరించిన)	2026-27
పాఠశాల విద్య	26,600.34	31,805.65	30,175.13	32,308.31
ఉన్నత విద్య	2,354.21	2,564.77	2,386.72	2,566.80
నైపుణ్యాభివృద్ధి, శిక్షణ	832.01	1,228.94	866.26	1,231.91

విశ్వవిద్యాలయాలకు నిధుల కేటాయింపులు (రూ.కోట్లలో)

విశ్వవిద్యాలయం	2024-25	2025-26 (సవరించిన)	2026-27
ఆదికవి నన్నయ	11.55	12.50	12.50
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్	8.00	8.50	8.50
ఆంధ్రకేసరి	2.00	1.04	1.04
ఆంధ్ర	417.24	379.34	389.34
క్లస్టర్ వర్సిటీ	1.40	1.04	1.00
ద్రవిడ	27.81	24.78	20.88
అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం	5.90	5.13	5.13
ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్	11.23	15.13	8.90
కృష్ణా	9.94	10.53	10.53
నాగార్జున	72.86	95.92	72.76
పొట్టి శ్రీరాములు	5.63	5.18	5.18
రాయలసీమ	10.45	11,.28	11.28
శ్రీకృష్ణదేవరాయ	112.25	100.13	100.13
శ్రీపద్మావతి మహిళ	54.56	57.33	57.33
శ్రీవేంకటేశ్వర	236.38	244.83	226.38
ఉర్దూ	2.80	3.10	3.13
విక్రమసింహపురి	20.69	20.53	20.42
యోగివేమన	49.04	42.94	42.94
జేఎన్‌టీయూ గురజాడ	9.00	9.00	9.00
జేఎన్‌టీయూ- కాకినాడ	55.62	60.00	60.00
జేఎన్‌టీయూ-అనంతపురం	73.97	76.43	63.43
ఆర్జీయూకేటీ	87.66	94.61	102.46

రోడ్లు, వంతెనలు రయ్..రయ్..

బడ్జెట్‌లో రూ.3,237 కోట్ల కేటాయింపు



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం రోడ్లను పట్టించుకోకుండా ప్రజలకు నరకం చూపించగా.. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రెండేళ్లుగా ఆ రోడ్లను బాగుచేసేందుకే పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తోంది. గుంతలు పూడ్చి, మరమ్మతులుచేసి వాహనాలు సాఫీగా వెళ్లేందుకు పెద్దపీట వేస్తోంది. అయితే గత రెండేళ్లు భారీ వర్షాలు కురవడంతో అనేకచోట్ల రోడ్లు ఛిద్రమయ్యాయి. ఇప్పటికే రూ.2,500 కోట్లతో 6,036 కి.మీ.మేర రోడ్లను రెన్యువల్ పనులు చేస్తున్నారు. తాజా బడ్జెట్‌లో కూడా రాష్ట్రమంతటా రోడ్లను గుంతలు రహితంగా మార్చేందుకు, వంతెనల నిర్మాణానికి, ఇతర పనులకు కలిపి మొత్తం రూ.3,237 కోట్లు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో జరిపిన కేటాయింపుల కంటే.. అవసరం మేరకు ఎక్కువ నిధులను రాష్ట్రప్రభుత్వం ఖర్చు చేసింది.

- జిల్లా ప్రధాన రహదారుల స్ట్రెంగ్తనింగ్, పునరుద్ధరణకు గత ఏడాది బడ్జెట్‌లో రూ.205 కోట్లు కేటాయించినప్పటికీ, రూ.605.58 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. తాజా బడ్జెట్‌లో ఈ రహదారుల పునరుద్ధరణ పనులకు రూ.255 కోట్లు కేటాయించారు.
- జిల్లా రోడ్ల ఉన్నతీకరణకు గత బడ్జెట్‌లో రూ.5 కోట్లు మాత్రమే కేటాయించినా, రూ.305 కోట్ల మేర ఖర్చుచేసినట్లు ప్రభుత్వం చూపింది. ఈసారి జిల్లా రోడ్ల ఉన్నతీకరణకు రూ.100 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.
- ఏపీ రహదారుల అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ) పరిధిలో రాష్ట్ర రహదారుల మరమ్మతులకు గత బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించగా, అధికంగా రోడ్ల పనులు జరిపించి రూ.182 కోట్లు ఖర్చు చేశారు. కొత్త బడ్జెట్‌లో రాష్ట్ర రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం రూ.130 కోట్లు ప్రతిపాదించింది.
- రాష్ట్ర రహదారుల ఉన్నతీకరణకు గత బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. అయినా రూ.180 కోట్లు ఖర్చు చేసింది. తాజా బడ్జెట్‌లో ఈ పనులకు రూ.200 కోట్లు కేటాయించింది.
- కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి కింద గత బడ్జెట్‌లో రూ.550 కోట్లు కేటాయించగా, అందులో రూ.350 కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుత బడ్జెట్‌లో దీనికి రూ.400 కోట్లు కేటాయించారు.

ఎన్‌డీబీ ప్రాజెక్ట్ పూర్తిచేసేలా..

గత బడ్జెట్‌లో ఎన్‌డీబీ రోడ్లకు రూ.610.45 కోట్లు కేటాయించగా, అందులో రూ.517.15 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. ఇప్పుడు రూ.580.61 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది చివరికి ఈ రోడ్లు పూర్తిచేయాలని భావిస్తున్నారు.

గ్రామీణ రోడ్లకు నిధులు

- పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో గ్రామీణ రోడ్లు, గిరిజన ప్రాంతాల్లోని రహదారుల పనులకు పెద్దఎత్తున నిధులు కేటాయించారు.
- పీఎం జన్‌మన్ పథకం కింద రూ.110 కోట్లు కేటాయించారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్డు సదుపాయం లేని గ్రామాలకు రహదారులు నిర్మించనున్నారు.
- పీఎంజీఎస్‌వై కింద రూ.656 కోట్లు కేటాయించారు.
- ఏడీబీ రుణంతో చేపడుతున్న రోడ్ల పనులకు సంబంధించి రూ.377.79 కోట్లు కేటాయించారు.
- పంచాయతీ రాజ్ రోడ్ల ఉన్నతీకరణకు రూ.250 కోట్లు ప్రకటించారు.
- గ్రామీణ మౌలికసదుపాయాల అభివృద్ధి నిధి (ఆర్ఐడీఎఫ్) కింద మరో రూ.250 కోట్లు ఇవ్వనున్నారు.

ఊపందుకోనున్న అమరావతి

రాజధాని నిర్మాణానికి రూ.6 వేల కోట్లు | **ఇప్పటికే రూ.57,868 కోట్ల విలువైన 97 పనులకు అనుమతులు** | **అవసరాన్ని బట్టి మరిన్ని కేటాయింపులు**

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.6,000.10 కోట్లు ప్రతిపాదించింది. భూసమీకరణ పథకానికి రూ.50 కోట్లు, రాజధాని ప్రాంతంలో సామాజిక భద్రతా నిధి, భూమి లేని పేదలకు పింఛన్ల కోసం రూ.115.14 కోట్లు కేటాయించింది. నిర్మాణ పనులకు రూ.6 వేల కోట్లు కేటాయించినా, పనుల వేగాన్ని బట్టి కేటాయింపులు పెరిగే ఆస్కారముంది. అమరావతి పనులకు ప్రభుత్వం రాష్ట్ర ఖజానా నుంచి నిధులు వెచ్చించడం లేదు. ప్రపంచబ్యాంకు, హడ్కో వంటి సంస్థల నుంచి తీసుకుంటున్న రుణంతో రాజధాని నిర్మాణం జరుగుతోంది. ఆ ఖర్చునే బడ్జెట్‌లో చూపిస్తున్నారు. 'వివిధ ఆర్థిక సంస్థల ద్వారా స్వయం సమృద్ధి (సెల్ఫ్ సస్టెయిన్) నమూనాలో నిధులు సమీకరించి అమరావతి నిర్మాణ పనుల్ని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నాం. రూ.57,868 కోట్ల విలువైన 97 పనులకు పరిపాలనా అనుమతులిచ్చాం. ప్రజా రాజధాని నిర్మించాలన్న మా నిబద్ధతకు ఇది స్పష్టమైన నిదర్శనం' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

కౌలు చెల్లింపు బాధ్యతా సీఆర్‌డీఏదే

- రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు చెల్లించాల్సిన వార్షిక కౌలు మొత్తాన్ని ప్రభుత్వం ఇదివరకు రాష్ట్ర ఖజానా నుంచే ఇచ్చేది. దీనికి ఏటా సుమారు రూ.298 కోట్లు ఖర్చవుతుంది. ఆ నిధులను భూసమీకరణ పథకం పేరుతో బడ్జెట్‌లో కేటాయించేది.
- 2025-26 బడ్జెట్‌లో కౌలు నిమిత్తం రూ.297.82 కోట్లు కేటాయించినా, ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. సీఆర్‌డీఏ అంతర్గత నిధులు, తీసుకున్న రుణంలోంచే కౌలు చెల్లించారు. ఈసారి బడ్జెట్‌లో రూ.50 కోట్లు మాత్రం ప్రతిపాదించారు.



ప్రపంచ బ్యాంకు ఇచ్చే నిధులే అవి..

- రాజధాని నిర్మాణానికి ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) సంయుక్తంగా రూ.13,500 కోట్ల రుణం ఇస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.1,500 కోట్లు సమకూరుస్తోంది.
- ప్రపంచబ్యాంకు, ఏడీబీ ఇప్పటికే రూ.4,500 కోట్లు ఇవ్వగా, పనుల పురోగతిని బట్టి దశల వారీగా విడుదల చేస్తాయి.
- తాజా బడ్జెట్‌లో అమరావతికి ప్రతిపాదించిన రూ.6,000 కోట్లు కూడా ప్రపంచ బ్యాంకు నుంచి తీసుకునేవే. సవరించిన అంచనాల ప్రకారం గత బడ్జెట్‌లో రాజధాని పనులకు రూ.3,200 కోట్లు వెచ్చించారు. డిజైన్ల తయారీ, టెండర్లు పిలవడం వంటి ప్రక్రియలకు సమయం పట్టడంతో కేటాయించిన నిధుల్ని పూర్తిగా వెచ్చించలేదు.
- ప్రస్తుతం రాజధానిలో ప్రధాన మౌలిక వసతులు, ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

చేనేతలకు అండ..

యూనిటీ మాల్ నిర్మాణానికి రూ.86 కోట్లు

ఈనాడు, అమరావతి: చేనేతలకు అండగా నిలిచేలా ప్రభుత్వం బడ్జెట్‌లో పలు పథకాలకు నిధులు కేటాయించింది. విశాఖలో యూనిటీ మాల్ ఏర్పాటుకు రూ.86 కోట్లు, త్రిఫ్ట్ ఫండ్‌కు రూ.5 కోట్లు కేటాయించింది. దీని ద్వారా 5,386 మంది చేనేతలకు లబ్ధి చేకూరనుంది. వెంకటగిరిలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఏర్పాటుకు రూ.1.26 కోట్లు, ముడిసరకు కొనుగోలు కింద 6,265 మందికి మేలు చేకూర్చేందుకు రూ.20 లక్షలు ఇచ్చింది. మొత్తంగా రూ.115.53 కోట్లు ప్రతిపాదించింది.

పారిశ్రామికవేత్తల ప్రోత్సాహకాలకు రూ.1,529.25 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పరిశ్రమలకు ప్రోత్సాహకాలు చెల్లించేందుకు బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.1,529.25 కోట్లు కేటాయించింది. ఈ మొత్తాన్ని సుమారు 40,862 మంది పారిశ్రామిక వేత్తలకు చెల్లించనుంది. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో ఎంఎస్ఎంఈలు, ఎస్సీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాల మొత్తాన్ని ప్రత్యేకంగా కేటాయించింది. గత వైకాపా ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతగా రూ.1,500 కోట్లు గత ఏడాది ప్రోత్సాహకాల కింద పారిశ్రామిక వేత్తలకు చెల్లించింది. ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ఎస్క్రో ఖాతాలనూ ఏర్పాటు చేసింది.



రూ.లక్ష కోట్లతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్

(మొదటి పేజీ తరువాయి)

శనివారం వెల్లడించారు.

ఆకర్షణీయ నగరాల మాదిరిగానే..: అవసరాలకు తగ్గట్టు మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్య వ్యవస్థను తీర్చిదిద్దడానికి రాష్ట్రాలు అర్బన్ ఛాలెంజ్ నిధిని ఉపయోగించుకోవచ్చు. ఆకర్షణీయ నగరాల (స్మార్ట్ సిటీస్) పథకాన్ని పోలిన ఈ కొత్త పథకం కాలపరిమితి 2030-31 వరకు ఉంటుంది. దీనికింద ఎంపికచేసిన ప్రాజెక్టులను పూర్తిచేయడానికి 2033-34 వరకు గడువు ఇస్తారు. ఇప్పటివరకూ కేవలం గ్రాంట్లపై ఆధారపడుతూ వచ్చిన పట్టణాభివృద్ధి... ఇక నుంచి మార్కెట్, సంస్కరణల ఆధారితంగా మారుతుందని కేంద్రం తెలిపింది. దీనివల్ల పట్టణ ప్రాంతాల్లో మౌలికవసతులు పెరుగుతాయంది. అన్ని నగరాలూ దీనికిందికి వస్తాయని వెల్లడించింది.

మరో ఇంజినీరింగ్ అద్భుతం

అస్సాంలోని బ్రహ్మపుత్ర నదీగర్భంలో గోహ్‌పుర్‌-నుమలిగఢ్ మధ్య 34 కి.మీ. మేర రైలు-రోడ్డు సొరంగ వంతెనను రెండు మార్గాలుగా రూ.18,662 కోట్లతో నిర్మించడానికి ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. రోడ్డు, రైలు రవాణా పక్కపక్కనే సాగేలా ఈ సొరంగం ఉంటుంది. ప్రపంచంలో ఇది రెండోది.

- రూ.10,000 కోట్ల నిధిని అంకుర పరిశ్రమలకు కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. మూడు రాష్ట్రాల్లో రోడ్డు పనులకు రూ.11,000 కోట్లు కేటాయించింది. ● దిల్లీ-అంబాలా, బెళగావి-హోసపేటె, కసారా-మన్మాడ్ మధ్య మూడో, నాలుగో రైలుమార్గాల నిర్మాణానికి రూ.18,509 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది.

చరిత్ర-భవిష్యత్తు సంగమం.. సేవాతీర్థ్

ప్రధానమంత్రి కార్యాలయాన్ని రైసీనా హిల్‌లోని సౌత్ బ్లాక్ నుంచి నూతనంగా నిర్మించిన సేవాతీర్థ్‌కు మార్చడం.. 'చరిత్ర-భవిష్యత్తు సంగమం' అని క్యాబినెట్ కొనియాడింది. గతించిన బానిసతత్వం నుంచి వికసిత భారత్‌వైపు ఇది మరొక అడుగు అని అభివర్ణించింది. "95 ఏళ్లలో బ్రిటిష్‌పాలన కాలం నుంచి సౌత్‌బ్లాక్ భవనం ఎన్నో నిర్ణయాలు, పరిణామాలకు సాక్షిగా నిలిచింది. భారత్‌పై పట్టు బిగించడానికి బ్రిటిష్ పాలకులు నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లను నిర్మించారు. స్వాతంత్ర్యానంతరం ఈ భవనాలను వివిధ కార్యాలయాల కోసం మన ప్రభుత్వాలు వాడుకుంటూ వచ్చాయి. చరిత్రాత్మక నిర్ణయాలెన్నో ఈ భవనాల నుంచే తీసుకున్నారు. ఇక్కడి మెట్లపై నెహ్రూ నుంచి మోదీ వరకు అందరు ప్రధానుల పాదముద్రలు ఉన్నాయి. ఇకపై ఈ భవనాలు జాతీయ మ్యూజియంగా మారి మన సాంస్కృతిక వారసత్వాన్ని, వైభవోపేత గతాన్ని భవిష్యతరాలకు అనుసంధానం చేస్తాయి. దార్శనిక నాయకత్వం వహిస్తున్న ప్రధానికి క్యాబినెట్ తరపున కృతజ్ఞతలు" అని తీర్మానించింది.

అభివృద్ధి వైపు బలమైన అడుగు

బడ్జెట్‌పై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



శ్రీకాకుళం (కలెక్టరేట్), న్యూస్‌టుడే: నిన్నమొన్నటి వరకు అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రం.. అభివృద్ధి వైపు బలమైన అడుగు వేసేలా బడ్జెట్ ఉందని పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించుకున్న స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యాలను ఈ బడ్జెట్ ద్వారా మరింత వేగంగా చేరవచ్చునన్నారు. 'ఉత్తరాంధ్రకు తగిన కేటాయింపులు జరిగాయి. విశాఖ ఆర్థిక ప్రాంతాన్ని విస్తరిస్తూ అభివృద్ధికి రూ.28వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం శుభపరిణామం. ఉత్తరాంధ్రలో నీటి పారుదల ప్రాజెక్టులు భారీ కేటాయింపులతో పూర్తవుతాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో చేపట్టిన బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.605.75 కోట్లు కేటాయించారు. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు మళ్లించే ఈ పథకం ద్వారా భవిష్యత్తులో శ్రీకాకుళం జిల్లా మెట్ట ప్రాంతాలకు సాగు, తాగు నీరందే అవకాశముంది' అన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో వికసిత్ భారత్ స్ఫూర్తి: దినకర్

ఈనాడు, అమరావతి: 'బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యతను ప్రతిబింబించింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల జల వనరుల ప్రాజెక్టులు, పారిశ్రామిక, ఉద్యాన రంగాల్లో అభివృద్ధికి దిక్సూచిలా ఉంది. విద్య, వైద్యం, వ్యవసాయం, సాంకేతిక రంగాల అభివృద్ధి, సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ స్వర్ణాంధ్రను వికసిత్ భారత్‌లో భాగస్వామ్యం చేసే బడ్జెట్ ఇది' అని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు.

ఇలా ఇచ్చి.. అలా వెనక్కి

రూ.480 కోట్ల ఉపాధి మెటీరియల్ నిధులు లాగేసుకున్న కేంద్రం

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ పనులకు బిల్లుల చెల్లింపుల కోసం కేంద్రం రూ.480 కోట్లు కేటాయించి కొద్ది రోజుల్లోనే మళ్లీ వెనక్కి తీసుకుంది. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. మరోసారి కేటాయిస్తామని.. ఇచ్చిన నిధులు రాష్ట్ర ఖజానాకు జమ కాకముందే కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ వెనక్కి లాగేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులనూ రద్దుచేసింది. ఉపాధిహామీ పథకంలో 2025-26లో చేసిన మెటీరియల్ కాంపొనెంట్ పనులకు కేంద్రం నుంచి రావలసిన నిధులపై తొలి విడతగా కేంద్రం గత నెల 27న నిధులిచ్చింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. వీటితో పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు అధికారులు సన్నద్ధమయ్యేలోపే కేంద్రం షాకిచ్చింది. నిధులు త్వరలోనే వస్తాయని, ఆందోళన చెందాల్సింది ఏమీ లేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. సాంకేతిక సమస్యల వల్లే ఇలా జరిగి ఉండొచ్చన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

అప్పులు తగ్గించుకుని..

ప్రగతి దిశగా



సభలో బడ్జెట్ ప్రసంగం చేస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్. చిత్రంలో సీఎం చంద్రబాబు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సభ్యులు

- రూ.30 వేల కోట్లతో అంతర్జాతీయ ఉద్యానహబ్‌గా రాయలసీమ
- రూ.100 కోట్ల సీడ్‌కార్పస్‌తో ఏపీ వెల్త్‌ఫండ్ ఏర్పాటు
- ఆర్థికంగా బలహీనవర్గాలకు 25 లక్షల ఇళ్ల పట్టాలు, ఇళ్లు
- గ్రోత్ ఇంజిన్లుగా విశాఖపట్నం, అమరావతి, తిరుపతి రీజియన్లు
- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: అప్పులు తగ్గించుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించేలా బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ.. గత ప్రభుత్వం అడ్డగోలుగా చేసిన అప్పులపై వడ్డీరేట్లు తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. శాసనసభలో శనివారం రాష్ట్ర బడ్జెట్‌ను పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. 'వైకాపా ప్రభుత్వం ఏకంగా 12.3% వడ్డీ వరకు అప్పులు తెచ్చింది. రాష్ట్రానికి ఆర్థికభారంగా పరిణమించిన ఈ రుణాలను 9% లేదా అంతకంటే తక్కువకు తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నాం. ఇప్పటి వరకు రూ.43,298 కోట్ల రుణాలకు వడ్డీని తగ్గించి, సంవత్సరానికి రూ.327 కోట్లు ఆదా చేశాం' అని తెలిపారు.

14 లక్షల హెక్టార్లకు ఉద్యాన పంటల సాగు

'రాయలసీమ రీజియన్‌ను రూ.30వేల కోట్లతో అంతర్జాతీయ ఉద్యానహబ్‌గా అభివృద్ధి చేయనున్నాం. రాయలసీమతో పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని 303 మండలాల్లో 200 పైగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం. ఉద్యాన ఉత్పత్తులకు మంచి మార్కెట్ కల్పించడం వల్ల లక్ష మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో ప్రత్యక్షంగా 9 లక్షల ఉద్యోగాలు లభిస్తాయి. దీంతో రాయలసీమపై వెనుకబడిన ప్రాంతమన్న ముద్ర తొలగిపోతుంది. రాయలసీమ పేరు చెబితే 'మిగులు' తప్ప, కొరత అన్నమాట వినపడదు' అని వెల్లడించారు.

ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా..

'గత ప్రభుత్వ విధ్వంసకర పాలన చేసిన లోతైన గాయాలు, మిగిల్చిన చేదు అనుభవాలు మనం ఏం చేయకూడదో నిరంతరం గుర్తుచేస్తున్నాయి. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగులు పెట్టించాలన్న దృఢ సంకల్పానికి ఈ బడ్జెట్ నిదర్శనం. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా నడిపించేందుకు 2024 బడ్జెట్ బలమైన పునాది వేసింది. రైతుల కలలు నెరవేర్చేలా, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా, తన బిడ్డలను చక్కగా పెంచాలనే తల్లికి భరోసా ఇచ్చేలా ఈ బడ్జెట్ రూపొందించాం. ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించే ప్రతి రూపాయీ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షల్ని సాకారం చేస్తుంది.

- విధ్వంసం నుంచి వికాసం దిశగా ఇప్పటి వరకు సాగిన అభివృద్ధి ప్రయాణం అద్భుతం. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాం.
- రాష్ట్రానికి విభజనతో జరిగిన నష్టంతో పాటు గత ప్రభుత్వ పాలన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. చాలా సవాళ్లున్నా రాష్ట్రం చెప్పుకోదగ్గ స్థాయిలో అభివృద్ధి చెందిందని చెప్పడానికి గర్వపడుతున్నాం.
- 163 కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.18,701 కోట్లు విడుదల చేసి, వాటిలో 85 పథకాలు మళ్లీ అమలయ్యేలా చేస్తున్నాం. ◆ రూ.100 కోట్ల సీడ్‌కార్పస్‌తో ఏపీ వెల్త్‌ఫండ్ ఏర్పాటు. ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడిదారులను ఆహ్వానించి రాష్ట్రానికి సంపద సృష్టించే దిశగా ముందుకు సాగుతున్నాం. ◆ విశాఖపట్నం, అమరావతి, తిరుపతి రీజియన్లను రాష్ట్రానికి కీలకమైన గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించాం. ◆ నీతి ఆయోగ్‌తో కలిసి విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్‌కి ఎకనమిక్ మాస్టర్‌ప్లాన్. విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఉత్పత్తి, సేవలు, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయ రంగాల్లో 41 అత్యంత ప్రభావం చూపే ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి.
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ నగర్స్ కింద ఆర్థికంగా బలహీనవర్గాలకు చెందిన కుటుంబాలకు 25 లక్షల ఇళ్ల పట్టాలు, సొంతింటి కలను నెరవేర్చడం లక్ష్యంగా పెట్టుకున్నాం.

పోలీసు వ్యవస్థ గౌరవం పునరుద్ధరణ

- గత ప్రభుత్వంలో దెబ్బతిన్న పోలీసు వ్యవస్థ గౌరవం పునరుద్ధరణ. పోలీసుశాఖకు త్వరలో 3 వేల కొత్త వాహనాలు కొనుగోలు చేయనున్నాం.
- డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాల్లాంటి ఆధునిక నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం
- జిల్లా న్యాయవ్యవస్థకు కోర్టు భవనాలు, నివాసగృహాల నిర్మాణం. 2026-27లో తొలి దశలో కొత్తగా 100 కోర్టులు ఏర్పాటు చేయనున్నాం.
- దివ్యాంగుల సమగ్రాభివృద్ధి కోసం 'ఇంద్రధనస్సు' కార్యక్రమం. ఇందులో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం, రాయితీ పథకాల పునరుద్ధరణ, క్రీడా శిక్షణ, గృహనిర్మాణం, వినికిడి లోపం ఉన్నవారికి ప్రత్యేక డిగ్రీ కళాశాల, దివ్యాంగుల భవనాలు ఏర్పాటు చేస్తాం.
- ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వ నిబంధనలకు మించి బీమా ప్రయోజనాలు అందించేందుకు బ్యాంకులతో ఒప్పందం.
- కార్మికుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసేందుకు కొత్త ఈఎస్ఐ వైద్య సదుపాయాలు. విజయనగరం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో వంద పడకల ఆస్పత్రుల నిర్మాణం. కర్నూలు, శ్రీసిటీ, అచ్యుతాపురం, శ్రీకాకుళం ప్రాంతాల్లో 30 పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నాం.
- గోదావరి పుష్కరాల సందర్భంగా యాత్రికులకు భద్రతతో కూడిన ఆధ్యాత్మికత అందించేందుకు సమగ్ర ఏర్పాట్లు. దీనికి ప్రారంభంగా రూ.60 కోట్లు కేటాయించాలని ప్రతిపాదిస్తున్నా.
- సాగునీరు, రహదారులు, ఇతర పనులకు రూ.37,030 కోట్లు చెల్లించి ఆర్థిక కార్యకలాపాల పునరుద్ధరణ చేపట్టాం.
- విశాఖపట్నం, విజయవాడ ప్రజలకు మెట్రోరైలు ప్రయాణ కలను తర్వలో సాకారం చేయనున్నాం.
- ప్రజల రాజధాని అమరావతిని నిర్మించాలనే నిబద్ధతతో ప్రభుత్వం పనిచేస్తోంది. వివిధ ఆర్థిక సంస్థల ద్వారా స్వయంసమృద్ధి నమూనాలో నిధులను సమీకరించి రాజధాని పనులను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నాం. రూ.57,868 కోట్ల విలువైన 97 పనులకు పరిపాలన అనుమతులు జారీ చేశాం.

సవాళ్లున్నా సంక్షేమం.. అభివృద్ధే సంకల్పం


(మొదటి పేజీ తరువాయి)

వీటన్నింటినీ శనివారం శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం పదేపదే నొక్కిచెప్పింది. 'కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఆశాకిరణంలా ఉంది' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సూటిగా చెప్పేశారు.

2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో శనివారం ప్రవేశపెట్టారు. రూ.3,32,205.34 కోట్ల అంచనా వ్యయంతో పద్దును సమర్పించారు. రెవెన్యూ లోటును రూ.22,002 కోట్లకే పరిమితం చేస్తామని పేర్కొన్నారు. ద్రవ్యలోటు రూ.75,868.09 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. ఆర్థిక మంత్రిగా కేశవ్‌కు ఇది వరుసగా మూడో బడ్జెట్. పేదలకు నేరుగా రూ.వేల కోట్ల నిధులిస్తున్న సంక్షేమ పథకాలకు ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్లో పెద్ద పీట వేశారు. సామాజిక పింఛన్లకు పెద్ద మొత్తంలో నిధులిచ్చారు. మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి గణనీయమైన కేటాయింపులు చూపారు. సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి రంగాలకు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కేంద్ర సహకారం తీసుకుంటామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి ఎలా ఉపయుక్తమయ్యే ఆస్కారం ఉందో కూడా ఈ బడ్జెట్‌లో విశదీకరించారు. ఐదేళ్ల వైకాపా అస్తవ్యస్త విధానాల నుంచి రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కిస్తున్నామో వెల్లడించారు.

కొత్త నిర్ణయాలు, ప్రాజెక్టుల దిశగా అడుగులు

- రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు ఏర్పాట్లు. కేంద్ర సాయం, ప్రైవేట్ భాగస్వామ్యం, బ్యాంకు రుణాలతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన
- విశాఖ, అమరావతి, తిరుపతి ఆర్థిక జోన్ల అభివృద్ధి. కేంద్ర సాయం పొందడం ఇందులో ముఖ్యం.
- వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు అమలు
- రూ.100 కోట్లతో ఏపీ సంపద నిధి ఏర్పాటు. ప్రైవేట్ భాగస్వాములను కూడా కలిపి ఆ నిధులతో ఇతరచోట్ల ప్రధాన ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడతారు. ఆ ఫలితాల నుంచి రాష్ట్ర ఆర్థికశక్తిని పెంచుకోవాలనేది ఆలోచన.
- దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం



అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో బడ్జెట్‌ను ఆమోదిస్తూ మంత్రిమండలి చేసిన తీర్మానంపై సంతకం చేస్తున్న సీఎం చంద్రబాబు

సంక్షేమానికి పెద్దపీట

'సూపర్ సిక్స్' పేరిట అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు రూ.27,719 కోట్లు కేటాయించారు. తల్లికి వందనం కింద రూ.9,668 కోట్లు ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు సాయం చేసేందుకు రూ.6,600 కోట్లు కేటాయించారు. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇచ్చేందుకు దీపం 2.0 పథకం కింద రూ.2,601 కోట్లు కేటాయించారు. మహిళలు, యువతులు, తదితరులకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.1,420 కోట్లు, బలహీనవర్గాల వారికి ఉచిత విద్యుత్తు, రాయితీపై విద్యుత్తు ఇచ్చేందుకు రూ.600 కోట్లు బడ్జెట్‌లో చూపారు. వివిధ సామాజికవర్గాల వారికి ఆర్థిక సాయం చేసేందుకు రూ.2,320 కోట్లు కేటాయించారు. ఆటోడ్రైవర్లకు సేవలో కార్యక్రమానికి రూ.450 కోట్లు, మత్స్యకార సేవలో కార్యక్రమానికి రూ.260 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.3,836 కోట్లు, మధ్యాహ్న భోజనానికి రూ.2,161 కోట్లు నిధులిచ్చారు.

సాగునీటి రంగానికి పెద్ద పీట

పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాదికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం రూ.6,105 కోట్లు కేటాయించింది. ఇది కాక ఇతర భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.9,906 కోట్లు కేటాయించింది. సాగునీటి రంగానికి మొత్తం రూ.18,223 కోట్లు కేటాయించారు. వ్యవసాయ, అనుబంధ శాఖలకు రూ.53,752 కోట్లు కేటాయించారు. రైతుల కోసం రూ.500 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ధరల స్థిరీకరణకు రూ.300 కోట్లు బడ్జెట్‌లో చూపినా ఒక్క ఏడాదిలోనే రైతులకు రూ.1,200 కోట్లకు పైగా ఖర్చు చేశామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. పేదల కోసం ఆరు లక్షల కొత్త ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. కొత్తగా 100 కోర్టులకు ఆమోదం తెలియజేశారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నారు. పోలీసు వ్యవస్థను ఆధునికీకరిస్తామని ప్రకటించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, పాఠశాల విద్య, వైద్యం, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధికి అధిక కేటాయింపులు చూపారు.

నిధుల సాధనే అసలు సవాల్


ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో చక్కని వ్యూహాలు ప్రతిపాదించినా వాటిని సాకారం చేయడమే పెద్ద సవాల్. 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.2,34,140.14 కోట్ల రెవెన్యూ రాబడి వస్తుందని ఆర్థిక మంత్రి అంచనా వేశారు. కిందటి ఆర్థిక సంవత్సరంలో రూ.2,17,976 కోట్లు రెవెన్యూ రాబడిని ఆశిస్తే జనవరి నెలాఖరు వరకు వచ్చింది రూ.1,40,000 కోట్లే. సవరించిన అంచనాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ రాబడి రూ.1,96,903 కోట్లు ఉంటుందని పేర్కొంటున్నారు. గత బడ్జెట్ (2025-26)ను రూ.3,22,359.34 కోట్లతో ప్రవేశపెట్టినా సవరించిన అంచనాల్లో దాన్ని రూ.3,00,534.67 కోట్లకే పరిమితం చేశారు. తుది లెక్కలు తేలేసరికి ఇంకా తగ్గిపోయే అవకాశాలే ఎక్కువ. మరో వైపు రెవెన్యూ లోటును రూ.22,002.50 కోట్లకే పరిమితం చేస్తామని హామీ ఇచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ ప్రతిపాదనల్లో రూ.33,185.97 కోట్లు రెవెన్యూ లోటు ఉంటుందని అంచనా వేస్తే సవరించిన అంచనాల్లో అది రూ.41,118.36 కోట్లకు పెరగడం గమనార్హం.

ముఖ్య శాఖలు, కేటాయింపులు (రూ.కోట్లల్లో)

కేటాయింపు	శాఖ
23,650.88	బీసీ సంక్షేమం
18,223.67	జల వనరులు
14,538.68	పురపాలక, పట్టణాభివృద్ధి
13,934.25	ఇంధనం, విద్యుత్
11,745.21	వ్యవసాయం
11,118.84	సాంఘిక సంక్షేమం
10,699.33	ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం

పర్యాటక రంగానికి భారీ కేటాయింపులపై ఏపీ స్టార్ హోటల్స్ హర్షం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర బడ్జెట్‌లో పర్యాటక, సాంస్కృతిక రంగానికి రూ.439 కోట్లు కేటాయించడం పట్ల ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు రాష్ట్రంలోని హోటళ్లు, ఆతిథ్యరంగానికి నూతన జవజీవాలను అందించేలా ఉన్నాయన్నారు. ఏపీ పర్యాటక విధానం 2024-29 ద్వారా ఈ రంగానికి పరిశ్రమ హోదా కల్పించడం, మూలధన సబ్సిడీలు, ఎస్సీ, ఎస్టీ రీయింబర్స్‌మెంట్, స్టాంపుడ్యూటీలను మినహాయించినట్లు ప్రకటించడం హోటల్ పరిశ్రమకు గొప్ప ఊరటనిస్తుందన్నారు. 'తిరుపతిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రపంచస్థాయి వసతులు, హోటళ్లు, వినోద ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనను మా అసోసియేషన్ స్వాగతిస్తోంది' అని స్వామి పేర్కొన్నారు.



కోపాన్ని ఎలా నియంత్రించుకోవాలంటే..

విపరీతమైన కోపం వల్ల ఒత్తిడి హార్మోన్లు పెరిగిపోతాయి. సరైన నిర్ణయాలు తీసుకొనే విచక్షణ తగ్గుతుంది. ఆరోగ్యంతో పాటు సంబంధాలు, కెరీర్‌పైనా దాని దుష్ప్రభావం పడుతుంది. అయితే కోపాన్ని అణచుకోకుండా సరైన విధానంలో నియంత్రించుకోవడమే దీనికి పరిష్కారం. కోపం వచ్చినప్పుడు కాస్త ఆగి, దీర్ఘశ్వాస తీసుకోండి. కాసేపు నడవండి. రాత్రిపూట కంటినిండా నిద్రపోవడం కూడా ముఖ్యం.

– డింపుల్ జంగ్డా, వెల్‌నెస్ కోచ్


తిరుమల 'కమాండ్' దేశానికే తలమానికం

- సరికొత్త దిక్సూచిగా అధునాతన వ్యవస్థ
- అయోధ్య, కాశీ, సోమనాథ్ వంటి ఆలయాల్లోనూ అమలుకు సన్నాహాలు

ఈనాడు డిజిటల్, తిరుపతి: కలియుగ వైకుంఠమైన తిరుమల క్షేత్రం ఆధ్యాత్మికతతోపాటు అత్యాధునిక సాంకేతికతలోనూ ఆదర్శంగా నిలుస్తోంది. అలిపిరి వద్ద తనిఖీలు, భక్తుల రద్దీని లెక్కగట్టడం, లడ్డూ ప్రసాద పంపిణీలో పారదర్శకత పెంచడం.. ఇలా తిరుమలలోని అనేక కీలక అంశాలు 'ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్' నిఘా నీడలో సాగుతున్నాయి. గత సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ వ్యవస్థ జాతీయస్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. ఈ సాంకేతికతను అమలు చేసేందుకు దేశంలోని పలు కీలక దేవస్థానాలు ఆసక్తి చూపుతున్నాయి. శ్రీకాళహస్తికి ఇప్పటికే బ్లూప్రింట్ సిద్ధమైంది. మహాశివరాత్రి తర్వాత తిరుమల టెక్నికల్ బృందం క్షేత్రస్థాయి పరిశీలన జరిపి పనులు ప్రారంభించనుంది. వారణాసిలోని విశ్వేశ్వరుడి ఆలయ అధికారులతో చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే అక్కడా ఈ సాంకేతికత అమలు కానుంది. అయోధ్య రామమందిరం, గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయాల్లోనూ ఈ తరహా వ్యవస్థను ఏర్పాటు చేయడంపై పీఎంవో స్థాయిలో సమాలోచనలు జరిగినట్లు సమాచారం. బెజవాడ కనకదుర్గ ఆలయంలోనూ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి.

లడ్డూ కౌంటర్ల వద్ద పక్కా నిఘా

శ్రీవారి లడ్డూ ప్రసాద వితరణ ప్రక్రియను 'ఎండ్ టు ఎండ్' ట్రాకింగ్ సిస్టమ్ పరిధిలోకి తెచ్చారు. ప్రస్తుతమున్న 60 లడ్డూ కౌంటర్ల వద్ద అత్యాధునిక కెమెరాలు ఏర్పాటు చేశారు. భక్తుల సంఖ్యను బట్టి ఎన్ని కౌంటర్లు తెరవాలి? ఎన్ని లడ్డూలు తాజాగా తయారు చేయాలి? ఏ కౌంటర్లో రద్దీ ఎలా ఉంది? అనే సమాచారం అధికారులకు ముందే తెలుస్తుంది. దీనివల్ల లడ్డూల మిగులు లేదా కొరత లేకుండా సరఫరా వ్యవస్థ మెరుగవుతోంది. క్యూలైన్లలో భక్తులు ఎంత సమయం ఉంటున్నారు? ఎవరైనా అనధికారికంగా లడ్డూలు పొందుతున్నారా? వంటి విషయాలు సైతం తెలుసుకోవచ్చు. దీనివల్ల దళారుల బెడద తగ్గి సామాన్య భక్తులకు త్వరగా ప్రసాదం అందుతుంది.



కమాండ్ డాష్ బోర్డుపై శ్రీవారి ఆలయ 3డీ నమూనా

అనుకోని రద్దీకి ఆటోమేటిక్ ఎలర్ట్

గతంలో అనుకోకుండా భక్తుల రద్దీ పెరిగితే వారు క్యూలైన్లలోకి వచ్చాకగానీ అధికారులకు తెలిసేది కాదు. ఇప్పుడు కమాండ్ కంట్రోల్ కేంద్రం సాయంతో భక్తులు ఎక్కడ ఎంతమంది ఉన్నారో లెక్క చెబుతుంది. దీనివల్ల కొన్ని గంటల ముందే రద్దీని అంచనా వేసి క్యూలైన్ల నిర్వహణను మెరుగుపరిచే అవకాశం ఉంటోంది. ఇటీవల రథసప్తమి వేడుకలకు మాడవీధుల్లో ఏర్పాటు చేసిన ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్) కెమెరాల సాయంతో రద్దీని పర్యవేక్షించారు. తిరుమలలో అమలవుతున్న ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ఎన్నారైల విరాళాలతో రూ.18 కోట్ల వరకు వెచ్చించారు. సుమారు 342 అధునాతన కెమెరాలతో ఈ వ్యవస్థను అనుసంధానించారు.

గ్రహం అనుగ్రహం

15-2-2026 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం

త్రయోదశి: సా. 4-38 తదుపరి చతుర్దశి

ఉత్తరాషాఢ: రా. 7-42 తదుపరి శ్రవణ

వర్జ్యం: రా. 11-54 నుంచి 1-36 వరకు

అమృత ఘడియలు: మ. 12-50 నుంచి 2-33 వరకు

దుర్ముహూర్తం: సా. 4-24 నుంచి 5-10 వరకు

రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు

సూర్యోదయం: ఉ.6.31; సూర్యాస్తమయం: సా.5.56

మహా శివరాత్రి

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
మెదక్	13.6	32.4
విజయనగరం	16.0	31.0
అనంతపురం	16.0	34.6
రాజమహేంద్రవరం	17.0	36.0
హైదరాబాద్	17.5	31.4
కడప	18.0	33.0
తిరుపతి	18.3	31.8
విశాఖపట్నం	18.4	30.2
విజయవాడ	18.8	32.2
కర్నూలు	18.9	35.1
తాడేపల్లిగూడెం	19.0	33.0
గుంటూరు	19.0	33.0
నరసాపురం	19.8	32.2
శ్రీకాకుళం	20.0	30.0
ఒంగోలు	21.0	32.3
నెల్లూరు	21.3	32.1

ధరల స్థిరీకరణ నిధికి రూ.500 కోట్లు

ధరల స్థిరీకరణ నిధికి ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించింది. 2025-26 బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే రూ.200 కోట్లు పెంచింది. గతేడాది కోకో, మామిడి, నల్లబర్లీ పొగాకు, ఉల్లి పంటలకు ధరలు తగ్గడంతో.. ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. మార్క్‌ఫెడ్ ద్వారా ఆ పంటల్ని కొనుగోలు చేయించింది. మామిడి, ఉల్లి, కోకో, తదితర పంటలు సాగు చేసిన రైతులకు ఆర్థికసాయం అందించింది.





జిల్లాకు రెండు చొప్పున షీ-మార్ట్‌లు

డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం రూ.955 కోట్లు కేటాయించింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన జాతీయ జీవనోపాధుల కార్యక్రమానికి రాష్ట్ర వాటాగా ఈ నిధుల్ని ప్రతిపాదించింది. దీనికి అదనంగా కేంద్రం తన వాటాగా రూ.1,000 కోట్లు కేటాయించనుంది. వీటితో తొలి విడతగా జిల్లాకు రెండు చొప్పున 'షీ-మార్ట్'లు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు కేంద్రం రూ.20 లక్షలు గ్రాంటుగా అందిస్తుంది. ఒక్కో షీ-మార్ట్ పరిధిలో 100 మంది సభ్యులను అనుసంధానిస్తారు.

రైతుకు రాజ మార్గం

- వ్యవసాయ, అనుబంధశాఖలకు మొత్తం రూ.53,752 కోట్లు
- హార్టికల్చర్ గ్లోబల్ హబ్‌గా రాయలసీమ
- పశ్చిమగోదావరి జిల్లాలో కోకో సిటీ
- ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం సబ్సిడీకి రూ.13,722 కోట్లు
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

రైతును రాజుగా నిలబెట్టాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్ర ఆర్థిక సౌధానికి మూలస్తంభమైన వ్యవసాయరంగాన్ని పటిష్ఠపరిచేలా బడ్జెట్ కేటాయింపులు చేశామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. 2026-27 బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ శాఖలకు రూ.53,752.12 కోట్లు ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. ఆయన శనివారం అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ జీఎస్‌డీపీలో వ్యవసాయ రంగం వాటా 33.20% ఉందని తెలిపారు. దేశ వ్యవసాయ రంగం వృద్ధిరేటు 0.80% కాగా, మనరాష్ట్రంలో 7.83% నమోదైందని, దేశ వ్యవసాయరంగ ఉత్పత్తిలో ఏపీ వాటా 10% కావడం గర్వకారణమన్నారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే.

అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు

- అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద 2025-26లో రెండోవిడత వరకు 46.86 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.6,309.44 కోట్లు చెల్లించాం. 2026-27లో రూ.6,600 కోట్లు ప్రతిపాదించాం.
- ధాన్యం సేకరణలో రైతులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు రూ.1,674.47 కోట్లు చెల్లించాం.
- 2025-26లో 51లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంతో పనిచేశాం. ఫిబ్రవరి 11 వరకు రూ.10,571 కోట్లు రైతులకు జమ చేశాం.
- పంటల కోత కాలంలో తుపాన్ల నుంచి రక్షించేందుకు.. కృష్ణా, గోదావరి డెల్టాల్లో ఖరీఫ్ సాగు కాలాన్ని ముందుకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. వ్యవసాయ యాంత్రీకరణకు రూ.139.65 కోట్లు ప్రతిపాదించాం.
- విత్తన రాయితీకి రూ.240 కోట్లు, ఎరువుల బఫర్ స్టాక్ నిర్వహణకు రూ.40 కోట్లు, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ల నిర్వహణకు రూ.4.66 కోట్లు కేటాయించాం.
- పంటల బీమా పథకం అమలుకు రూ.250 కోట్లు, వడ్డీలేని రుణాలకు మరో రూ.250 కోట్లు ప్రతిపాదించాం.

గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ

- రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టుల అమలుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇందులో రాష్ట్రవాటా రూ.30వేల కోట్లు కాగా, ఉద్యాన అభివృద్ధికి రూ.15వేల కోట్లు వెచ్చించనున్నాం.
- రాయలసీమలోని 8 జిల్లాలతోపాటు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో 22 ప్రధాన ఉద్యానపంటలపై దృష్టిపెట్టాం. ఉద్యాన విస్తీర్ణాన్ని 8.4 లక్షల హెక్టార్ల నుంచి మూడేళ్లలో 14.4 లక్షల హెక్టార్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.
- పండ్ల ఉత్పత్తి, ఆయిల్‌పామ్, బొప్పాయి, నిమ్మ, కోకో, టమాటా, కొబ్బరి ఉత్పాదకతలో రాష్ట్రం మొదటి స్థానంలోనూ, మిరపలో రెండోస్థానంలో ఉంది.
- పామాయిల్ తోటల పెంపకానికి రూ.204 కోట్లు కేటాయించాం.
- పశ్చిమగోదావరి జిల్లాను కోకో హబ్‌గా అభివృద్ధిచేసి, అక్కడ కోకో సిటీ ఏర్పాటుచేసి, చాక్లెట్ పరిశ్రమలను నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నాం.
- కూటమి ప్రభుత్వం వచ్చాక 5.5 లక్షల ఎకరాలను కొత్తగా సూక్ష్మసేద్యం పరిధిలోకి తీసుకొచ్చాం. 2026-27లో మరో 3.75 లక్షల ఎకరాలను తీసుకొచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం.
- రాష్ట్రంలో 1.52 లక్షల ఎకరాల్లో ఉన్న పట్టుకు.. రూ.95.87 కోట్లు కేటాయించాం.





వ్యవసాయ బడ్జెట్ ప్రతుల బ్యాగును సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ధరల స్థిరీకరణ నిధి కింద ఎంతైనా ఖర్చుచేస్తాం

- ధరల స్థిరీకరణకు గత బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించినా, రూ.588 కోట్లు ఖర్చుచేసి, లక్షల మంది రైతులను ప్రభుత్వం ఆదుకుంది.
- ఈ బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధికి రూ.500 కోట్లు ప్రతిపాదించాం. ఎంతైనా ఖర్చుచేసేందుకు సిద్ధంగా ఉన్నాం.
- విశాఖపట్నంలో ఎంవీపీ కాలనీ, గోపాలపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతిల్లో పీపీపీ విధానంలో అత్యాధునిక రైతుబజార్లు నిర్మిస్తున్నాం.

68,988 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం

- రాష్ట్రంలో 22.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేసినందుకు.. గత డిసెంబరు ఆఖరుకు సబ్సిడీ కింద రూ.13,241.17 కోట్లు వెచ్చించాం.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 68,988 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం.
- 2026-27లో విద్యుత్ సబ్సిడీ అవసరాలకు రూ.13,722 కోట్లు కేటాయించాం.

వ్యవసాయ అనుబంధ శాఖలు, కొన్ని పథకాలకు కేటాయింపులు (రూ.కోట్లలో)

వ్యవసాయశాఖ	12,152.32
ఉద్యానశాఖ	1,123.86
పట్టుపరిశ్రమశాఖ	95.87
మార్కెటింగ్‌శాఖ	515.39
సహకారశాఖ	209.30
పశు సంవర్ధకశాఖ	1,121.26
మత్స్యశాఖ	523.52
ఎన్జీ రంగా వర్సిటీ	504.11
వైఎస్ఆర్ ఉద్యానవర్సిటీ	97.99
వేంకటేశ్వర పశువైద్య వర్సిటీ	163.01
ఏపీ మత్స్య వర్సిటీ	39.20
విద్యుత్ సబ్సిడీ	13,722
వీబీ-జీ రామ్‌జీ పనులు	500
సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ	14,276

పాలు, మాంసం ఉత్పత్తిలో తొలిస్థానాలు లక్ష్యం

- 2026-27లో దేశంలో పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తిలో తొలి మూడు స్థానాల్లో రాష్ట్రం నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.
- ఎస్సీ, ఎస్టీ, పేద పశు పోషకులకు 50వేల గోకులాలు నిర్మించాలని ప్రతిపాదించాం.
- పశువుల గుర్తింపునకు గో-ఆధార్ పథకాన్ని తీసుకొస్తున్నాం.
- చేపల ఉత్పత్తిలో 29%, సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 34% వాటాతో దేశంలోనే మన రాష్ట్రం తొలి స్థానంలో ఉంది.
- హ్యాచరీలు, బయోఫ్లాక్ యూనిట్లు, ఐస్‌ప్లాంట్లు, ఫీడ్ మిల్లులు హార్బర్లు, ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లు, కృత్రిమ రీఫ్‌లకు రూ.398 కోట్లు కేటాయించాం.

– ఈనాడు, అమరావతి

ఇది స్వర్ణాంధ్ర బడ్జెట్



– లోకేశ్, విద్య, ఐటీ శాఖల మంత్రి

ఆర్థిక ఒత్తిళ్ల మధ్య కూడా బాధ్యతాయుతమైన ఆర్థిక నిర్వహణ, దీర్ఘకాలిక వృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇది స్వర్ణాంధ్ర బడ్జెట్. పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణం, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ ప్రాజెక్టు సహా అనేక అంశాల్లో రాష్ట్రానికి మద్దతుగా నిలుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ల నిరంతర మార్గదర్శకత్వం, ప్రోత్సాహకం రాష్ట్ర బలమైన భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నాయి.

రూ.8,365 కోట్లతో వీబీ జీ రామ్ జీ

బడ్జెట్‌లో రాష్ట్ర వాటా రూ.3,346 కోట్ల కేటాయింపు



రాష్ట్రంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీ జీ రామ్ జీ) పథకం రూ.8,365 కోట్లతో ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానుంది. ఇందుకోసం రాష్ట్ర వాటా కింద రూ.3,346 కోట్లను (40%) ప్రభుత్వం ఖర్చు చేయనుంది. మిగతా రూ.5,019 కోట్లను (60%) కేంద్ర ప్రభుత్వం కేటాయించనుంది. 2026-27లో వేతన జీవులకు 15 కోట్ల పనిదినాలు కల్పించనున్నారు. ఈ మేరకు 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయింపులు చేసింది.

- వీబీ జీ రామ్ జీకి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇప్పటివరకు కేటాయింపులు చేయలేదు. అప్పటివరకు వేచి చూడకుండా గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఉపాధి పథకం అమలు, నిధుల వ్యయాన్ని పరిశీలించి.. అంచనాగా కేటాయింపులు చేశారు. కేంద్రం నిధులు కేటాయించాక.. అవసరమైతే రాష్ట్ర వాటా నిధులు పెంచనున్నారు.

జలజీవన్ పనుల్లో ఇక జోరు



గ్రామాల్లో ప్రతి ఇంటికీ.. స్వచ్ఛమైన తాగు నీరు సరఫరా చేసేందుకు ఉద్దేశించిన జలజీవన్ మిషన్ (జేజేఎం) పనులు కొత్త ఆర్థిక సంవత్సరంలో ఓ కొలిక్కి రానున్నాయి.
వైకాపా ప్రభుత్వ హయాంలో చేసిన కొద్దిపాటి పనులూ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పైపులైన్లు వేసిన చోట్ల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదు. కుళాయి కనెక్షన్లు ఇచ్చిన ప్రాంతాల్లో పైపులైన్లు వేయలేదు. దీన్ని చక్కదిద్దేందుకు 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో జేజేఎంకు ప్రభుత్వం రూ.4 వేల కోట్లు కేటాయించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా కింద ఈ ఏడాది రూ.2 వేల కోట్ల వరకు వస్తుందని అంచనా. ఈ కార్యక్రమం కోసం బ్యాంకుల నుంచి రూ.10 వేల కోట్ల రుణం తీసుకుంటున్నారు. రెండేళ్లలో మొత్తం రూ.16 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు.

- జేజేఎం కింద రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వినియోగానికి కూటమి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. రూ.1,242 కోట్లతో ఉద్దానం, డోన్, పులివెందులలో నిర్మాణంలో ఉన్న తాగునీటి ప్రాజెక్టుల పూర్తికి చర్యలు చేపడుతోంది. చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయగోదావరి జిల్లాల్లో రూ.7,910 కోట్లతో తాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. వీటి పూర్తితో 1.20 కోట్ల మంది ప్రజలకు తాగునీటి సౌకర్యం కలగనుంది.

మూలధన వ్యయం పెంచడం బాగుంది

–నాదెండ్ల మనోహర్, పౌర సరఫరాల శాఖ మంత్రి



ఇది సంక్షోభం నుంచి పురోగతి వైపు, విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించే బడ్జెట్. గతంతో పోలిస్తే మూలధన వ్యయానికి 16 శాతం అదనపు నిధుల కేటాయింపు రాష్ట్రాభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికున్న నిబద్ధతకు నిదర్శనం. రెవెన్యూ వసూళ్ల పెరగడం ఆర్థిక వ్యవస్థ పటిష్ఠానికి సంకేతం. ఈ ఖరీఫ్‌లో రూ.10,950 కోట్ల విలువైన ధాన్యం కొన్నాం. 93% మంది రైతులకు 24 గంటల్లోనే బిల్లులు చెల్లించడం ఓ రికార్డు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా కీలక రంగాలకు నిధులు కేటాయించారు. పెట్టుబడుల సాధనకు మంత్రి నారా లోకేశ్ కృషిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాం.

83 కేంద్ర పథకాల పునరుద్ధరణ



–సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్యశాఖ మంత్రి

వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిన 83 కేంద్ర పథకాల్ని పునరుద్ధరించాం. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి వైద్యారోగ్య రంగానికి 9.5% అదనపు నిధులు కేటాయించారు. జగన్ ప్రభుత్వం చివరి బడ్జెట్‌తో ఇది పోలిస్తే 30% అదనం. శాఖల వారీగా నిధుల కేటాయింపులో వైద్యారోగ్యశాఖ నాలుగో స్థానంలో ఉంది. మూలధన వ్యయం రూ.3,066 కోట్లు కావడం సంతోషం.

సీమలో సిరుల పంట

- రూ.30 వేల కోట్లతో అంతర్జాతీయ ఉద్యానహబ్
- వచ్చే మూడేళ్లలో మరో 15 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగు
- ఉత్పత్తి 222 లక్షల టన్నుల నుంచి 435 లక్షల టన్నులకు పెంపు
- దిల్లీ పర్యటనలో కేంద్రంతో చర్చించిన సీఎం
- సానుకూల స్పందన తర్వాతే బడ్జెట్‌లో ప్రకటన



ఉమ్మడి ప్రకాశం జిల్లా సహా రాయలసీమ ముఖచిత్రమే మార్చేలా.. కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దేలా రూ.30 వేల కోట్లతో ప్రతిపాదనలు సమర్పిస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. రాష్ట్ర ఉద్యాన విస్తీర్ణంలో 43%, ఉత్పత్తిలో 55% వాటా ఈ ప్రాంతానిదే. అధిక విలువ కలిగిన 65 రకాల పంట ఉత్పత్తులు అక్కడి నుంచే వస్తున్నాయి. రూ.81,734 కోట్ల స్థూల విలువ జోడింపు (జీవీఏ) అందిస్తోంది. అయినా కోత అనంతర నష్టాలు, మార్కెట్ సమస్యలు, మౌలిక వసతుల లోటు రైతుల ఆదాయాన్ని, ఎగుమతి సామర్థ్యాల్ని దెబ్బతీస్తోంది. ఈ సమస్యలకు పరిష్కారం చూపడంతోపాటు ఉద్యాన సాగు మరింత విస్తరించడం ద్వారా అక్కడి రైతుల జీవితాల్లో సమూల మార్పులు తేవాలని లక్ష్యం. దీనిలో భాగంగా ప్రస్తుతం 21 లక్షల ఎకరాల్లో సాగవుతున్న ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని వచ్చే మూడేళ్లలో 36 లక్షల ఎకరాలకు, ఉత్పత్తిని 222 లక్షల టన్నుల నుంచి 445 లక్షల టన్నులకు పెంచేలా.. సమీకృత అభివృద్ధి ప్రణాళికలు రూపొందించింది. రైతులకు సాగునీటి సమస్యలు, రవాణాకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం మౌలిక సౌకర్యాలు కల్పించనుంది. పూర్వోదయ పథకం కింద కేంద్ర సహకారంతో ఈ ప్రాజెక్టు అమలు చేయనుంది. ఇటీవల దిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు దీనిపై కేంద్ర మంత్రులతో చర్చించారు. వారి నుంచి సానుకూల స్పందన లభించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే రూ.30 వేల కోట్లతో అంతర్జాతీయ ఉద్యానహబ్ ఏర్పాటును బడ్జెట్‌లో ప్రతిపాదించినట్లు తెలిసింది.



అంతర్జాతీయ ఉద్యాన హబ్‌కు ప్రాథమిక అంచనాలు

ఆయకట్టు స్థిరీకరణ, ప్రాజెక్టుల విస్తరణ:	రూ.20,000 కోట్లు
ఉద్యాన రంగంలో వాల్యూ చైన్ బలోపేతం	రూ.15,000 కోట్లు
గ్రామీణ రహదారుల నిర్మాణం	రూ.6,000 కోట్లు

చేపట్టే పనులు.. రైతుకు ఉపయోగం

- నాణ్యమైన మొక్కల సరఫరా, నర్సరీ సర్టిఫికేషన్
- ఉద్యాన సాగు విస్తీర్ణం, పంటల సాగులో వైవిధ్యం
- సూక్ష్మసేద్యంలో ఆటోమేషన్
- ఇప్పటికే ఉన్న పండ్లతోటల ఉత్పాదకత పెంపు
- ఉత్పత్తులకు పరిపూర్ణత
- పంట కోత అనంతర నిర్వహణ విధానాల అమలు
- లాజిస్టిక్స్, ప్యాకింగ్, బ్రాండింగ్
- స్టార్టప్, వ్యవసాయ అనుబంధ వ్యాపారాలకు ప్రత్యేక వ్యవస్థ అభివృద్ధి
- మౌలిక సౌకర్యాల కల్పన
- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
- ఎగుమతిలో పోటీతత్వం, మార్కెట్ సౌకర్యాల పెంపు
- ఉత్పత్తుల నాణ్యతకు ప్రాధాన్యం
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉత్తమ విధానాల అమలు
- ఉద్యాన పంటల ఉత్పాదకత గణనీయంగా పెరుగుదల
- రైతులు పండించే పంటలకు మెరుగైన ధర
- వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో 9 లక్షల ఉద్యోగాలు

10 జిల్లాలు.. 303 మండలాల్లో

ప్రాజెక్టు: గ్లోబల్ హార్టికల్చర్ హబ్
లక్ష్యం: అధిక విలువ కలిగిన, ఎగుమతి ఆధారిత ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం
అమలయ్యే జిల్లాలు (10): అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు. నంద్యాల, ప్రకాశం, మార్కాపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, వైఎస్సార్ కడప
మొత్తం మండలాలు: 303 గ్రామాలు: 5,869

201 క్లస్టర్లలో రూ.15,500 కోట్లతో..

ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక కింద 10 జిల్లాల పరిధిలో 201 క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నారు. రెండు దశల్లో పనులు చేపడతారు.

- వివిధ కార్యక్రమాల కింద రూ.24 వేల కోట్లు ఖర్చు చేస్తారు. అందులో కేంద్ర, రాష్ట్రాల వాటా రూ.15,500 కోట్లు, రైతుల వాటా రూ.8,500 కోట్లు.
- మొదటి ఫేజ్‌లో 170 మండలాల్లోని 101 క్లస్టర్లు ఉన్నాయి. అక్కడ ప్రస్తుతం ఉన్న 10.62 లక్షల ఎకరాలకు అదనంగా వచ్చే మూడేళ్లలో మరో 10 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు పెంచాలని లక్ష్యం.

రూ.20 వేల కోట్లతో ఆయకట్టు స్థిరీకరణ

ఉమ్మడి ప్రకాశం జిల్లాతోపాటు రాయలసీమ ప్రాంతంలో 23 మేజర్, మీడియం సాగునీటి ప్రాజెక్టుల్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. దీనితోపాటు జలాశయాల సామర్థ్యం పెంపు, కాల్వల ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకాలు, నదుల అనుసంధానం ద్వారా నీటి బదిలీ తదితర పనులు చేపడతారు. మొత్తం రూ.20 వేల కోట్లు ఖర్చవుతుంది. కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. 4.30 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరిస్తారు.

7,326 కి.మీ. రహదారుల వ్యవస్థ బలోపేతం

10 జిల్లాల్లో 7,326 కి.మీ. గ్రామీణ ప్రాంత రహదారుల వ్యవస్థ అభివృద్ధి చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం గుర్తించింది. ఇందుకు రూ.6 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా. తీవ్రంగా దెబ్బతిన్న రహదారుల్ని పూర్తిగా పునర్నిర్మిస్తారు. ఓ మోస్తరుగా పాడైనవాటికి మరమ్మతులు చేయడంతోపాటు అవసరమైన చోట రోడ్లు విస్తరిస్తారు. దీంతో రైతులకు ప్రయాణ సమయం తగ్గుతుంది. రవాణా ఖర్చులు ఆదా అవుతాయి. మండీ, ప్రాసెసింగ్ కేంద్రాలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలకు త్వరగా చేరుకోవచ్చు. తద్వారా పంట కోత అనంతర నష్టాన్ని తగ్గించుకోవచ్చు.

– ఈనాడు, అమరావతి

పంటల బీమాకు రూ.250 కోట్లు



ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకానికి (పీఎంఎఫ్‌బీవై) 2026-27 బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించింది. పంటల బీమా పథకం కింద రాష్ట్రం చెల్లించాల్సిన బకాయిలతో పోల్చితే ఈ కేటాయింపు తక్కువే. ఖరీఫ్, రబీల్లో సాగయ్యే మొత్తం సాగు విస్తీర్ణంలో సగానికి బీమా చేయాలన్నా.. రాష్ట్ర వాటాగా కనీసం రూ.500 కోట్లు అవసరం. సాధారణంగా ఖరీఫ్‌లో 37లక్షల హెక్టార్ల నుంచి 41 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయి. రబీలో 20 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలు వేస్తారు. పీఎంఎఫ్‌బీవై, సవరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల కింద ప్రీమియం చెల్లిస్తే.. పంట నష్టపోయిన వారికి బీమా సంస్థలు పరిహారం చెల్లిస్తాయి. 2022-23 రబీ నుంచి ప్రీమియం చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో ఇప్పటివరకు రూ.3వేల కోట్లకు పైగా బీమా సంస్థలకు చెల్లించాల్సి ఉంది. వీటిని విడుదల చేస్తేనే బీమా సంస్థలు రైతులకు పరిహారం చెల్లించే వీలుంటుంది.

అతడే నేను

పరమశివుడు భక్తసులభుడు. భోళాశంకరుడు. దేవదానవులు పాలకడలిని చిలికినప్పుడు సముద్రగర్భంలోంచి ఎన్నో అమూల్య దినుసులు బయటపడ్డాయి. ఘనమైన వాటిని గడుసువారంతా వాటంగా పంచేసుకున్నారు. భయంకర కాలకూట విషం పొంగేసరికి బెంబేలెత్తిపోయారు. శివుణ్ని ఆశ్రయించారు. పొగడ్తలు కురిపించారు. విషాన్ని ఆయన 'రస ఘుటికయునుం బోలె (ఔషధంలా) గుటుకున మ్రింగెన్' అంది హరవిలాసం. మింగేముందు మాత్రం అర్ధాంగికేసి చూశాడు. ఆ తల్లీ అమాయకురాలే! 'మ్రింగెడివాడు విభుండని మ్రింగెడిది గరళమనియును- మేలని ప్రజకున్ మ్రింగుమనె సర్వమంగళ... ప్రజలకోసమే కదా- సరే!' అందామె. తీరా విషం కడుపులో చేరితే బొజ్జలోని ముజ్జగాలు మాడి మసై పోవూ! అందుకే గుటకేసే సమయానికి చప్పున వచ్చి కంఠాన్ని గట్టిగా హత్తుకుంది. 'మంగళసూత్రమ్ము నెంత మది నమ్మినదో' అన్నాడు పోతన. తన పసుపు కుంకుమలపై నమ్మకం ఒకటేకాదు- ఆవిడ జగజ్జనని! లోకాలన్నీ క్షేమంగా ఉండాలన్నది ఆమె మంగళకర సూత్రం(సిద్ధాంతం). అదీ- ఆ ఆదిదంపతుల నిజస్వభావం. అందుకే వారిని 'జగత్తుకే అమ్మానాన్నలు' అన్నాడు కాళిదాసు- రఘువంశంలో!

కరవు ప్రాంతంలో మంచినీటిచుక్క దొరక్క దాహంతో తల్లడిల్లిపోయాడు శ్రీనాథుడు. శివుడిపై కోపం ముంచుకొచ్చింది. 'తిరిపెమునకు(భిక్షగాడికి) ఇద్దరాండ్రా? పరమేశా... గంగవిడుము పార్వతి చాలున్!' అని గద్దించాడు- చొరవగా! 'నీలకంఠుని శిరసుపై నీళ్లు చల్లి, పత్తిరి ఇసుమంత ఎవ్వాడు పారవైచునో... వాడింట కల్పవృక్షం, కామధేనువు కొలువుంటాయి' అన్నాడు- రాజశేఖర చరిత్రలో మాదయ గారి మల్లన్న. 'దేవా! నిన్ను నుతింపలేను అధమ బుద్ధిన్..' అంటూనే, ఆ చేతకానితనానికి 'ఛీ! లజ్జింపరు గాక మాదృశ కవుల్' అని తక్కిన వారిని కలుపుకొని మరీ దాసోహం అన్నాడు ధూర్జటి. అందుకే చేసేదేం లేక, 'నా హృదయాన్ని కానుక చేస్తున్నాను, స్వీకరించు' అంటూ ప్రార్థించారు- శివానంద లహరిలో శంకరులు. శివభక్తులు అందరికీ ఆయనతో బాగా చనువు. ప్రాణస్నేహం. భగవంతుడికి భక్తుడికి మధ్య అభేదభావం. 'నారుద్రో రుద్ర మర్చయేత్...' శివుడిగా మారిపోతే తప్ప శివార్చనకు పనికిరావంది- వేదం. తీవ్ర తపస్సుతో జీవుడు శివుడై పోవడాన్ని 'భ్రమర కీట న్యాయం' అంటారు. ఆ తరహా అద్వైతసిద్ధిని సాధించిన 'ఈశ్వర అర్చన కళాశీలురు' అలనాటి శివకవులు.

ఆధునిక యుగంలోనూ అంతటి అన్యోన్యత సాధ్యమేనని కవుల నమ్మకం. 'నాకీ ఉపాసనలు, మనోనిగ్రహాలు కుదిరేవి కాదు- కవితారూప తపస్సు చేసెదను శ్రీకంఠా!' అని ప్రతిపాదించారు విశ్వనాథ. 'నీవే భూమివి. నేను కర్షకుడ. తండ్రీ! నిన్ను పండించెదన్' అని సంకల్పించారు. అఖండ శివ విభూతిని అక్షరనేద్యంతో పెంచి పోషించారు. లోకానికి పంచారు. 'గిరిబాలతో తనకు కల్యాణమొనరింప దరిచేరు మన్మథుని మసి చేసినాడు...' వాడిని ఇంకేం అడుగుతామని సినీకవులు నిందాస్తుతి చేశారు. భక్తులెలాగో- భగవంతుడలాగ! భావమే భగవంతుడు. అన్నిరకాల ఆభిజాత్యాలు అహంకారాలు ఆత్మప్రత్యయాలు- ఆయన మూడో కంటి ప్రచండాగ్నిలో దగ్ధమై, ఆత్మశుద్ధమై- అటు భక్తితో ప్రణయాన్నో, ఇటు జ్ఞానంతో ప్రణవాన్నో ఉపాసించి, తుదకు మనోభావాలన్నింటినీ భవుడిలో లీనం చేసి జీవుడు శివుడై పోవడమే- శివరాత్రి ఉపవాస, జాగరణల గమ్యం. లీనం చేసుకుంటుంది కాబట్టి దాన్ని లింగం అన్నారు. ఆ లింగోద్భవం నేడే! నేను నువ్వూ అనేవి నశించి ఏకం అనేకమై ఏకంలో లీనమై ఉన్నదంతా ఏకమై ఎద సర్వం నాకం(స్వర్గం) కావడం- కృష్ణకథలో అయితే రాసం. శివుడి విషయంలో లయం! అదే శివ భక్తుల ధ్యేయం!



వ్యాపారవేత్తలు ఒక వయసుకు వచ్చాక 'లెట్ గో' స్వభావాన్ని అలవరచుకోవాలి. బాధ్యతలను తరవాత తరాల నిపుణులకు అప్పజెప్పి వాళ్లకు నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛనివ్వాలి. అది కొంచెం కష్టమే కానీ ముందు నుంచే దానికి సిద్ధమవ్వాలి.

– నుస్లీ వాడియా

శరణం శరణం... శంకరం

మహాశివరాత్రి లోతైన ఆధ్యాత్మిక పరమార్థం ఉన్న పండుగ. 'శివ' అంటే అక్షరాలా కల్యాణకారి. మహాశివరాత్రి నిరాకార స్వరూపుడైన ఆ మహాశివుడి దివ్య కార్యాలను స్మరించుకుంటూ, పరమేశ్వరుడికి ప్రణమిల్లే సుదినం. లింగపురాణం ప్రకారం, శివుడు ప్రపంచాన్ని సృష్టించి, దివ్యశక్తితో నిలబెడతాడు.

శివలింగం పైన మూడు గీతలు ఆయన త్రిమూర్తి, త్రినేత్రి, త్రికాలదర్శి, త్రిలోకనాథుడు అని సూచిస్తాయి. శ్రీరాముడు రామేశ్వరంలో, శ్రీకృష్ణుడు బృందావనంలోని గోపేశ్వర్‌లో శివుణ్ని ప్రార్థించారని, అందుకు గుర్తుగా అక్కడ శివాలయాలు నిర్మించారని చెబుతారు. భారతదేశంలోని పన్నెండు ప్రసిద్ధ శివాలయాలను జ్యోతిర్లింగ క్షేత్రాలుగా పిలుస్తారు. చిదంబరంలో శివుడు నటరాజు. అనంత శక్తితో నృత్యం చేస్తాడు. అసాధారణ కదలికలతో చిరుత పులిలా కనిపిస్తాడు. పాములా జారిపోతాడు. ఉరుమవుతాడు. ఆ నటరాజే భారతీయ శాస్త్రీయ నృత్యాలకు ప్రేరణ.

రమణ మహర్షి శివుణ్ని తండ్రిగా భావించి, ఆయనను వెతుకుతూ అరుణాచలం బయలుదేరారని అంటారు. వేదసార శివస్తోత్రం సూర్యుడు, చంద్రుడు, అగ్ని... శివుడి మూడు కళ్లు అని పేర్కొంటుంది. సూర్యుడు తేజోవంతంగా ఉంటాడు. ఆ కాంతి వస్తువులను ప్రకాశింపజేస్తుంది. దానికి విరుద్ధంగా చంద్రుడి కాంతికి చల్లదనం, ప్రశాంతమైన గుణం ఉంటుంది. శివుడు తన మూడు కళ్లతో ప్రపంచాన్ని చూస్తాడు. బాధలో, దుఃఖంలో ఉన్నవారు సమీపించినప్పుడు ఆయన వారిని చంద్రకాంతికి సమమైన ఆహ్లాదకరమైన, ఓదార్పునిచ్చే దృక్కులను ప్రసరిస్తాడు. సూర్యరశ్మి ఒక్క క్షణంలో ప్రపంచాన్ని ప్రకాశింపజేస్తుంది. పరమశివుడి కరుణాకటాక్ష వీక్షణాలతో సమకూరే జ్ఞానం జీవితానికి కొత్త వెలుగును అద్దుతుంది. అగ్నికి దహించే శక్తి ఉంది. భగవంతుడి తపస్సుకు భంగం కలిగించడానికి తన వంతు ప్రయత్నం చేసిన కామదేవుడు ఆయన కోపాగ్నికి బూడిదైన సంగతి తెలిసిందే.




అంతర్యామి

శ్వేతాశ్వతర ఉపనిషత్ శివుణ్ని పరమపురుషుడిగా ప్రస్తావించింది. ఆయనే సర్వోన్నత గురువు, దక్షిణామూర్తి. తాను సృష్టించిన మాయకు అతీతంగా స్వయంగా నిర్దేశించిన నియమాలతో ఈ లౌకిక ప్రపంచంలో కర్తవ్యబద్ధుడై ఉంటాడు. భక్తుడి చిన్న ప్రార్థనకే సంతోషిస్తాడు. ఈ విషయం పార్వతి స్వయంగా గ్రహించింది. ఆమె కూడా తన చుట్టూ ఉన్న భౌతిక సృష్టికి అతీతంగా ఎదిగి, తీవ్రమైన తపస్సు, సాధనల ద్వారా మనసును ఆత్మలో విలీనం చేయాల్సి వచ్చింది.

శివుడి ఎనిమిది లక్షణాలు- స్వయం ఉనికి, పవిత్రత, ఆత్మజ్ఞానం, సర్వజ్ఞత్వం, అపారమైన దయ, సర్వశక్తిమత్వం, ఆనందం, అనారోగ్యం లేకపోవడం అంటే మాలిన్యం లేకపోవడం. కరుణ ఆయన స్వభావం. ప్రేమ... అస్తిత్వం. ఆయనకు అనంతమైన పేర్లూ రూపాలూ ఉన్నాయి. శివస్తోత్రావళి- శివుణ్ని దక్షిణాచార, వామాచార మార్గాల సారాంశంగా వర్ణిస్తుంది. ఏ విధంగానైనా, ఏ ప్రదేశంలోనైనా, ఏ రూపంలోనైనా శివయ్యను పూజించవచ్చని ఇది స్పష్టం చేస్తోంది.

– మంత్రవాది మహేశ్వర్



చిన్నారి కలలను కాపాడుకుందాం!

క్యాన్సర్ అంటేనే భయపడతాం. ఇక పిల్లలకు క్యాన్సర్ ఉందని తెలిస్తే? తల్లిదండ్రులు భయాందోళనలతో ఉక్కిరిబిక్కిరవుతారు. అభంశుభం తెలియని చిన్నారులకు క్యాన్సరేంటని నమ్మడానికే నిరాకరిస్తుంటారు. నిజమే, పిల్లల్లో క్యాన్సర్ అరుదే. అలాగని అసలే రాకూడదనేమీ లేదు. మన దేశంలో ఏటా ప్రతి లక్ష మంది పిల్లల్లో సుమారు 12-15 మంది క్యాన్సర్ బారినపడుతున్నారు. ఒకప్పుడు పిల్లల్లో క్యాన్సర్ అనగానే ఆశలు వదులుకునేవారు. అధునాతన చికిత్సల పుణ్యమాని ప్రస్తుతం పరిస్థితి గణనీయంగా మెరుగైంది. సుమారు 80-85శాతం బాల్య క్యాన్సర్లను నయం చేయగలుగుతున్నారు. కాకపోతే అవగాహన కలిగుండటం, సత్వరం గుర్తించి, సరైన చికిత్స చేయించడమే కావాలి. నేడు ఇంటర్నేషనల్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే సందర్భంగా...

బాల్య క్యాన్సర్ల తీరే వేరు. ఇవేమీ జీవనశైలి మార్పులతోనో, పెంపకం తీరుతోనో ముడిపడినవి కావు. పుట్టుకతోనే జన్యువుల పనితీరు అస్తవ్యస్తం కావడం వీటికి మూలం. వృద్ధి చెందుతున్న కణాల్లో అనూహ్యంగా తలెత్తే మార్పులతో ఇవి పుట్టుకొస్తుంటాయి. పద్దెనిమిదేళ్ల లోపువారిలో వచ్చే వాటిని చైల్డ్‌హుడ్ క్యాన్సర్లు అంటారు. వీటిల్లో రక్తక్యాన్సర్ (ల్యుకేమియా), లింఫ్ వ్యవస్థ క్యాన్సర్ (లింఫోమా), మెదడు కణితులు (బ్రెయిన్ ట్యూమర్స్), ఎముక క్యాన్సర్ (బోన్ సార్కోమా), కంటి క్యాన్సర్ (రెటినోబ్లాస్టోమా), నాడీ కణాల క్యాన్సర్ (న్యూరోబ్లాస్టోమా), కిడ్నీ క్యాన్సర్ (విల్మ్స్ ట్యూమర్), కండర క్యాన్సర్ (రాబ్డో మయోసార్కోమా) ఎక్కువగా కనిపిస్తుంటాయి.



భయపడొద్దు, భయపెట్టొద్దు

బాల్య క్యాన్సర్లు చికిత్సలకు లొంగుతాయి. పిల్లల శరీరం కీమోథెరపీ వంటి చికిత్సలను సమర్థంగా తట్టుకుంటుంది, స్పందిస్తుంది. ఎముకమజ్జ మార్పిడి వంటి పెద్ద చికిత్సలు చేసినా కోలుకుంటారు. సర్జరీ నుంచి త్వరగా బయటపడతారు. సమయానికి చికిత్స చేస్తే నయమయ్యే అవకాశం ఎక్కువ. కాబట్టి తల్లిదండ్రులు భయపడకుండా, పిల్లలను భయపెట్టకుండా ఉండటం ముఖ్యం. పిల్లల్లో ధైర్యాన్ని నింపి, మూడు నాలుగు నెలలు చికిత్స చేస్తే మామూలుగా అవుతారు. అందరిలా బడికి వెళ్లొచ్చు, ఆటలు ఆడొచ్చు, చదువుకోవచ్చు, ఉద్యోగాలు దక్కించుకోవచ్చు. ఇలాంటివారు చాలామందే ఉన్నారు. బాల్య క్యాన్సర్ల విషయంలో మాత్రమూ ప్రాణాంతక సమస్య కాదని వీరంతా నిరూపిస్తున్నారు.

- **అధునాతన చికిత్సల అండ:** పిల్లల క్యాన్సర్లలో కీమోథెరపీ చాలా ముఖ్యం. కొన్నిసార్లు రేడియేషన్, సర్జరీ, ఎముకమజ్జ మార్పిడి కూడా అవసరమవుతాయి. కొత్త చికిత్సలు ఇప్పుడు అండగా నిలుస్తున్నాయి. కార్-టి సెల్ చికిత్స పిల్లల రోగ నిరోధక కణాలనే క్యాన్సర్‌ను నిర్మూలించేలా చేస్తుంది. ఇమ్యునోథెరపీ శరీర సహజ రక్షణ వ్యవస్థను బలోపేతం చేసి, క్యాన్సర్‌తో పోరాడేలా ప్రోత్సహిస్తుంది. ఆరోగ్య కణజాలాలకు హాని కలగకుండా కేవలం క్యాన్సర్ కణాల మీదే దాడి చేయడం టార్గెటెడ్ థెరపీ ప్రత్యేకత.
- **ముందే గుర్తించడం కీలకం:** బాల్య క్యాన్సర్లను తొలిదశలోనే గుర్తిస్తే బాగా నయం చేయొచ్చు. కాబట్టి లక్షణాలను విస్మరించొద్దు. విడవకుండా జ్వరం వేధించడం, ఒంటి మీద అసాధారణ గడ్డలు, ఉబ్బులు ఉంటే వదిలేయొద్దు. అకారణంగా బరువు తగ్గుతున్నా, నిరంతరం నీరసం, ఆటలు పట్టించుకోకపోతున్నా, ఎముకలు లేదా కీళ్ల నొప్పి పుడుతున్నా అనుమానించాలి. తేలికగా చర్మం కమలడం, రక్తస్రావం ఆగకపోవడం, చూపు మారడం, ఉదయంపూట తీవ్రమైన తల నొప్పి, వాంతులు... వంటి అసాధారణ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు. నిజానికి ప్రతి లక్షణమూ క్యాన్సర్ సంకేతమేమీ కాదు. కానీ తరచూ, విడవకుండా వేధిస్తుంటే మాత్రం జాగ్రత్త పడాల్సిందే. సత్వరం మేల్కొంటే చికిత్స త్వరగా, తేలికగా పూర్తవుతుంది. క్యాన్సర్ నయమయ్యే అవకాశం పెరుగుతుంది.
- **పోషణ, మానసిక దన్ను:** క్యాన్సర్ చికిత్సలో మందులతో పాటు మంచి పోషణ, ఇన్‌ఫెక్షన్ల నివారణ, రక్తం ఎక్కించడం, నొప్పి తగ్గించడం, కౌన్సెలింగ్, శ్రద్ధగా కనిపెట్టుకోవటమూ ముఖ్యమే. మంచి పోషకాహారం తీసుకునే పిల్లలు చికిత్సలను బాగా తట్టుకుని, త్వరగా కోలుకుంటారు. తల్లిదండ్రులు, సంరక్షకులు, వైద్యులు అండగా నిలిస్తే పిల్లలకు కొండంత బలం లభిస్తుంది. జబ్బును తేలికగా ఎదుర్కొంటారు. చికిత్స అనంతరం క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించడమూ కీలకమే. పిల్లల ఆరోగ్యాన్ని ఓ కంట కనిపెట్టడం, అవసరమైన టీకాలన్నీ ఇప్పించడం, మంచి జీవనశైలిని పాటించేలా చూడటం వంటివన్నీ ముున్ముందు ఆరోగ్యంగా, హాయిగా జీవించటానికి తోడ్పడతాయి.
- **అపోహలు వద్దు:** బాల్య క్యాన్సర్ల మీద ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, అణగారిన వర్గాల్లో చాలా అపోహలున్నాయి. వీటిని తొలగించుకోవడం మంచిది. పిల్లల క్యాన్సర్లు ఒకరి నుంచి ఒకరికి సోకేవి కావని, ఎవరి శాపంతోనో రావని గుర్తించడం ముఖ్యం. ఒకసారి చికిత్సతో నయమయ్యాక అందరిలాగే హాయిగా జీవిస్తారు. కీమోథెరపీ దుష్ప్రభావాలు ఒకట్రెండు నెలల వరకే ఉంటాయి. తరవాత ఇబ్బందులేవీ ఉండవు. రెండేళ్లు దాటితే, జబ్బు తిరగబెట్టకపోతే పూర్తిగా నయమైనట్టుగానే భావించొచ్చు.

అందరి ప్రయత్నంతోనే


బాల్య క్యాన్సర్‌ను ఎదుర్కోవడం సవాలే కావచ్చు. కానీ దాంతో జీవితమేమీ అంతం కాదని ఇంటర్నేషనల్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే గుర్తుచేస్తోంది. అవగాహన, త్వరగా గుర్తించడం, అధునాతన చికిత్సలు, తగు పోషణ, దయతో కూడిన దన్ను వంటి వాటితో భయాలను పోగొట్టొచ్చు. కొత్త ఆశలు రేకెత్తించొచ్చు. సత్వర చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చు. చిన్నారులను క్యాన్సర్ నుంచి బయటపడేస్తే అది కుటుంబానికే కాదు, యావత్ సమాజానికి, శాస్త్రరంగానికీ విజయమే. అందువల్ల మరింత ఎక్కువ మంది పిల్లల మనుగడకు మనమంతా కంకణబద్ధులం కావాలి. వాళ్లు తిరిగి కమ్మటి కలలు కనడానికి కలిసికట్టుగా ప్రయత్నించాలి.

– డాక్టర్ వర్షిణీ బండి

కన్సల్టెంట్ పీడియాట్రిక్ హెమటాలజిస్ట్ అండ్ అంకాలజిస్ట్,
అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్

కాసేపు ఫోనుకు దూరంగా ఉంటేనే ప్రాణం గిజగిజలాడిపోయే రోజులివి. అలవాటైన సౌకర్యాలు వదిలి ఒక్క పూటైనా ఉండలేం. అలాంటిది కట్టుబట్టలు కూడా లేకుండా ఒంటరిగా ఓ దీవిలో ఏళ్ల తరబడి బతకడం... మన ఊహకు కూడా అందని విషయం. అలాంటి వాస్తవ సంఘటనల స్ఫూర్తితో బ్రిటిష్ రచయిత డానియెల్ డెఫో 1719లో రాసిన నవల పేరు 'రాబిన్సన్ క్రూసో'. ఆ దీవిలో జీవితాన్ని క్రూసో మాటల్లోనే చెప్పిస్తారు రచయిత. రియలిస్టిక్ ఫిక్షన్‌కి నాంది పలికిన నవలగా దీన్ని పేర్కొంటుంటారు. డెఫో మొదట ఈ పుస్తకానికి పెట్టిన పేరు ఒక పెద్ద పేరాగ్రాఫ్ అంత ఉంటుంది. ప్రచురితమైన ఎనిమిది నెలల్లోనే నాలుగు సార్లు పునర్ముద్రణ పొంది, లెక్కలేనన్ని భాషల్లోకి అనువాదమైంది 'రాబిన్సన్ క్రూసో'. భాషను సరళతరం చేస్తూ, పిల్లల కోసం బొమ్మలతో... దీనికి రకరకాల ఎడాప్టేషన్లు వచ్చాయి.

ఒంటరిగా... ఓ దీవిలో!



ఆ రోజుల్లో ఓడలో ప్రయాణించడమంటే సాహసయాత్ర కిందే లెక్క. క్రూసోకి అలాంటి సాహసాలు చేయడం ఇష్టం. అందుకే అమ్మానాన్నలు వద్దన్నా వినకుండా యాత్రలకు వెళ్లిపోయేవాడు. మొదటిసారి అలా వెళ్లి చేసిన వ్యాపారం బాగా కలిసొచ్చింది. ఆ డబ్బంతా ఓ స్నేహితురాలికి అప్పజెప్పి మళ్లీ వెళ్లాడు. ఈసారి సముద్ర దొంగలు దోచుకుని ఓడలోని వారందరినీ బందీలుగా చేసుకుంటే క్రూసో ఓ కుర్రాడితో కలిసి ఎలాగో తప్పించుకుంటాడు. ఆ ఇద్దరినీ మరో ఓడ కెప్టెన్ రక్షించి తమ దేశానికి తీసుకెళ్తాడు. అక్కడ ఆ పిల్లాణ్ని కెప్టెన్‌కు అమ్మేసి తోటలు కొని సెటిలవుతాడు క్రూసో. కొన్నాళ్లకు మళ్లీ సముద్రం మీదికి గాలి మళ్లుతుంది. బానిస వ్యాపారం లాభసాటిగా ఉందని తెలిసి తానూ ఆ పని చేద్దామని ప్రయాణమవుతాడు. ఈసారి తుపానులో చిక్కుకుని ఓడ ధ్వంసం కాగా క్రూసో తప్పించుకుని ఈదుకుంటూ ఒక నిర్జన ద్వీపానికి చేరతాడు. ఓడ శిథిలాల్లో దొరికిన పనిముట్లను, ఇతర సామాన్లను తీసుకుని ఆ దీవిమీద అడుగుపెట్టిన క్రూసో భయపడలేదు, తన జీవితం అక్కడే అనామకంగా ముగుస్తుందన్న ఊహ కూడా రానీయలేదు. అక్కడున్న వనరులతోనే ఇల్లు కట్టుకున్నాడు. పంటలు పండించుకున్నాడు. మట్టి పాత్రలు తయారుచేసుకున్నాడు. మేకల్ని పెంచుకున్నాడు. పడవలు తయారుచేశాడు. అప్పుడప్పుడు అక్కడికి వచ్చే నరమాంస భక్షకులను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. వాళ్ల దగ్గర నుంచి మొదట రక్షించిన వ్యక్తికి ఆరోజు శుక్రవారం కాబట్టి 'ఫ్రైడే' అని పేరు పెట్టి తన సహాయకుడిగా ఉంచుకుంటాడు. ఆ తరవాత మరికొందరిని రక్షించి ఆశ్రయమిచ్చి ఆ దీవికి తాను రాజైనట్లు భావిస్తాడు. వారందరి సాయంతో ఒక ఓడను చేజిక్కించుకుని 28 ఏళ్ల తరవాత తిరిగి స్వదేశానికి వస్తాడు.

అన్నేళ్లపాటు ఒంటరిగా జీవిస్తూ అనూహ్య ప్రమాదాలను ధైర్యంగా ఎదుర్కొంటూ ఏమీలేని చోటును ఒక కాలనీగా మలుస్తాడు క్రూసో. కష్టాలను తట్టుకుని మనగలిగే శక్తి, సానుకూల దృక్పథం, స్వావలంబన... లాంటి అంశాలు పిల్లలకు తెలియాలని ఈ నవలను తప్పనిసరిగా చదవాల్సిన జాబితాలో చేర్చారు. ఈ తరహా కథలకు 'రాబిన్సనేడ్' అనీ, ఒంటరిగా పరిస్థితులకు ఎదురీది బతికేవారిని 'క్రూసోస్' అనీ, కుడిభుజంగా ఉండేవాళ్లను 'మ్యాన్ ఫ్రైడే' అనీ అనడం... దీనినుంచే వచ్చింది. 1902లో మూకీ చిత్రంతో మొదలుపెట్టి ఇటీవలి 'కాస్ట్‌అవే', 'ద మార్షియన్' వరకూ ఈ కథతోనూ, దీని స్ఫూర్తితోనూ వచ్చిన సినిమాలకైతే లెక్కే లేదు.

– మిహిర

జాతి మూలుగను పీల్చేస్తున్న అవినీతి

భారతావనిలో మూడు పువ్వులూ ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది ఏంటి అంటే ప్రతి ఒక్కరికీ వెంటనే గుర్తొచ్చేది అవినీతే! రెవెన్యూ, పురపాలక, పట్టణాభివృద్ధి... ఇలా ఏ శాఖ తీసుకున్నా, కొన్ని ధనపిశాచాలు కాచుకుని ఉంటాయి. లంచాల మేతల్లో భయం, అంతరాత్మకు జడవడం లాంటివేవీ వాటికి ఉండవు. ఆ అవినీతి బకాసురుల పొట్ట నింపనిదే పనులేవీ జరగవన్నది దాదాపు అందరికీ అనుభవైకవేద్యం! ఇక నల్లధనమే ఇంధనంగా ఎన్నికల్లో గెలిచి, ఆ తరవాత అంతకు వందల రెట్లు రాబట్టేందుకు అనుంగు అధికారులూ కాంట్రాక్టర్లతో కలిసి కొందరు నాయకులు సాగించే అక్రమాల గురించి చెప్పుకొంటూ పోతే, 'అసలు ఈ వ్యవస్థ ఎప్పటికి బాగుపడుతుంది' అనే సందేహం ప్రతి ఒక్కరికీ తప్పక కలుగుతుంది. ఎక్కడికక్కడ అవినీతి జలగలు ఆబగా జనం రక్తాన్ని జుర్రుకుంటుంటే, సామాన్యుల బతుకుల్లో అభివృద్ధి జాడ కనిపించకపోతుంటే- ఎన్నాళ్లీ దురవస్థ అన్న ఆక్రోశమూ తన్నుకొస్తుంది.

ఇంతలా అవినీతి భూతం స్వైరవిహారం చేస్తున్న ఇండియాకు సంబంధించి ఇటీవల ఒక ఆసక్తికర నివేదిక వెలుగులోకి వచ్చింది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ కరప్షన్ ఇండెక్స్‌లో 2024తో పోలిస్తే భారత్ నిరుడు అయిదు స్థానాలు మెరుగుపడి 91వ ర్యాంకు దక్కించుకుంది. మార్కులు ఎంత తగ్గితే అంతగా ఆయా దేశాల్లో నీతీ నిజాయతీలు కరవవుతున్నట్లుగా లెక్కించే సూచీ ఇది. ఇందులో 2024లో ఇండియాకు వచ్చిన స్కోరు 38 అయితే, 2025లో ఒక మార్కు ఎక్కువగా 39 సాధించింది. అవినీతి వ్యతిరేక పోరాటంలో ఇదే పెద్ద ప్రగతి అని చంకలు గుద్దుకుంటే అంతకు మించిన ఆత్మద్రోహం ఇంకోటి ఉండదు. అయినా, క్షేత్రస్థాయిలో ఆఫీసులన్నీ ఆమ్యామ్యాల మయమే అయినప్పుడు ఇలాంటి నివేదికలను చూసి జనం నిర్వేదంతో నవ్వుకోవడం తప్ప జరిగేదేమీ ఉండదు!

డబ్బు సంపాదనపై విపరీతమైన యావే అవినీతి క్యాన్సర్‌ను పెంచి పోషిస్తోందని సుప్రీంకోర్టు గతంలోనే ఆవేదన వ్యక్తం చేసింది. అది అక్షర సత్యం. గౌరవప్రదమైన ఉన్నత కొలువుల్లో ఉన్నా, జీతాలుగా పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని తీసుకుంటున్నా- కొందరు అధికారులకు సంతృప్తి కలగడంలేదు. ఇంకా ఇంకా ఆర్జించాలన్న పేరాశతో విచ్చలవిడిగా వసూళ్లకు తెగబడుతున్నారు. రవాణా శాఖ మహబూబ్‌నగర్ డిప్యూటీ కమిషనర్ ఇంటితో పాటు ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లలో తెలంగాణ ఏసీబీ ఇటీవల సోదాలు జరిపింది. అందులో గుర్తించిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో వందల కోట్లలో ఉంటుందని అంచనా వేసింది. రాష్ట్ర ఏసీబీ చరిత్రలో ఈ స్థాయిలో అక్రమాస్తులు బయటపడటం ఇదే తొలిసారి! అంతకుముందు నీటిపారుదల విభాగంలో చిక్కిన ఇంజినీర్ల అడ్డగోలు సంపాదన కన్నా ఇదే ఎక్కువ! ఉద్యోగంలో చేరింది మొదలు నిస్సిగ్గుగా చెయ్యి చాపడం మొదలుపెట్టి ఒక్కొక్కరు ఇంతగా కూడబెడుతుంటే వ్యవస్థలు కళ్లు మూసుకున్నాయా? ఏపీ గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగి ఒకరు పలుమార్లు ఏసీబీకి చిక్కినా ఆయన బుద్ధి మారలేదు!



ఆదిలోనే అతడిపై గట్టి చర్యలు తీసుకుని ఉంటే, మళ్లీమళ్లీ వక్రబుద్ధిని ప్రదర్శించేవాడేనా? ఒక కేసు విషయంలో నిందితుడి నుంచి నాలుగు లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ బెంగళూరులో లోకాయుక్తకు చిక్కిన ఒక ఇన్‌స్పెక్టర్ పెద్దగా అరుస్తున్న వీడియో ఇటీవల వైరల్ అయ్యింది. అపరాధభావం ఇసుమంతైనా లేని అటువంటి వారే యంత్రాంగంలో ఎక్కువగా పోగుపడటం జనభారతం ప్రారబ్ధం!

పుణ్యభూమి

తెలంగాణ ఏసీబీ 2024లో 11 మంది అధికారులపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదు చేసింది. బహిరంగ మార్కెట్లో వారి అక్రమాస్తుల విలువ వెయ్యి కోట్ల రూపాయలు ఉంటుందని తేలింది. నిరుడు తొలి అయిదు నెలల్లోనే అలాంటి రూ.500 కోట్ల అక్రమాస్తులను గుర్తించింది. 2024లో తెలంగాణ ఏసీబీ 129 ట్రాప్ కేసులు నమోదు చేస్తే, గతేడాది తొలి ఆరు నెలల్లోనే ఆ సంఖ్య 122కు చేరింది. ఆంధ్రప్రదేశ్ ఏసీబీ నిరుడు వలవేసి మరీ 69 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. దేశవ్యాప్తంగా ఇలా చాలామంది దొరుకుతున్నారు. ఆయా కేసుల్లో సంబంధిత లంచాలరాయుళ్లకు శిక్షలు పడుతున్నాయా అని ఆరాతీయడం- కుందేటి కొమ్ముకోసం వెతకడం ఒకటే అవుతుంది! గూగుల్‌పే, ఫోన్‌పే చేసెయ్యమని దర్జాగా డిమాండ్ చేసే స్థాయికి అవినీతి పెరిగిపోయింది. ఇంతలా బరితెగించి లంచం తీసుకున్నా ఎవరూ ఏమీ చేయలేరన్న ధైర్యం వీరందరికీ ఎక్కడి నుంచి వస్తోంది? అక్రమాస్తుల కేసుల్లో న్యాయ విచారణకు ప్రభుత్వాలు ఒక పట్టాన సమ్మతి తెలపడంలేదు. దాంతో ఏళ్లకేళ్లు గడిచిపోతున్నా అవి ఒక కొలిక్కి రావడంలేదు. అవినీతి అధికారులు, రాజకీయ నాయకుల మధ్య ఉన్న ఫెవికాల్ బంధాన్ని ఇది కళ్లకు కడుతుంది. అసలు అన్ని రకాల భ్రష్టాచారాలకూ తల్లివేరులా రాజకీయ అవినీతి వర్ధిల్లుతుండటం వల్లే జాతి వనరులు కొందరి గుప్పిట చిక్కి అసమానతలు, పేదరికం జడలు విప్పుతున్నాయి. విశృంఖల అక్రమాల మూలంగా నాసిరకం రోడ్లు, ప్రాజెక్టులు, బ్రిడ్జిలు పుట్టుకొచ్చి దేశ ప్రగతిని పరిహాసం చేస్తున్నాయి. అంతూదరీ లేని అవినీతి మూలంగా ఇండియా ఏటా లక్ష కోట్ల డాలర్ల మేర నష్టపోతున్నట్లు పుష్కర కాలం కిందటే వెల్లడైంది. ఇన్నేళ్లలో అది ఇంకెన్ని రెట్లు పెరిగి ఉంటుందని తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది.

ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ పరిశీలన ప్రకారం 2021 జనవరి చివరి నాటికి తెలంగాణలో ఒక్క రెవెన్యూ విభాగంలోనే 318 ఏసీబీ, 121 విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో పడి ఉన్నాయి. ఏపీలోనూ అనిశా కేసుల పరంగా దాదాపు ఇదే దుస్థితి నెలకొంది. ఇక సీబీఐ దర్యాప్తు చేసిన ఏడువేలకు పైగా అవినీతి కేసుల్లో విచారణలు ఏళ్లుగా అక్కడే పడి మూలుగుతున్నాయి. ఇంకోవైపు 2015 నుంచి గత జూన్ నాటికి ఈడీ చేపట్టిన ఆరువేల మనీలాండరింగ్ కేసుల్లో కేవలం 15 మందికే శిక్షలు పడ్డాయి. దండనలో జాప్యమే అవినీతి దందాసురులకు వరమవుతోంది! సమాజాన్ని సర్వనాశనం చేస్తున్న అవినీతిపరుల కారణంగా ప్రజలకు సామాజిక న్యాయం అందించాలన్న రాజ్యాంగ లక్ష్యం నీరుగారిపోతోంది. ఈ దుర్భర స్థితిని నివారించాలంటే- న్యాయపాలిక సూచించినట్లు రాజ్యానికి, సమాజానికి వ్యతిరేకమైన నేరంగా అవినీతిని చూడాలి. రాజకీయ అవినీతిని అంతం చేయకుండా కింది స్థాయిలో అక్రమాలను కట్టడి చేయలేమన్న సంగతిని ప్రభుత్వాలు గుర్తుపెట్టుకోవాలి. కానీ, తిలా పాపం తలా కొంచెం అన్నట్లు నల్లధనం చుట్టూ పరిభ్రమిస్తున్న మన నేతాస్వామ్యంలో అక్రమ ధనార్జనకు అర్రులుచాచే వారిపై ఉక్కుపాదం మోపేదెవరు?

– వేణుబాబు మన్నం

అంతా ప్లాస్టిక్కే!

ఫ్రెండ్స్.. ఇప్పుడు మీకో టాస్క్. ఒకసారి మీ స్కూలు బ్యాగ్‌లో ఎన్ని ప్లాస్టిక్ ఐటమ్స్ ఉన్నాయో లెక్క పెట్టండి. లెక్క చూశాక అమ్మో అనిపిస్తుంది కదూ. ఇంట్లో ఉన్న వస్తువుల్ని కూడా లెక్కిస్తే కళ్లు తేలేయాల్సిందే. మనం వాడే పెన్ను మొదలు లంచ్‌బాక్సుదాకా అంతా ప్లాస్టిక్కే. అవును, మనకు తెలియకుండానే రోజూ బోలెడన్ని ప్లాస్టిక్ వస్తువులు వాడేస్తున్నాం. మన రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ ఒక భాగంగా మారిపోయింది. మరి దాని గురించి తెలుసుకుందామా!

మనం స్కూలులో క్లే వాడతాం కదా! దాంతో రకరకాల ఆకృతులు తయారు చేస్తాం. ప్లాస్టిక్ కూడా ఎలా కావాలంటే అలా తీర్చిదిద్దుకోవడానికి వీలుగా ఉండే పదార్థం. ప్లాస్టిక్‌ను వేడి చేసి, అది చల్లారే లోపు కావాల్సిన ఆకృతిలోకి మార్చుకోవచ్చు. ప్లాస్టిక్ కోసం శాస్త్రవేత్తలు చాలా రకాలుగా ప్రయత్నించారు. కాలక్రమంలో రకరకాల ప్లాస్టిక్ పదార్థాలను గుర్తించారు.



అప్పట్లో సహజసిద్ధ పదార్థాలైన కర్ర, మెటల్, తోలు వంటివి ఎక్కువగా లభించేవి. ఇలాంటి సింథటిక్ మెటీరియల్‌తో పెద్దగా ఉపయోగం కనిపించలేదు.

1907లో లియో బేక్‌లాండ్ ఫెనోలిక్ ప్లాస్టిక్‌ను కనిపెట్టారు. భారీ పరిమాణాల్లో తయారు చేయడానికి వీలయ్యే పూర్తిస్థాయి సింథటిక్ మెటీరియల్ అదే. అప్పట్నుంచి పలువురు శాస్త్రవేత్తలు విభిన్న రకాల ప్లాస్టిక్‌లను కనిపెట్టారు. ఇప్పుడు దాదాపు 50కిపైగా రకాల ప్లాస్టిక్కులున్నాయి. ప్లాస్టిక్స్ తయారీలో క్రూడ్‌ఆయిల్ కీలక ముడి సరకు. కాకపోతే ఇది శిలాజ ఇంధనం. అంటే మన భూగోళంపై పరిమితంగా ఉన్న ఒక వనరు.

హాయ్! బుజ్జీ!!

ప్లాస్టిక్‌తో గత వందేళ్లలో ప్రపంచమే మారిపోయింది. ఎలాంటి రూపంలోకైనా మారగలగడం, దృఢంగా ఉండటం, తయారీ సులభం, చవక కావడం వంటి కారణాలతో ప్లాస్టిక్ వాడకం పెరిగింది. కాకపోతే, పర్యావరణానికి అది చేస్తున్న హానితోనే పెద్ద సమస్య. అందుకని, వాడేసిన ప్లాస్టిక్‌ను ఎక్కడ పడితే అక్కడ పారేయొద్దు, జాగ్రత్తగా ఉండాలి.

– శ్రీజన్

అవునా.. కాదా..?

ఇక్కడ ఇచ్చిన వాక్యాలను చదివి అవునో, కాదో చెప్పండి చూద్దాం.

1. పెంగ్విన్లు గాల్లో ఎగరగలవు.
2. మనిషిలో ఎముకల సంఖ్య 206.
3. పాలపిట్ట మన జాతీయ పక్షి.
4. మార్స్‌ని 'రెడ్ ప్లానెట్' అని పిలుస్తారు.

జవాబులు: 1.తప్పు 2.ఒప్పు 3.తప్పు 4.ఒప్పు

అసెంబ్లీకి రూ.165 కోట్ల కేటాయింపు

బడ్జెట్‌లో అసెంబ్లీకి గత ఏడాది కంటే సుమారు రూ.21 కోట్లకుపైగా పెంచి రూ.165 కోట్లు కేటాయించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల నుంచి 'నేషనల్ ఈ-విధానం' అమలు చేసేందుకు అవసరమైన సాంకేతిక ఏర్పాట్ల కోసం సుమారు రూ.8 కోట్ల ప్రతిపాదనకూ పచ్చ జెండా ఊపారు. ఈ పథకానికి కేంద్రం ఇవ్వనున్న రూ.10 కోట్లను కలిపి ప్రాజెక్టు చేపట్టనున్నారు.




మెట్రో రైల్ ప్రాజెక్టులకు రూ.15.50 కోట్లు


విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.15.50 కోట్లు కేటాయించారు. అవసరానికి అనుగుణంగా అంచనాలు సవరించి అదనపు కేటాయింపులు చేయనున్నారు. సీఎం చంద్రబాబు ఇటీవల దిల్లీలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ని కలిసి మెట్రో రైల్ ప్రాజెక్టులకు ఇవ్వాల్సిన అనుమతులపై చర్చించారు. రెండు నగరాల్లో తొలి దశ పనులకు రూ.22,507 కోట్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

ఆర్థిక వృద్ధికి త్రిముఖ వ్యూహం

- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా 3 ఎకనమిక్ రీజియన్లు
- విశాఖ రీజియన్‌కు రూ.500 కోట్ల కేటాయింపు
- నీతి ఆయోగ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు
- కేంద్రం, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రాజెక్టుల అమలు











ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమ్మిళిత అభివృద్ధే లక్ష్యంగా తలపెట్టిన ఎకనమిక్ రీజియన్‌ల ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. విజన్ స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్ని గ్లోబల్ ఎకనమిక్ హబ్‌లుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో బడ్జెట్‌లో వాటికి ప్రత్యేక ప్రాధాన్యమిచ్చింది. ఇప్పటికే ఆర్థికాభివృద్ధి ప్రణాళిక సిద్ధమైన విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)కు తాజా బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించింది. విశాఖ మెట్రో రైలు సహా వీఈఆర్‌కు సంబంధించి రూ.28 వేల కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.

విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా మూడు ఆర్థికాభివృద్ధి రీజియన్‌లను ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. ఇవి రాష్ట్రానికి కీలక గ్రోత్ ఇంజిన్లుగా భావిస్తోంది. నీతి ఆయోగ్‌తో కలసి రూపొందించిన వీఈఆర్ ఆర్థికాభివృద్ధి ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం 2025 నవంబరులో విడుదల చేసింది. అమరావతి, తిరుపతి రీజియన్‌లకు సంబంధించిన ప్రణాళికలను కూడా నీతి ఆయోగ్, ఇతర సంస్థల భాగస్వామ్యంతో త్వరలో రూపొందించనుంది. ఇంకా ప్రణాళికలు సిద్ధం కాకపోయినా, ఈ రెండు ప్రాంతాల అభివృద్ధి దిశగా కీలక నిర్ణయాలు ప్రకటించింది. రాయలసీమలో రూ.30 వేల కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తాజాగా బడ్జెట్‌లో ప్రకటించింది. అమరావతి రీజియన్‌లో రాజధాని నిర్మాణ పనులు రూ.57,868 కోట్ల వ్యయంతో జరుగుతున్న సంగతి తెలిసిందే.

7 వృద్ధి చోదకాలతో విశాఖ ప్రగతి వీచిక

- విశాఖ ఆర్థిక రీజియన్‌లోకి శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు వస్తాయి.
- వీఈఆర్‌ను 2032 నాటికి 125-135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, 60-70 బిలియన్ డాలర్ల జీవీఏ, 20-24 లక్షల ఉద్యోగాల సాధన లక్ష్యంగా ఏడు గ్రోత్ డ్రైవర్‌లను ప్రభుత్వం గుర్తించింది. పోర్టు ఆధారిత మాన్యుఫ్యాక్చరింగ్ హబ్, ఐటీ, డేటా సెంటర్, ఏఐ, ఇన్నోవేషన్ హబ్, వ్యవసాయం, పర్యాటకం వంటి ఏడు డ్రైవర్లను ఎంపిక చేసింది.
- మొత్తం 41 కీలక ప్రాజెక్టులు, పరిశ్రమలను ఏర్పాటు చేస్తారు. వాటికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం, ప్రైవేటు సంస్థల నుంచి సమకూర్చుకుంటామని ఆర్థిక మంత్రి కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు.
- ముఖ్యమంత్రి ఛైర్‌పర్సన్‌గా ఏర్పాటైన వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌తో పాటు ఆర్థిక, వ్యవసాయ, హోం, పురపాలక, పరిశ్రమల శాఖల మంత్రులను సభ్యులుగా నియమించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

అభివృద్ధికి ఆయువుపట్టుగా అమరావతి రీజియన్

అమరావతి ఎకనమిక్ రీజియన్ పరిధిలోకి పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం జిల్లాలు వస్తాయి. దీని ప్రణాళికను నీతి ఆయోగ్‌తో కలిసి సింగపూర్ సంస్థలు రూపొందిస్తాయి. రాజధానిలో ప్రభుత్వం క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తోంది. ఐటీ పరిశ్రమల్ని ప్రోత్సహిస్తోంది. అంతర్జాతీయ విమానాశ్రయం, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ వంటి ప్రాజెక్టులతో పాటు ప్రముఖ విద్యాసంస్థలు ఇక్కడికే వస్తున్నాయి.

ఈ ప్రాంతంలో వ్యవసాయాధారిత, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, లాజిస్టిక్స్, టెక్స్‌టైల్, సిమెంట్ క్లస్టర్లు, నాలెడ్జ్/ ఫైనాన్స్ హబ్‌లకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వనుంది. ఏవియేషన్, కమర్షియల్ హబ్‌లూ రాబోతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాను ఆక్వాకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దబోతోంది.

రాయలసీమ సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

రాయలసీమ ఎకనమిక్ రీజియన్ ప్రణాళికను కూడా నీతి ఆయోగ్ రూపొందించబోతోంది. దీని పరిధిలోకి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, వైఎస్సార్ కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాలు వస్తాయి. రాయలసీమలో ఇప్పటికే పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టులను, ఉద్యానరంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఆటోమొబైల్, ఏవియేషన్, ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్‌ల తయారీ పరిశ్రమలు వంటివి ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున వస్తున్నాయి. సీమలో పర్యాటక రంగాన్ని కూడా ప్రోత్సహిస్తోంది.

3 పోర్టులు.. 4 చేపల రేవులు!



- మౌలిక సదుపాయాల కోసం రూ.400 కోట్లు
- పెండింగ్ భూసేకరణ పనుల పూర్తికి అవకాశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడు, కాకినాడ సెజ్ పోర్టుల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది ఈ ఏడాది ఆఖరుకు మూడు పోర్టుల నిర్మాణాన్ని పూర్తిచేయాలన్నది లక్ష్యం. సేకరించాల్సిన భూముల కోసం చెల్లించేందుకు ఇబ్బంది లేకుండా 2026-27 బడ్జెట్‌లో రూ.400.37 కోట్లు కేటాయించింది. భావనపాడు పోర్టుకు రూ.100 కోట్లు, మచిలీపట్నం పోర్టుకు రూ.150 కోట్లు, రామాయపట్నం పోర్టుకు రూ.100 కోట్లు, కాకినాడ ఎస్ఈజడ్ పోర్టుకు రూ.50 కోట్ల చొప్పున ప్రభుత్వం కేటాయించింది.

- మచిలీపట్నం పోర్టు సమీపంలో ఉన్న ఉప్పుభూములు సుమారు 507 ఎకరాలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డీపీఐఐటీకి ప్రతిపాదన పంపింది. ప్రస్తుతం 456.28 ఎకరాలు సేకరించేందుకు డీపీఐఐటీ అంగీకరించింది. ఈ డిసెంబరు కల్లా నిర్మాణం పూర్తిచేయాలన్నది లక్ష్యం. ఇప్పటికే 50% పనులు పూర్తయ్యాయి.

మొదటిదశ పోర్టు నిర్మాణ పనుల పురోగతి (రూ.కోట్లలో)

పోర్టు పేరు	ఒప్పంద విలువ	చేసిన ఖర్చు
మచిలీపట్నం	4,735.18	1,761.01
రామాయపట్నం	3,289.96	1,956.57
మూలపేట	3,256.18	1,887.72
కాకినాడ గేట్‌వే	2,620.00	604.23

- కాకినాడ గేట్‌వే పోర్టు నిర్మాణాన్ని 2028 సెప్టెంబరు నాటికి పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

- రామాయపట్నం పోర్టు వాటర్‌ఫ్రంట్ విస్తరించే ప్రతిపాదన ఉంది. దీనికోసం 363 ఎకరాలు అవసరం. ఈ భూములను ఇప్పటికే బీపీసీఎల్‌కు కేటాయించడంతో.. ప్రత్యామ్నాయ భూములు చూపించి, వాటిని వెనక్కి తీసుకునేలా సంప్రదింపులు జరుగుతున్నాయి. పోర్టు పనులు 75% వరకు పూర్తయ్యాయి.
- మూలపేట పోర్టు సమీపంలోని 385.24 ఎకరాల ఉప్పు భూములు తీసుకునేందుకు డీపీఐఐటీకి ప్రభుత్వం ప్రతిపాదన పంపింది. వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు ఆ సంస్థ అంగీకరించింది. ఇప్పటికి 65% పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది నవంబరుకు పోర్టు పనులు పూర్తిచేయాలన్నది లక్ష్యం.
- కాకినాడ గేట్‌వే పోర్టు నిర్మాణానికి సేకరించాల్సిన 586 ఎకరాల భూముల ఎసైనీలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. దీన్ని 2028 సెప్టెంబరు నాటికి పూర్తిచేయాలని భావిస్తున్నారు.

ఈ ఏడాదిలోనే మొదటి దశ ఫిషింగ్ హార్బర్లు

రాష్ట్రంలో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడలలో నాలుగు ఫిషింగ్ హార్బర్లను రూ.1,204.58 కోట్లతో మొదటిదశలో ప్రభుత్వం చేపట్టింది. వాటిలో సగటున 85% పనులు పూర్తయ్యాయి. వచ్చే మార్చికి వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.

విమానయానానికి ఊతం



ఈనాడు, అమరావతి: నిర్మాణంలో ఉన్న భోగాపురం విమానాశ్రయాన్ని పూర్తి చేయడంతో పాటు.. రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు వీలుగా ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.250.73 కోట్లు కేటాయించింది. దీంతో పాటు రాబోయే ప్రాజెక్టుల అభివృద్ధి కోసం మరో రూ.50 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించింది. మొత్తంగా ఈ రంగానికి రూ.300.73 కోట్లు కేటాయించడం గమనార్హం.

- భోగాపురం విమానాశ్రయాన్ని పూర్తి చేయడాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంది. ఈ ఏడాది జూన్‌లో దీన్ని ప్రారంభించాలని భావిస్తున్నారు. ఈ దృష్ట్యా పెండింగ్ పనులపై అధికారులు దృష్టి పెట్టారు. ఇప్పటికే విమానాల ల్యాండింగ్‌ను ప్రయోగాత్మకంగా నిర్వహించారు. మిగిలిన పనులు వేగంగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.155.73 కోట్లు కేటాయించింది. ఈ మొత్తంతో పెండింగ్‌లో ఉన్న 40 ఎకరాల భూ సేకరణ.. 15 కి.మీ.మేర రోడ్ల పనులు, విద్యుత్ సదుపాయం, నీటి సరఫరా తదితర పనులు పూర్తిచేస్తారు.

రెండు ప్రాంతీయ విమానాశ్రయాలకు రూ.30 కోట్లు

రాష్ట్రంలో కొత్తగా రెండు విమానాశ్రయాల నిర్మాణానికి వీలుగా రూ.30 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడంతో పనులు ప్రారంభించేందుకు మార్గం ఏర్పడింది. కుప్పంలో విమానాశ్రయాన్ని నిర్మించాలన్న ప్రతిపాదనతో పాటు..దగదర్తి విమానాశ్రయ నిర్మాణ పనులు పట్టాలెక్కనున్నాయి.

- కుప్పంలో విమానాశ్రయ నిర్మాణం కోసం 444 ఎకరాలు సేకరించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే సర్వే పూర్తయింది.
- నెల్లూరు జిల్లా దగదర్తిలో విమానాశ్రయ నిర్మాణానికి ఇంకా పెండింగ్‌లో ఉన్న 418 ఎకరాల భూముల సేకరణ, 14 కి.మీ. ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉంది.
- విజయవాడ విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన రైతులకు నిబంధన మేరకు ఏటా చెల్లించాల్సిన మొత్తం.. ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం కోసం (1,121 మందికి) రూ.30 కోట్లు కేటాయించారు.
- ప్రాంతీయంగా విమాన సర్వీసులు నడిపేందుకు వీలుగా 8 సర్వీసులకు వయబిలిటీ గ్యాప్ ఫండ్(వీజీఎఫ్) చెల్లించేందుకు రూ.30 కోట్లు కేటాయించింది.

కడప ఉక్కుకు రూ.25 కోట్లు



ఈనాడు, అమరావతి: కడప ఉక్కు కర్మాగారం పనుల నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. ప్రాజెక్టు నిర్మించే ప్రాంతానికి రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్‌లో రూ.25 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ ఏడాదిలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. జాతీయ రహదారి-67 నుంచి కర్మాగారం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని అనుసంధానిస్తూ నాలుగు లేన్ల రహదారి, ఏటా 2 టీఎంసీల నీటిని సరఫరా చేసేందుకు వీలుగా 15 కి.మీ.ల పైపు లైన్, విద్యుత్ సరఫరా కోసం జమ్మలమడుగులోని 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి డబుల్ సర్క్యూట్ లైన్ ఏర్పాటుకు వీలుగా ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది.

ఐటీకి దన్ను

- బడ్జెట్‌లో రూ.536 కోట్ల కేటాయింపు
- అమరావతి క్వాంటమ్ వ్యాలీకి రూ.10 కోట్లు

ఈనాడు-అమరావతి: ఐటీ సామర్థ్యాన్ని బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం రూ.536.28 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. బడ్జెట్ కేటాయింపుల నుంచి వివిధ ఐటీ కంపెనీలకు ప్రోత్సాహకాల కింద రూ.300 కోట్లు చెల్లించేందుకు ప్రతిపాదించింది.

ఐటీ కార్యకలాపాల కోసం..



అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించింది. కార్యాలయం స్పేస్ అద్దె ప్రోత్సాహకం, టెక్నికల్ కన్సల్టెంట్లు, క్వాంటమ్ ఇంప్లిమెంటేషన్ యూనిట్, ఆఫీసు ఏర్పాటు, ఏడాదిలో కనీసం 10 ఈవెంట్లు నిర్వహించేందుకు ఈ మొత్తాన్ని వినియోగించనుంది.

- ఇంక్యుబేటర్లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, జాతీయ స్థాయి సదస్సులు, హ్యాకథాన్లు, స్టార్టప్‌లకు మద్దతు వంటి కార్యక్రమాలకు రూ.40.70 కోట్లు కేటాయించింది.
- ఈ-ప్రగతి ద్వారా వివిధ శాఖల వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను బలోపేతం చేయడానికి రూ.17.37 కోట్లు కేటాయింపు.
- ఐటీ పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.55.87 కోట్లు కేటాయింపు.
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా చేపట్టే కార్యక్రమాలకు రూ.50 కోట్లు.
- ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్‌కు రూ.3.05 కోట్లు కేటాయించడం ద్వారా వివిధ పథకాల అమలుకు వివిధ విభాగాలకు సాంకేతిక సహకారం, రాష్ట్రంలో 667 మండలాల్లో భూగర్భ జలాల వివరాలు తెలుసుకోనుంది.

వైద్య రంగానికి రూ.19,306 కోట్లు

- గతంతో పోలిస్తే 9.46 శాతం అధికం
- ఎన్టీఆర్ వైద్యసేవకు రూ.4 వేల కోట్లు
- వైద్య కళాశాలలు, బోధన ఆసుపత్రులకు రూ.3,069 కోట్లు



ఈనాడు, అమరావతి: రాష్ట్ర బడ్జెట్‌లో వైద్యారోగ్య రంగానికి ప్రభుత్వం రూ.19,306 కోట్లు కేటాయించింది. నాలుగో ప్రాధాన్య అంశంగా ఈ రంగానికి మొత్తం బడ్జెట్‌లో 5.81 శాతం నిధులను ప్రకటించింది. 2025-26 బడ్జెట్‌లో (రూ.17,637 కోట్లు) కంటే రూ.1,669 కోట్లు (9.46%) పెంచింది. కీలకమైన ఎన్టీఆర్ వైద్యసేవకు రూ.4 వేల కోట్లు, వైద్య కళాశాలలకు రూ.1,699 కోట్లు, బోధనాసుపత్రులకు రూ.1,400 కోట్లు, పీఎం- అభిమ్‌కు రూ.830 కోట్లు కేటాయించింది. వైకాపా ప్రభుత్వం నిలిపేసిన ఎన్టీఆర్ బేబీ కిట్ పథకం పునరుద్ధరణకు రూ.51.15 కోట్లు ప్రతిపాదించింది.

విభాగాల వారీగా..

- కుటుంబ సంక్షేమశాఖకు గత బడ్జెట్‌లో రూ.4,915.62 కోట్లు కేటాయిస్తే.. ఈ బడ్జెట్‌లో రూ.5,352.74 కోట్లు (8.89% పెంపు) ప్రతిపాదించారు.
- వైద్యవిద్య (డీఎంఈ)కు గత బడ్జెట్‌లో రూ.8,363.22 కోట్లు కేటాయిస్తే.. ఇప్పుడు రూ.9,380 కోట్లకు (12.17%) పెంచారు.
- ప్రజారోగ్యశాఖ (డీపీహెచ్)కు గత బడ్జెట్‌లో రూ.2,519.56 కోట్లు ఇవ్వగా ఇప్పుడు రూ.2,582.67 కోట్లు (2.50% వృద్ధి) కేటాయించారు.
- జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల బలోపేతానికి గత బడ్జెట్‌లో రూ.1,444.12 కోట్లు కేటాయిస్తే.. ఈసారి రూ.1,549.11 కోట్లకు (7.27%) పెంచారు.
- ఆయుష్ శాఖకు రూ.385.25 కోట్లు (గతంతో పోలిస్తే 21.29% పెంపు) ప్రకటించారు.
- వైద్యారోగ్య శాఖకు గత బడ్జెట్‌లో రూ.8.14 కోట్లు కేటాయిస్తే ఇప్పుడు రూ.8.46 కోట్లు ఇచ్చారు.

సరిపోని నిధులు

బడ్జెట్‌లో గతంలో కంటే నిధుల కేటాయింపు పెరిగినా.. కొన్ని విభాగాలకు ఈ నిధులు చాలని పరిస్థితి నెలకొంది. ఎన్టీఆర్ వైద్య సేవాట్రస్ట్‌కు తాజా బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయించగా.. ఈ పరిధిలోని 600 నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలే రూ.2,400 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, మందుల కొరత లాంటి సమస్యలను అధిగమించాల్సి ఉంది. సంజీవని, అందరికీ ఆరోగ్యం లాంటి కార్యక్రమాల అమలుకు మరిన్ని నిధులు అవసరం.

వైద్య కళాశాలలకు..

- ఇప్పటికే ఉన్న వైద్య కళాశాలలకు రూ.1,419 కోట్లు, రాజమహేంద్రవరం, ఏలూరు, నంద్యాలలో కొత్త వైద్య కళాశాల నిర్మాణానికి రూ.250 కోట్లు, గిరిజన ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులకు రూ.110 కోట్లు, నర్సింగ్ కళాశాలలకు రూ.105 కోట్లు, కొత్త నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు రూ.10 కోట్లు, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)కు రూ.180 కోట్లు, మహాప్రస్థానాలకు రూ.9 కోట్లు, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు రూ.3 కోట్లు కేటాయించారు.
- పీహెచ్‌సీలకు రూ.1,190.78 కోట్లు, వైద్యసేవలకు రూ.382.86 కోట్లు, జిల్లా కార్యాలయాలకు రూ.146.79 కోట్లు వెచ్చించనున్నారు.
- 108 అంబులెన్స్ సేవలకు రూ.222 కోట్లు, 104 సంచార వైద్య సేవలకు రూ.128 కోట్లు, పట్టణ పీహెచ్‌సీల్లో డయాగ్నస్టిక్ సేవలకు రూ.127.83 కోట్లు, ఆయుర్వేద ఆసుపత్రులకు రూ.23 కోట్లు, కళాశాలలకు రూ.12 కోట్లు, డిస్పెన్సరీలకు రూ.5 కోట్లు కేటాయించింది.



- ఔషధ నియంత్రణ (డీసీఏ) విభాగానికి గత బడ్జెట్‌లో రూ.47.47 కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.25.63 కోట్లు మాత్రమే కేటాయించారు.

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమగ్ర స్వరూపం



(అంకెలు రూ.కోట్లలో)

వివరం	2024–25 వాస్తవ గణాంకాలు	2025–26 బడ్జెట్ అంచనాలు	2025–26 సవరించిన అంచనాలు	2026–27 బడ్జెట్ అంచనాలు
ఎ. ప్రారంభ నిల్వ	–67.16	-67.16	-31.03	-31.03
బి. రెవెన్యూ వసూళ్లు	1,67,675.81	2,17,976.53	1,96,903.53	2,34,140.14
1. కేంద్ర పన్నుల్లో వాటా	52,080.15	57,566.31	56,741.18	64,362.16
2. పన్ను ఆదాయం	89,435.30	1,09,006.78	98,025.18	1,25,845.78
3. పన్నేతర ఆదాయం	5,972.16	19,119.04	14,324.18	11,473.98
4. గ్రాంట్లు	20,188.20	32,284.40	27,812.99	32,458.22
సి. మూలధన వసూళ్లు	1,04,646.40	1,04,382.80	1,03,631.14	98,065.20
5. బహిరంగ మార్కెట్ రుణాలు	78,205.06	80,456.50	79,456.00	76,182.00
6. ఫ్లోటింగ్ డెట్ (గ్రాస్)	13,419.30	0.00	0.00	0.00
7. కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు	8,868.21	21,700.00	20,929.42	19,133.41
8. ఇతర రుణాలు	700.00	1,500.00	2,496.30	2,000.00
9. డిపాజిట్లు, లావాదేవీలు (నికరం)	3,008.82	700.56	700.97	700.00
10. రుణాలు, అడ్వాన్సులు	96.19	25.74	48.45	49.79
11. ఇతర వసూళ్లు	349.04	0.00	0.00	0.00
12. కంటింజెన్సీ ఫండ్	-0.22	0.00	0.00	0.00
డి. మొత్తం వసూళ్లు	2,72,322.21	3,22,359.33	3,00,534.67	3,32,205.34
ఇ. రెవెన్యూ వ్యయం	2,27,960.96	2,51,162.50	2,38,021.89	2,56,142.64
13. ఇందులో వడ్డీ చెల్లింపులు	32,967.13	34,998.12	37,233.27	37,280.55
ఎఫ్. మూలధన వ్యయం	16,141.28	40,635.72	33,134.63	48,697.71
జి. రుణాలు, అడ్వాన్సులు	5,032.20	6,130.95	6,362.93	5,217.67
హెచ్. మూలధన చెల్లింపులు	23,151.65	24,430.16	23,015.22	22,147.32
ఐ. మొత్తం వ్యయం	2,72,286.08	3,22,359.34	3,00,534.67	3,32,205.34
జే. ముగింపు నిల్వ	-31.03	-67.17	-31.03	-31.03
కె. రెవెన్యూలోటు (బి-ఇ)	-60,285.15	-33,185.97	-41,118.36	-22,002.50
ఎల్. ద్రవ్యలోటు	-81,362.44	-79,926.90	-80,567.47	-75,868.09
ఎం. ప్రాథమిక లోటు	-48,395.31	-44,928.78	-43,334.20	-38,587.54

పేదల గూడుకు రూ.6,355 కోట్లు

ఈనాడు, అమరావతి: పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.6,355 కోట్లు కేటాయించింది. వైకాపా ప్రభుత్వంలో వదిలేసిన నిర్మాణాలు, కొత్తగా గృహనిర్మాణాలు చేపట్టేందుకు నిధులు కేటాయించింది. కూటమి ప్రభుత్వం వివిధ దశల్లో ఉన్న 3 లక్షల గృహాలను పూర్తి చేసి, లబ్ధిదారులకు అందించింది. పీఎంఏవై పట్టణ పథకానికి రూ.1,818 కోట్లు, పీఎంఏవై గ్రామీణ్ పథకానికి రూ.2,710 కోట్లు, పీఎం జన్‌మన్ రూ.686 కోట్లు కేటాయించింది.



పేదలందరికీ 'అన్న'ం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మరో 71 అన్న క్యాంటీన్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ప్రతి నియోజకవర్గంలోనూ క్యాంటీన్ ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. నగరాలు, పట్టణాల్లో ప్రస్తుతం 204 క్యాంటీన్లు ఉన్నాయి. కొత్తవి గ్రామీణ నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ప్రారంభించనున్నారు. ఈ క్యాంటీన్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోజూ 1.06 కోట్ల మందికిపైగా పేదల ఆకలి తీరనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు.

వెనుకబడిన తరగతులకు వెన్నుదన్ను

ఈనాడు, అమరావతి: వెనుకబడిన తరగతులకు వెన్నెముకలా నిలిచేలా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. గతేడాది రూ.47,456 కోట్లు కేటాయించగా.. ఈసారి దాన్ని రూ.51,021 కోట్లకు పెంచింది. రూ.3,565 కోట్లు అదనంగా ప్రతిపాదించింది. చేనేతలకు ఆర్థికసాయాన్ని అందించేందుకు రూ.245 కోట్లు కేటాయించింది. ఇందులో బీసీల్లోని వివిధ సామాజికవర్గాలకు చెందిన నేత వృత్తివారికి రూ.200 కోట్లు, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి చేయూత అందించేందుకు రూ.20 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద చేనేత కార్మికులకు ఏడాదికి రూ.25 వేల చొప్పున అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

- ఓబీసీ, ఈబీసీ, సంచారజాతులకు కేంద్ర సహకారంతో అందించే పోస్ట్‌మెట్రిక్, ప్రీమెట్రిక్ ఉపకారవేతనాలకు రాష్ట్ర వాటా విడుదల చేయకుండా జగన్ ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసింది. కూటమి ప్రభుత్వం వాటికి రూ.1,892 కోట్లు కేటాయించింది. బోధనారుసుముల చెల్లింపునకు రూ.686 కోట్లు కేటాయించింది.
- వైకాపా ప్రభుత్వంలో కునారిల్లిన బీసీ స్టడీ సర్కిళ్లకు జీవం పోసింది. పోటీ పరీక్షలకు బీసీ విద్యార్థులకు ఉచిత వసతితో కూడిన శిక్షణ అందించేందుకు రూ.9.56 కోట్లు కేటాయించింది.
- నాయీబ్రాహ్మణులకు విద్యుత్తు రాయితీ అమలుకు రూ.50 కోట్లు. దీంతో 45 వేల మందికి లబ్ధి చేకూరనుంది.
- చేనేతలకు విద్యుత్తు రాయితీకి రూ.150 కోట్లు కేటాయించారు. 81 వేల మందికి రాయితీ వర్తింపజేయనున్నారు.
- విదేశీ విద్యకు రూ.40 కోట్లు
- వసతిగృహాల నిర్మాణానికి రూ.80.42 కోట్లు
- గురుకులాల నిర్మాణానికి రూ.10 కోట్లు
- బీసీ కులవృత్తులకు చేయూత అందించేందుకు కూటమి ప్రభుత్వం ఆదరణ 2.0ను అమలు చేయాలని నిర్ణయించింది. గతేడాది ఈ పథకానికి రూ.1,000 కోట్లు కేటాయించగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఈసారీ బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించారు. బీసీల అభివృద్ధికి ఎంతో కీలకమైన స్వయం ఉపాధి రాయితీ రుణ పథకం కూడా గతేడాది 60 వేల మంది లబ్ధిదారుల ఎంపికకే పరిమితమైంది. వారంతా ప్రభుత్వ చేయూత కోసం ఇప్పటికీ ఎదురుచూస్తున్నారు. రాయితీ రుణ పథకానికి నిరుడు రూ.200 కోట్లు కేటాయించగా ఈసారి రూ.220 కోట్లకు పెంచారు.

మైనారిటీలకు మెజారిటీ నిధులు

ఈనాడు, అమరావతి: మైనారిటీల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. గతేడాది బడ్జెట్‌లో రూ.5,434 కోట్లు కేటాయించగా.. తాజాగా రూ.656 కోట్లు అదనంగా చేర్చి రూ.6,090 కోట్లు ప్రతిపాదించింది. ఇందులో మైనారిటీల సంక్షేమానికి రూ.2,957 కోట్లు కాగా.. ఉపప్రణాళిక కింద రూ.3,133 కోట్లు చూపించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మైనారిటీలకు ప్రత్యేకంగా ఉపప్రణాళికను అమల్లోకి తీసుకురాగా.. ఆ కోటా కింద గతేడాది (రూ.2,512 కోట్లు) కంటే ఈసారి రూ.621 కోట్ల కేటాయింపులు పెరిగాయి. మైనారిటీ విద్యార్థులకు మేలు చేకూరేలా కొత్తగా గురుకులాలు, వసతి గృహాల నిర్మాణం, ఇప్పటికే ఉన్న వాటిలో మౌలిక వసతుల కల్పనకు చేయూత అందిస్తూ రూ.20 కోట్లు కేటాయించింది.

- మైనారిటీలు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో వారి అభివృద్ధికిగాను కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలయ్యే ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమాన్ని వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేయగా.. కూటమి ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించింది. ఈ పథకం కింద కేంద్రం విడుదల చేసిన నిధుల్ని అప్పటి ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించింది. ఆ మేరకు రూ.200 కోట్లను కూటమి ప్రభుత్వం తిరిగి గతేడాది కేంద్రానికి జమ చేసింది. తాజాగా ఆ పథకం కింద కేంద్రం నుంచి మరిన్ని నిధులు తెచ్చుకునేందుకుగాను రాష్ట్ర వాటాగా రూ.300 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించింది.
- ముస్లిం మైనారిటీ యువత స్వయం ఉపాధి పథకాల అమలుకుగాను రూ.183.98 కోట్లు, క్రైస్తవ యువత స్వయం ఉపాధి కల్పనకు రూ.21.20 కోట్లు ప్రతిపాదించారు. గతేడాది కూడా ఇదే తరహాలో నిధులు కేటాయించినా ఖర్చు చేయలేదు.
- ఉర్దూ ఘర్, షాదీఖానాల నిర్మాణానికి రూ.2.85 కోట్లు
- మైనారిటీ విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం సీఈడీఎంకి రూ.3.97 కోట్లు
- హజ్ యాత్రికుల సాయానికి రూ.6.97 కోట్లు
- జెరూసలెం యాత్రికులకు రూ.1.50 కోట్లు
- ఇమామ్, మౌజమ్‌ల గౌరవ వేతనాల చెల్లింపునకు రూ.90 కోట్లు
- పాస్టర్ల గౌరవ వేతనాల చెల్లింపునకు రూ.67.41 కోట్లు. గతేడాది (30.49 కోట్లు) కంటే ఈసారి సుమారు రూ.37 కోట్లు కేటాయింపులు పెరిగాయి.



సహస్ర వృత్తులకు సంక్షేమ పెన్నిధి

ఎస్టీలకు రూ.9,190 కోట్లు

ఈనాడు, అమరావతి: గత ఏడాదితో పోలిస్తే ఈ సారి బడ్జెట్‌లో ఎస్టీలకు నిధుల కేటాయింపును ప్రభుత్వం పెంచింది. 2025-26లో రూ.8,159 కోట్లు ప్రతిపాదించగా తాజాగా రూ.9,190 కోట్లు చేసింది. ఎస్టీల అభివృద్ధిలో కీలక భూమిక నిర్వహించే కేంద్ర ప్రాయోజిత పథకాలకు ఊపిరి పోసేలా రాష్ట్ర వాటా నిధులను భారీగా పెంచింది. మారుమూల గిరిజన గ్రామాలకు రహదారుల అనుసంధానం, కాఫీ సాగు విస్తరణ, ఉచిత విద్యుత్తు, ఉపకారవేతనాలు, బోధనా రుసుములు మొదలైన పథకాలకు నిధులు కేటాయించింది.

- కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు రూ.433.51 కోట్లు
- గిరిజన ప్రాంతాల్లో కాఫీ తోటల విస్తరణకు: రూ.16.88 కోట్లు
- వసతి గృహాలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అనుసంధాన రహదారులకు: రూ.100 కోట్లు
- 9 ఐటీడీఏల నిర్వహణకు రూ: 28.63 కోట్లు
- ఉచిత విద్యుత్తుకు: రూ.100 కోట్లు
- గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం కోసం రూ.15 కోట్లు
- గిరిజన సంస్కృతి, పరిశోధన శిక్షణకు రూ.13.97 కోట్లు
- ఎస్టీల స్వయం ఉపాధి రాయితీ పథకాల అమలుకు బడ్జెట్‌లో రూ.138 కోట్లు కేటాయించింది. గత ఏడాది కూడా నిధులు కేటాయించినా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు.

ఎస్సీలకు రూ.20,644 కోట్లు

ఈనాడు, అమరావతి: ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం రూ.20,644 కోట్లు కేటాయించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.363 కోట్లు అదనం. కొత్త వసతి గృహాలు, గురుకులాల నిర్మాణం, పాత వాటిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసింది. ఆయా వర్గాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం, తాగునీటి వసతి, ఇతర సౌకర్యాల కల్పనకు నిధుల కేటాయింపు పెంచింది. ఈ ఏడాది ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్మాణం, మరమ్మతులు, అదనపు తరగతి గదులు, ఇతర వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. గత ఏడాది కూడా ఇదే తరహాలో ఖర్చు చేసింది. ఇది కాకుండా కేంద్ర ప్రాయోజిత పథకమైన పీఎం అజయ్ పథకం కింద రూ.65 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించింది. వీటితో కేవలం కొత్త భవనాలను మాత్రమే నిర్మిస్తారు.

- ప్రధానమంత్రి ఆదర్శ గ్రామీణ యోజనకు రూ.185.08 కోట్లు
- ఎన్టీఆర్ విద్యోన్నతికి : రూ.2.15 కోట్లు
- అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి : రూ.28.15 కోట్లు
- ఎస్సీలకు ఉచిత విద్యుత్ అమలుకు : రూ.300 కోట్లు
- కులాంతర వివాహాలకు : రూ.6.96 కోట్లు
- పీఎం అజయ్ (గ్రాంటు): రూ. 10 కోట్లు
- ఎస్సీ యువతకు స్వయం ఉపాధి రాయితీ రుణ పథకాన్ని అమలు చేసేందుకు బడ్జెట్‌లో రూ.361.45 కోట్లు కేటాయించింది.

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రూ.10,699 కోట్లు

ఈనాడు, అమరావతి: ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్) సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.10,699 కోట్లు కేటాయించింది. ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు, కమ్మ, రెడ్డి, ఈబీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ఈ నిధుల్ని వినియోగించనున్నారు. స్వయం ఉపాధి రాయితీ రుణ పథకాల అమలుకు రూ.495 కోట్లు ప్రతిపాదించింది. ఆయా వర్గాల్లో నేత వృత్తి చేసే వారికి ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించేందుకు రూ.19 కోట్లు కేటాయించింది. బోధనా రుసుములు, ఉపకార వేతనాలు చెల్లించేందుకు రూ.677 కోట్లు ప్రతిపాదించింది.

కార్పొరేషన్ల వారీగా రాయితీ రుణ పథకానికి నిధుల కేటాయింపు..

కార్పొరేషన్ పేరు	నిధులు (రూ.కోట్లలో)
కాపు	221.86
ఈబీసీ	59.70
కమ్మ	78.34
రెడ్డి	68.71
క్షత్రియ	12.66
ఆర్యవైశ్య	30.84
బ్రాహ్మణ	23.03

మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనిత



ఈనాడు, అమరావతి: శాసన మండలిలో వార్షిక బడ్జెట్‌ను మంత్రి అనిత ప్రవేశపెట్టారు. శనివారం ఉదయం 11:30 గంటలకు ఛైర్మన్ మోషేను రాజు అధ్యక్షతన మండలి సమావేశం ప్రారంభమైంది. ఆ వెంటనే ఛైర్మన్ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టేందుకు అనుమతించడంతో వార్షిక బడ్జెట్‌ను మంత్రి అనిత చదివి వినిపించారు. వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రవేశపెట్టడం పూర్తయిన వెంటనే సభను మంగళవారానికి ఛైర్మన్ వాయిదా వేశారు.

పర్యాటక గమ్యస్థానంగా ఏపీ

–కందుల దుర్గేశ్, పర్యాటక శాఖ మంత్రి



పర్యాటక రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నాం. రాష్ట్రాన్ని ప్రపంచ పర్యాటకానికి గమ్యస్థానంగా మారుస్తాం. ఈ సారి బ్రాండింగ్, ప్రమోషన్, మార్కెటింగ్, ఈవెంట్స్‌కు ఎక్కువగా ఖర్చుచేస్తాం. తిరుపతి, విశాఖ, అరకు, రాజమహేంద్రవరం, గండికోట, శ్రీశైలం, అమరావతిల్లో ఏడు యాంకర్ హబ్‌లు ఏర్పాటు చేస్తాం. 25 థీమాటిక్ సర్క్యూట్లు సిద్ధం చేస్తున్నాం.

బీసీల ఉన్నతికి సముచిత కేటాయింపులు


సవిత, బీసీ సంక్షేమశాఖ మంత్రి



బడ్జెట్ కేటాయింపుల్లో అన్నివర్గాలకూ సముచిత ప్రాధాన్యమిచ్చారు. బీసీల సంక్షేమం, ఉన్నతికి నిధులు పెంచుతూ రూ.51,021 కోట్లు కేటాయించారు. రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా మార్చేందుకు రూ.30 వేల కోట్లు ప్రతిపాదించారు. ఆ ప్రాంత అభివృద్ధిపై కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమిది.

పేదల ఇంటికల సాకారమయ్యేలా..

కొలుసు పార్థసారథి, గృహనిర్మాణశాఖ మంత్రి



గృహనిర్మాణ రంగానికి రూ.6,250 కోట్లు కేటాయించడం ద్వారా పేదవాడి సొంతింటి కల సాకారం కానుంది. ఇది రాష్ట్ర భవిష్యత్తుకు భరోసానిచ్చే బడ్జెట్. గత బడ్జెట్‌లో ధరల స్థిరీకరణకు కేవలం రూ.300 కోట్లు కేటాయించి.. రూ.1,200 కోట్లు ఖర్చు పెట్టిన ఘనత మా ప్రభుత్వానిది. అదీ మా నిబద్ధత. వైకాపా ప్రభుత్వంలో రాజధాని ఏదో చెప్పలేని పరిస్థితి ఉండగా, నేడు ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటోంది.

ఇది అద్భుత బడ్జెట్

విష్ణుకుమార్‌రాజు, భాజపా శాసనసభాపక్ష నేత



కూటమి ప్రభుత్వం బాగా పని చేస్తోందనడానికి ఈ బడ్జెట్ నిదర్శనం. ఇది అద్భుతం. డబుల్ ఇంజిన్ సర్కారుకు కేంద్రం అండగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌లకు ప్రత్యేక అభినందనలు.

అభివృద్ధినిపరుగులు పెట్టించే బడ్జెట్

రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్



శాసనసభలో రూ.3,32,205 కోట్లతో ప్రవేశపెట్టిన 2026- 27 వార్షిక బడ్జెట్ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టించేలా ఉంది. విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, పేదలు, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది. బడ్జెట్‌లో రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రూ.30 వేల కోట్లు కేటాయించడం గొప్ప నిర్ణయం.

బీసీలకు బాహుబలి కేటాయింపులు

కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.51,021 కోట్లు కేటాయింపు వారి సామాజిక, ఆర్థిక పురోగతికి దోహదం చేస్తుంది. జగన్ ప్రభుత్వం 2022-23 బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.26 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. రూ.3,432 కోట్ల బీసీ కార్పొరేషన్ నిధులను దారి మళ్లించింది. 26 మంది బీసీలను వైకాపా నాయకులు పొట్టనపెట్టుకున్నారు. 650 మందిపై అక్రమ కేసులు బనాయించారు. 2,540 మందిపై దాడులు జరిగాయి"

పోలీసుశాఖకు వాహన యోగం

• 3,000 వాహనాలు త్వరలో సమకూర్చనున్నట్లు ప్రకటన

ఈనాడు, అమరావతి: కొన్నేళ్లుగా తీవ్రంగా వాహనాల కొరత ఎదుర్కొంటున్న ఏపీ పోలీసులకు తీపి కబురు. రూ.300 కోట్లు వెచ్చించి 3,000 వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం ఆ శాఖకు సమకూర్చనుంది. పోలీసు వాహనాల కొనుగోలుకు ఒకేసారి ఇంత భారీ మొత్తం కేటాయించడం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా జరగలేదు. 2014-19 మధ్య నాటి తెదేపా ప్రభుత్వం 3 విడతల్లో రూ.225 కోట్లు వెచ్చించి 5,167 వాహనాలు సమకూర్చింది. ఇన్నాళ్ల తర్వాత మళ్లీ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వమే భారీగా వాహనాలు కొంటోంది.



- ప్రభుత్వం ప్రతి పోలీసుస్టేషన్‌కు, ప్రతి సర్కిల్‌కు, సబ్‌డివిజన్‌కు ఒక్కో వాహనాన్ని కేటాయించనుంది. కొన్ని పెద్ద వాహనాలతో పాటు ఎక్కువ ద్విచక్ర వాహనాలు ఇవ్వనుంది. 2022లో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినప్పటికీ వారికి ప్రత్యేకంగా వాహనాలు కేటాయించలేదు. ఉన్నవే సర్దుబాటు చేశారు.
- గంజాయి, మాదకద్రవ్యాల కట్టడి కోసం ఏర్పాటైన ఈగల్, సైబర్ పోలీసుస్టేషన్లు, ఇతర ప్రత్యేక విభాగాలకు మరికొన్ని వాహనాలు కేటాయించనుంది. వీటి వల్ల పోలీసులు త్వరగా ఘటనా స్థలానికి చేరుకోవడానికి, సత్వర స్పందనకు వీలవుతుంది. గస్తీ పెరుగుతుంది.
- ఆంధ్రప్రదేశ్ పోలీసు గృహనిర్మాణ సంస్థ ద్వారా రూ.300 కోట్లు రుణం తీసుకుని ఆ సొమ్ముతో ఈ వాహనాలు కొనుగోలు చేయనుంది.

అప్పాకు రూ.15 కోట్లు..

- పోలీసు అకాడమీ నిర్మాణం కోసం ఇప్పటికే 94 ఎకరాలు కేటాయించామని ప్రభుత్వం ప్రకటించింది. నిర్మాణ పనుల ప్రారంభానికి రూ.15 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు, శిక్షణకు సంబంధించిన ఇతర పరికరాలు కొనుగోలు చేయనుంది.



దివ్యాంగులకు 'ఇంద్రధనుస్సు'

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇంద్రధనుస్సు పథకం పేరిట దీన్ని అమలు చేయనున్నారు. శనివారం బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది.

2 లక్షల మందికి పైనే..

- రాష్ట్రంలో ప్రస్తుతం 2 లక్షల మంది దివ్యాంగులు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో 50% ఛార్జీయే ఇస్తున్నారు.
- విశాఖపట్నం, విజయవాడలోని సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నారు.
- వీరందరికీ రాయితీ కింద ప్రభుత్వం ఏటా రూ.190 కోట్లు వెచ్చిస్తోంది.
- ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తే.. వీరికి అసలు టికెట్ భారం ఉండదు.
- రాష్ట్రంలో దివ్యాంగ పింఛను పొందుతున్నవారు సుమారు 7.70 లక్షల మంది ఉన్నారు. వీరిలో వీల్‌ఛైర్‌కు, మంచానికి పరిమితమైనవాళ్లు దాదాపు 25 వేల మంది. మిగిలిన వారిలో 2 లక్షల మందే ఆర్టీసీ బస్సుల్లో రాయితీ పాస్ వినియోగించుకుంటున్నారు.
- ప్రస్తుతం 40% శారీరక వైకల్యం, 100% వినిపించకపోవడం, 100% అంధత్వం, 69% కంటే తక్కువ ఐక్యూతో మానసిక వైకల్యం ఉంటేనే ఆర్టీసీలో దివ్యాంగుల పాస్‌లు ఇస్తున్నారు.

మహిళల ఉచిత ప్రయాణానికి రూ.1,420 కోట్లు

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేందుకు అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1,420 కోట్లు కేటాయించింది. ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ)కు మొత్తం రూ.5,972.48 కోట్లు కేటాయించగా, అందులో స్త్రీశక్తి పథకానికి రూ.1,420 కోట్లు ఇవ్వనున్నారు. 2025-26 బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులేవీ కేటాయించలేదు. మహిళా ప్రయాణికులకు చెందిన రాయితీ మొత్తం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,040 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా నిధుల కొరత లేకుండా రూ.1,420 కోట్లు కేటాయించింది. ఈ పథకంలో ఇప్పటివరకు 44.29 కోట్ల మంది ప్రయాణాలు చేశారు.



మరో 800 విద్యుత్తు బస్సులు

పీఎం ఈ-బస్ సేవా పథకం కింద రాష్ట్రానికి 750 విద్యుత్తు బస్సులను ఇప్పటికే కేటాయించారు. వీటిని రాష్ట్రంలోని 11 నగరాల పరిధిలో నడపనున్నారు. తిరుపతి-తిరుమల మధ్య నడిపేందుకు మరో 300 విద్యుత్తు బస్సులను కేటాయించేందుకు కేంద్రం సమ్మతించింది. పూర్వోదయ పథకం కింద విద్యుత్తు బస్సులు రానున్నట్లు పయ్యావుల కేశవ్ ప్రకటించారు. ఈ పథకం కింద కేంద్రం ఐదు రాష్ట్రాలకు నాలుగు వేల విద్యుత్తు బస్సులు కేటాయించనుంది. ఇందులో ఏపీ కూడా ఉంది. దీంతో దాదాపు 800 విద్యుత్తు బస్సులు అదనంగా మన రాష్ట్రానికి కేటాయించే అవకాశం ఉంది. వీటికి కేంద్రం సబ్సిడీ కింద కొంత మొత్తం చెల్లిస్తుంది.

పర్యాటకానికి 'ఉత్సవ' శోభ



ఈనాడు – అమరావతి: పర్యాటకులను వివిధ ఉత్సవాలతో ఆకట్టుకునేలా బడ్జెట్‌లో ప్రభుత్వం 186.27 కోట్లు కేటాయించింది. మెగా ఉత్సవాలు, ఫుడ్ ఫెస్టివల్, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ట్రేడ్ ఫెయిర్లు నిర్వహించనున్నారు. ప్రతి నెలా రాష్ట్రంలో ఏదో ఒక చోట ఉత్సవాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. పర్యాటకశాఖకు కేటాయించిన మొత్తం నిధుల్లో వీటి నిర్వహణకే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహించి, పర్యాటకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. విజయవాడలో ఇటీవల ఆవకాయ్-అమరావతి ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహించారు. విశాఖ, అరకు ఉత్సవాలు చేపట్టారు. పలు చోట్ల బీచ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాల్లోనూ ట్రేడ్ ఫెయిర్లు నిర్వహించి పర్యాటకంలో రాష్ట్ర ప్రత్యేకతలు వివరించి పెట్టుబడులు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు.

ఏపీ ఫైబర్‌నెట్‌కు ఊపిరి



ఈనాడు, అమరావతి: ఏపీ ఫైబర్‌నెట్ పునరుజ్జీవనానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.252.67 కోట్లు కేటాయించింది. ఈ మొత్తాన్ని కొత్త సెట్ టాప్ బాక్సుల కొనుగోలు, నిర్వహణకు వినియోగించనుంది. గతంలో తెదేపా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును తీసుకురాగా.. వైకాపా అధికారంలోకి వచ్చాక దీన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. కొత్త కనెక్షన్లు ఇవ్వకపోగా.. పాడైన బాక్సులకు కనీసం మరమ్మతులు కూడా చేయించలేదు. కొత్త బాక్సుల కొనుగోలుకు నిధులు ఇవ్వలేదు. దీంతో 10 లక్షలుగా ఉన్న కనెక్షన్ల సంఖ్య క్రమేణా తగ్గి 5 లక్షలకు పడిపోయింది. దీనికి తోడు వైకాపా కార్యకర్తలకు ఉపాధి కేంద్రంగా ఫైబర్‌నెట్‌ను మార్చేసింది. దీంతో కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టింది.



కొత్తగా 100 కోర్టులు

న్యాయవ్యవస్థలో మౌలిక సౌకర్యాల కల్పనకు రాష్ట్ర బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ముఖ్యంగా జిల్లా న్యాయవ్యవస్థలో వసతుల మెరుగుతో పాటు కోర్టు భవనాలు, నివాస గృహాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ దిశగా జిల్లా న్యాయవ్యవస్థకు రూ.349 కోట్ల విలువైన పనులు మంజూరు చేశారు. 2026-27 తొలి దశలో 100 కొత్త కోర్టుల నిర్మాణానికి ఆమోదం తెలిపారు.



రూ.100 కోట్లతో ఏపీ వెల్త్‌ఫండ్!

రూ.100 కోట్లతో 'ఏపీ వెల్త్‌ఫండ్' ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తరహా ప్రయోగాన్ని ప్రభుత్వం మొదటిసారి చేస్తోంది. నార్వే, అబుదాబి 'సావరిన్ వెల్త్ ఫండ్స్' మాదిరే భవిష్యత్తులో అది తయారవుతుందని పేర్కొంది. రాష్ట్రానికి దీర్ఘకాలిక సంపద సృష్టించేందుకు ప్రైవేట్ ఈక్విటీ భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తోంది. దీనికోసం రూ.100 కోట్ల సీడ్ కార్పస్‌తో నిధితో ఫండ్‌ను ఏర్పాటుచేసింది. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టి.. రాష్ట్రానికి ఆదాయం వచ్చేలా చూడటమే ఫండ్ ఉద్దేశం.

రాష్ట్ర బడ్జెట్ భేష్..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్‌లో ఎన్టీఆర్ భరోసా, దీపం, స్త్రీశక్తి, తల్లికి వందనం, సమగ్ర శిక్షా, వీబీ జీ-రామ్ జీ, జలజీవన్ మిషన్, ఎన్టీఆర్ వైద్య సేవ, అన్నదాత సుఖీభవ.. ఇలా అన్ని రంగాలకు ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయించారు. రాజధానికి, జల వనరుల ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి లోటును అదుపు చేస్తూ, సంపదను సృష్టించే దిశగా అడుగులు పడుతున్నాయి. గడచిన 20 నెలల్లో రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. డబుల్ ఇంజిన్ సర్కారు పాలనలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చేలా బడ్జెట్ రూపొందించారు.

– పీవీఎన్ మాధవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

అంకెల గారడీలా బడ్జెట్



ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్ అంతా అంకెల గారడీలా ఉంది. ఆత్మస్తుతి, పరనింద తప్ప ఏమీ లేదు. బడ్జెట్ ప్రసంగంలో గత వైకాపా ప్రభుత్వం మీద నిందలు వేయడం, కూటమి ప్రభుత్వాన్ని పొగడడం తప్ప ఇంకేమీ లేదు. వైకాపా ప్రభుత్వం ఎక్కువ అప్పులు చేసినట్లు అబద్ధాలు చెబుతున్నారు. బడ్జెట్‌లో లోపాలపై మండలిలో నిలదీస్తాం.

– వైకాపా నేత బొత్స సత్యనారాయణ

అన్నీ అభూత కల్పనలే..



ఊహాజనితం, అభూత కల్పనలా బడ్జెట్ ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు బారెడు ఉంటే.. కేటాయింపులు మూరెడంత కూడా లేవు. ఇచ్చిన వాగ్దానాలు పూర్తిగా విస్మరించారు. సూపర్ సిక్స్ హామీలకు ఎగనామం పెట్టారు. ఆడబిడ్డ నిధి ప్రస్తావన లేదు. వీబీ జీ రామ్ జీ పథకానికి ఇవ్వాల్సిన రాష్ట్ర వాటా రూ.3,070 కోట్లు ఎక్కడ నుంచి తెస్తారో చెప్పాలి.

– ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

ఆస్తుల సృష్టికి అత్యధిక కేటాయింపులు



- మూలధన వ్యయానికి రూ.53,915 కోట్లు
- గత ఏడాది కన్నా రూ.13 వేల కోట్లు ఎక్కువ
- కూటమి ప్రభుత్వం రెండేళ్లలో రూ.60 వేల కోట్ల ఖర్చు
- తాజా గణాంకాల వెల్లడి


ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.53,915 కోట్లను మూలధన వ్యయంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం సంకల్పించింది. మౌలిక సౌకర్యాలు, సాగునీటి ప్రాజెక్టులు, రాష్ట్రానికి ఆదాయాన్ని పెంచే అభివృద్ధి కార్యక్రమాలపై చేసే ఖర్చును మూలధన వ్యయంగా పరిగణిస్తారు. ఈ సారి మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో 16శాతం మూలధన వ్యయంగా కేటాయించడం గమనార్హం. తాజా గణాంకాల ప్రకారం కూటమి ప్రభుత్వం గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో కలిపి రూ.60,500 కోట్లను పెట్టుబడి వ్యయంగా వెచ్చించింది.

రూ.13 వేల కోట్ల పెంపు

2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.40,635 కోట్లు మూలధన వ్యయంగా కేటాయిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో రూ.53,915 కోట్లు కేటాయించారు. అంటే ఆస్తుల సృష్టికి దాదాపు రూ.13 వేల కోట్లు అదనంగా కేటాయించడం గమనార్హం. గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఎప్పుడూ ఈ స్థాయిలో కేటాయింపులు లేవు. ప్రభుత్వాలు ఖర్చు చేసిందీ లేదు. 2021-22లో రూ.18,511 కోట్లు, 2022-23లో రూ.8,017 కోట్లు, 2023-24లో రూ.24,061 కోట్లు ఖర్చు చేస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం రూ.39,498 కోట్లు ఖర్చుగా చూపించారు.

రాష్ట్రాభివృద్ధికి కీలకమైన మూలధన వ్యయం గత 7 ఏళ్లుగా ఇలా...

ఆర్థిక సంవత్సరం	ఖర్చు (రూ.కోట్లలో)
2020-21	18,974.95
2021-22	18,511.00
2022-23	8,017.00
2023-24	24,061.00
2024-25	21,172.00 (కూటమి ప్రభుత్వం)
2025-26	40,635.72 (కేటాయింపులు)
2025-26	39,498.00 (కొత్త బడ్జెట్‌లో సవరించిన అంచనాల ప్రకారం ఖర్చు)
2026-27	53,915.00 (కేటాయింపులు)



వాస్తవాలకు అద్దం పట్టేనా?

కాగ్ లెక్కల ప్రకారం...ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నెలాఖరునాటికి మూలధన వ్యయం కింద చేసిన ఖర్చు రూ.19,224 కోట్లు కాగా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో అంతే స్థాయిలో ఖర్చు చేస్తామనే అంచనాల ఆధారంగా బడ్జెట్‌లో సవరించిన అంచనాలు సమర్పించారు. 2024-25 బడ్జెట్ సమయంలో సవరించిన అంచనాల ప్రకారం మూలధన వ్యయం కింద రూ.24,072 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రస్తావిస్తే వాస్తవ లెక్కలు తేలేసరికి అది రూ.21,172 కోట్లకు పరిమితమయింది. రూ.3 వేల కోట్లు తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని ఆ కోణంలో పరిశీలించినా మూలధన వ్యయం తుది అంకెలు చేరేసరికి కొంత సర్దుబాటు చేసినా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేసిన ఖర్చు గతంలో ఎన్నడూ లేనంతగా ఉన్నట్లే పరిగణనలోకి తీసుకోవచ్చు.

పోలవరానికి రూ.6,105 కోట్లు

- ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.605 కోట్లు
- చింతలపూడికి పెద్దపీట
- రాయలసీమ ప్రాజెక్టులకూ అధిక నిధులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సాగునీటి రంగానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ, కాలువల తవ్వకం తదితరాలకు రూ.18,223 కోట్లు ప్రతిపాదించారు. గతేడాది కేటాయింపులు కూడా దాదాపు ఇంతే మొత్తం ఉండటం విశేషం. ఎన్డీయే ప్రభుత్వం ఈ రెండేళ్లలో నీటిపారుదల రంగంపై ఏకంగా రూ.25 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు బడ్జెట్ గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.18,019 కోట్లు కేటాయించగా, ఇప్పటికే రూ.14,751.68 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు పేర్కొంటున్నాయి.

ప్రాధాన్య క్రమంలో ప్రాజెక్టులు..

రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సత్వర ఫలితాలిచ్చే ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యంగా నిధులు కేటాయిస్తూ, ఆ మేరకు ఖర్చు చేస్తూ, దశల వారీగా ఒక్కోటి పూర్తి చేయాలని తలపోస్తోంది. కేంద్రం అడ్వాన్స్‌గా ఇస్తున్న నిధులతో పోలవరం ప్రాజెక్టుకు ఎక్కువ మొత్తం వెచ్చిస్తున్నారు. ఈ దఫా పోలవరం జలాశయానికి రూ.6,105 కోట్లు కేటాయించగా, ఇందులో ప్రధాన ప్రాజెక్టుకు రూ.5,139.35 కోట్లు ఖర్చు చేయనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3,745 కోట్లు ఖర్చుచేశారు.

■ పనులు కొనసాగించడానికి ఎన్జీటీ నుంచి అభ్యంతరాలున్న కారణంగా కిందటేడు చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నిధులు తక్కువ కేటాయించారు. ఇటీవలే ఆ సమస్య పరిష్కారమైనందున.. ఈ ఏడాది ఏకంగా రూ.430 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో చింతలపూడి ప్రాజెక్టు పనులు పట్టాలెక్కనున్నాయి.

■ నేరడి బ్యారేజ్‌తో పాటు ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తిచేసే దిశగా నిధులు ప్రతిపాదించారు.

■ వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. బడ్జెట్‌లో రూ.492 కోట్లు కేటాయించింది. అయితే, ఈ ప్రాజెక్టుకు అదనపు కేటాయింపులు పెంచే ఆస్కారముంది.

■ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కింద రూ.605 కోట్లు కేటాయించారు. పోలవరం ఎడమ కాలువ వరకూ జలాలు తరలించి, ఉత్తరాంధ్రకు సాగు, తాగునీరు ఇచ్చేలా పనులు చేయనున్నారు.

సంవత్సరం	బడ్జెట్ ప్రతిపాదనలు	ఖర్చు (రూ.కోట్లలో)
2019-20	13,139.05	6,812.90
2020-21	11,805.74	6,057.47
2021-22	13,237.79	7,144.06
2022-23	11,482.37	6,262.97
2023-24	11,908.20	8,370.72
2024-25	16,705.33	11,197.18
2025-26	18,019.66	14,751.68

2026-27 బడ్జెట్‌లో కీలక సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు..



ప్రాజెక్టు	కేటాయింపులు (రూ.కోట్లలో)
పోలవరం ప్రధాన డ్యామ్	5,139.35
కేసీ కెనాల్	184.38
తుంగభద్ర దిగువ కాలువ	250.00
పోలవరం ఎత్తిపోతల	119.20
గోదావరి పెన్నా తొలిదశ	200.00
చింతలపూడి ఎత్తిపోతల	430.00
గోదావరి డెల్టా	200.00
కృష్ణా డెల్టా	300.00
సోమశిల	266.11
తెలుగుగంగ	359.20
సోమశిల స్వర్ణముఖి లింకు	63.05
పులివెందుల కాలువ వ్యవస్థ	130.68
గాలేరు-నగరి సుజల స్రవంతి	665.35
తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు	68.00
మహేంద్రతనయ	90.60
గుండ్లకమ్మ ప్రాజెక్టు	20.01
చిన్ననీటి వనరులు	598.78
పెన్నా కాలువ వ్యవస్థ	115.00
నేరడి బ్యారేజ్	182.14
హంద్రీ-నీవా	2621.73
తోటపల్లి రిజర్వాయర్	47.80
వెలిగొండ ప్రాజెక్టు	492.90

పాత బకాయిలు చెల్లిస్తూ.. వడ్డీల భారం తగ్గించుకుంటూ..

- ఆర్థిక సంస్కరణల దిశగా ఎన్డీయే ప్రభుత్వం
- రూ.24,811 కోట్ల పాత బకాయిల చెల్లింపులు

ఈనాడు, అమరావతి: జగన్ సర్కార్‌లో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని బయటపడేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వం బడ్జెట్‌లో వెల్లడించింది. నాడు లెక్కకు మిక్కిలి అప్పులు, గుత్తేదారులకు, ఉద్యోగులకు, సరఫరాదారులకు, ఇతర అనేక ప్రభుత్వ పథకాలకు రూ.లక్షన్నర కోట్ల పెండింగ్ బిల్లులు, ఎక్కడికక్కడ ఆగిపోయిన సాగునీటి ప్రాజెక్టులు, లెక్కకు మిక్కిలి వడ్డీలకు అప్పులు తీసుకురావడం.. ఇలాంటి ఎన్నో అంశాల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించే ప్రయత్నాలు చేస్తున్నామని ప్రభుత్వం శనివారం నాటి బడ్జెట్‌లో విశదీకరించింది.

■ 2024లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడేనాటికి అప్పులు, పెండింగ్ బిల్లులతో వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఉద్యోగులకూ జగన్ సర్కార్ రూ.21,980 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉంచి వెళ్లిపోయింది. అలాంటి పరిస్థితి నుంచి ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం పాత బకాయిలు క్రమేణా చెల్లిస్తోంది. 2024 జూన్ 12 నాటికి పెండింగ్‌లో ఉన్న బకాయిల్లో రూ.24,811 కోట్లు ఈ ప్రభుత్వం చెల్లించింది. చిన్న గుత్తేదారులు, సరఫరాదారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ మొత్తాలు అందుకున్నారు. మొత్తం బకాయిల్లో ప్రభుత్వం చెల్లించినవి 18% మాత్రమే అయినా అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు వెచ్చించాల్సి వస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రభుత్వం పెండింగ్ బకాయిలను తాజా బడ్జెట్‌లోకి బదలాయించలేదు. దీంతో చిన్న గుత్తేదారులు ఇబ్బందులు పడ్డారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలోనైనా వారిపై దృష్టి సారించాలి.

వడ్డీల ఉపశమనం

రాష్ట్రంలో అనేక కార్పొరేషన్ల పేరుతో వైకాపా హయాంలో అడ్డగోలు వడ్డీలకు అప్పులు తెచ్చేశారు. ఏకంగా 8.5% నుంచి 12.3% వరకు వడ్డీలున్నాయి. చాలా సందర్భాల్లో మంజూరు సమయం కంటే తర్వాత వడ్డీ మరింత పెరిగింది. ఆయా కార్పొరేషన్ల వడ్డీ రేట్లను, రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ రుణాలపై వడ్డీని 9% కన్నా తక్కువకు తగ్గించుకోవడం ఒక రుణాన్ని మరో రుణాన్ని కలిపి సర్దుబాటు చేసి వడ్డీ భారం తగ్గించుకోవడం వంటి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం రూ.43,298 కోట్ల రుణాలకు వడ్డీని తగ్గించడం వల్ల ఏటా రూ.327 కోట్లు ఆదా అవుతోందని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. మరో రూ.1.20 లక్షల కోట్ల రుణాలపై వడ్డీ సవరణకు చర్యలు తీసుకుంటున్నారు. అది కూడా పూర్తయితే ఏడాదికి రూ.1,658 కోట్ల వడ్డీ నుంచి ఉపశమనం లభిస్తుంది.

కేంద్ర పథకాలను గాడిన పెట్టి...

జగన్ సర్కార్‌లో అస్తవ్యస్తమైన కేంద్ర పథకాలను ఈ ప్రభుత్వం గాడిన పెట్టింది. ఆ సర్కార్‌లో ఐదేళ్లా కేంద్ర పథకాల్లో రాష్ట్రానికి రూ.39,642 కోట్లు కోతపడ్డాయి. రూ.10,171 కోట్లు వేరే పథకాలకు మళ్లించేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ధ్రువీకరణ పత్రాలు సమర్పించడం, పాత బకాయిలు ఇచ్చి ఈ పథకాలను క్రమబద్ధీకరించడం, నిధులు మళ్లీ తెచ్చుకోవడం, ఖర్చు చేసి మళ్లీ కేంద్రనిధులు రాబట్టడం అనే సూత్రంతో ముందుకెళ్తోంది. కేంద్ర పథకాలకు రాష్ట్రం రూ.18,701 కోట్లు విడుదల చేసి ఆ పథకాలను గాడిన పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.17,893 కోట్లు కేటాయించింది.

ప్రతి జిల్లాలోనూ ఓ సైబర్ పోలీస్‌స్టేషన్

- 27 పీఎస్‌ల ఏర్పాటుకు రూ.54 కోట్లు
- సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో నిర్ణయం



ఈనాడు, అమరావతి: సైబర్ నేరాల తీవ్రత, విస్తృతి నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు ప్రతి జిల్లాలోనూ ఒక సైబర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది. డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలు వంటి నేరాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలుగా మొత్తం 27 సైబర్ పోలీసుస్టేషన్ల ఏర్పాటుకు రూ.54.01 కోట్లు కేటాయించింది. ఈ పోలీసుస్టేషన్లన్నీ ఈ ఆర్థిక సంవత్సరంలోనే అందుబాటులోకి రానున్నాయి. వీటి ఏర్పాటుతో బాధితులు సత్వరం ఫిర్యాదులు ఇవ్వడానికి, దర్యాప్తు అధికారులు వెంటనే రంగంలోకి దిగడానికి వీలవుతుంది.

■ ప్రస్తుతం రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం నగర కమిషనరేట్లతో పాటు అమరావతిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో మాత్రమే సైబర్ పోలీసుస్టేషన్లు ఉన్నాయి. ప్రస్తుత అవసరాలకు ఇవి ఏ మాత్రం సరిపోవడంలేదు. ఈ నేపథ్యంలోనే ప్రతి జిల్లా కేంద్రంలోనూ సైబర్ నేరాల కట్టడికి పోలీసుస్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

■ రాష్ట్రంలో జరిగిన సైబర్ నేరాల్లో బాధితులు 2024లో రూ.974 కోట్లు, 2025లో రూ.815 కోట్లు పోగొట్టుకున్నారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ పరిధిలోని టోల్‌ఫ్రీ నంబర్ 1930, సైబర్ క్రైమ్ ఫిర్యాదుల పోర్టల్‌కు రాష్ట్రం నుంచి ఏటా 65 వేలకు పైగా ఫిర్యాదులు అందుతున్నాయి. వాటిల్లో నుంచి ఒకే తరహా స్వభావం కలిగిన నేరాలన్నింటినీ కలిపి ఏటా సగటున 2,500కు పైగా కేసులు నమోదవుతున్నాయి.

■ అయినా వాటిల్లో ఛేదించిన కేసులు రెండు శాతం లోపే ఉంటున్నాయి. నేరగాళ్లు వేర్వేరు దేశాలు, వివిధ ప్రాంతాల్లో ఉంటూ ఈ మోసాలకు తెగబడుతుండటంతో వారిని పట్టుకోవడం, సొమ్మును రికవరీ చేయడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రతి జిల్లాలోనూ ప్రత్యేకంగా పోలీసుస్టేషన్ల ఏర్పాటు ద్వారా ఈ నేరాలను కట్టడి చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

■ సాంకేతికంగా అత్యుత్తమ పరిజ్ఞానం ఉన్న ఇన్‌స్పెక్టర్లను ఈ స్టేషన్లకు ఎస్‌హెచ్‌వోలుగా నియమించనుంది.



కేంద్రం జత.. అభివృద్ధికి చేయూత

- మోదీ సర్కారు పథకాల ఆసరా పొందడమే లక్ష్యం
- ప్రస్ఫుటించిన రాష్ట్ర బడ్జెట్

2026-27కి ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఆశాకిరణంలా ఉంది.

- రాష్ట్ర బడ్జెట్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భావన

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారం ఆశిస్తోంది. తాజా కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన వివిధ పథకాల నుంచి ఎంత ఎక్కువ నిధులు రాబట్టగలిగితే రాష్ట్రం అంతగా అభివృద్ధి చెందుతుందని విశ్వసిస్తోంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఈ అంశాన్ని ప్రస్ఫుటంగా ప్రతిబింబించింది. కేంద్ర బడ్జెట్ నుంచి ఏ మేరకు కేటాయింపులు తెచ్చుకోగలమనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు కసరత్తు చేసింది. నవంబరు నెల నుంచే కేంద్రంతో సంప్రదింపులు జరిపింది. పూర్వోదయ పథకం కింద సాగునీటి పథకాల నిర్మాణం, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు సాధించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌కు రూ.30 వేల కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. అందులో సాగునీటి పథకాలకు ప్రాధాన్యం కల్పించారు. సీఎం దిల్లీ వెళ్లి కేంద్రానికి స్వయంగా ఈ ప్రతిపాదనలు అందించారు. కేంద్ర బడ్జెట్‌లో పూర్వోదయకు నిధులు కేటాయించారు. ఇందులో టూరిజం సర్క్యూట్ల అభివృద్ధికి, విద్యుత్తు వాహనాలకు కూడా నిధులు తెచ్చుకునే ఆస్కారం ఉంది.

కేంద్ర బడ్జెట్ ఆసరా ఇలా..

■ రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ ఆర్థిక జోన్లకు, హార్టీకల్చర్ హబ్‌కు, సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర పథకాలు చేయూతనిస్తాయని రాష్ట్ర బడ్జెట్‌లో పేర్కొన్నారు.

■ కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న తూర్పు కోస్తా పారిశ్రామిక కారిడార్, పర్యాటక కేంద్రాల అభివృద్ధి, విద్యుత్తు వాహనాల కొనుగోలుకు పూర్వోదయ పథకం ఉపకరిస్తుందనేది యోచన.

■ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం కేటాయించిన రేర్ ఎర్త్ కారిడార్‌ను శ్రీకాకుళం, విశాఖ జిల్లాల మధ్య ఏర్పాటు చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్ణయించారు. దీనికి అనుబంధంగా ఇతర విలువైన ఖనిజాలకు సంబంధించి వాల్యూ చైన్ పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించనున్నారు.

■ తూర్పు కోస్తా పారిశ్రామిక కారిడార్‌ను మూలపేట నుంచి కృష్ణపట్నం వరకు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తూ కేంద్రం ప్రతిపాదించిన కంటెయినర్ తయారీ అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని యోచిస్తున్నారు.

■ కేంద్రం ప్రాంతీయ మెడికల్ హబ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రాజెక్టులను ప్రకటించింది. వీటి నుంచి రాష్ట్రానికి ప్రయోజనాలు రాబట్టేలా కార్యాచరణ సిద్ధమవుతోంది.



ప్రతిపాదనలన్నీ సిద్ధం..

■ కేంద్రం బడ్జెట్‌లో చాలా ప్రాజెక్టుల్ని ఛాలెంజ్ విధానంలో ప్రకటించింది. రాష్ట్రాల మధ్య పోటీతత్వాన్ని పెంచడం, ప్రాజెక్టు వ్యయాన్ని లెక్కించడం, నిర్ణయించడంలో పారదర్శకతకు ఈ విధానం ఉపకరిస్తుంది. ఇప్పటికే ప్రభుత్వం రాష్ట్రానికి ఉన్న అవకాశాలపై అనేక ప్రతిపాదనలు రూపొందించి, కేంద్రానికి సమర్పించింది. కేంద్రం ప్రతిపాదించిన మెగా టెక్స్‌టైల్ పార్కును పల్నాడు ప్రాంతానికి తీసుకురావాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన.

■ రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఎకనమిక్ రీజియన్ ప్లాన్‌కు రూ.28 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అమరావతి ఎకనమిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలనీ భావిస్తోంది. కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న సిటీ ఎకనమిక్ రీజియన్ల విభాగంలో వీటికి నిధులు తెచ్చుకోవాలని ప్రణాళికలు రచిస్తోంది.

■ కెమికల్ పార్కు, యూనివర్సిటీ టౌన్‌షిప్ ప్రాజెక్టులను కూడా రాష్ట్రానికి సాధించేందుకు ప్రయత్నాలు చేయాలని బడ్జెట్‌లో పేర్కొన్నారు.

శివోహం.. అనంతం!



మహాశివరాత్రి నేపథ్యంలో బ్రహ్మకుమారీలు జ్యోతిర్లింగాలన్నీ ఒకే చోట చూసేందుకు భక్తులకు వీలు కల్పించారు. చిత్తూరులోని సాంబయ్యకండ్రిగ సమీపంలోని ఓం శాంతి యోగా భవనంలో వీటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సోమనాథుడు, శ్రీకేదారేశ్వరుడు.. ఇలా దేనికదే ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ప్రతి శివలింగం ఎదుట దాని విశేషాలతో బోర్డులు పెట్టారు. శివుడు అనంతం అని ప్రతీకాత్మకంగా చెప్పేందుకు.. వాటి చుట్టూ ప్రత్యేకంగా అద్దాలు ఏర్పాటు చేసి అనంతమైన శివలింగాలను చూసిన అనుభూతి కలిగిస్తున్నారు.

– ఈనాడు, చిత్తూరు, చిత్తూరు(సంతపేట)

కోటప్పకొండంత భక్తి!



శివుడిపై భక్తితో ఓ కళాకారుడు కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి మినీయేచర్‌ను తయారు చేశారు. ఆ ఆలయంలో కొలువుదీరిన శివలింగం, మండపం నమూనాను ఇటుకలతో ఆవిష్కరించారు. ప్రకాశం జిల్లా టంగుటూరు పంచాయతీ పరిధిలోని బాపూజీ కాలనీకి చెందిన దాసరి శ్రీనివాసులు పది రోజులు శ్రమించి 6 అంగుళాల ఎత్తు, 5 అంగుళాల వెడల్పుతో ఈ మినీ శివలింగాన్ని చేశారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని దీన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు.

– న్యూస్‌టుడే, టంగుటూరు

రేపు సచివాలయానికి బిల్‌గేట్స్

చంద్రబాబు, పవన్, లోకేశ్‌లతో సమావేశం

ఈనాడు–అమరావతి; తాడేపల్లి–న్యూస్‌టుడే: గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ ఈ నెల 16 (సోమవారం)న రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లతో ఆయన సమావేశం కానున్నారు. ఫౌండేషన్ సహకారంతో చేపడుతున్న 'సంజీవని' డిజిటల్ హెల్త్ కేర్ ప్రాజెక్టు, ఏఐ ఆధారిత వ్యవసాయం, ఇతర రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులపై చర్చిస్తారు. సోమవారం పది గంటలకు రాష్ట్ర సచివాలయానికి చేరుకోనున్న బిల్‌గేట్స్.. ఆర్టీజీఎస్‌కు వెళ్లి పాలనలో సాంకేతిక వినియోగాన్ని పరిశీలిస్తారు. రియల్‌టైం గవర్నెన్స్ విధానం, దాని ఫలితాల్ని గేట్స్‌కు చంద్రబాబు వివరిస్తారు. అనంతరం సీఎం, మంత్రులు, వివిధ శాఖల అధికారులతో సమావేశమవుతారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై చంద్రబాబు ప్రజంటేషన్ ఇస్తారు. అనంతరం సీఎంతో కలిసి బిల్‌గేట్స్ ఉండవల్లి పరిధిలో సాంకేతికత ఉపయోగించి సత్ఫలితాలు సాధిస్తున్న రైతులతో సమావేశమవుతారు. వారు పరిశీలించనున్న వ్యవసాయ క్షేత్రాల వద్ద శనివారం డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ ట్రయల్ రన్ నిర్వహించారు. రైతులతో సమావేశానికి వేదిక, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు.

కల్తీ నెయ్యి కేసులో మరో ఆరుగురు తితిదే ఉద్యోగులు!

ఈనాడు, తిరుపతి: తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో మరో ఆరుగురు తితిదే ఉద్యోగులకూ ప్రమేయం ఉందని సిట్ విచారణలో తేలింది. నిందితుల జాబితాలో చేర్చేంత అభియోగాలు లేకున్నా వారికీ ఈ వ్యవహారంలో సంబంధం ఉన్నట్లు నిర్ధారణ అయింది. దాంతో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిట్ బృందం.. తితిదేకు లేఖ రాసింది. డిప్యూటీ ఈవో పద్మావతితోపాటు వీఎస్ సురేష్‌కుమార్, జ్యోతీశ్వరుడు, పార్థసారథి, భోపాలన్ మురళి, వెంకట రమణల పేర్లు ఇందులో ఉన్నట్టు సమాచారం. వీరు కొనుగోళ్లు, గోదాముల విభాగంలో విధులు నిర్వర్తించారు. ఈ కేసులో ఇప్పటికే నిందితులుగా ఉన్న డెయిరీ ప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఈ ఉద్యోగులు సహకరించారు. ఇప్పటికే తితిదేకు చెందిన 9 మంది ఉద్యోగులు నిందితులుగా ఉన్నారు.

ఫ్యాక్టరీస్, బాయిలర్స్ అధికారుల పేర్లూ డైరీలో

గతంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ శాఖలో విధులు నిర్వర్తించిన ఏడుగురు ఉద్యోగులు.. వైష్ణవి డెయిరీ నుంచి లంచాలు తీసుకున్నట్లు శ్రీనివాసన్ అనే కమిషన్ ఏజెంట్ తన డైరీలో రాసుకున్నాడు. సిట్ అధికారుల సోదాల్లో దొరికిన ఆ డైరీ ఇప్పుడు కీలకంగా మారింది. అందులో ఏయే అధికారికి ఎంతెంత లంచం, ఎప్పుడెప్పుడు ఇచ్చారనే సమాచారం ఉంది. లంచాలు తీసుకున్న ఈ అధికారులు డెయిరీని సక్రమంగా తనిఖీ చేయకుండా అనుకూలంగా నివేదిక ఇచ్చారు. నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం పెద్దగా లేకున్నా.. డెయిరీ ప్రతినిధులు చెప్పిన విధంగా అధికారులు సంతకాలు చేశారు. తితిదే టెండర్లలో పాల్గొనేందుకు ఇది వారికి దోహదపడింది. ఈ నేపథ్యంలో వీటన్నింటిపై మరోసారి శాఖాపరంగా విచారించి, వాస్తవమైతే చర్యలు తీసుకోవాలని సిట్ అధికారులు ఆ శాఖలను కోరారు.



మీరు ఎలాంటి వారితో గడపాలంటే..

గొప్ప లక్ష్యం ఉన్నవారితో సన్నిహితంగా మెలిగితే మీలోనూ ఆ స్ఫూర్తి రగులుతుంది. అందుకే ఎల్లప్పుడూ మీకన్నా పెద్ద లక్ష్యాలు ఉన్నవారితోనే ఎక్కువగా గడపండి. అప్పుడు మీరు జీవితంలో విజయం సాధిస్తారు.

– అమీ పగెట్, టీచర్



పాతాళగంగలో స్నానమాచరిస్తున్న భక్తులు



శ్రీశైల ఆలయం విహంగ వీక్షణం

ఆది దేవుడి సన్నిధిలో.. ఆధ్యాత్మిక వైభోగం!

- భక్తులతో కిక్కిరిసిన శ్రీశైలం
- నేడు మహాశివరాత్రి వేడుకలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు నంద్యాల జిల్లాలోని శ్రీశైల మహాక్షేత్రం ముస్తాబైంది. ఆది దేవుడి ఉత్సవ శోభను తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. శివదీక్షా భక్తుల శివనామ స్మరణలతో శ్రీగిరులు మార్మోగిపోతున్నాయి. నేడు మహాశివరాత్రి కావడంతో శివయ్యను దర్శించుకోవడానికి వచ్చే భక్తజనంతో శనివారం శ్రీశైలం రహదారులన్నీ సందడిగా మారాయి. వెంకటాపురం నుంచి నల్లమల అడవుల గుండా భక్తులు పాదయాత్రగా శ్రీశైలానికి చేరుకుంటున్నారు. గంగాధర, నంది మండపం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు.

నేడు పాగాలంకరణ, కల్యాణం

ఆదివారం మహాశివరాత్రి పురస్కరించుకొని సాయంత్రం 5 గంటలకు శ్రీస్వామిఅమ్మవార్లకు ప్రభోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో నంది వాహనసేవ నిర్వహిస్తారు. రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు శ్రీమల్లికార్జునస్వామి ఆలయ విమాన గోపురానికి పాగాలంకరణ చేపట్టనున్నారు. శ్రీమల్లికార్జునస్వామి మూలమూర్తికి లింగోద్భవకాల మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తారు. రాత్రి 12 గంటల నుంచి కల్యాణోత్సవం ఉంటుంది.

★ ఆదివారం తెల్లవారుజామున 2 గంటల నుంచి సోమవారం తెల్లవారుజామున 2 గంటల వరకు భక్తులకు మల్లన్న దర్శనం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

★ బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని శనివారం రాత్రి 7 గంటలకు శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లకు గజ వాహన సేవ నిర్వహించారు. కళాకారుల సందడి మధ్య గ్రామోత్సవం వైభవంగా జరిగింది.



గజవాహనంపై స్వామి అమ్మవారు

'రాయంచ'పై.. సోమస్కందుడి వైభవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమస్కందమూర్తి శనివారం హంస వాహనంపై దర్శనమిచ్చారు. జ్ఞానాంబిక అమ్మవారు చిలుక వాహనంపై స్వామివారి వెంట పురవీధుల్లో ఊరేగారు. శివపరివారమైన వినాయకస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత చెంగల్వరాయస్వామి, భక్తకన్నప్ప, చండికేశ్వరుల ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉత్సవం ఆద్యంతం రమణీయంగా సాగింది.

★ బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముక్కంటికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. రూ.29 కోట్లతో నిర్మించిన శివం టు శివం రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, ట్రస్టు బోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డితో పాల్గొన్నారు.



హంస, చిలుక వాహనాలపై ఊరేగుతున్న సోమస్కందమూర్తి, జ్ఞానప్రసూనాంబిక అమ్మవారు

విశాఖ తీరంలో మరో సంబరం

- ప్రపంచ యుద్ధనౌకల ప్రదర్శనకు రంగం సిద్ధం
- 18న ఫ్లీట్ రివ్యూ, 19న మిలన్, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్
- హాజరుకానున్న 70 దేశాల నౌకాదళ బృందాలు





సాగరంపై హెలికాప్టర్ నుంచి విన్యాసం ★ సన్నాహక విన్యాసాలను తిలకిస్తున్న ప్రజలు

ఈనాడు, విశాఖపట్నం: ప్రపంచ యుద్ధ నౌకల ప్రదర్శనకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం భారత నౌకాదళం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి వివిధ దేశాల నౌకల రాక సైతం మొదలైంది. ఫిబ్రవరి 18న అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష(ఫ్లీట్ రివ్యూ-2026), 19న మిలన్, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్, 20న 'ఐయాన్స్ కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్' కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశాఖ చేరుకుంటారు. 18న ఫ్లీట్ రివ్యూలో పాల్గొంటారు. 2016లో 51 దేశాలు ఫ్లీట్ రివ్యూలో పాల్గొనగా, పదేళ్ల తర్వాత మళ్లీ విశాఖ వేదికగా ఈ సారి జరుగుతున్న ఫ్లీట్ రివ్యూలో 70దేశాలు పాల్గొననున్నాయి.

మిత్రదేశాల కలయిక 'మిలాన్'

మిత్రదేశాల నౌకా దళాల మధ్య సమన్వయం, స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయడం 'మిలన్' లక్ష్యం. 137 దేశాలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించగా 70 దేశాల వరకు పాల్గొంటున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. మిలన్ విన్యాసాలు 19న హార్బర్ ఫేజ్‌లో (తీరంలో), 21 నుంచి సీ ఫేజ్‌లో (సముద్రంలో) రెండు దశల్లో నిర్వహిస్తారు.



యుద్ధ ట్యాంకుల సన్నాహక విన్యాసాలు

ఆకట్టుకునేలా ఇంటర్నేషనల్ సిటీ పరేడ్

19న సాయంత్రం ఆర్కే బీచ్ రోడ్డులో 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్' నిర్వహిస్తారు. వివిధ దేశాల నౌకాదళాల కవాతు ఆకట్టుకునేలా ఉంటుంది. ప్రపంచ దేశాల సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే విధంగా బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు ఈ కవాతు నిర్వహిస్తారు. భారత నౌకాదళ ఫైటర్ జెట్స్, హెలికాప్టర్లు, పారాచూట్లతో ఆకాశంలో అద్భుత విన్యాసాలు ప్రదర్శిస్తారు. ఆ తర్వాత నౌకాదళ బ్యాండ్, లేజర్ షోలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. ఈ నెల 20న 'ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్' నిర్వహించనున్నారు.

సుందరీకరణ పనులు పూర్తి

ఫ్లీట్ రివ్యూ, మిలాన్‌ల కోసం జిల్లా యంత్రాంగం 64 డ్రోన్లతో నిరంతర నిఘా, 7 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. మరో వైపు జీవీఎంసీ ఆధ్వర్యంలో 119 అభివృద్ధి, సుందరీకరణ పనులను రూ.19 కోట్లతో చేపట్టి పూర్తిచేశారు. ఆర్కే బీచ్‌లో ప్రధాన ప్రాంగణం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రముఖులు, వీవీఐపీలు కూర్చునేందుకు, వీక్షకులకు గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు.

ఐటీల్లో సీట్లు సాధించేలా ఎస్టీ విద్యార్థులకు శిక్షణ

- గిరిజనుల సంక్షేమానికి రూ.9,190 కోట్లు కేటాయించాం
- సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో సీఎం



సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా క్యాంపు కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: నీట్, జేఈఈల్లో ర్యాంకులు సాధించేలా గురుకులాల్లో చదువుతున్న ఎస్టీ విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. గిరిజనుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.9,190 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఉండవల్లి నివాసంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆ మహానుభావుడి స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. "ఆదివాసీ ప్రాంతాల్లో విద్యార్థులు చదువులో ముందుంటున్నారు. ఉన్నత కొలువులు సాధించాలనే పట్టుదల వారిలో పెరిగింది. గిరిజన విద్యార్థుల కోసం గురుకులాలు ఏర్పాటు చేశాం. తండాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో వాటిని ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాం. ఆయా ప్రాంతాల్లోని ఉత్పత్తుల్ని ప్రమోట్ చేస్తున్నాం. మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేస్తున్నాం. అరకు కాఫీకి ఇప్పటికే ప్రపంచ వ్యాప్త గుర్తింపు వచ్చింది" అని చంద్రబాబు పేర్కొన్నారు. సేవాలాల్ మహరాజ్ బంజారాల గుండెల్లో ఉన్నారని కొనియాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆయన పుట్టడం రాష్ట్రం చేసుకొన్న అదృష్టమని పేర్కొన్నారు.

పాకల తీరంలో అట్టహాసంగా బీచ్ ఫెస్టివల్ ప్రారంభం



పాకల తీరంలో శనివారం రాత్రి పర్యాటకుల సందడి

సింగరాయకొండ గ్రామీణ, టంగుటూరు, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల తీరంలో పర్యాటక శాఖ, మారిటైం బోర్డు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. వేడుకలను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య ప్రారంభించారు. పాకల తీర ప్రాంతాన్ని ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా గుర్తింపు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ముందుగా హెలికాప్టర్, బోట్ రైడింగ్‌లు, బీచ్ కబడ్డీ, వాలీబాల్ పోటీల కోర్టులు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల దుకాణాలు, ఫుడ్ కోర్టులను ప్రారంభించారు. అనంతరం హెలికాప్టర్‌లో శ్రీనివాసులురెడ్డి, సత్య తదితరులు ఆసీనులై తీరప్రాంతంలో విహంగ వీక్షణం చేశారు. వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా మంత్రులు కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, బాలవీరాంజనేయస్వామి, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఒడా(ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్) ఛైర్మన్ రియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ సుచిత్ర, కలెక్టర్ రాజాబాబు, జేసీ కల్పనాకుమారి పాల్గొన్నారు.

రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చింది మేమే

- హంద్రీనీవాను మేం సీరియస్‌గా చేపట్టడం వల్లే ఇప్పుడు ఫలితాలు
- సీమను ఉద్యాన హబ్‌గా చేసేందుకు రూ.30వేల కోట్లు కేటాయించాం
- ఎమ్మెల్యేల పనితీరును నివేదికలతో వారికి అద్దంలోలా చూపిస్తున్నా
- నాటి హైదరాబాద్‌లోలాగే... అమరావతిలో గణనీయ మార్పులొస్తాయి
- ముఖ్యమంత్రి చంద్రబాబు



అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కూటమి మహిళా ఎమ్మెల్యేలు

ఈనాడు, అమరావతి: రాయలసీమలో ఒకప్పుడు పశువులకు తాగడానికి నీరు దొరికేది కాదని, రైళ్లలో పశుగ్రాసం, నీరు తరలించిన రోజులు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గతంలో తాము హంద్రీనీవా ప్రాజెక్టు పనులను సీరియస్‌గా చేపట్టామని, అందుకే ఇప్పుడు దాని ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చింది తామేనని పేర్కొన్నారు. రాయలసీమను ఉద్యానహబ్‌గా అభివృద్ధి చేసేందుకు ఇప్పుడు బడ్జెట్‌లో రూ.30వేల కోట్లు కేటాయించామని, దీనిపై ఎమ్మెల్యేలూ సంతోషాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. దేశంలోనే నాణ్యమైన పండ్లు ఇప్పుడు రాయలసీమ నుంచి వస్తున్నాయని, అక్కడ పండే దానిమ్మకు మంచి డిమాండ్ ఉందని చెప్పారు. శనివారం ఆయన అసెంబ్లీలో తన కార్యాలయం వద్ద విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

అప్పటి లాగే నిక్కచ్చిగా ఉంటా

ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలను వారికి అద్దంలో చూపించినట్లుగా సీల్డ్‌కవర్‌లో పెట్టి వారి చేతికే ఇస్తున్నామని సీఎం చెప్పారు. ఎమ్మెల్యేల విషయంలో 1995-96 లోలా నిక్కచ్చిగా ఉంటానని స్పష్టం చేశారు. 'ఇప్పుడు ఎమ్మెల్యేలకు ఇచ్చిన నివేదికలను 9 ప్రాతిపదిక అంశాలపై తీసుకున్న ఫీడ్‌బ్యాక్.. ఇవేకాకుండా అసలు ఎమ్మెల్యేలకూ తెలియని ఇంకొన్ని ప్రాతిపదికల (పారామీటర్ల) వివరాలు కూడా నా దగ్గర ఉన్నాయి' అని చెప్పారు.

అప్పుడు అడవి.. తర్వాత రూపురేఖలు మారిపోయాయి

'హైదరాబాద్‌లో ఒకప్పుడు జూబ్లీహిల్స్ దాటితే అడవిలా ఉండేది. ఇప్పుడు బాలకృష్ణ ఉంటున్న ఇంటి స్థలంలో ముందు నాకు ఇల్లు కట్టించి ఇస్తానని ఎన్టీఆర్ చెప్పారు. నేను అక్కడకు వెళ్లి చూస్తే అంతా అడవిలా ఉంది. అక్కడకు రిక్షాలు, ఆటోలు కూడా రావని అర్థమై.. ఇల్లు వద్దని పెద్దాయనకు సున్నితంగా చెప్పా. అయితే అప్పట్లో బాలకృష్ణ సినిమాల్లో బిజీగా ఉండి చెన్నైలోనే ఉండడంతో ఆ ఇల్లు పూర్తయ్యాక నాలుగేళ్లు నేనే ఆ ఇంట్లో ఉన్నా. ఆ నాలుగేళ్లలోనే అక్కడి పరిస్థితులు ఎంతో మారిపోయాయి. అలాంటి గణనీయ మార్పునే రేపు అమరావతిలోనూ చూస్తాం' అని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

మానవ సంబంధాలు, ప్రేరణ... భయం-భక్తిలా ఉండాలి

తన పని తాను, లోకేశ్ పని లోకేశ్ చేసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. నాయకులతో ఆత్మీయానుబంధాలను పెంచేలా వారితో సమావేశాలను లోకేశ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆత్మీయత, మోటివేషన్ అనేవి భయం-భక్తిలా ఉండాలని వ్యాఖ్యానించారు. మంగళగిరి చీరలకు లోకేశ్ బాగా బ్రాండింగ్ తీసుకొస్తున్నారని సీఎం చెప్పారు. శనివారం అసెంబ్లీలో బడ్జెట్ నేపథ్యంలో.. మహిళా ఎమ్మెల్యేలంతా ఒకే రకమైన చీరలతో రావడం ఐక్యతకు నిదర్శనంగా నిలిచిందన్నారు.

దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో దక్షిణ బంగాళాఖాతంలో సోమవారంలోగా అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. దీని ప్రభావంతో తమిళనాడులో వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంపై దీని ప్రభావం ఉండబోదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పొగమంచు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
ఆదివారం ఫిబ్రవరి 15, 2026



మహాశివరాత్రి పురస్కరించుకొని జిల్లాలో శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాల వెలుగుల్లో సంగమేశ్వర స్వామి ఆలయం – నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

కైలాసవాసా.. కరుణించ రావా..



కాంతులీనుతున్న ముక్త్యాల శ్రీభవాని ముక్తేశ్వరస్వామి దేవస్థానం – జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే

పద్దు భళా.. పొద్దు కళ..!

రాష్ట్ర బడ్జెట్ 2026-27

ఉమ్మడి కృష్ణా ప్రగతికి ఊతం

సాగు మెరిసేలా.. అన్నదాత మురిసేలా..
ఓనమాలు నుంచి విశ్వవిద్య వరకు వెలిగేలా...
జలనిరులకు నిధులు.. జనభద్రతకు సొమ్ములు...
పరిశ్రమకు వైభవం.. ప్రగతిని కూర్చే దార్శనికం..
ఇంతికి తోడు.. ఇంటికి చేదోడు..
పాడికి సిరులు... ప్రగతికి దారులు..
పోర్టుకు.. ఎయిర్‌పోర్టుకు సపోర్టు...
పేదకు వైద్యం.. ఆకలి తీర్చే అభయం..
సంక్షేమ సరాగం... సకలజన శ్రేయం...

.. ఒక్కమాటలో చెప్పాలంటే.. రాష్ట్రాభివృద్ధి... ప్రజాసంక్షేమాన్ని.. శరవేగంగా పరుగులు పెట్టించే సంకల్పంతో 2026-27 రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం శాసనసభలో ప్రవేశపెట్టారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రగతికి మరింత వన్నెలద్దేలా బడ్జెట్‌లో కేటాయింపులు భేషుగ్గా ఉన్నాయని నిపుణులు.. ప్రజలు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు - అమరావతి, ఈనాడు డిజిటల్ - మచిలీపట్నం - న్యూస్‌టుడే, విజయవాడ సిటీ



వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో బడ్జెట్ ప్రతులకు పూజలు చేసిన మంత్రి కేశవ్

రాష్ట్రంపై ఆర్థిక భారం తగ్గుతుంది...

వ్యవసాయం, ఉద్యాన, ప్రాథమిక విద్య, సాగునీరు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక కారిడార్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం గొప్ప విషయం. కేంద్ర బడ్జెట్‌లో పథకాలకు ప్రకటించిన నిధులను.. రాష్ట్రానికి తీసుకొచ్చి అభివృద్ధికి బాటలు పడేలా ప్రభుత్వం చొరవ చూపాలి. అప్పుడే.. రాష్ట్రంపై ఆర్థిక భారం తగ్గుతుంది. పరిశ్రమలకు రావాల్సిన రాయితీలను సకాలంలో విడుదల చేసేందుకు ఎస్క్రో మెకానిజం ఏర్పాటు చేయాలి. పారిశ్రామిక మౌలిక సదుపాయాలకు ఎప్పటికప్పుడు నిధులు కేటాయింపు మరింత పెంచుతూ వెళ్లాలి.



- పొట్లూరి భాస్కరరావు, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు

ఆతిథ్య రంగానికి జవసత్వాలు..

బడ్జెట్‌లో పర్యాటక, సాంస్కృతిక రంగానికి రూ.439 కోట్లు కేటాయించడం హర్షణీయం. రాష్ట్రంలో హోటల్, ఆతిథ్య రంగానికి నూతన జవసత్వాలను అందించేలా బడ్జెట్ రూపకల్పన ఉంది. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించడం, మూలధన సబ్సిడీలు, ఎస్‌జీఎస్టీ రీయంబర్స్‌మెంట్లు, స్టాంపు డ్యూటీ మినహాయింపులు ప్రకటించడం హోటల్ పరిశ్రమకు గొప్ప ఊరటనిచ్చింది. 117 ఎంఓయూల ద్వారా రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు 1.22 లక్షల ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం చేయడం అభినందనీయం. పర్యాటక రంగాన్ని ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌గా గుర్తించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు.



- ఆర్.వి.స్వామి, ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రగతి బాగు.. సంక్షేమం కొనసాగు

బడ్జెట్‌పై సమగ్ర కథనం.. 13లో

కాలువలకు 3,411 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాలువలకు శనివారం 3,411 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 2,823, కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 502, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల చొప్పున నీటిని ఇస్తున్నారు.


హమ్మయ్యా.. రేపు ఐచ్ఛిక సెలవు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ నెల 16వ తేదీ సోమవారం ప్రభుత్వ ఉద్యోగులకు ఐచ్ఛిక(ఆప్షనల్ హాలిడే) సెలవుగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 15న ఆదివారం శివరాత్రి పర్వదినం సందర్భంగా జాగారాలతో మరుసటి రోజు విధులకు హాజరు కావడం ఇబ్బందిగా మారుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

మంత్రి లోకేశ్‌తో.. ఆత్మీయ భేటీ

- జిల్లా ప్రజాప్రతినిధులకు విందు
- రాజకీయాలకు అతీతంగా మాటామంతీ

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులతో మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని తన నివాసంలో ఆత్మీయ సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం నిర్వహించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు, భవిష్యత్తు కార్యాచరణపై ప్రజాప్రతినిధులతో లోకేశ్ చిట్‌చాట్ నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా కుటుంబ సభ్యుల బాగోగులు, పిల్లల ఆసక్తులు, విద్య, క్రీడలపై సరదాగా ముచ్చటించారు. ప్రస్తుతం క్రీడలు కూడా చాలా అవసరమని, వాటిని కూడా కెరీర్‌గా మార్చుకోవచ్చని లోకేశ్ అందరికీ సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు తనకు ఇచ్చిన వినతులకు సంబంధించిన తాజా నివేదికలపైనా లోకేశ్ కొద్ది సమయం చర్చించారు. అనంతరం అందరితో కలిసి విందును స్వీకరించారు. ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు ఎమ్మెల్యేలు.. గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, తంగిరాల సౌమ్య, వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు తమ కుటుంబాలతో కలిసి ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధుల పిల్లలతో లోకేశ్ ముచ్చటించారు. ఎవరెవరు ఏం చేస్తున్నారనేది అడిగి తెలుసుకున్నారు. లోకేశ్‌తో కలిసి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులందరితో ఒక చోట కూర్చుని ఆహ్లాదకరమైన వాతావరణంలో భోజనం చేస్తూ సరదాగా మాట్లాడుకున్నట్టు.. ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రజాప్రతినిధుల మధ్య స్నేహబంధం మరింత బలోపేతం అవుతుందన్నారు. ఏపీ రాజకీయాలలోనే ఇలాంటి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన ఘనత లోకేశ్‌కు దక్కుతుందని శివనాథ్ పేర్కొన్నారు.



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ కేశినేని చిన్ని కుటుంబ సభ్యులు



ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తూ..

18 నుంచి యువతకు ఉచిత శిక్షణ

మాచవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతకు 18 నుంచి 'అప్లికేషన్ డెవలపర్'(వెబ్ అండ్ మొబైల్) కోర్సులో ఉచిత శిక్షణనిస్తామని కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. 18- 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువత ఇంటర్ లేదా డిప్లొమా, ఆపై అర్హతగల వారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 16వ తేదీలోపు ధ్రువపత్రాలు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో కళాశాలలోని స్కిల్ హబ్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మూడు నెలల పాటు జరిగే శిక్షణ ముగిసిన తర్వాత ఎన్ఎస్‌డీసీ/ ఏపీఎస్ఎస్‌డీసీ ధ్రువపత్రంతో పాటు ప్రముఖ కంపెనీల్లో ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ 90326 33548 నంబరుపై సంప్రదించాలన్నారు.

ఎలుకలు కరిచిన ఘటన.. బాధ్యులపై చర్యలు



బాలికలు సాధించిన మార్కులు పరిశీలిస్తున్న కలెక్టర్

ఎ.కొండూరు: విద్య, ఆరోగ్యం, సంక్షేమంపై అలసత్వం వహిస్తే బాధ్యులపై వేటు తప్పదని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. విద్యార్థుల బాగోగులు, వసతిగృహాల నిర్వహణపై నిర్లక్ష్యం చేసిన అధికారులు, ఉద్యోగులను క్షమించేది లేదన్నారు. ఎ.కొండూరు కేజీబీవీలో చదువుతున్న 12 మంది బాలికలను ఎలుకలు కరిచిన సంఘటన నేపథ్యంలో శనివారం ఆయన విద్యాలయాన్ని సందర్శించారు. దుర్ఘటనకు మూలాలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాలికలతో మాట్లాడి ధైర్యం చెప్పి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక కేజీబీవీలో అధికారులు, సిబ్బంది అలసత్వంతోనే ఈ సంఘటన చోటు చేసుకుందని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితిని నివారించకుండా నిర్లక్ష్యం చేసిన ఈ ఏడాది జనవరి 31 వరకు ప్రత్యేకాధికారిణిగా ఉన్న ఎం.శ్యామలను విధుల నుంచి తొలగించి ప్రభుత్వానికి సరెండర్ చేశామన్నారు. పర్యవేక్షణ బాధ్యతలను ఎంపీడీవోకు అప్పగిస్తున్నట్లు వివరించారు. తహసీల్దార్ అరవింద్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సుందర్‌లాల్, ఎంఈవో కేశవరావు పాల్గొన్నారు.









నిజాయతీ.. నిరాడంబరతే దామోదరం ఊపిరి



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని శనివారం నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ జి.లక్ష్మీశ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన రాష్ట్రానికి చేసిన సేవలు మరులేనివన్నారు. దామోదరం నిజాయతీ, నిరాడంబరత, కార్యదక్షత నేటి తరానికి ఆదర్శమన్నారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: దామోదరం సంజీవయ్య చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయినా పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదిగారని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు పేర్కొన్నారు. న్యాయవాదిగా పని చేస్తూనే రాజకీయాల్లోకి వచ్చి కేవలం 38 ఏళ్ల వయసులోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారని కొనియాడారు. శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి సీపీ పూలమాల వేసి నివాళులర్పించారు.

నందిగామకు 50 పడకల ఆయుష్ వైద్యశాల మంజూరు



ఎంపీ శివనాథ్‌ను సత్కరిస్తున్న విప్ సౌమ్య, డాక్టర్ భానుప్రసాద్

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామకు 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి మంజూరైనట్లు ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడించారు. వైద్యశాల మంజూరుకు కృషి చేసిన ఎంపీ చిన్నిని శనివారం రాత్రి నందిగామలో ప్రభుత్వ విప్ సౌమ్య, విశ్రాంత హోమియో వైద్యులు కాపా భానుప్రసాద్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్‌లు సత్కరించారు. ఇంటిగ్రేటెడ్ వైద్యశాల నిర్మాణానికి ఎంపీ ప్రత్యేక చొరవ చూపించారని విప్ తెలిపారు. గత తెదేపా ప్రభుత్వంలో 2018లోనే నందిగామలో 20 పడకల ఆయుష్ వైద్యశాల మంజూరైందన్నారు. తర్వాత వైకాపా ప్రభుత్వంలో వైద్యశాల భవన నిర్మాణ పనులు ఆగిపోయాయని చెప్పారు. లోక్‌సభలో ఎంపీ ప్రత్యేకంగా 50 పడకల ఇంటిగ్రేటెడ్ వైద్యశాల నందిగామకు ఇవ్వాలని కోరారని, ఈ మేరకు అనుమతులు వచ్చాయని, స్థల సేకరణ కూడా పూర్తి చేశామన్నారు. త్వరలో నిర్మాణ పనులు జరుగుతాయని చెప్పారు.

రాజకీయాల్లో మహిళా మోర్చా కొత్త ఒరవడి సృష్టించాలి



మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

భవానీపురం, న్యూస్‌టుడే: రాజకీయాల్లో భాజపా మహిళా మోర్చా నాయకులు కొత్త ఒరవడిని సృష్టించాలని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. భాజపా మహిళా మోర్చా రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశం విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగింది. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. వివిధ రంగాలకు చెందిన మహిళలు కమిటీల్లో ఉండడం సంతోషకరమన్నారు. నిర్మలా సీతారామన్ తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం గర్వకారణమని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని ప్రవేశపెట్టడం ఒక సాహసోపేత చర్య అన్నారు. దేశానికి అవసరమైన బలం కుటుంబ వ్యవస్థ అని వెల్లడించారు. మహిళా మోర్చా అంటే చిన్నపాటి కార్యక్రమాలను నిర్వహించడంతో పరిమితం కాకూడదని, క్రీడా పోటీలను నిర్వహించాలన్నారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొనాలని సూచించారు. మహిళలు స్వయంగా టికెట్లు అడిగే స్థాయికి ఎదగాలన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిదా రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దయాకర్‌రెడ్డి, లక్ష్మీ ప్రసన్న, అధికార ప్రతినిధి రేణుక, ఉపాధ్యక్షులు నిర్మలా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మెడపై కత్తి పెట్టి దౌర్జన్యం

తండ్రి ఫోన్ నంబరు చెప్పాలని బెదిరింపు



ఇంట్లో పడేసిన వస్తువులు

పటమట, న్యూస్‌టుడే: [illegible] బాలుడు.. 'మా నాన్న ఏ రంగు చొక్కా వేసుకున్నారు' అని ప్రశ్నించాడు. తమకు గుర్తు లేదని చెప్పి తలుపు తీయమన్నారు. బాలుడు తీయకపోవడంతో బలవంతంగా తలుపులు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. బాలుడిని మంచం మీదకు తోసేసి కత్తి మెడపై పెట్టి 'మీ నాన్న ఫోన్ నంబరు చెప్పు' అని బెదిరించారు. ఇంతలో మిగిలిన ముగ్గురు ఇంట్లో వస్తువులను ధ్వంసం చేశారు. బాలుడు పెద్దగా కేకలు వేయడంతో అతని స్నేహితుడు సాయి అక్కడికి వచ్చాడు. దాంతో వారంతా అక్కడ నుంచి కొండపైకి పరారు అయ్యారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బాలుడిని విచారించారు. ఇంట్లోకి వచ్చిన వ్యక్తుల్లో ఒకరు అస్తమానం రాజేష్ అన్న.. రాజేష్ అన్న అన్నాడని బాలుడు చెప్పాడు. తెలిసిన వ్యక్తుల పనేనని పోలీసులు భావిస్తున్నారు. కిడ్నాప్ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీ, వేలిముద్రలు సేకరించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఆహార పదార్థాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



అధికారులకు సూచనలు ఇస్తున్న ఆశిష్ మెహతా

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే ఎస్‌డీజీఎం ఆశిష్ మెహతా ఒక రోజు పర్యటనలో భాగంగా శనివారం విజయవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అన్ని ప్లాట్‌ఫారాల్లో తిరిగి ప్రయాణికుల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల మౌలిక సదుపాయాల కల్పనలో రాజీపడొద్దని సూచించారు. అనంతరం రాయనపాడు వ్యాగన్ వర్క్‌షాప్‌లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూఎం ఎస్.శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

17 శాఖలు.. 250 అద్దె ఖాతాలు

అనుమానాస్పద లావాదేవీలపై అప్రమత్తం చేసిన ఐ4సి

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరంలోని పలు ప్రభుత్వ రంగ, ప్రైవేటు బ్యాంకుల్లో భారీగా అద్దె ఖాతాలు ఉన్నట్లు ఐ4సి (ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్) గుర్తించింది. సైబర్ నేర నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తున్న కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఈ ఏజెన్సీ 17 శాఖల్లో దాదాపు 250 ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలు జరుగుతున్నట్లు తేల్చింది. ఈ ఖాతాలను స్తంభింపజేసింది. ఈ వివరాలను ఎన్టీఆర్ కమిషనరేట్‌కు అందజేసింది.

ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగింతతో..

పలు బ్యాంకులు వివిధ సేవలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాయి. ఏజెన్సీ సిబ్బంది ద్వారా అద్దె ఖాతాలు తెరవగలుగుతున్నారు. తాజాగా నమోదు చేసిన కేసులో దుర్గాప్రసాద్ (ఏ4) కూడా ప్రైవేటు ఏజెన్సీ ద్వారా బ్యాంకులో విధులు నిర్వహిస్తూ అర్హతలేని వారితో ఖాతాలు తెరిపిస్తున్నా బ్యాంకు అధికారులు అనుమతిస్తున్నారు. మ్యూల్ ఎకౌంట్లు, అనుమానాస్పద లావాదేవీలపై తరచూ బ్యాంకర్లతో పోలీసులు సమావేశాలు నిర్వహిస్తున్నా పలు బ్యాంకులు దృష్టి సారించడం లేదు.

బ్యాంకు మేనేజర్ల పాత్రపై అనుమానాలు..

ఈ నెల 6న కూడా దుర్గాప్రసాద్ నిర్మల కాన్వెంట్ వద్దనున్న ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిపించడం విశేషం. సైబర్ పోలీసులు శనివారం ఇండియన్ బ్యాంకు మేనేజర్‌కు నోటీసులిచ్చారు. ఈ తరహా ఖాతాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించినా పట్టించుకోకుండా ఖాతాలు తెరుస్తున్నారని, వివరణ ఇవ్వాలని తాఖీదులో పేర్కొన్నారు. ఇప్పటికే పటమట ఉత్కర్ష్ బ్యాంకు బిజినెస్ మేనేజర్‌కు తాఖీదులు ఇచ్చారు. ఇదే బ్రాంచి మేనేజర్‌కు సోమవారం నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిసింది.

యూపీఐ ద్వారా నగదు బదిలీ

ఈ కేసులో తాజాగా అరెస్టు అయిన నిందితుడు శివ దుర్గాప్రసాద్ (ఏ4)కు ప్రధాన నిందితుడు రవికుమార్ నుంచి యూపీఐ లావాదేవీలు భారీగా జరిగినట్లు గుర్తించారు. పొదుపు, కరెంట్ ఖాతాలు తెరిచేందుకు వీలుగా డిపాజిట్ల కోసం ఫోన్‌పే ద్వారా బదిలీ చేసినట్లు తేలింది. ఖాతాలు తెరిపించడం, వాటి ద్వారా లావాదేవీల పర్యవేక్షణను రవికుమార్ చేసేవాడు. అతని సోదరుడు స్టీవెన్ (ఏ2) కార్యాలయంలో ఉండి చెన్నైలో ఉన్న సూత్రధారికి నగదు బదిలీలు, ఓటీపీల వివరాలు పంపించడం చేసేవాడు. ఖాతాలు తెరిచినందుకు కమీషన్లు కూడా యూపీఐ ద్వారా జమయ్యేవి. దుర్గాప్రసాద్‌పై గతంలో పెనమలూరు స్టేషన్‌లో క్రికెట్ బెట్టింగ్ కేసు నమోదైంది. నిందితుడిని శనివారం కోర్టులో న్యాయాధికారి ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించడంతో పోలీసులు కారాగారానికి తరలించారు.

క్రీడాకారిణుల్లో ఆత్మవిశ్వాసం పెంపునకు పోటీలు దోహదం



క్రీడాకారిణుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అపర్ణ, వర్సిటీ వీసీ రాంజీ, రెక్టార్ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఉష, నవీన లావణ్యలత, సిస్టర్ ఇన్నాసమ్మ, తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పోటీలు క్రీడాకారిణుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల ప్రాంగణంలో కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు నిర్వహించే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా నెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. పోటీల నిర్వహణ క్రీడా సంస్కృతి వృద్ధికి దోహదపడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి సంపూర్ణ మద్దతు ఇస్తోందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. మహిళా ప్రపంచ కప్ క్రికెట్‌లో రాణించిన శ్రీచరణి, ఏషియన్ అథ్లెటిక్స్ పతక విజేత జ్యోతి యర్రాజి వంటి మహిళల క్రీడాకారులను సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని గుర్తు చేశారు. అమరావతిలో ప్రపంచ స్థాయి క్రికెట్ స్టేడియం రానుందని తెలిపారు. ప్రతి జట్టు క్రీడా స్ఫూర్తితో తలపడాలని అన్నారు. ఇప్పటికే విజయవాడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు జరిగాయని, రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ పోటీలకు వేదిక కానుందని వెల్లడించారు. కృష్ణా వర్సిటీ రెక్టార్ మండవ వెంకట బసవేశ్వరరావు మాట్లాడుతూ.. రాజధాని అమరావతి ప్రాంతంలో క్రీడా విశ్వవిద్యాలయం రానుందని, అందుకు విద్యా శాఖ మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.ఉష మాట్లాడుతూ.. ఇటువంటి పోటీల వల్ల మహిళా సాధికారత ప్రతిబింబిస్తుందని అన్నారు. టోర్నీ చీఫ్ రిఫరీ ఆకాష్ బత్రా మాట్లాడుతూ.. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారిణులను ఎంపిక చేస్తామని, వారంతా త్వరలో దిల్లీలో జరిగే ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ మాట్లాడుతూ ప్రతి జట్టు క్రీడా స్ఫూర్తితో తలపడి టోర్నీ విజయవంతం చేయాలన్నారు. పోటీల కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్, వర్సిటీ ఉపకులపతి కూన రాంజీ, కార్యనిర్వాహక కార్యదర్శి జె.నవీన లావణ్యలత, ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్నాసమ్మ తదితరులు పాల్గొన్నారు. ముందుగా మంత్రి క్రీడా పతాకాన్ని ఎగురవేసి, క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కృష్ణా వర్సిటీ జట్టు సారథి మౌనిక ప్రతిజ్ఞ చేసింది. వర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.ఉష నెట్‌బాల్ కోర్టులు ప్రారంభించారు.

సాంకేతిక ముసుగులో బంధాలను బలహీనపరచుకోవద్దు



మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి

మొగల్రాజపురం(విజయవాడ సిటీ): యువత మొబైల్‌కు బానిసై సహచరులతో సహజ సంబంధాలకు తిలోదకాలు ఇవ్వడం ఆందోళన కలిగిస్తోందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ కె.మధుమూర్తి అన్నారు. గరిష్ఠ స్థాయిలో డేటా వాడకంపై చూపిస్తున్న శ్రద్ధ, విద్య, ఉపాధిపై నిలపాలని తెలిపారు. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మధుమూర్తి మాట్లాడుతూ.. మానవ దృక్పథం, సాంకేతికతతో శరవేగంగా మార్పులు వస్తున్న నేపథ్యంలో నూతన పరిమాణాలకు అనుగుణంగా విద్యార్థులు ఎదగాలని అన్నారు. తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డీన్ విజయమోహనన్ పిళ్లై మాట్లాడుతూ.. సౌర విద్యుత్తు, అణు శక్తి, మానవ వనరుల్లో భారత దేశం అగ్రగామిగా పురోగమిస్తోందని అన్నారు. కళాశాల పూర్వ రెక్టార్ ఆచార్య ఎం.బసవేశ్వర రావు, ప్రిన్సిపల్ మేకా రమేష్, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణ రావు, కన్వీనర్ నిమ్మగడ్డ లలిత ప్రసాద్, విద్యార్థి కౌన్సిల్ అధ్యక్షురాలు సీహెచ్ నిఖిల తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

16న కెనాల్ రోడ్డులో రథోత్సవం

విద్యాధరపురం: మహాశివరాత్రి కల్యాణమహోత్సవం అనంతరం ఈనెల 16న కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో కెనాల్ రోడ్డులో రథోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు బచ్చు వెంకటలక్ష్మీ వరప్రసాద్ తెలిపారు. పాతబస్తీలోని కన్యకాపరమేశ్వరి సత్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రథోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. [illegible] మాట్లాడుతూ.. [illegible] దేవస్థానం, [illegible] మల్లేశ్వరస్వామి దేవస్థానం(పాత శివాలయం), [illegible] స్వామివార్ల దేవస్థానం(బుద్ధవారి గుడి)లో శివరాత్రి కల్యాణం [illegible] కెనాల్ రోడ్డులో [illegible] దాయబద్ధంగా పల్లకీల్లో సంబంధిత ఆలయాల [illegible] వస్తారన్నారు. సాయంత్రం 5.30 గంటలకు [illegible] ఖరబాబు తొలి కొబ్బరికాయ కొట్టి ఊరేగింపు [illegible] ప్రజాప్రతినిధులు, ఆలయ ఉద్యోగులు, కమిటీ [illegible] ర్తులను అలంకరించిన రథం కెనాల్ రోడ్డు వినా[illegible] రథం సెంటరుకు చేరడంతో రథోత్సవం ము[illegible]

పారిశ్రామిక రంగంలో జిల్లాను ఆదర్శంగా ఉంచుదాం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకు సత్వర అనుమతులు జారీ చేస్తూ పారిశ్రామిక అభివృద్ధిలో జిల్లాను ఆదర్శవంతంగా నిలబెడదామని కలెక్టరు లక్ష్మీశ చెప్పారు. గుంటుపల్లి రైజ్ కేంద్రంలో శనివారం జరిగిన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. పారిశ్రామిక అనుమతులు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు తదితరాలతో పాటు వివిధ పారిశ్రామిక చేయూత పథకాల అమలుపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగ అభివృద్ధికి చేస్తున్న కృషిలో అధికారులు భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వం అన్ని కోణాల్లో పెట్టుబడిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. జిల్లాలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులతో ఎంఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వివిధ పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వస్తున్న దరఖాస్తులను నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ పారిశ్రామిక అభివృద్ధి విధానాల కింద 21 క్లెయిమ్‌లకు రూ. 1.66 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలకు తాజాగా కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. జిల్లాలో పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ పథకాల అమల్లో పురోగతిని కమిటీ చర్చించింది. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం ఛైర్మన్‌గా సుధాకర్ యాదవ్



సుధాకర్ యాదవ్‌ను అభినందిస్తున్న అధ్యక్షుడు రవికుమార్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం ఛైర్మన్‌గా పి.సుధాకర్ యాదవ్ (కడప) నియమితులయ్యారు. నగరంలోని ఒక హోటల్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ అతన్ని నియమిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కూన రవికుమార్ (ఎమ్మెల్యే, ఆముదాలవలస) అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రానున్న రోజుల్లో పోటీల నిర్వహణ, విధివిధానాలపై చర్చ జరిగిందని సంఘం కన్వీనర్ ఎం.వెంకట రమణ తెలిపారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం రిఫరీస్ బోర్డు కన్వీనర్‌గా ఏఎస్ఎస్ జగదీశ్వర్‌రెడ్డి (గుంటూరు) నియమితులయ్యారు. సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల సంఘాలను బలోపేతం చేయడానికి క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రి అందజేస్తామని తెలిపారు. క్రీడా పోటీల క్యాలెండర్ రూపొందించి అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. రవికుమార్ మాట్లాడుతూ.. అర్హత గల రిఫరీలకు రాష్ట్ర స్థాయి పునశ్చరణ తరగతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. క్రీడాకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర స్థాయి 'సాఫ్ట్‌బాల్ ప్రీమియర్ లీగ్' నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి పి.నరసింహారెడ్డి, వివిధ జిల్లాల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

అద్విక ట్రేడింగ్ మోసం కేసు ఐవో మార్పు

దర్యాప్తు అధికారిగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారి

ఈనాడు, అమరావతి విజయవాడ కేంద్రంగా గతేడాది వెలుగుచూసిన అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం కేసులో దర్యాప్తు అధికారి (ఐవో) మారారు. ఇప్పటి వరకు కేసు దర్యాప్తును పర్యవేక్షించిన సెంట్రల్ ఏసీపీ దామోదర్ నుంచి టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారికి అప్పగించారు. ఈ మేరకు ఇటీవల సీపీ రాజశేఖర్‌బాబు ఉత్తర్వులిచ్చారు. దర్యాప్తును మరింత వేగవంతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మొత్తమ్మీద ఈ కేసును క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డి పర్యవేక్షించనున్నారు. హైదరాబాద్ సహా పలు జిల్లాల పరిధిలో దాదాపు రూ.413కోట్లు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా చేతులెత్తేసిన వ్యవహారం తెలిసిందే. కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సన్నద్ధం అవుతున్నారు.

ఈనెలాఖరు లోపు కొలిక్కి.. డిపాజిటర్లు, ఏజెంట్లు కలిపి రూ.144కోట్లు నష్టపోయినట్లు తేల్చారు. 92 మంది డిపాజిటర్లు రూ.9.47 కోట్లు పెట్టుబడులు పెట్టగా.. ఒక్క పైసా కూడా రాలేదు. నష్టపోయిన వారికి న్యాయం చేసేందుకు పోలీసులు అడుగులు వేస్తున్నారు. ఎక్కువగా లబ్ధి పొందిన వారిని పిలిచి తిరిగి ఆ మొత్తాన్ని చెల్లించాల్సిందేనని గట్టిగా చెబుతున్నారు. వీరు వారం రోజులు సమయం అడిగినట్లు తెలిసింది. ఈనెలాఖరు లోపు ఈ వ్యవహారాన్ని కొలిక్కి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని జమ చేసేందుకు ఇప్పటికే ఎస్‌బీఐ పటమటలంక శాఖలో ప్రత్యేక ఖాతా తెరిచారు. దీనిని కూడా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ పేరుతో మార్చనున్నారు. ప్రధాన నిందితుడు ఆదిత్యతో పాటు మిగిలిన నిందితుల పేరిట పలు జిల్లాల్లో ఉన్న 52 ఆస్తులను పోలీసులు గుర్తించారు. వీటి మార్కెట్ విలువ రూ. 100 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

'మెడికల్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి'



మాట్లాడుతున్న ఈశ్వరయ్య, పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మెడికల్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన శనివారం ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ ప్రాథమిక నినాదాలైన విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఆవాసం వంటి మౌలిక వసతులను పేదవానికి దూరం చేస్తూ ఈ ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కార్పొరేట్ వైద్యరంగం మాఫియాగా మారి ప్రభుత్వాన్ని సైతం నియంత్రించి పేదలకు కనీస వైద్యం అందనివ్వకుండా అడ్డుపడుతోందని మండిపడ్డారు. మెడికల్ మాఫియా నిర్ధారించిన రేట్లకే మందుల ధరలను ముద్రించి మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకువస్తున్నారని ఆరోపించారు. ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఛైర్మన్ అన్నపురెడ్డి విజయభాస్కర్ రెడ్డి, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్, ఫార్మా మాఫియా పేట్రేగిపోతోందని విమర్శించారు. అన్ని జిల్లాల్లో సుమారు 200 వరకు ఫార్మా దుకాణాలపై ఇటీవల దాడులు నిర్వహించారని వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నక్క వీరభద్రరావు, బుట్టి రాయప్ప, మూలి సాంబశివరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, రాము, కొట్టు రమణారావు, రమణబాబు, వీరయ్య, కొడాలి ఆనందరావు, లంకా గోవింద రాజులు, ఎస్కే నజీర్, జమలయ్య, కరవాది సుబ్బారావు, యుగంధర్, గుజ్జుల వలరాజు, ఎం.సాయికుమార్, చంద్రనాయక్, ఆర్.పిచ్చయ్య, రమణమ్మ, ఇందిరా పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-18/22, టమాటా-13, బెండ-26, పచ్చిమిర్చి-38, కాకర-32, బీర-26/28, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-28, దొండ-42, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-26, దోస-16/26, సొర-12/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-22, అల్లం-72, మునగ-10/8, ఆకుకూరలు(కట్ట)-2.50, కంద-36, బీట్‌రూట్-24, కీరదోస-44, బీన్స్-52/56, క్యాప్సికమ్-60, చింతకాయలు-65, నిమ్మ(డజను)-24/30, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22(నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈధరలు(కిలో రూ.ల్లో) వర్తిస్తాయి. **- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు**

వ్యవసాయ, సాగునీటి రంగాలకు అధిక ప్రాధాన్యం



ఆళ్ల గోపాలకృష్ణ

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఏపీని కరవు రహిత రాష్ట్రంగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లక్ష్యంగా ఉందని సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సమాఖ్య కార్యాలయం నుంచి శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయం, సాగునీటి రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్టు విశదమైందన్నారు. సాగునీటి రంగానికి రూ.18,224 కోట్లు, వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.13,598 కోట్లు కేటాయించడం ఎంతో ఉపయోగకరమన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ప్రత్యేకంగా రూ.6,105 కోట్లు, పనుల వేగవంతానికి పెండింగ్‌లో ఉన్న రూ.5,000 కోట్ల బిల్లులు కేంద్రం విడుదల చేయడం, పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానంపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ బడ్జెట్‌లో అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.6,600 కోట్లు కేటాయించి, 46.86 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూర్చారని వివరించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు కోసం రూ.11,000 కోట్లకు పైగా రాయితీ విడుదల చేయడం శుభపరిణామం. సీఎం చంద్రబాబు దశ, దిశ నిర్దేశంతో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడి ఆధ్వర్యంలో రానున్న మూడేళ్లలో ఏపీలో జలవనరుల రంగం మరింత అభివృద్ధి చెందడం ఖాయమని ఆళ్ల పేర్కొన్నారు.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
ఆదివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉదయరాగం	ఉ. 5 - ఉ. 7
లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్	ఉ. 7 - ఉ. 9
రాగ సాథి	ఉ. 9 - ఉ. 10
ఎక్స్‌ట్రా డోస్	ఉ. 10 - మ. 2
ఈవారం అతిథి	మ. 2 - సా. 5
బెస్ట్ డ్రైవ్	సా. 5 - రా. 7
#హాష్‌ట్యాగ్	రా. 7 - రా. 9
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 9 - ఉ. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమావేశం


అధ్యాపకులతో పూర్వ విద్యార్థుల బృందం

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశం ఉత్సాహంగా సాగింది. అలుమ్ని పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పలు సంవత్సరాల్లో చదువుకున్న విద్యార్థులంతా కలిసి పలు అంశాలను చర్చించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కో-ఫౌండర్ జయప్రకాశ రెడ్డి, ఛైర్మన్ ప్రసాదరెడ్డి పాల్గొని పూర్వ విద్యార్థులు, తోటి విద్యార్థులకు సహకరించాలని కోరారు.

గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం రేపు

జి.కొండూరు, న్యూస్‌టుడే : అనురాగ్ హెల్త్ కేర్, వాసన సీతారావమ్మ అంజయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జి.కొండూరు పంచాయతీ కార్యాలయంలో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ వాసన నాగమల్లేశ్వరరావు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


చెవుటూరు బైపాస్‌లో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీష్ కుమార్

శిరస్త్రాణంతో ప్రాణానికి రక్షణ

జి.కొండూరు, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించి తమ ప్రాణాలు కాపాడుకోవాలని జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు. చెవుటూరు బైపాస్ సమీపంలో ఆయన శనివారం ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్షణ కల్పించుకోవచ్చని అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకూడదని సూచించారు. పలువురు సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: తిరువూరు 11వ వార్డులో చెత్త పేరుకుందని స్థానికుడు సిరాజుద్దీన్ 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. మున్సిపల్ శానిటరీ అధికారి స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి వాటిని తీయించారు. ★ తిరువూరు 7వ వార్డులోని రోడ్లపై చెత్త అలాగే ఉంటుందని స్థానికుడు ప్రదీప్ సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన శానిటరీ అధికారి విజయ్ కుమార్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయించారు.★ తిరువూరు 19వ వార్డులోని డ్రెయిన్లలో మురుగు నిలిచి దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికుడు ఆదినారాయణ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి దోమల మందు పిచికారీ చేయించి సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు** ★ వెలగలేరు పోస్టాఫీసు సమీపంలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటికి అవస్థలు పడుతున్నామని స్థానికులు పంచాయతీ కార్యదర్శి సరోజకు తెలిపారు. స్పందించిన ఆమె బోరుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు.**- జి.కొండూరు**

అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీకి కృష్ణా జట్టు

విజయవాడ క్రీడలు: గుంటూరు జిల్లాలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగే ఏసీఏ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల అండర్-12 క్రికెట్ టోర్నీలో తలపడే కృష్ణా జట్టును ఉమ్మడి కృష్ణా జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎం.రవీంద్రచౌదరి శనివారం ప్రకటించారు. వి.దేవ్ సాత్విక్ (కెప్టెన్), కేడీ నిఖిలేష్ (వికెట్ కీపర్), వీఎల్ఎన్ సుబ్రహ్మణ్యం, కేఆర్ఎస్ఎస్‌వీ జైరామ్, సీహెచ్ వెంకట కార్తికేయ, పి.చంద్ర చిత్రాన్, వి.పవన్‌కుమార్, ఆర్.దేవన్ రుషి, ఎస్.జ్ఞాన్ కృష్ణ, ఎ.జాయ్ జోయల్, ఎస్‌కే ఫదిల్, జె.రిషిత్ రాయ్, వి.నాగ వెంకటేష్, కె.షణ్ముఖ్ చౌదరి, టి.ఆర్యన్‌కుమార్, ఆర్.ధన దీప్, స్టాండ్ బైగా జి.జస్విన్, పి.అభిజిత్, టి.ప్రతీక్ నారాయణ, టి.లిఖిత్ ప్రేమ్, కె.ప్రజ్వల్ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఎస్.రామ్‌కుమార్ కోచ్‌గా నియమితులయ్యారు.

తాగునీటి ఎద్దడి నివారణకు.. క్రాష్

ఇబ్రహీంపట్నం గ్రామీణం, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు క్రాష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి చేపట్టిన ఈ కార్యక్రమం మార్చి 15వ తేదీ వరకు సాగనుంది. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని చేతి పంపులు, రక్షిత తాగునీటి పథకాలను పరిశీలించి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించి వినియోగంలోకి తీసుకురానున్నారు. గ్రామాల్లో ప్రజల దాహం తీర్చేందుకు చేతి పంపులే(బోర్లు) కీలకం. అధిక శాతం గ్రామాల్లో తాగునీటి పైపులు మరమ్మతులకు గురవుతుండడంతో రోజుల తరబడి సరఫరా నిలిచిపోతుంది. ఈ క్రమంలో ప్రజలు వాడుక నీటి కోసం స్థానికంగా ఉండే చేతి పంపులపైనే ఆధారపడుతున్నారు. దీంతో వినియోగ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏటా వేసవికి సన్నద్ధత క్రమంలో ముందస్తుగా మరమ్మతులు చేస్తున్నారు.

నిధుల కేటాయింపు.. క్రాష్ కార్యక్రమం కింద బోర్ల మరమ్మతులకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు మండల పరిషత్తు, గ్రామ పంచాయతీలు నిధులు కేటాయించనున్నాయి. ఇటీవల మండల పరిషత్తుతో పాటు గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. ఇందులోని టైడ్ విభాగంలో 15 శాతం నిధులను తాగునీటి అవసరాలకు కేటాయించనున్నారు. వీటితో బోర్ల మరమ్మతులకు అవసరమైన గొట్టాలు, తదితర విడిభాగాలను కొనుగోలు చేయనున్నారు.


అవసరమైన వాటిని గుర్తించి.. ఇబ్రహీంపట్నం మండలంలోని పది గ్రామాల్లో 147 బోర్లు, తాగునీటి పథకాలకు సంబంధించిన 19 ఓహెచ్ఆర్‌లు, నాలుగు జీఎల్ఎస్ఆర్‌లతో పాటు మూడు డైరెక్టు పంపింగ్ పథకాలున్నాయి. వీటిని అధికారులు, సిబ్బంది పరిశీలించి మరమ్మతులు అవసరమైన వాటిని గుర్తించనున్నారు. వేసవిలో విద్యుత్తు సమస్యతో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు తెదేపా హయాంలో పది సోలారు తాగునీటి పథకాలు ఏర్పాటు చేశారు. ఇవి ప్రస్తుతం వివిధ కారణాలతో పని చేయడం లేదు. వీటిని కూడా పరిశీలించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాచవరం ఇందిరమ్మ కాలనీలో గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలోని మినరల్ వాటర్ ప్లాంటు పని చేయడం లేదు. దీని పరిశీలించి అవసరమైన రిపేర్లు చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.


కాచవరంలో చేతి పంపు సామర్థ్యం పరిశీలిస్తున్న ఏఈ సునీత

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత


కార్యక్రమంలో తెదేపా నాయకులు

మైలవరం : మండలంలోని గణపవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎం.శివన్నారాయణకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఎల్‌వోసీని ఆ గ్రామ తెదేపా నాయకులు శనివారం అందజేశారు. రూ.1,04,152 సాయం స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ సిఫారసు మేరకు మంజూరైనట్లు వారు చెప్పారు. గోపాలస్వామి, బాబు, రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అంబేడ్కర్ పాల్గొన్నారు.


మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులతో మంత్రి లోకేశ్


తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు సతీమణి మాధవికి పట్టుచీర ఇస్తున్న మంత్రి లోకేశ్

ఆత్మీయ పలకరింపునకు హాజరైన ఎమ్మెల్యేలు

మైలవరం, గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే : మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల శాసన సభ్యులు, లోకసభ సభ్యులకు శనివారం మధ్యాహ్నం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. దీనికి తిరువూరు, మైలవరం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కొలికపూడి శ్రీనివాసరావు, వసంత కృష్ణప్రసాద్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. మంత్రి లోకేశ్‌ను కలిసి మాట్లాడి ఆయనతో పాటు భోజనం చేశారు.

ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలనేదే లక్ష్యం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం): ఆహార ఉత్పత్తుల వ్యాపారం మంచి లాభదాయమని, అయితే ఉత్పత్తులను నాణ్యతతో అందించినప్పుడే వినియోగదారుల ఆదరణ ఉంటుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. శనివారం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో మహిళల కోసం కూలెక్స్ ఇండస్ట్రీస్ సంస్థ నిర్వహించిన ప్రత్యేక జాగ్రుతి వర్క్‌షాపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధి, సూక్ష్మ, చిన్న పారిశ్రామిక రంగాల్లో ముందుకు తీసుకువెళ్లే లక్ష్యంతో ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని సూచించారు. పీఎంఈజీపీ వంటి పథకాలతో పాటు వివిధ రుణ సదుపాయాలు, సబ్సిడీలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెటింగ్ మద్దతు పథకాలను జిల్లా పారిశ్రామిక అధికారులు వివరించారు. ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, ఆర్డీఓ చైతన్య, కైలెక్స్ ఇండస్ట్రీస్ యాజమానులు రాధాకృష్ణ, ప్రమోదరాణి, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ



హిందీ పరీక్షలు ప్రారంభం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : దక్షిణ భారత హిందీ ప్రచార సభ వారి ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు తిరువూరు పట్టణం సర్వోదయ పాఠశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలు ఆదివారం కూడా జరుగుతాయని పరీక్షల సూపరింటెండెంట్ వైవీ.రమణమూర్తి తెలిపారు.

నిరాహార దీక్షకు సంఘీభావం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : తిరువూరు ప్రభుత్వ వైద్యశాలలో శాశ్వతంగా సూపరింటెండెంట్‌ను నియమించాలని సామాజిక కార్యకర్తలు కొల్లి అశోక్, పమ్మి రామారావు చేస్తున్న నిరాహార దీక్ష శిబిరం వద్దకు సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే.నాగుల మీరా, సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ వెళ్లి సంఘీభావం తెలిపారు. పలువురు వైద్యులను నియమించాలని, కాలం చెల్లిన ఎక్స్‌రే యంత్రాన్ని తీసేసి అధునాతనమైన పరికరాలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని చీమలపాడులో పోలీసు శాఖ అధికారుల ఆధ్వర్యంలో శనివారం డ్రగ్స్‌పై దండయాత్ర ప్రదర్శన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్న మహిళా పోలీసుల బృందానికి రామచంద్రాపురంలో ఘన స్వాగతం పలికారు. చీమలపాడు గ్రామ పొలిమేరలో పోలీసులు, గ్రామస్థులు, విద్యార్థులు పూలు చల్లుతూ, హారతులు ఇస్తూ ఆహ్వానించారు. డప్పు వాయిద్యాలు, కోలాట భజనలు, గిరిజన మహిళలు సాంప్రదాయ వస్త్రధారణతో నృత్యాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. తదుపరి కృష్ణవేణమ్మపాలెం గురుకుల విద్యాలయంలో మత్తు పదార్థాల అనర్థాలు, ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమం శనివారం నాటికి 19వ రోజుకు చేరిందని, మొత్తం 510 కి.మీ దూరాన్ని బృందం పర్యటించాల్సి ఉండగా ఇప్పటి వరకు 300 కి.మీ పూర్తయిందని అధికారులు తెలిపారు. ఏసీపీ ప్రసాదరావు, సీఐ గిరిబాబు, ఎస్సై మహాలక్ష్మణుడు, ఎంఈవో కేశవరావు, స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.


సైకిల్ యాత్ర చేస్తున్న మహిళా పోలీసులకు స్వాగతం పలుకుతున్న పోలీసు అధికారులు, గ్రామస్థులు

సందడిగా హెచ్‌సీఎల్ క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు: పటమట కేబీసీ జడ్పీ హెచ్ స్కూల్‌లో శనివారం హెచ్‌సీఎల్, హీల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో సుమారు 650 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను రాష్ట్ర సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. హీల్ సీఈవో కె.అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. డీవైఈవో డి.సాంబశివరావు జాతీయ పతాకాన్ని, గన్నవరంలోని హెచ్‌సీఎల్ సీఎస్ఆర్ ఇన్‌ఛార్జి బి.శ్రీనివాసులు హెచ్‌సీఎల్ జెండా, ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ హీల్ జెండా ఆవిష్కరించారు. హెచ్‌సీఎల్ స్పోర్ట్స్ ఫర్ చేంజ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందరరావు, శాప్ విశ్రాంత డీఎస్‌డీవో బి.సుధాకర్, కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య పరిపాలన కార్యదర్శి ఎం.అరుణ పర్యవేక్షించారు.

'కార్మిక వర్గానికి ప్రాధాన్యత లేని బడ్జెట్'

గొల్లపూడి, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కార్మిక వర్గానికి ప్రాధాన్యత లేదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు.

శివరాత్రి ఉత్సవాల బందోబస్తు పరిశీలన

మైలవరం, న్యూస్‌టుడే : మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని వెల్వడంలో బాలకోటేశ్వర స్వామి ఆలయంలో మూడ్రోజుల పాటు నిర్వహించే శివరాత్రి ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లను పోలీసు ఉన్నతాధికారులు శనివారం పరిశీలించారు. రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ, సీఐ చంద్రశేఖర్, ఎస్సై సుధాకర్ ఆలయం ప్రాంగణం, కోనేరు, స్టాళ్ల ఏర్పాటు స్థలం, ఇతర కార్యక్రమాలను నిర్వహించే ప్రాంతాలను చూసి పలు సూచనలు చేశారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద భక్తుల పుణ్యస్నానాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం తెలిపారు. ఘాట్ల శుభ్రత చర్యలను ఛైర్మన్ చిట్టిబాబుతో కలిసి ఆయన శనివారం పర్యవేక్షించారు. ఏసీపీ దుర్గారావు ఆధ్వర్యంలో వేకువజాము నుంచే పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మల్లయ్య స్వామి తిరునాళ్లకు సర్వం సిద్ధమైందని తిరువూరు సీఐ గిరిబాబు, ఎస్సై యం.అర్జున్ రాజు తెలిపారు. అనంతరం సీఐ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు, సిబ్బంది, వాలంటీర్లతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఉత్సవ కమిటీ, ట్రస్ట్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం : ఘాట్ వద్ద కమిషనర్ వెంకటరత్నం, ఛైర్మన్ చిట్టిబాబు తదితరులు


కొండపర్వ : పోలీసులు, వాలంటీర్లకు సూచనలిస్తున్న సీఐ గిరిబాబు


ఇబ్రహీంపట్నం : సీపీఐ, ఏఐటీయూసీ నాయకుల ఆందోళన


తిరువూరులో నినాదాలు చేస్తూ...

మెడికల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మెడికల్, ఫార్మా దోపిడీలపై ఆందోళన కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నంలో శనివారం నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు దుర్గా కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.


విస్సన్నపేట గాంధీ బొమ్మ సెంటర్ వద్ద..

విస్సన్నపేట. న్యూస్‌టుడే : విస్సన్నపేట గాంధీ బొమ్మ సెంటర్, తిరువూరులో సీపీఐ శ్రేణులు ధర్నా చేపట్టారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.


గోసవీడులో విద్యుత్తు దీపాలతో అలంకరణ


జి.కొండూరులో ముస్తాబైన శివాలయం

మహాశివరాత్రికి శివాలయాలు సిద్ధం

మైలవరం, న్యూస్‌టుడే : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాల్లో ఉత్సవాల నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధానంగా వెల్వడంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయంలో జరిగే వేడుకలకు వేలాది మంది ప్రజలు హాజరుకానున్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక పార్వతీ సమేత అమృత లింగేశ్వర స్వామి దేవాలయాన్ని ఆలయ నిర్వాహకులు ముస్తాబు చేశారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని శివాలయాలను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విద్యుత్తు దీపాలతో అలంకరించారు. కొత్తపల్లి సమీప గోపాల స్వామి మడుగులో పుణ్యస్నానాలు చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని భావిస్తూ ఏర్పాట్లు చేస్తున్నారు.


గోపాలస్వామి మడుగు వద్ద వాగు దాటేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్లు

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం నేడు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

భక్తులకు ప్రత్యేక బస్సుల ఏర్పాటు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి శైవ క్షేత్రములైన గుట్టపాడు, నీలాద్రి దేవాలయాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం వేకువజాము నుంచి ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు తిరువూరు బస్టాండ్ నుంచి బయలుదేరుతుందని ఆయన చెప్పారు.

తెదేపాను బలోపేతం చేయండి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్(చిన్ని)ని ఆయన కార్యాలయంలో తెదేపా విస్సన్నపేట మండల నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు గురించి ఎంపీతో చర్చించారు. తిరువూరు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎంపీ వారికి సూచించారు. పార్టీ జిల్లా నాయకుడు నెక్కలపు శ్రీనివాసరావు(డాబా శ్రీను), పార్టీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి ఆకుల రాధాకృష్ణ, మండల కార్యదర్శి ఆకుల సత్యనారాయణ, పలగాని మాధవరావు, పలగాని వెంకటేశ్వరరావు, జయలక్ష్మి పాల్గొన్నారు.

తిరునాళ్ల రహదారి ప్రారంభం


రిబ్బను కత్తిరిస్తున్న సుధాకరరావు, జయప్రకాశరెడ్డి

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని వెల్వడంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు వెళ్లేందుకు భక్తుల సౌకర్యార్థం ప్రవాస భారతీయుడు లకిరెడ్డి పుల్లారెడ్డి వితరణతో అభివృద్ధి చేసిన రహదారిని లకిరెడ్డి సోదరులు జయప్రకాశరెడ్డి, వెంకటేశ్వరరావు, ప్రసాదరెడ్డిలతో కలిసి తెదేపా రాష్ట్ర నాయకుడు కోమటి సుధాకరరావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, శ్రీను, రాజారెడ్డి, కోటారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

మైలవరం, న్యూస్‌టుడే : ఆరాధ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక స్ప్రింగ్స్ ప్రత్యేక పిల్లల పాఠశాలలోని చిన్నారులకు నూతన దుస్తులు, భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో రవితేజ, వందనా దాస్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చదువులో పోటీతత్వం అవసరం


ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువులో పోటీతత్వం కలిగి ఉండాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. కొండపల్లిలో శనివారం నిర్వహించిన ఓ పాఠశాల వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులందరూ తమ ముందు ఉన్న లక్ష్యాన్ని సాధించేందుకు మాత్రమే ఆసక్తి కలిగి ఉండాలని చెప్పారు. సామాజిక, కుటుంబ తదితర విషయాలను పక్కన పెట్టి విద్యా, క్రీడలకు చోటు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కిశోర్, చైతన్య, హరిణి, లక్ష్మణ్, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి సూచించారు. రాయనపాడులోని సెయింట్ పాల్స్ పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పట్టుదలతో చదివితే ఉన్నత స్థానానికి చేరవచ్చని తెలిపారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత సెయింట్ పాల్స్ పాఠశాల యాజమాన్యానికే దక్కుతుందని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏపీ గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీరు విజయ్ కుమార్, ప్రిన్సిపల్ లంక భూషణ కుమారి, నిర్వాహకులు లంకా కరుణాకర్‌దాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న ఉండవల్లి శ్రీదేవి తదితరులు

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

2020 మోడల్ టాటా 14 టైర్స్, వెహికల్స్ మంచి కండిషన్‌లో ఉన్నవి అమ్మబడును, (తెలంగాణ రిజిస్ట్రేషన్) సంప్రదించండి: 73311 91175.

2018 Honda City Superb Condition for Sale. Call: 94406 72315.

2011 Ape గూడ్స్ ఆటో బోర్‌చేసిన బండి, జస్ట్ 40 వేలతే, పేపర్స్ నో ఫోర్స్, 2023 TATA Ace 22K రీడింగ్, షోరూమ్ ట్రాక్ 94919 60496

కారు సేల్ AP39AU7749 Tata Tiago XZA1.2RTN BS4, 04/2019 మోడల్ పెట్రోల్ Color బెర్రి రెడ్. ✆ 77027 17088, 94920 30404

BUSINESS SERVICES

BUSINESS OFFER

Wanted Investors in Vijayawada for India's fastest Growing Education Institutions Contact: 95425 13426.

Promote Apex Solar Business with Just 3600/- Earn Daily Good Income + Get 6000/- Worth of Digital Marketing Course Free ✆ 91337 52959.

విజయవాడలోని ప్రముఖ హోల్‌సేల్ మెడికల్ (రన్నింగ్‌లో వున్న) డిస్ట్రిబ్యూటర్‌కు స్లీపింగ్ పార్ట్‌నర్ కావలెను. ఆసక్తి గలవారు సంప్ర: ✆ 94407 41128.

FOR SALE

బొటిక్ అమ్మకం: మంచి ఆదాయంతో 13 సం||ల నుండి రన్నింగ్‌లో ఉన్న బొటిక్. బెంజ్‌సర్కిల్ దగ్గర, LEPLప్రక్కన, రోడ్డు No.1, RTC కాలనీ ✆ 94901 13293

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 Certified Co. House hold Goods Shifting any Time any Where. ✆ 97043 64389.

CCTV

CC TV/Solar సిస్టం సేల్స్ & సర్వీస్ సీసీటీవి టెక్నీషియన్స్ కావలెను. Qul: 10th, ఇంటర్, టూవీలర్ మస్ట్. ✆ 94942 33533.

BUILDING CONSTRUCTION

TDR
AP & TELANGANA
BONDS
BUY & SALE
KAMESH
92 92 15 15 15

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 Yrs Exp. ★ 5 Yrs Warranty ★ Bathroom Leakage Grouting Epoxy Works. ✆ 94940 02285, 99516 07504.

EDUCATION

SCHOOLS & COLLEGES

Well running School in Vijaywada, Sanath Nagar looking for Partner to invest 6 lakhs in muslim mgmt school. If Interested ✆ 90325 46264, 91604 49554

SPOKEN HINDI

Learn Online/Offline Spoken Hindi/ English, French & German Within 30 Days.100% Guarantee for all Ages. Free Demo.✆ 98495 42456

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసింది గా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

HOME TUITIONS

Home Tuitions for Physics Long & Short term NEET Short term EAPCET Rank oriented coaching. ✆ 82477 50969.

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG All Objective సబ్జెక్ట్స్. NEET, IIT ట్యూటర్స్‌కు. ✆ 92900 05677, 74165 35749.

FINANCIAL SERVICES

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్ని తరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

మీ ఇళ్ళు బిల్డింగ్స్ కాంప్లెక్స్‌ల మీద తనఖా పద్ధతిలో రూ. 1 వడ్డీకి ఫైనాన్స్ ఇప్పించబడును. వేరే ఏ బ్యాంకులో ఉన్ననూ విడిపించబడును. ✆ 83099 11995

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుట, జాయింట్ పెయిన్స్‌కు విజయవాడ:- శ్రీశరణం లాడ్జి పాతబస్టాండ్ ఎదురూగా, బందర్‌రోడ్, ప్రతీనెల 2, 16 తేదీల్లో మందులు

HOME NEEDS

WATER PURIFIER

రోజుకి 600 లీటర్లు
Life Guard
ప్రతి రోజు 600 లీటర్ల వాటరు విడుదలగును
9246470001

MOSQUITO SCREENS

మెష్ డోర్స్, కర్టెన్ రాడ్స్, కర్టెన్స్, కప్‌బోర్డ్స్ UPVC విండోస్ బ్లైండ్స్, వాల్‌పేపర్, Anti Bird మెష్, ఇన్విజిబుల్ గ్రిల్స్, దుర్గాప్రసాద్. ✆ 98495 69111

PEST CONTROL

Tarun Pest ★25Yrs Exp. 5Yrs Warranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest & Other Insects Control). ✆ 94940 02285, 99516 07504

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

Abid mohammad S/o Aslam azad R/o 8-22-38 effin st, wynchipeta VJA-01, Change my Name As Mohammad Abid Azad. S/o Mohammad Aslam Azad

PEOPLE CARE

OLD AGE HOME

నెస్ట్ కేర్ హోమ్ వృద్ధాశ్రమం, కానూరు. వృద్ధులకు, బెడ్ పేషెంట్‌లకు ఆహ్లాదకరమైన ఇంటి వాతావరణంలో మంచి ఆహారం, సేవలు కలవు. ✆ 98483 40496

REAL ESTATE

విజయవాడ మరియు అమరావతి పరిసర ప్రాంతాలలో ఖాళీ స్థలాలు, పొలాలు కొనాలన్నా లేదా అమ్మాలన్నా సంప్రదించండి. 96424 64649.

గుంటూరు సిటీ, గోరంట్ల, రెడ్డిపాలెం, లాం, అగతవరప్పాడు, వెనిగండ్ల, నంబూరు,పెదకాకాని, కొప్పురావూరు, కంతేరు, కాజాలలో ప్లాట్లు అమ్మాలన్నా/ కొనాలన్నా సంప్ర. 73823 96677.

గచ్చిబౌలి, కొండాపూర్, నల్లగండ్ల, తెల్లాపూర్ & మోకిలా, తుక్కుగూడ పరిసరాలలో ప్లాట్స్ అమ్మదలచిన కొనదలచిన. సంప్రదించండి: 99630 77477.

అమరావతి రాజధానిలో గల ల్యాండ్ పూలింగ్ ప్లాట్లు, పొలాలు విజయవాడ - గుంటూరు మధ్య అన్ని వెంచర్లలో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన Ph. 77949 12324

గుంటూరుసిటీలో, గోరంట్లలాం, JKCరోడ్డు, ఇన్నర్‌రింగ్‌రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మదలచిన వారు సంప్ర: 93999 55545.

బెల్లంకొండ మండలంలో (9ఎకరాలు + 3 ఎకరాలు) ఎకరం పొలం 7-8 లక్షలకు, అమరావతిలో ఇళ్ళు అమ్మకమునకు కలవు. సంప్ర. 91775 46316.

FLAT FOR SALE

KANURU

3BHK 1750 S.Ft., 1st Floor E/F Flat For Sale. with Car Parking, Deepika Grandeur Apt., Road No: 3, Amaravathi Colony, Kanuru, VJA. ✆ 99081 12244.

4&3 BHK
SITE OWNERS
FLATS FOR SALE
NAVAH
GATED COMMUNITY
@ KANURU
కొద్దిఫ్లాట్లు మాత్రమే త్వరపడండి
అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న
HIGH RANGED
(G+7) with 8 Blocks
3&4 బెడ్‌రూమ్ ఫ్లాట్లు అమ్మకానికి కలవు
గృహ ప్రవేశానికి సిద్ధం.
Contact
9849583838
9848641234

కానూరు నాగార్జున హాస్పిటల్ దగ్గర పద్మావతి గ్రూప్ హౌస్ 3rd ఫ్లోర్ నందు తూర్పుఫేస్ 3 BHK ఫ్లాట్స్. లిఫ్ట్, కార్ పార్కింగ్‌తో అమ్మకం. సంప్ర: 90149 59999.

3BHK - 1470Sft North, 2BHK- 1240Sft East, Full cupboards, ready to move at Srinivasa Residency, Near Sitapuram Colony, Aravapalli Purnaiah Veedi, Opposite Priya Foods, Poranki, VJA. Ph: 77028 76445

కానూరు, మురళీనగర్ బల్లెంవారివీధిలో అక్షయ మెడోస్‌నందు న్యూ 3 BHK (1400 Sft) ఫ్లాట్స్ అన్ని సౌ॥తో 53 లక్షలు. 89195 70872, 96428 47736.

కానూరు పిన్నమనేని టీచర్స్‌కాలనీ మైనేనిప్లాజా 5thఫ్లోర్ నందు పడమరఫేస్ 1185 S.Ft.తో న్యూ 2BHK ఫ్లాట్ లిఫ్ట్‌కార్ పార్కింగ్‌తో అమ్మకం. 80740 52745

100% బ్యాంక్ లోన్‌తో కానూరు బల్లెంవారి వీధిలో Occupancyకి సిద్ధంగా ఉన్న న్యూ 2BHK & 3BHK తూర్పు ఫేస్ Flats అమ్మకం.✆ 81214 07585.

3BHK న్యూ డీలక్స్‌ఫ్లాట్స్ అన్నిసౌకర్యాలు గల 100%బ్యాంక్ లోన్‌తో గృహప్రవేశానికి సిద్ధంగా కలవు. బల్లెంవారివీధి, కానూరు. ✆ 97017 98726, 89196 79256

TADIGADAPA

Tadigadapa, VR Siddhartha Engg. College Opp: Padmaja nagar, Individual Floors 3BHK Flats 1800 S.Ft Sale. ✆ 94400 31268.

తాడిగడపసెంటర్ బందరు రోడ్డుకి దగ్గర సాయినగర్‌లో 2320 S.Ft.తో ఫ్లోర్‌కి ఒక్కఫ్లాట్ చొప్పున నిర్మించిన న్యూ 3BH లగ్జరీ ఫ్లాట్స్1.3Cr. 77298 87101

CURRENCY NAGAR

Vijayawada Currency Nagar near Aayush Hospital Kamala Residency 3BHK Furnished, N/E Face 1800 Sft Car Park. 97393 80905.

TADEPALLI

తాడేపల్లి/ AIIMS దగ్గర్లో APCRDA అప్రూవ్డ్ గృహప్రవేశానికి సిద్ధంగా తూర్పుఫేస్, 5thఫ్లోర్, న్యూ 3BHKఫ్లాట్ (1615 S.Ft) సీలింగ్, కబోర్డ్స్, లిఫ్ట్, RO ప్లాంట్, బ్యాంక్‌లోన్ సౌకర్యంతో అమ్మబడును. Tejas Residency. ✆87901 84566

SATYANARAYANAPURAM

VJA, సత్యనారాయణపురం 1,200SF.t ప్రీమియం న్యూ 2BHK ఫ్లాట్స్ కార్‌పార్క్, లిఫ్ట్, సిసిటివి, జనరేటర్‌తో BRTS రోడ్ దగ్గరలో అమ్మకానికి. ✆80992 13888

GENERAL

Ready to Occupy 237 Sq.yds, 4500 Sq.Ft, Lavish Triplex Villas at Golden Villas. Mustabada Road, 1min. Drive to West bypass, 7min. Drive to NTR University ✆ 94405 28023

Ready to Move in Geted Community 2,3,4 BHK Flats for Sale in Currency Nagar. 100% Loan. ✆ 86884 66789

3BHK సెమి ఇండిపెండెంట్ ఫ్లాట్స్ గృహప్రవేశానికి సిద్ధంగా పోరంకి- నిడమానూరు రోడ్డులో ఉగాది స్పెషల్ ఆఫర్‌తో అమ్మకంనకు కలవు. ✆ 85229 12999

నిడమానూరు ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ ప్రక్కన హైవే ఆనుకుని ప్రముఖ గేటెడ్ 10ఫ్లోర్ల హైరైజ్ అపార్ట్‌మెంట్లు విశాలమైన 2BHK ఫ్లాట్స్ 90% బ్యాంక్ లోన్‌తో. 9951495555

బెంజ్‌సర్కిల్ ఈనాడు వెనుక పటమటలంక, రామవనగర్‌లో 1050 S.Ft. గల 2 BHK ఫ్లాట్, కార్ పార్కింగ్‌తో అమ్మకం. సంప్ర: ✆ 94938 98972.

Hyd, Kokapet -Kollur -Patancheru -High -Rise APTM, Villas & Open Plots @ Rs.6700-10,000 Per Sft & Rs.50K Per Sq.Yard 73869 25841.

Prime Loc 2BHK with Car Par. Auto N. Bus Depo. 15 Old, New Luck, East Face 1020 S.Ft., For Sale ✆ 92987 09740, 92965 05126.

నెలకు రూ. 19,500/- అద్దెతో
37 లక్షలకే 2 BHK
చైతన్య కాలేజి బిల్డింగ్, విజయవాడ, కేసరపల్లి NHని ఆనుకుని
✆ 91609 06566

విజయవాడ భారతీనగర్ నందు గృహప్రవేశమునకు సిద్ధముగా న్యూ 3BHK (3100 S.Ft) సెంట్రల్ A/C, 3 కార్ల పార్కింగ్‌తో అమ్మబడును. ✆ 99497 46789

సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ మారుతీ కార్ల షోరూం వెనుక, షిర్డీ సాయి హైట్స్‌లో3BHK ఫ్లాట్, పుల్లీ ఫర్నిష్డ్ 1431S.Ft, 4th ఫ్లోర్,W/F. Ready to Occupy.✆ 98492 42413

న్యూ 2 BHK 40 లక్షలు
విజయవాడ, రాజధాని దగ్గర, గొల్లపూడిలో వెస్ట్ బైపాస్‌కి అతి సమీపంలో 1100 S.Ft.
✆ 93475 53145

VJA రామవరప్పాడు రింగు కమర్షియల్ ఏరియా వీరమాచినేని రెసిడెన్సీ 2BHK ఫ్లాట్ నెం. 505 (1075చ॥అ॥) కారుపార్కింగ్‌తో అమ్మకము. ✆ 94410 25225.

బందరురోడ్డు పప్పుల మిల్లు సెంటర్ కాస TVS ప్రక్కన నిర్మించిన 3BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా వున్నవి. సంప్ర ✆ 94940 51157

విజయవాడ మహానాడురోడ్డు దగ్గర గణేష్‌నగర్ 4thరోడ్ లో శ్రీనిలయం అపార్ట్‌మెంట్ 5th ఫ్లోర్‌లో 2BHK ఫ్లాట్ లిఫ్ట్,కార్ పార్కింగ్‌తో అమ్మకం. 99595 16777

3&4 BHK Deluxe Floorwise FLATS for SALE
Near Kennedy School, Kanuru.
G+2 Independent House for Sale in 154 Sq.yds
(Lift & 2 Car Parking) @ Tadigadapa.
✆7075017255

బందరురోడ్డులోని PVPమాల్ ఎదురుగా చెన్నుపాటి పెట్రోల్ బంక్ వీధిలో సాయిబలరాం టవర్స్‌లో 2BHK ఫ్లాట్ నెంబర్ 303 అమ్మకం. ✆ 98498 16076.

గాయత్రినగర్ లలితా జ్యుయలర్స్ వెనుక రిలయన్స్ స్పెండర్ అపార్ట్‌మెంట్‌లో 3BHK, 2500S.Ft., 2కార్‌పార్కింగ్స్‌తో అమ్మకం. 98482 07437/ 93981 14214

2 BHK FLATS SALE
Ananda Lahari
Edupugallu, Bandar Road, Vijayawada
FIVE STAR RETIREMENT HOMES
Multi-Speciality Hospital
Community Dining
Club House and Pool
Ready to Occupy
96427 74699, 80961 23123

VJA ఆయుష్ హాస్పిటల్, కరెన్సీనగర్ వద్ద W/F 3BHK పుల్లీఫర్నిష్ 2475 S.Ft. ఫ్లోర్ వైజ్ Dr. గారి ఫ్లాట్ రీసేల్ (4Y) 1.10 Cr. 95427 56666

చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ ప్రక్కన విష్ణు హైట్స్‌లో 3BHK 1st, 4th ఫ్లాట్స్ అన్ని సౌకర్యములతో అమ్మకము. ✆ 88851 15888, 88852 25888.

తాడేపల్లి లగ్జరీ రాయల్ అపార్ట్‌మెంట్స్‌లో 5వ ఫ్లోర్, B బ్లాక్, ఫ్లాట్ నెం.506, అన్ని వసతులతో అమ్మకానికి కలదు. సంప్ర: Ph: 90000 59583, 90000 46605.

విజయవాడ, లోటస్ ల్యాండ్‌మార్క్ 2nd గేట్ దగ్గర, కేదారేశ్వరపేటలో, తూర్పు, రోడ్డు ఫేసింగ్, పుల్లీఫర్నిష్ 2BHK (1240S.ft.) ఫ్లాట్ అమ్మకం ✆ 93948 70425.

లబ్బీపేటలో RRగార్డెన్స్‌లో గురునానక్ కాలనీలో, మహనాడు రోడ్‌లో, పటమటలంకలో, 3B/Rఫ్లాట్స్ అమ్మకం. అమ్మాలన్నా కొనాలన్నా సొంత ఇల్లు.com ✆ 92464 12213

ఉయ్యూరు శ్రీనివాస కాలేజి మెయిన్ రోడ్డులో శారద రెసిడెన్సీ గ్రూప్‌హౌస్ 3BHK న్యూఫ్లాట్స్ ఫ్లోర్‌కి ఒక్కఫ్లాట్ మాత్రమే. కారు, లిఫ్ట్‌సౌకర్యంతో అమ్మకం ✆ 98483 34898

HOUSE FOR SALE

KANURU

తాడిగడప 100అ॥రోడ్డులో కామినేని హాస్పిటల్ ఎదురు రోడ్డులో 200చ॥గ॥లో G+2 (5000 S.Ft.) ఇండిపెండెంట్ హౌస్ Liftతో 94914 43283, 94401 45136

GANNAVARAM

విజయవాడ- గన్నవరం ఎయిర్ పోర్ట్ వద్ద B.Bగూడెం రోడ్, 5ఎ. వెంచర్ లో 2BHK ఇండిపెండెంట్ హౌస్ 1000sft , 250yds, 100%వాస్తు, బ్యాంక్ లోన్ లో ఉంది.డైరెక్ట్ ఓనర్: 9885584519

NUNNA ROAD

New Individual House for Sale నున్న సాయిబాబా గుడి దగ్గరలో AP CRDA అప్రూవల్‌తో 80% లోన్ సౌకర్యం కలదు. ✆ 95151 39429

SATYANARAYANAPURAM

257 Sq.Yds Site with Old Building, Beside Chebrolu Towers, Brahmaiah Pantulu Street, SYN. Puram, Vij. ✆ 9154024700

GENERAL

VJA, భవానీపురం, స్వాతి థియేటర్ దగ్గరలో బ్యాంకు సెంటర్‌లో NH నుండి 2వ బిట్ 40Ft లోపల 150 గ॥ల G+1 ఇల్లు అమ్మకం ✆ 9573059117

బిల్డింగ్ అమ్మకము
9BHK
3 ఫ్లోర్స్ బిల్డింగ్ అమ్మకానికి ఉన్నది
(ప్రతీ ఫ్లోర్ ఒక 3BHK కలదు)
కంకిపాడు దగ్గరలో
విజయవాడ - బందరు హైవేకి 1 కిలో మీ. దూరంలో
కంకిపాడు నుండి ఎయిర్‌పోర్టుకు వెళ్ళేరోడ్డులో
ధర: కోటి 80 లక్షలు
3 ఫ్లోర్స్‌కు కప్‌బోర్డ్స్ & ఇంటీరియర్ మీకు నచ్చిన విధముగా చేసి ఇవ్వబడును
906 3456 379
984 9247 554

VJA, కస్తూరిబాయిపేట గాంధీ బొమ్మల దగ్గరలో ఈస్ట్ ఫేసింగ్ 73గజాలు గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్లు గల RCC బిల్డింగు అమ్మకము. ✆ 91000 41412.

244 Sqyds Old Building for Sale Vijayawada, Sitha rampuram Geetha Mandir Street Eluru Road. Ph.No: 98661 23355.

రామవరప్పాడు రింగ్‌లో K హోటల్ వెనుక ఇంద్రలోక్ ఎస్టేట్‌లో 150చ॥గ॥లో 3BHK డ్యూప్లెక్స్ ఇండివిడ్యువల్ హౌస్ అమ్మకానికి కలదు. ✆ 98481 53136.

ఇల్లు అమ్మకం
విజయవాడ, సత్యనారాయణపురం దాక్షిణ్యం వారి వీధిలో, తూర్పుఫేస్ 256 గ॥ (44x56)
H.No: 23-16/1-5
అమ్మకంనకు కలదు.
✆ 98853 74350

ప॥గో॥జిల్లా T.P.గూడెం కొత్తబ్రిడ్జి ప్రక్కన కడకట్లలో 300 చ॥గ॥ స్థలంలో బిల్డింగ్ అన్నిసౌకర్యాలతో అమ్మకమునకు కలదు. తూర్పు ఫేసింగ్. ✆ 79746 93758.

కంకిపాడు లాక్‌విలేజ్ 25 సెంట్ల స్థలం అప్‌స్టేర్ బిల్డింగ్ + 12 కొబ్బరి+ 5 మామిడిచెట్లు + ప్రహరీ+ W-N-SE స్థలం అమ్మబడును. ✆ 96198 61798/ 99898 15888.

VJA, కుమ్మరిపాలెం, గుప్తా సెంటర్, సిటీబస్టాపు ప్రక్కన, నెలకు 73వేలు అద్దెవచ్చు బిల్డింగ్, 103గ॥ రి.జి, 3 అంతస్తులు, ప/ఉ బజార్లు గల బిల్డింగ్ అమ్మకం. ✆ 98498 31931.

గుడివాడ ఏలూరు రోడ్డులో పడమర ఉత్తరం కార్నర్‌లో 4 గదుల 277 చ॥గ॥ బిల్డింగ్ అమ్మకానికి కలదు. కావలసినవారు సంప్రదించగలరు.✆ 91544 58734.

2BHK ఇల్లు ప్రశాంత వాతావరణంలో 167 గ॥లలో కట్టిన ఇల్లు. కోలవెన్ను గేటెడ్ కమ్యూనిటీలో 50 లక్షలు మాత్రమే. ✆ 77801 96244.

LAND FOR SALE

కొంతేపూడి గ్రామం, పెదన మండలం, బందరు తాలూకా నందు 9.10 ఎకరాల మాగాణి వ్యవసాయ భూమి ఒకే చోట అమ్మకానికి కలదు. కరెంటుతో లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యం కలదు. వడ్లమన్నాడు డ్రైనేజీ ప్రక్కన, పెదనకు 4 కి.మీ, (బందరు గుడివాడ రోడ్డు) ఫోన్: 99636 74352, 94401 38224.

కృష్ణాజిల్లా, జి.కొండూరు మండలం, చెవుటూరు గ్రామంలో 20సం॥ వయస్సు మామిడి చెట్లున్న 12 ఎకరముల మామిడితోట అమ్మకం. 9392112777, 9493872999

Commercial Land for Sale. Opp. Vijayawada Airport Adjacent to NH-16. 93.5 Cents Land Interested Parties. ✆ 9908721049.

Industrial Land Sale. 2.60 Acrs (SG) Nidadavole, E.G. Dist. ✆ 94401 43154, 81429 61443.

గుడివాడ మండలం, కొమరవోలు శివారు తటివర్రు గ్రామము నందు 10 ఎకరముల మాగాణి పొలము అమ్మకం. సంప్ర: ✆ 93462 81147, 83676 38755

గుండిమెడ దగ్గర 8ఎ॥ &పరిసర ప్రాంతాలలో పొలములు & జగ్గయ్యపేటలో 17ఎ॥ నందమూరి నగర్, తోటచర్లవద్ద రోడ్‌ఫేస్‌తో స్థలాలు, లయోలా కాలేజ్ దగ్గర 267గ॥లలో ఇల్లు అమ్మకం.✆ 98496 33982

VJA గుణదల కార్మెల్‌నగర్‌లో నెక్స్‌జెన్ విల్లాస్ వద్ద కమర్షియల్ & కన్‌స్ట్రక్షన్‌కు అనువైన 6150 చ॥గ॥ల స్థలం అమ్మకము. చ॥గ॥ 32 వేలు.✆ 78939 93999

గుడివాడ దగ్గర, వెంట్రప్రగడ గ్రామంలో, మెయిన్‌రోడ్డు, పంట కాలువ ఆనుకొని ఎ॥ 2.56 సెంట్లు (1+1.56) వ్యవసాయ భూమి అమ్మబడును. ✆ 85007 37579

8ఎకరాల మామిడితోట అమ్మబడును. విస్సన్నపేట సిటీకి 4KM రెడ్డిగూడెం వెళ్లే రూటు తారు రోడ్డు ఫేసింగ్ 1ఎకరం 35లక్షలు. ✆ 94915 86009/ 88856 12999

నూజివీడు IIIT కి దగ్గరలో య 1.52 లు వ్యవసాయ భూమి అమ్మకంనకు కలదు. రేట్ 70 లక్షలు. ఫోన్: 9440194742

కృష్ణాజిల్లా కంచికచర్ల హైవేకి అనుకొని ఒక ఎకరం 40 సెంట్లు అమ్మకానికి కలదు. డైరెక్ట్, డాక్యుమెంట్స్ క్లియర్‌గా వున్నవి. ✆ 83487 05797.

NTR జిల్లా, కంచికచర్ల మం॥ గనిఆత్కూరు గ్రా॥ లంకభూమి ఒకఎకరము రేటు రూ.25లక్షలు గండేపల్లి గ్రామములో ఇళ్ళ మధ్యలో సెంటు 8లక్షలు. ✆ 9676102276

అగిరిపల్లిలో గెస్ట్‌హౌస్ కట్టు కునేందుకు మామిడితోట రోడ్డు ఫేసింగ్ సెంటు 1,50,000/- కరెంటు కలదు. 5సెంట్లు బిట్స్ కలవు ✆ 70753 44069, 93986 83813

PLOT FOR SALE

KANURU

కామినేని హాస్పిటల్ రోడ్డు పోరంకి నిడమానూరు ఈడుపుగల్లు నందు 215చ॥గ॥, 500చ॥గ॥, 920 చ॥గ॥ ప్లాట్లు అమ్మకము. ✆ 93922 72888, 96407 84953

తాడిగడప 100 Ft. కామినేని హాస్పిటల్ రోడ్డులో పంచుమర్తి అనురాధ గారి విల్లాస్ రోడ్డులోపల జనచైతన్య వెంచర్‌లో 200, 300, 418 గజాల లేఅవుట్ ప్లాట్లు అమ్మకం. గజం: 30000/-కే ✆ 92907 63488.

కానూరు, తాడిగడప, పోరంకి, గొల్లపూడిలలో రాఘవ ఎస్టేట్స్, జన చైతన్య, హరివిల్లు, శ్రీ భ్రమర, శ్రీ సిటి వెంచర్లలో ప్లాటు అమ్మదలచిన వారు. ✆ 93922 56567

హరివిల్లువారి అన్ని CRDA లేఅవుట్‌లలో పెనమలూరు కంకిపాడు గండిగుంటలో 194, 240, 300,400 గ॥ మంచి ప్లాట్లు కంపెనీ డైరెక్ట్ సేల్.✆ 92464 73929

కామినేని హాస్పిటల్ 100అ॥ రోడ్డు, కానూరు, పోరంకి రాఘవఎస్టేట్స్, జనచైతన్య, ఈడుపుగల్లు, కంకిపాడు చుట్టుప్రక్కల ప్లాట్లు అమ్మదలచిన వారు డైరెక్ట్ ✆ 98485 87376

TADIGADAPA

నిడమానూరు టుపోరంకి నారాయణ పురం కాలనీరోడ్డులో & తాడిగడప 100అ. రోడ్డులో 200, 300, 400, 600, 1000 & 1200 చ.గ. ప్లాట్స్ అమ్మకం 98495 05854

PENAMALURU

Edupugallu Layout, Sai priya constructions 2 Plots (226 yards each). Rate Neg. Contact: +91 85238 52064

ఈడుపుగల్లు నందు, ఈడుపుగల్లు - ఉప్పులూరు రోడ్డు అనుకొని, వైష్ణవి పార్క్, ఫేజ్-1, CRDA లేఅవుట్‌లో 200 చ.గ.ల, ఓపెన్ ప్లాట్ అమ్మబడును. ✆ 9502376934

CURRENCY NAGAR

విజయవాడ, భారతీనగర్‌లో North& East ఫేసింగ్‌తోగల 451 చ॥గ॥ల స్థలం మొత్తంగా లేదా విడిగా అమ్మకం.✆ 93946 26067/ 94903 53541

GANNAVARAM

Vacant Plot 150 sqy West Facing near Highway Pottipadu Gannavaram sale. contact Malleswara: ✆ 96769 24785

గన్నవరం రావ్‌ఫిన్ వెంచర్‌లో E/F 250గ॥, కేసరపల్లి IT పార్క్ దగ్గర 220, 240గ॥ లేఅవుట్ ప్లాట్లు & 3BHK హౌస్ అమ్మకం. ✆ 86397 97570.

GOLLAPUDI

గొల్లపూడి ఖలీల్ బాయ్ రెస్టారెంట్ Opp రోడ్డులో హైవేకి 600 మీటర్ల దగ్గరగా 250 గజాల లేఔట్ ప్లాట్లు అమ్మకం. గజం 26,000/- ✆ 92907 63488

NUNNA ROAD

విజయవాడ -నున్న రోడ్‌లో కండ్రిక దగ్గర HP పెట్రోల్‌బంక్ వెనుక నార్త్, వెస్ట్ కార్నర్ (64x40) 284చ॥గ॥ స్థలం అమ్మకంనకు కలదు. ✆77995 55535

GENERAL

కమర్షియల్ స్థలము అమ్మకము. విజయవాడ To హైదరాబాద్ రోడ్డులో కంచికచర్ల వద్ద 66x98 = 720చ॥గ॥లు N/E/W ఫేస్‌తో లే అవుట్ ప్లాటు అమ్మకం. చ॥గ॥ 15,000/- ✆ 93939 62234.

అర్జెంట్ సేల్ ఉయ్యూరు - మంటాడ ఇళ్ళ మధ్యలో 10ఎ CRDA వెంచర్‌లో 10 ప్లాట్లు కలవు. గజం ఆఫర్ రేటు 7800/- (స్పెషల్ ఆఫర్ గ్రూప్ బుకింగ్) స్పాట్ రిజిస్ట్రేషన్ Hyma Prasad. ✆ 99596 45468

తక్కువ ధరలో ప్లాట్లు
బందరు రోడ్డు 6 లైన్ల హైవేకి అతి సమీపములో ఇళ్ళకు ఆనుకుని కురుమద్దాలి నూతన వెంచర్‌లో గజం
7,500 మాత్రమే
(మార్కెటింగ్ నిపుణులు కావలెను)
✆ 99514 95555

పోరంకి, నిడమానూరు ఏరియాలో ఇన్వెస్ట్‌మెంట్ ఓపెన్ ప్లాట్లు మరియు పోరంకి బందరు రోడ్డుకి దగ్గరగా 3BHK ఫ్లాట్ అమ్మకం. ✆ 99636 43777.

విజయవాడ ప్రైమ్ లొకేషన్‌లో ఇళ్ళస్థలములు, అపార్ట్‌మెంట్ సైట్లు మరియు వెంచర్స్ అనువైన పొలములు అమ్మాలన్నా-కొనాలన్నా. సంప్ర- వేమూరి. ✆ 99857 78999.

గజం 11999/- బందర్ రోడ్‌లో 80 ఎకరాల గేటెడ్‌కమ్యూనిటీ స్పోర్ట్స్, స్విమ్మింగ్‌పూల్, హౌసింగ్ 46L గవర్నమెంట్ ఆఫీసులకు దగ్గరలో. ✆ 99495 05050

500/800 sq.yds, main road/NH facing, four side road, CRDA approved, near to Westbypass, Mayuri techpark, Chinakakani. Contact: ✆ 90144 58976.

పటమట ఎలక్ట్రిసిటీ కాలనీ
ప్రైమ్ లొకేషన్‌లో
40 అ॥ రోడ్డు తూర్పు ఫేస్
ఫ్లోర్‌కి ఒక్క 3 BHK డీలక్స్ ఫ్లాట్
అమ్మకమునకు కలవు
✆ 90000 40792

విజయవాడ, పోరంకి, సీతాపురం కాలనీ, 410 చ॥గ॥ ఈస్ట్‌ఫేస్ & పటమట, కెనరా బ్యాంకు రోడ్డు 570 చ॥గ॥ వెస్ట్ ఫేస్ స్థలాలు అమ్మకం. ✆98498 64969.

కంకిపాడు బస్టాండ్ దగ్గర, ఫ్యూజన్ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో B బ్లాక్, ప్లాట్ నెం. 463, W/F 187 గ॥ ఖాళీస్థలం అమ్మబడును. ✆ 83099 08373.

VJA, ఉయ్యూరు 75ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో 60.40 రోడ్లతో ఓపెన్ ప్లాట్లు, విల్లాస్ 10,999కి అమ్మకం. ✆ 70937 56789

బందరు రోడ్ నేషనల్ హైవే ఫేసింగ్ నార్త్‌సైడ్ కంకిపాడు దగ్గరలో 450 చ॥గ॥ ప్లాట్ అమ్మకమునకు కలదు. ✆ 98483 43355

కానూరు మురళీనగర్ 1225గ॥ N/E కార్నర్ అమ్మకం. బల్లెం వారివీధి - శక్తి కళ్యాణ మండపం వెళ్లే 80అ॥ రోడ్డులో గజం:35K. ✆ 94915 86009/ 88856 12999

VJA-Hyd హైవే ఏరియాలలో 30ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ "ది రాయల్"కు ఓపెన్‌ప్లాట్స్ తక్కువ ధరలో వెస్ట్‌బై-పాస్, ORR & IRR దగ్గర. ✆ 89859 66069.

గుణదల, విజయవాడ, AMBITIOUS School దగ్గర 325చ॥గ॥ తూర్పుఫేస్ స్థలం అమ్మకం. తూర్పు 40అ॥ రోడ్. ✆ 99592 19223.

పామర్రు, పరిటాలలో హైవేకి ఆనుకుని CRDA అప్రూవ్డ్ లేఅవుట్ నందు లోన్ సదుపాయంతో ప్లాట్లు కలవు. ✆ 88864 80803.

కంకిపాడు @ కోలవెన్నులో
చ॥గ॥ 13,500/- మాత్రమే
కంకిపాడు టోల్‌గేట్ ఇవతల, అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డుకి లోపల వైపునే, CRDA LP No: 5/2026, అప్రూవల్‌తో, అందరికీ అందుబాటు ధరలో రెడీ టూ కన్‌స్ట్రక్షన్ ఓపెన్ ప్లాట్స్ కలవు.
✆ 90100 55678

డెవలప్‌మెంట్ కొరకు 40 సెంట్ల భూమి కృష్ణా జిల్లా పామర్రు గ్రామంలో పాలిటెక్నిక్ కాలేజీ దగ్గరలో హైవే ప్రక్కన కలదు. ✆ 98496 62899, 94904 24019

మచిలీపట్నం టౌన్ చిలకలపూడి రైల్వే గేటు దగ్గర ఉన్న మేకావారి పాలెంలో 10 సెంట్ల స్థలం అమ్మబడును. ✆ 94943 20480.

PLOTS FOR SALE
రామవరప్పాడు ఫస్ట్ ఫ్లైఓవర్ తూర్పు సర్వీస్‌రోడ్‌కు దగ్గర్లో పడమర ఫేసింగ్‌తో 68 X 80 కొలతలు గల స్థలం అమ్మకం.
మరియు
తూర్పు, పడమర, దక్షిణం రోడ్ల ఫేసింగ్‌తో 612 చ॥గ॥ల స్థలం. చుట్టూ ప్రహరీ గోడలు మరియు మలబార్ వేపచెట్లు కలవి అమ్మకం.
✆ 9440666333

పటమట బందరురోడ్డుకి 10వ బిట్టు 38 53 కొ॥తో తూర్పు ఫేస్ 225చ॥గ॥లు సిద్దార్థ Eng కాలేజ్‌దగ్గర W/F 1086చ॥గ॥లు అమ్మకం. ✆ 98482 39369

గూడవల్లి MGషోరూమ్ ప్రక్కరోడ్డులో ఉత్తరం ఫేసింగ్ 290చ॥గ॥ల స్థలము, గుణదల ఉలవచారు కంపెనీ దగ్గరలో 2BHK డీలక్స్ ఫ్లాట్ అమ్మకం. ✆98661 74020

గవర్నర్‌పేటలో 400గ॥ సేల్ గ॥1.35వేలు ★ మంగళగిరి ఎర్రబాలెం వేపచెట్టుసెంటర్ దగ్గర 300గ॥ సేల్ గ॥23వేలు. నో బ్రోకర్స్ ✆ 96668 52977

కంకిపాడు టోల్‌గేట్ ఇవతల అమరావతి ఔటర్ రింగ్ రోడ్డులోపల, CRDA LP: 5/2026 కోలవెన్నులో గ॥ 13,500/- రెడీ టు కన్‌స్ట్రక్షన్. ✆ 98850 56753

VJA వెస్ట్‌బైపాస్‌కి దగ్గరలో హైదరాబాద్ హైవే రోడ్ ఫేసింగ్‌తో తుమ్మలపాలెం నందు 1040 గజాల మంచి కమర్షియల్ స్థలం అమ్మకము. ✆ 83097 01101.

విజయవాడ, పెదపులిపాకలో, తూర్పు ఫేసింగ్, VUDA లేఅవుట్ 220 చ॥గ॥ల ప్లాట్ అమ్మకం. కన్‌స్ట్రక్షన్‌లకు అనువైనది. ✆ 98857 28222.

రాజధాని అమరావతి, ఔటర్‌రింగ్ రోడ్డు, కొత్త రైల్వేలైన్, ఇళ్ల ప్రక్కన సెంటు కేవలం 2,49,999/- కొద్ది ప్లాట్స్, స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 84989 73586

విజయవాడ రామకృష్ణా పురం 1st లైన్‌లో తూర్పు ఫేసింగ్‌తో 130 చ॥గ॥ల ఖాళీ స్థలము అమ్మకమునకు కలదు. ✆ 99495 25924.

మంగళగిరి NH-16కి, DGP ఆఫీసుకి AIMSకి మరియు ఫ్యూచర్ సిటీలో Open Plots అమ్మకమునకు కలవు. సంప్ర॥ ✆ 93907 15079.

హ్యాపీక్లబ్ వెనుక శాంతిహౌసింగ్ అమరావతి టౌన్‌షిప్, రాజధాని, చినకాకాని, కాజ రామకృష్ణ హౌసింగ్, మంగళగిరి చుట్టుప్రక్కల ప్లాట్లు అమ్మదలచిన సంప్ర. 98485 87376

విజయవాడ లైలా గార్డెన్స్‌లో, తూర్పు ఫేస్, 375 చ॥గ॥ ★ మరియు భారతీనగర్‌లో పడమర ఫేస్ 340 చ॥గ॥ ఖాళీ స్థలాలు అమ్మబడును. ✆ 99483 44723.

VJA కానూరు మురళీ (గౌరినగర్) నగర్ అపార్ట్‌మెంట్స్ ఏరియానందు E/F 321 గ॥ (49x59) గ॥ 45 వేలు. హరివిల్లు ప్లాట్స్‌కై ✆ 95427 56666.

బందరు రోడ్డుకు 900మీటర్స్ రింగ్‌రోడ్‌కు 1KM ఆకునూరు దగ్గరలో CRDA LP40/25 గేటెడ్ కమ్యూనిటీలో 138, 165, 183, 222 చ॥గ ప్లాట్స్ స్పాట్ రిజిస్ట్రేషన్ బ్యాంకులోన్ 70%తో Baburao ✆ 91603 12999

పోరంకి నారాయణపురం కాలనీలో సాయివిజయ ఎక్స్‌టెన్షన్‌లో 210 చ॥గ॥ స్థలము అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. ✆ 92469 33983.

VJA, ఉయ్యూరు CRDA 84ఎ॥ నూతన వెంచర్ ప్రారంభం. గ॥ 11,999/-, 75% లోన్ ★ ప్లాట్స్ ★ హౌసెస్ ★ విల్లాలు ✆ 95531 29369, 97054 33765

రాజధాని బందరురోడ్ దగ్గరలో CRDA వెంచర్స్ కోలవెన్ను కురుమద్దాలి; తాడికొండ; కాజ వెంచర్స్‌లో ప్లాట్లు లోన్ డబుల్ గ్యారంటీతో అమ్మకం; VJA , S.N.పురం BRTS సర్కిల్ దగ్గర 213గ॥ కమర్షియల్ ఓల్డ్ బిల్డింగ్ అమ్మకం. ✆ 89785 00962

పోరంకి, సాయిలక్ష్మి-1లో ప్లాటు & పునాదిపాడులో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు లేఅవుట్ ప్లాట్స్ అమ్మకం. ఇన్వెస్ట్‌మెంట్‌కు కూడా కలవు. ✆ 91774 36308.

ఆయుష్ హాస్పిటల్ వెనుక 400 గ॥, గాంధీనగర్‌లో 450గ॥, 350గ॥ స్వాతి థియేటర్ రోడ్‌లో 400గ॥, సెంటిని దగ్గర కమర్షియల్ బిల్డింగ్ ✆ 9849348066

COMMERCIAL SPACE FOR SALE

నందిగామ, చందాపురం బైపాస్ రోడ్‌కి కమర్షియల్ సెడ్స్ 1000 చ॥గ॥ అమ్మకం/ లీజు/ డెవలప్‌మెంట్‌కు కలదు సం॥ప్ర॥ ✆ 98495 46408.

గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్ నందు నూతనముగా నిర్మించిన G+4 కమర్షియల్ కాంప్లెక్స్ నందు షాపులు అమ్మకమునకు కలవు. సంప్ర: ✆ 99851 51976.

SHOP FOR SALE

విజయవాడ గాంధీనగర్, శైలజ థియేటర్ రోడ్డులో, రవి పునుగులు ఎదురుగా 10x20 కొ॥ గల షాపులు-2 అమ్మకమునకు కలవు. ✆ 86606 77987.

LEASE

తెలంగాణ, ఖమ్మంలో 3021 చ॥గ॥లు ట్విన్ థియేటర్/ కమర్షియల్ లీజుకు సం॥ ✆ 98485 31544. bit.ly/4rMldEv

SITE FOR LEASE
Nearly 90 Feet Road Facing at Kandrika Junction
1,030 Sq.Yards
Suitable for Warehouses and Car Showrooms Cum Service Centres
✆ 90307 12375
94933 30049

LEASE/ RENT

తాడిగడప (కామినేని హాస్పిటల్ రోడ్) 100అ॥రోడ్‌లో పంచుమర్తి నగర్ నందు 5ఫ్లోర్‌ల భవనము సుమారు 10000చ॥అ॥ లీజుకు/ అద్దెకు కలదు. ✆ 94410 75333

AGRICULTURE LANDS

NH-16కి అతి దగ్గరగా 14 ఎకరాల కొబ్బరి తోట + ఒక ఎకరం చేపల చెరువు, 2 బోర్లు, డ్రిప్, ప్లాట్స్ /రియల్ ఎస్టేట్‌కి అనుకూలం. సూరప్ప గూడెం, భీమడోలు, ఏలూరు జిల్లా. కాంటాక్ట్: చిన్న గారు- ✆ 97043 22999, 73372 28262.

తోట్లవల్లూరు మండలం, సౌత్ వల్లూరు గ్రామం 54 సెంట్లు, 20 సెంట్లు వ్యవసాయ భూమి అమ్మబడును. No brokers. ఫోన్ నెంబర్: ✆ 86392 38081

కృష్ణా జిల్లా, జి.కొండూరు మండలం, హెచ్. ముత్యాలంపాడు గ్రామంలో 1.4 ఎకరాల భూమి అమ్మకానికి అందుబాటులో ఉంది. విజయవాడ వెస్ట్ బైపాస్ సమీపంలో, మైలవరం దగ్గర. సంప్రదించండి: ✆ 92901 51755

గుడివాడ దగ్గర్లో ముదినేపల్లి (మం) చిగురుకోట ONGS ప్రక్కన 1.50 ఎకరము వ్యవసాయ భూమి అమ్మబడును. పొలాలు కావలసిన వారు సంప్ర: ✆ 91774 36308.

TO LET

For Rent 3BHK Apt.1600 S.Ft., 2 attached bath, Parking & Security, Painted Renovated Likenew. Dornakal Road, VJA. ✆ 70752 10521

VJA, Gurunanak Colony: 3BHK (2650 Sq.Ft.) Flat, Modern amenities, Dining & Media rooms. Aikya Apart.: ✆ 70133 74171.

For Rent: 3BHK Flat; 1st Floor; 3 Bath; Car Parking Ramakrishna Towers; Prakasam Road; Suryaraopet; VJA. ✆ 98488 85657

కానూరు వృద్ధాశ్రమం రోడ్ శ్రీవాణి నిలయం 2nd ఫ్లోర్ 3 BHK, 1700 S.Ft., ఈస్ట్‌ఫేస్, కార్ పార్కింగ్ సౌ॥లతో అద్దెకు ఇవ్వబడును. ✆ 94401 32746.

VJA, గుణదల Ambitius ఇంటర్నేషనల్ స్కూల్ దగ్గర్లో APACE హిల్‌వ్యూ గేటెడ్ కమ్యూనిటీ నందు 2 విల్లాలు అన్ని సౌ॥తో అద్దెకుకలవు. 90112 99983

విజయవాడ, బృందావన్ కాలనీ, సింధు భవన్ రోడ్డులో, MG రోడ్డు దగ్గర కబోర్డ్స్‌తో ఉన్న 3BHK ఫ్లాట్ అద్దెకు కలదు. ✆ 90635 79566.

1200 Sft, SF-1, ఫస్ట్ ఫ్లోరు D.V.మానర్ వెనుక 2వ బిల్డింగు, టిక్కిల్ రోడ్, కమర్షియల్ స్పేస్ అద్దెకు కలదు. Cont ✆ 99852 95566.

న్యూ 3BHK తూర్పు ఫేసింగ్ (2500 Sft) 1st ఫ్లోర్, సెమీఫర్నిష్డ్, కారు పార్కింగ్‌తో అద్దెకు VJA, బందరురోడ్డు సిరీస్ కంపెనీ వెనుక, చౌదరిపేట ✆ 96666 04111, 93473 06486

3BHK 1920 Sq.Ft., at Sowbhagya Heights beside Metro Hospital. TV, A.Cs, Beds, Sofa, Dining Tables+ Chairs with all Amenities for Rent. ✆ 80082 91236

SHOP FOR RENT
Commercial Space (10 x 23 Sft. Shop) Available for Rent on Ground floor @ Funtimes Club Road, near to Gurunanak Nagar Main Road, Vijayawada.
*Rent: 20,000 / month
Cont. 77994 36666

2 Bed Room Independent House in Kowdapalli side Nagarjuna College for Rent. Ph: 99515 22999, 94418 87641.

3BHK Flat with ACs 4th Floor Krish Reviera Apt Ashram Rd, Opp: CSR Kalyana Mandapam, Tadepalli. Rent Only for Residence. ✆ 90520 19999

గుంటూరు-నల్లచెరువు బొమ్మల సెంటర్ దగ్గర, 8000అడుగుల గోడౌన్ మొత్తంగా కాని విడివిడిగా కాని అద్దెకు కలదు. Ph: 98663 15903, 98663 15913.

13000 S.Ft.
Commercial Building for Rent
at SRI RAMACHANDRA NAGAR, MAHANADU ROAD.
Ready for EDUCATIONAL INSTITUTIONS, Also Suitable for CORPORATES, HOSPITALS & HOTELS
✆ 97013 63535
95177 73456

ఆఫీస్ స్పేస్ అద్దెకు, ప్రైమ్ లొకేషన్, మాన్యవర్ షోరూం ఎదురుగా, ఎమ్.జీ. రోడ్, విజయవాడ. ఫోన్: 73307 17770.

IJM రెయిన్‌ట్రీపార్క్‌లో 5B/R లగ్జరి ట్రిప్లెక్స్ విల్లా అద్దెకు. విశాలమైన లేఔట్, ప్రైవేట్ టెర్రస్ 24x7 భద్రత, NH5, నంబూరు VJA-GNT హైవే. ✆ 77024 75525

COMMERCIAL

3,500S.ft Commercial Space 1st Floor for Rent. Suitable Bank, Office, Godown Seetharampuram, VJA. No Brokers ✆ 70958 84402.

VJA, భారతీనగర్ Novotel రోడ్డు, రోడ్ నెం-10B ప్లాటు నెం: 3 నందు 2BHK, 1BHK డ్యూప్లెక్స్ హౌస్ మొత్తముగా లేదా విడివిడిగా అద్దెకు. ✆ 92461 61717

గవర్నర్‌పేట గోపాలెడ్డిరోడ్ హోటల్ మమత వెనుక S/E కార్నర్‌లో GF: 1,000 S.Ft., FF: 500 S.Ft., వ్యాపార సంస్థలకు అనువైన కమర్షియల్ స్పేస్ అద్దెకు. ఓనర్స్. ✆ 76010 93961

1600 S.ft GF Plug & Play + 1600 S.ft FF Semi fur. Beside Prasanth Hos. MG Road, Labbipet. VJA. Con: 94401 80280, 85001 80280

హాస్టల్స్/హాస్పిటల్స్‌కు అనువైన 12 B/R విత్‌అటాచ్ బాత్‌రూమ్స్ 1&2 ఫ్లోర్లు అద్దెకు, చుట్టుగుంట సెంటర్ సిగ్నల్స్ దగ్గర, ఏలూరురోడ్, విజయవాడ. ✆ 94905 11849.

గవర్నర్‌పేట చెరుకుపల్లివారి వీధిలో Ist ఫ్లోర్-3500, 2nd ఫ్లోర్ 3,500 & సెల్లార్ 2000 S.Ft. కమర్షియల్ స్పేస్ అద్దెకు. 82477 04069, 70931 77429

బందరురోడ్, పశువుల హాస్పిటల్ రోడ్‌లో (గ్రౌండ్ + 4 ఫ్లోర్స్) 5 ఫ్లోర్స్ కమర్షియల్ కాంప్లెక్ హోటల్స్, బ్యాంక్స్, ఆఫీస్‌లకు, C&Fలకు అద్దెకు (సెల్లార్ పార్కింగ్‌తో). ✆ 93962 21024

MORE CLASSIFIEDS ON PAGES 13

విజయవాడ - మచిలీపట్నం హైవేలో గండిగుంట నందు డైరెక్ట్ సర్వీస్ రోడ్డును ఆనుకొని మాచే అభివృద్ధి చేయబడుతున్న ప్రతిష్ఠాత్మమైన ప్రాజెక్ట్...
CRDA GATED COMMUNITY PROPOSED LAYOUT
M.R'S Arcadia
@ GANDIGUNTA, Kankipadu Zone
ఓపెన్ ప్లాట్స్ - ఇండిపెండెంట్ హౌస్‌స్ - విల్లాస్
BANK LOAN FACILITY AVAILABLE
M.R. ESTATES & PROJECTS PVT.LTD.
ఫస్ట్ ఫ్లోర్, నవమల్లిక బిల్డింగ్, టీచర్స్ కాలనీ, 5వ లైను, ఫన్‌టైమ్ క్లబ్ ప్రక్కన, విజయవాడ.
✆ 98499 58449 / 70950 59166

ప్రగతి బాగు.. సంక్షేమం కొనసాగు

ఈనాడు, అమరావతి – ఈనాడు డిజిటల్, మచిలీపట్నం





ఉమ్మడి కృష్ణా పురోగతికి తోడ్పాటునిచ్చేలా.. ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర బడ్జెట్‌లో పుష్కల కేటాయింపులు జరిగాయి. ప్రధానంగా.. మచిలీపట్నం పోర్టుకు రూ.150 కోట్లు, గన్నవరం విమానాశ్రయానికి రూ.30 కోట్లు, విజయవాడ మెట్రో, కృష్ణా విశ్వవిద్యాలయానికి ప్రత్యేక కేటాయింపులు చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, అనుబంధ రంగాలకు పెద్దఎత్తున ప్రాధాన్యం ఇచ్చారు. రాజధాని నిర్మాణానికి కూడా రూ.6 వేల కోట్లు కేటాయించారు. తల్లికి వందనం, దీపం, అన్నదాత సుఖీభవ పథకాలకు భారీగా నిధులు కేటాయించడం ద్వారా.. సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఈ పథకాల కింద లక్షల మందికి లబ్ధి చేకూరబోతోంది. నగర, పుర పాలికల్లో.. ప్రస్తుత ప్రాజెక్టుల మరింత వేగవంతానికి నిధులు కేటాయించారు. ప్రధానంగా జల్ జీవన్ మిషన్ పథకాలకు.. రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్ కేటాయించడంతో.. కొంతకాలంగా నిలిచిన పథకాలు గాడిన పడబోతున్నాయి.

దుర్గమ్మ దీవెనలతో.. రాష్ట్ర అభివృద్ధి కోసం రూపొందించిన బడ్జెట్ ప్రతులను శనివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఉంచి అధికారులు ప్రత్యేక పూజలు చేయించారు. రాష్ట్ర ఉన్నత అధికారులు బడ్జెట్ ప్రతులను తేగా.. ఈవో శీనా నాయక్, స్థానాచార్య శివప్రసాదశర్మ స్వాగతం పలికారు. అమ్మ సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజ చేయించారు. - ఇంద్రకీలాద్రి



బడ్జెట్ ప్రతులకు పూజ చేయిస్తున్న ప్రభుత్వ ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, అధికారులు గౌతమ్ అల్లాడ, సూరజ్ గనోరే

రైతుకు తోడు.. ప్రగతికి చేదోడు..

★ **అన్నదాత సుఖీభవ:** ఏటా రూ.20 వేలు చొప్పున ఒక్కో రైతు కుటుంబానికి ప్రభుత్వం సాయం చేయనుంది. ఉమ్మడి జిల్లాలో 2.62 లక్షల మంది రైతులకు ఏటా లబ్ధి చేకూరనుంది.

★ **సేంద్రియ వెలుగు:** ఉమ్మడి జిల్లాలో 1.23 లక్షల ఎకరాలను సేంద్రియ సాగులోకి మార్చడానికి నిధులు సమకూరనున్నాయి. 1.5 లక్షల మంది రైతులను సేంద్రియ సాగుపథాన నడిపిస్తారు. బయో రిసోర్స్ సెంటర్ల ద్వారా ఎరువులు, కషాయాలు సమకూర్చనున్నారు. 200 సెంటర్ల నిర్మాణానికి.. సెంటర్‌కు రూ.లక్ష చొప్పున అందిస్తున్నారు.



★ **అధునాతన రైతుబజారు:** ఉమ్మడి కృష్ణాలో 26 రైతుబజార్లు ఉండగా విజయవాడలో అత్యాధునిక హంగులతో రైతు బజారు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు రూ.6 కోట్లు కేటాయిస్తున్నారు. ఇందులో శీతల గిడ్డంగులు సమకూర్చి, డిజిటల్ యాప్‌ల ద్వారా లావాదేవీలు కల్పిస్తారు.

★ **పాడికి వైభవం:** ఉమ్మడి జిల్లాలో పాడి పరిశ్రమ ప్రగతికి 9 పశువుల వసతి గృహాల ఏర్పాటు.. ఒక్కో నిర్మాణానికి రూ.10 లక్షలు ఇస్తారు. పశుగ్రాసం భద్రతకు రూ.1.69 కోట్లు వెచ్చించనున్నారు. 28 ఆసుపత్రులు కొత్తగా నిర్మిస్తారు.. 52 ఆసుపత్రులకు మరమ్మతులు చేస్తారు. షెడ్యూల్డ్ కులాల వారికి 3,500 గోకులాలు సమకూర్చనున్నారు. 1.52 లక్షల మంది పాడి రైతులు ఉండగా వారికి రూ.86 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

★ **సాంకేతిక తోడు:** రైతులకు అద్దె ప్రాతిపదికన డ్రోన్లు సరఫరా చేసేందుకు రూ.11 కోట్లతో 87 కిసాన్ డ్రోన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. విత్తన రాయితీ కింద జిల్లాకు రూ.13 కోట్లు కేటాయించారు.

అపురూప దారులు..

★ గుంతలు పడి అధ్వానంగా ఉన్న 170 రహదారుల మరమ్మతులు, పునర్నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లాకు రూ.750 కోట్ల మేర నిధులు వచ్చే వీలుంది. దశల వారీగా దారులను బాగు చేస్తున్నారు. ఇంకా జిల్లాలో కొన్ని దారులు అధ్వానంగా ఉన్నాయి. తాజా నిధులతో సమస్య తీరనుంది.

కొత్త అన్న క్యాంటీన్లు రానున్నాయ్..



ప్రతి నియోజకవర్గంలోనూ అన్న క్యాంటీన్లు పెట్టాలని తాజాగా బడ్జెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి కృష్ణాలో నాలుగు నియోజకవర్గాల్లో ప్రస్తుతం అన్న క్యాంటీన్లు లేవు. తాజా నిర్ణయంతో ఇక్కడ కూడా కొత్తగా రానున్నాయి. మైలవరంలో అన్న క్యాంటీన్ లేదు. గన్నవరం, పామర్రు, అవనిగడ్డల్లో అన్న క్యాంటీన్లు లేవు. పామర్రు, అవనిగడ్డల్లో భవనాలు నిర్మాణంలో ఉన్నాయి.

దీపం.. దేదీప్యం

ఉమ్మడి జిల్లాలో దీపం పథకం ద్వారా దాదాపు 10 లక్షల మందికి రాయితీ రానుంది. ఒక్కో లబ్ధిదారుడు ఏడాదికి 3 సిలిండర్ల చొప్పున రూ.2,700 లబ్ధి చేకూరుతుంది. దీంతోపాటు పౌరసరఫరాల శాఖ ప్రగతి, బియ్యం, పంచదార రాయితీ కోసం రూ.250 కోట్లు కేటాయించారు.



సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా బడ్జెట్..



సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. మౌలిక సదుపాయాల ఏర్పాటు, అభివృద్ధి, ఎంటర్‌ప్రైజ్ బలోపేతం, ప్రాంతీయ ఆర్థిక సమూహాల ద్వారా పరిశ్రమల ఏర్పాటు ఉపయుక్తమవుతుంది. విశాఖపట్నం ఆర్థిక ప్రాంతం కోసం రూ.28 వేల కోట్లు కేటాయించడంతో ఉత్తరాంధ్ర పారిశ్రామిక, ఐటీ, సేవల వృద్ధి కారిడార్ ఏర్పడుతుంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన బడ్జెట్ ఇది. మరింతగా ఉద్యోగ, ఉపాధి కల్పనకు వీలవుతుంది. - మురళీకృష్ణ గన్నమణి, సీఐఐ ఏపీ ఛైర్మన్

జలవనరులకు... నిధుల పరవళ్లు!

కృష్ణా డెల్టాకు రూ.986.2 కోట్లు

కృష్ణా డెల్టా... ప్రగతి పరవళ్లు తొక్కనుంది. కూటమి సర్కారు తాజా బడ్జెట్‌లో రూ.986.2 కోట్ల కేటాయింపులతో సముచిత ప్రాధాన్యమిచ్చింది.

చింతలపూడికి రూ.430 కోట్లు...

★ 4.8 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని వైకాపా సర్కారు గాలికొదిలేయగా కూటమి సర్కారు భుజానికెత్తుకుంది. తాజా కేటాయింపుల్లో ప్రధాన కాలువ, బ్రాంచి కాలువల తవ్వకం, భూసేకరణకు రూ.430 కోట్లు కేటాయించింది. నిరుడు రూ.150 కోట్లు మాత్రమే ఇవ్వగా ఈసారి కేటాయింపులు భారీగా పెంచారు. ★ ప్రధాన కాలువ తవ్వకానికి 912 ఎకరాలు సేకరించాలి. తాజాగా రూ.30 కోట్లు భూసేకరణకు ఉపయోగిస్తారు. దీంతో ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఊరట లభిస్తుంది. ఇంకా బ్రాంచి, ప్రధాన కాలువల్లో భూసేకరణకు రూ.120 కోట్లు అవసరం. ★ 106 కిమీ మేర ప్రధాన కాలువ, బ్రాంచి కాలువల తవ్వకాలకు రూ.400 కోట్లు ఉపయోగించనున్నారు. చింతలపూడి పూర్తయితే 2.8 లక్షల ఆయకట్టు స్థిరీకరిస్తూనే.. 2 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించవచ్చు.

బందరు పోర్టుకు రూ.150 కోట్లు..



★ బందరు పోర్టుకు గత బడ్జెట్‌లో మాదిరే.. ఈసారి కూడా రూ.150 కోట్లను కేటాయించారు. ★ ఈ ఏడాది చివరకు నాలుగు బెర్తులతో మచిలీపట్నం ఓడరేవు నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మాణ సంస్థను ఆదేశించారు. ★ 35 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణా సామర్థ్యం కల్పించేలా నిర్మిస్తున్న పోర్టు పనులు 50 శాతం పూర్తయ్యాయి. ★ బెర్తుల నిర్మాణం, అంతర్గత రోడ్లు, బ్రేక్ వాటర్, గోదాములు, రహదారులు, రైలు మార్గం, భవనాలు, డ్రెడ్జింగ్ పనులు జరుగుతున్నాయి. ★ పోర్టు నిర్మాణం పూర్తయితే పెద్ద ఎత్తున అనుబంధ పరిశ్రమలు రానున్నాయి. ★ ఇప్పటికే నౌకల నిర్మాణం, మరమ్మతులకు పచ్చజెండా ఊపారు. ★ ఫర్నిచర్ తయారీ తదితర పరిశ్రమలకు ఎంవోయూలు చేసుకోనున్నారు. ★ అన్నీ కార్యరూపం దాలిస్తే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరిగి ఈ ప్రాంత రూపు మారనుంది.

వైద్య సేవలకు భరోసా..



వైద్య ఆరోగ్యానికి రూ.19,306 కోట్లు కేటాయించడంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు మెరగవనున్నాయి. విజయవాడ కొత్త, పాత ప్రభుత్వ ఆసుపత్రులు, మచిలీపట్నం జిల్లా ఆసుపత్రి, గుడివాడ, తిరువూరు ఏరియా ఆసుపత్రుల్లో తరచూ మందుల కొరత వేధిస్తోంది. ఉమ్మడి కృష్ణాలో 50 లక్షల మందిపైగా జనాభా ఉండగా...11 లక్షల మందికి పైగా తెల్లరేషన్ కార్డుల కుటుంబాలు ఉన్నాయి. వీరిలో ఎక్కువ మంది వైద్యానికి సర్కారు ఆసుపత్రులే ఆధారం. రూ.2.5 లక్షల బీమాకు 11 లక్షల మందీ అర్హులే.

4 లక్షల మంది తల్లులకు లబ్ధి..

ఉమ్మడి కృష్ణాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 4,500 ఉండగా.. ఆరు లక్షల మంది విద్యార్థులు, ఇంటర్ రెండేళ్లు కలిపి 1.20 లక్షల మంది చదువుతున్నారు. తల్లికి వందనం పథకానికి రూ.9,668 కోట్లు కేటాయించడంతో.. ఉమ్మడి జిల్లాలో 4 లక్షల మందికి పైగా తల్లులకు.. ఒక్కొక్కరికి ఏటా రూ.13 వేలు జమకానున్నాయి.



ఆర్అండ్ఆర్‌కి రూ.30 కోట్లు..



గన్నవరం విమానాశ్రయం విస్తరణలో ఇళ్లను కోల్పోయిన 423 మందికి... దావాజీగూడెం, అల్లాపురం, బుద్ధవరం, అజ్జంపూడివాసులకు.. పునరావాస ప్యాకేజీ కోసం రూ.30 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లోనూ వీరికి రూ.29.99 కోట్లను కేటాయించారు. చినఅవుటపల్లి రెవెన్యూలో ఇప్పటికే స్థలాలను కేటాయించి రిజిస్ట్రేషన్లు చేశారు. ఆ స్థలాల్లో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇళ్లను నిర్మిస్తామనే హామీ మేరకు నిధులను కేటాయించారు.

ఇంటి కల.. నెరవేరునిలా...

ఉమ్మడి కృష్ణాలో గృహకల్పకు దాదాపు రూ.450 కోట్లతో పనులు చేపట్టనున్నారు. 1,30,536 గృహాలు మంజూరు చేయగా.. 59,847 పూర్తయ్యాయి. ఇంకా 70,689 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఐదు వేలకు పైగా పునాదులు కూడా వేయలేదు. గృహ నిర్మాణ శాఖకు బడ్జెట్ కేటాయింపులతో పెండింగ్ బిల్లులు, వివిధ దశల్లో నిర్మాణాలు.. కొత్తగా కట్టుకునేవారికి లబ్ధి చేకూరనుంది.

కృష్ణా విశ్వవిద్యాలయానికి రూ.10.54 కోట్లు కేటాయించారు.

మరిన్ని అభివృద్ధి పనులు..




★ కృష్ణా డెల్టా పరిధిలో మరిన్ని ప్రగతి పనులకు రూ.300 కోట్లు ఇచ్చారు. నిరుడు రూ.250 కోట్లు ఇవ్వగా.. ఈసారి రూ.50 కోట్లు పెంచారు. ★ అత్యధికంగా ఉమ్మడి కృష్ణాలో 6.79 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. బందరు, కేఈబీ, ఏలూరు, రైవస్ కాలువలు న్నాయి. వీటి అభివృద్ధి, పూడికతీతకు నిధులు వినియోగిస్తారు. ★ కృష్ణా నది రెండు కరకట్టల బలోపేతానికి నిధులు కేటాయించారు. నిత్యం బస్సులు, వాహనాలు తిరిగి చాలాచోట్ల కుంగిపోవడం, గండ్లు పడేందుకు వీలున్న ప్రాంతాలను అభివృద్ధి చేస్తారు. ★ మెట్ట భూములకు ప్రాణాధారమైన వేదాద్రి ఎత్తిపోతలకు రూ.15 కోట్ల మేర కేటాయించే వీలుంది. ★ ముక్త్యాల ఎత్తిపోతలకూ నిధులు కేటాయించగా కొద్ది రోజుల్లో నిర్మాణం పట్టాలెక్కే వీలుంది. ★ అవనిగడ్డ పరిధిలో డ్రెయిన్లు సముద్రంలో కలిసేచోట 8 ఔట్‌ఫాల్ స్లూయిజ్‌లు మరమ్మతులకు గురవగా.. కొత్త స్లూయిజ్‌ల నిర్మాణానికి నిధులు కేటాయించారు.

పోలీసు భవనాలకు నిధులు...

ఎన్టీఆర్ కమిషనరేట్, కృష్ణా పోలీసు యూనిట్లకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. వన్‌టౌన్‌లో భవన నిర్మాణానికి, కంకిపాడు స్టేషన్ నిర్మాణానికి రూ.3 కోట్లు ఇచ్చారు. నిధుల కొరతతో కంకిపాడు స్టేషన్ పనులు నత్తలా సాగుతున్నాయి. ఖర్చులు, జీతాల కోసం రూ.35 కోట్లు కేటాయించారు. గన్నవరం సర్కిల్ ఆత్కూరులో నిర్మాణంలో ఉన్న మోడల్ స్టేషన్ పనులు చివరి దశలో ఉండగా బిల్లులు రావాల్సి ఉంది. తాజా నిధులతో ఇవన్నీ కొలిక్కి రానున్నాయి.

ఠాణాలకు వాహన యోగం



బడ్జెట్‌లో పోలీసులకు వాహనాల కొనుగోలుకు నిధులు కేటాయించారు. ఎన్టీఆర్ కమిషనరేట్, కృష్ణా పోలీసు పరిధిలో స్టేషన్లకు త్వరలో కొత్త వాహనాలు రానున్నాయి. ప్రతి స్టేషన్‌కు, ప్రతి సర్కిల్, సబ్‌డివిజన్‌కు ఒక్కో వాహనం ఇవ్వనున్నారు. వీటితోపాటు గస్తీ, నేర నియంత్రణకు ద్విచక్ర వాహనాలూ భారీగా రానున్నాయి. ఈగల్, సైబర్ స్టేషన్లకూ వాహనాలు కేటాయించనుండటంతో గస్తీ మెరుగవనుంది.

ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి

ఏపీ-ఎస్ఆర్ఎం ఛాన్సలర్ డా. టీఆర్ పారివేందర్



కేంద్ర మంత్రి అర్జున్‌రామ్‌మేఘవాల్‌ను సత్కరిస్తున్న ఛాన్సలర్ డా.టీఆర్ పారివేందర్, ప్రతినిధులు

తుళ్లూరు న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు దార్శనికతతో అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నారని ఎస్ఆర్ఎం వర్సిటీ వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ డా. టి.ఆర్. పారివేందర్ పేర్కొన్నారు. శనివారం అమరావతిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన ప్రత్యేక స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్ల కిందట సీఎం చంద్రబాబు చొరవతో అమరావతిలో ప్రారంభమైన వర్సిటీ గ్రీన్ హైడ్రోజన్ తయారీ, అమరావతి క్వాంటమ్ వ్యాలీ నిర్మాణంలో ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం గర్వకారణమన్నారు. ప్రోవీసీ డా.పి.సత్యనారాయణ్ మాట్లాడుతూ త్వరలో డిఫెన్స్ ఇంజినీరింగ్ కోర్సును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. తొలుత ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి అర్జున్‌రామ్‌మేఘవాల్‌ను వర్సిటీ యాజమాన్యం జ్ఞాపికతో సత్కరించింది. పీహెచ్‌డీ పట్టాలు అందుకున్న వారి అభిప్రాయాలు ఇలా.

ఆనందంగా ఉంది



నేను హైపర్ స్పెక్ట్రల్ అండర్ వాటర్ డిటెక్షన్ సాంకేతికతపై పరిశోధన చేశాను. నాలుగేళ్లు కష్టపడి పీహెచ్‌డీ పట్టా అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. -ఎ.సురేష్, మందడం

క్వాంటమ్ కంప్యూటర్స్‌లో పరిశోధనలు చేస్తా



సీఎస్‌ఈ విభాగంలో 'కనెక్టెడ్ ఎండ్ టు ఎండ్ కాంప్లెక్స్ డేటా హైపర్ నెట్‌వర్క్స్'పై పరిశోధనకు పీహెచ్‌డీ లభించింది. విజయవాడ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం లభించింది. క్వాంటమ్ కంప్యూటర్స్‌లో పరిశోధనలు చేస్తాను. -వై.వెంకట నందిని, యలమర్రు, కృష్ణాజిల్లా

బాడీ బిల్డింగ్ జట్టు ఎంపిక నేడు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్, ఫిట్‌నెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన అజిత్‌సింగ్‌నగర్‌లోని మనోహర్ జిమ్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు బి.మనోహర్, కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. ఎంపిక పోటీలో పాల్గొనే ఆసక్తిగల బిల్డర్లు ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23వ తేదీన విశాఖలో జరిగే మిస్టర్ ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడతారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 86867 71358, 97036 67553 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కశ్మీర్ లోయ.. వైష్ణోదేవి యాత్రకు ప్రత్యేక రైళ్లు

విజయవాడ(రైల్వేస్టేషన్), విజయవాడ సిటీ: కశ్మీర్ లోయతో పాటు వైష్ణో దేవి పుణ్యక్షేత్రాన్ని దర్శించాలనుకునే భక్తుల సౌకర్యార్థం ఏప్రిల్ 11వ తేదీన భారత్ గౌరవ్ రైలు పేరుతో ప్రత్యేక పర్యాటక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ఈ రైళ్లు పెనుకొండ, ధర్మవరం, అనంతపురం, గుత్తి, కర్నూలు, గద్వాల్, మహబూబ్‌నగర్, సికింద్రాబాద్ నుంచి నడుస్తుందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం 33 శాతం రాయితీ కల్పిస్తోందన్నారు. టికెట్ల బుకింగ్ కోసం నేరుగా ఫోన్ నంబర్ 93550 21516లో సంప్రదించాలని లేదా ఆన్‌లైన్‌లో www.tourtimes.in ద్వారా బుక్ చేయవచ్చన్నారు. కశ్మీర్ యాత్రలో భాగంగా ఆగ్రా, మధుర, శ్రీనగర్, అమృత్‌సర్, దిల్లీ ప్రాంతాలను సందర్శించవచ్చన్నారు. 13 రోజుల ఈ యాత్రకు ఒక్కొక్కరికి టికెట్ ధర స్లీపర్‌లో రూ.42,400, థర్డ్ ఏసీలో రూ.54,000, సెకండ్ ఏసీలో రూ.61,000, ఫస్ట్ ఏసీలో రూ.68,200 ఉంటుందన్నారు. వైష్ణోదేవి యాత్రలో ఆగ్రా, మధుర, హరిద్వార్, రిషికేష్, కురుక్షేత్ర, వైష్ణోదేవి, అమృత్‌సర్, దిల్లీలను సందర్శించవచ్చని 13 రోజుల ఈ యాత్రకు స్లీపర్ తరగతిలో రూ.36,800, ఫస్ట్ ఏసీలో రూ.65,700, సెకండ్ ఏసీ లో రూ.54,300, థర్డ్ ఏసీలో రూ.48,700 ఉంటుందన్నారు. సౌత్ స్టార్ రైల్ ప్రొడక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ పర్యాటక రైలు 2,97,130 కి.మీ ప్రయాణించిందని ఈ రైల్లో అపరిమిత దక్షిణ భారత భోజనం అందిస్తున్నట్లు తెలిపారు.

జిల్.. జిల్.. జిలేబీ!

తియ్యతియ్యటి జిలేబీ ఇష్టపడని వాళ్లు ఉండరు కదూ! దీన్ని గుజరాత్, బెంగాల్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా.. ఇలా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా చేస్తారు. మీ కోసం కొన్ని స్పెషల్ జిలేబీ రెసిపీలు...



ఆలూతో



కావలసినవి

బంగాళదుంపలు - 2, పంచదార - 2 కప్పులు, శనగపిండి - 200 గ్రాములు, పెరుగు - అర కప్పు, ఫ్రూట్ సాల్ట్ - పావు స్పూన్, కుంకుమపువ్వు - కొద్దిగా, యాలకుల పొడి - పావు స్పూన్, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ

పంచదారలో 2 కప్పుల నీళ్లు, కుంకుమపువ్వు, యాలకుల పొడి వేసి ఆరేడు నిమిషాలు మరిగించాలి. కాస్త చిక్కగా అయ్యాక సెగ తీసేయాలి. బంగాళదుంపలను ఉడికించి పొట్టు తీసి మెత్తగా మెదపాలి. అందులో శనగపిండి, పెరుగు, ఫ్రూట్ సాల్ట్ వేసి కలపాలి. చిన్న రంధ్రం చేసిన పల్చని వస్త్రంలోకి ఈ పిండిని కొంత తీసుకుని.. కాగుతున్న నూనెలో చుట్టలుగా వేయాలి. బంగారు రంగులోకి మారాక.. వాటిని పంచదార పాకంలో వేసి.. రెండు నిమిషాలుంచి తీసేయాలి. తక్కిన పిండితోనూ ఇలాగే చేయాలి.

బెల్లం జిలేబీ



కావలసినవి

బెల్లం - కప్పున్నర, నిమ్మరసం - అర స్పూన్, మైదా - కప్పు, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్ - అర స్పూన్ చొప్పున, నెయ్యి - 2 స్పూన్లు

తయారీ

బెల్లంలో కప్పున్నర నీళ్లు పోసి మరిగించాలి. మరీ చిక్కబడకుండా దించేయాలి. దాన్ని వడకట్టి, నిమ్మరసం కలిపి పక్కనుంచాలి. మైదాలో ముప్పావు కప్పు నీళ్లు, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్, నెయ్యి జతచేసి ఉండలు కట్టకుండా కలపాలి. ఈ మిశ్రమాన్ని సీసాలో వేసి.. మూతకు చిన్న రంధ్రం చేయాలి. కాగుతున్న నూనెలోకి జిలేబీలుగా ఒత్తుకోవాలి. రెండు వైపులా వేగాక..బెల్లం పాకంలోకి తీసి.. వెంటనే మరో పాత్రలోకి మార్చేయాలి. అంతే.. 'బెల్లం జిలేబీ' తయారైపోతుంది.

ఖోయాతో

కావలసినవి- పంచదార - ఒకటిన్నర కప్పులు, ఖోయా - 250 గ్రాములు, మొక్కజొన్న పిండి - 100 గ్రాములు, యాలకుల పొడి - చిటికెడు, పాలు - అర కప్పు, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ

పంచదారలో ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి మరిగించి సిరప్ చేసి ఉంచాలి. ఖోయాలో మొక్కజొన్న పిండి, పాలు చేర్చి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని కొంత చొప్పున చిన్న రంధ్రం చేసిన వస్త్రంలోకి తీసి.. కాగుతున్న నూనెలో జిలేబీలుగా వేయాలి. చక్కగా వేగాక.. వాటిని పంచదార పాకంలోకి తీయాలి. తక్కిన పిండితోనూ ఇలాగే చేయాలి.

ఇమర్తీ



కావలసినవి

మినప్పప్పు - ఒక కప్పు, మొక్కజొన్న పిండి - 4 టేబుల్ స్పూన్లు, ఉప్పు - చిటికెడు, నారింజ లేదా పసుపు రంగు ఫుడ్ కలర్ - 2 చుక్కలు, పంచదార - 2 కప్పులు, కుంకుమ పువ్వు - కొన్ని రేకలు, యాలకుల పొడి - పావు స్పూన్, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ

మినప్పప్పును మూడు గంటలు నానబెట్టి, ఆ నీళ్లు వంచేయాలి. అందులో కొన్ని నీళ్లు, ఉప్పు చేర్చి మెత్తగా గ్రైండ్ చేయాలి. పంచదారలో అంతే పరిమాణంలో నీళ్లు పోసి వేడి చేయాలి. అందులో కుంకుమపువ్వు, యాలకుల పొడి జతచేసి.. చిక్కగా అయ్యాక సెగ తీసేయాలి. కాస్త పిండిని పేస్ట్రీ బ్యాగ్‌లోకి తీసి.. కాగుతున్న నూనెలో ఒత్తుకోవాలి. రెండు వైపులా వేగనిచ్చి.. పంచదార సిరప్‌లోకి తీయాలి. అవి కాస్త నానిన తర్వాత మరో పాత్రలోకి మారిస్తే సరిపోతుంది. చక్కటి ఆకృతి వచ్చేందుకు ఒక వృత్తంలా తిప్పి.. దాని మీద వరుసగా చిన్న చిన్న సర్కిల్స్ వచ్చేలా మెలికలు తిప్పాలి. నూనె బాగా కాగితేనే జిలేబీలు చక్కగా వేగుతాయి. కడాయిలో మరీ కిక్కిరిసినట్లు వేయకూడదు.

పనీర్‌తో



కావలసినవి

మైదా - కప్పు, పనీర్ - 200 గ్రాములు, పెరుగు - పావు కప్పు, యాలకుల పొడి - అర స్పూన్, పంచదార - కప్పు, నూనె - వేయించడానికి సరిపడా, కుంకుమపువ్వు - కొద్దిగా, రోజ్ వాటర్ - అర స్పూన్

తయారీ

పంచదారలో కుంకుమపువ్వు, తగినన్ని నీళ్లు చేర్చి మరిగించి సిరప్ చేసుకోవాలి. వెడల్పాటి పాత్రలో తురిమిన పనీర్, మైదా, పెరుగు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కాస్త కాస్తగా కోన్‌లోకి తీసి.. కాగుతున్న నూనెలో చిన్న చుట్టలుగా వేయాలి. రెండు వైపులా కాలాక.. పంచదార పాకంలోకి తీయాలి. ఒకట్రెండు నిమిషాలు నానిన తర్వాత మరో పాత్రలోకి మార్చాలి. అంతే.. నోరూరించే 'పనీర్ జిలేబీ' సిద్ధమైపోతుంది.

రబ్డీ జిలేబీ



కావలసినవి చిక్కటి పాలు - లీటర్, పంచదార - 75 గ్రాములు, మొక్కజొన్న పిండి - 2 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి - అర స్పూన్, పిస్తా పప్పులు - 2 టేబుల్ స్పూన్లు, కుంకుమపువ్వు - కాస్త, మైదా - ముప్పావు కప్పు, మినప్పప్పు - పావు కప్పు, ఉప్పు - తగినంత, పెరుగు - అర కప్పు, ఫుడ్ కలర్ - 2 చుక్కలు, బేకింగ్ సోడా - చిటికెడు, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ పాలు పొంగు వచ్చిన తర్వాత సెగ తగ్గించి మరిగించాలి. నాలుగు టేబుల్ స్పూన్ల పాలు చిన్న పాత్రలోకి తీసి.. అందులో మొక్కజొన్నపిండి వేసి.. ఉండలు కట్టకుండా కలిపి పాలలో చేర్చాలి. పంచదార, సగం కుంకుమపువ్వు, యాలకుల పొడి, పిస్తా పప్పులు కూడా జతచేసి తెర్లనివ్వాలి. పాలు దాదాపు పావు శాతం అయ్యాక సెగ తీసేయాలి. చల్లారాక రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. పంచదారలో మిగిలిన కుంకుమపువ్వు, యాలకుల పొడి, ముప్పావు కప్పు నీళ్లు పోసి మరిగించి సిరప్ చేసి పక్కనుంచాలి. మూడు గంటలు నానబెట్టిన మినప్పప్పులో ఉప్పు చేర్చి గ్రైండ్ చేయాలి. అందులో పెరుగు, ఫుడ్ కలర్, బేకింగ్ సోడా జతచేయాలి. ఈ మిశ్రమాన్ని పైపింగ్ బ్యాగ్‌లో వేసి.. కాగుతున్న నూనెలో చుట్టలుగా ఒత్తుకోవాలి. బంగారు రంగులోకి మారాక.. షుగర్ సిరప్‌లో వేసి.. కొన్ని క్షణాలుంచి తీసేయాలి. ఇక వేడివేడి జిలేబీలు చల్లటి రబ్డీతో వహ్వా అనిపిస్తాయి.



సొరకాయ వడలు.. తింటే వదలరు!

పాఠకవంట

వడలు చాలామంది చాలా రకాలుగా చేస్తారు. నేను సొరకాయతో చేసే వడలు మా వాళ్లందరికీ చాలా ఇష్టం. ఇవి రుచిగానూ ఉంటాయి, ఆరోగ్యం కూడా. అందుకే మీతో పంచుకుంటున్నాను.

ఈ వడల కోసం.. సొరకాయ - అర కిలో, బియ్యప్పిండి - అర కప్పు, శనగపిండి - 3 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, పెరుగు - కప్పు, బరకగా దంచిన పల్లీలు - 3 టేబుల్ స్పూన్లు, నువ్వులు - 4 టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి - 2, అల్లం - అంగుళం ముక్క, జీలకర్ర - స్పూన్, కొత్తిమీర, పాలకూర తరుగు - గుప్పెడు చొప్పున, వాము - పావు స్పూన్, నూనె వేయించడానికి సరిపడా తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. అల్లం, పచ్చిమిర్చిలను కచ్చాపచ్చా దంచాలి. సొరకాయ చెక్కు తీసి, తురమాలి. అందులో బియ్యప్పిండి, పాలకూర, కొత్తిమీర తరుగు, అల్లం, పచ్చిమిర్చి, ఉప్పు, పల్లీలు, నువ్వులు, శనగపిండి, జీలకర్ర, వాము, పెరుగు వేసి బాగా కలపాలి. అవసరమైతే రెండు మూడు స్పూన్ల నీళ్లు జోడించవచ్చు. ఈ మిశ్రమంతో అరచేతిలో అప్పాలు చేసి.. కాగుతున్న నూనెలో బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. అంతే.. అద్దిరిపోయే సొరకాయ వడలు సిద్ధమైపోతాయి. నచ్చితే ఒకసారి చేసి చూడండి. సాయంత్రం చిరుతిండిగా సూపర్‌గా ఉంటాయి. ముఖ్యంగా పిల్లలు ఇంకా ఇంకా కావాలంటారు.



– సి. అశ్వని, హైదరాబాద్

కిచెన్ ల్యాబ్‌లో.. కాకరకాయలు!



బ్యాచిలర్స్ కిచెన్

చిన్నప్పటి నుంచి హాస్టల్లో చదవడం వల్ల నాకు వంట రాదు. ఆ సంవత్సరం సెలవుల్లో వంట నేర్చుకోవాల్సిందే అని నాన్న వార్నింగిచ్చేశారు. ఇక అప్పటి నుంచి అమ్మ వంట చేస్తుంటే అక్కడికేదో థ్రిల్లర్ సినిమా చూస్తున్నంత శ్రద్ధగా చూస్తున్నా. ఒకరోజు అమ్మ అత్యవసరంగా అమ్మమ్మ దగ్గరికెళ్తూ కూర నన్నే చేయమంది. గరిట తిప్పడమే రాని నా చేతుల్లో బండరాయి పెట్టినట్టయ్యింది. ఇంకేం చేస్తాను.. కడాయిలో నూనె పోసి, గుప్పెడు పోపుగింజలు గుమ్మరించి మూత పెట్టేశా.. ఆవాలు చిటపటమంటూ చిందులేస్తే ముఖాన పడ్తాయని. తాలింపు దిగ్విజయంగా పూర్తవగానే కాకరగాయ ముక్కలు వేసి మళ్లీ మూత పెట్టేశా. నిమిషానికోసారి మూత తీసి, ఎడాపెడా కలిపేస్తున్నా. కానీ ఈలోగా ఎన్నిసార్లు చెయ్యి కాలిందో లెక్కలేదు. ఒక పాతికసార్లు మూత తీయడం, కలపడం అయ్యాక.. కారం, ఉప్పు, పసుపు వేశా. ఈలోగా కరెంట్ పోయింది. వంటింట్లోకి అంతగా వెల్తురు రాదు. మళ్లీ మూతపెడితే చీకట్లో తీయలేనని.. ఒక కూనిరాగం తీయడం, ఒకసారి కలపడం చొప్పున ఐదారు నిమిషాలు కుకింగ్ విత్ సాంగ్స్ కార్యక్రమం ముగించి స్టవ్వు కట్టేశా. నాన్న రాగానే హుషారుగా అన్నం, కూర వడ్డించా. తీరా నల్లగా మాడిన ముక్కలు చూసి.. బెదిరిపోయా. నాన్న విసుక్కోడానికి బదులు 'బొగ్గుల్ని వేయించావా ఏంటి?' అని నవ్వడమే కాదు.. అంత మాడినా గమ్మున తినేశారు. అమ్మ వచ్చాక.. 'ఇన్ని ముక్కలకి కప్పు నూనె పోయాలి. గుళ్లో తీర్థం తీసుకున్నట్టు కాస్తంత వేస్తే ఎలా సరిపోతుంది? అందుకే మాడిపోయాయి' అంది. 'కానీ మంచి వాసనే వచ్చిందమ్మా' అని నేను నసిగితే.. 'అది నీ ముక్కు సమస్య' అనేసింది అమ్మ. అదీ కిచెన్ ల్యాబ్‌లో నా ఫస్ట్ ఎక్స్‌పరిమెంట్.

– ఊటుకూరి నందిని, హైదరాబాద్

ఐరన్ తక్కువైతే.. కష్టమే!

ఆహారం ఆరోగ్యం



మన ఒంట్లో ఐరన్ తగినంత ఉండాలి. లేకుంటే నీరసం ముంచుకొస్తుంది. కళ్లు తిరుగుతున్నట్లు అవుతుంది. ఇలాంటి సమస్యలు రాకూడదంటే ఇనుము అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.

వీటిల్లో ఐరన్ అధికం

పాలకూర, గోంగూర, తోటకూర, చుక్కకూర, మెంతికూర, కొత్తిమీర మొదలైన ఆకుకూరల్లో; పెసరపప్పు, మినప్పప్పు, రాజ్మా, కందిపప్పు, శనగపప్పు, సోయాబీన్స్ తదితర పప్పుల్లో; రాగులు, జొన్నలు, సజ్జలు వంటి ధాన్యాల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. దానిమ్మ, యాపిల్ మొదలైన పండ్లు; బాదం, ఖర్జూరం, ఎండు ద్రాక్ష, అంజీరా వంటి డ్రై ఫ్రూట్స్; నువ్వులు, గుమ్మడి గింజలు, పుచ్చ గింజలు వంటి నట్స్, సీడ్స్ తగినంత మోతాదులో తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఐరన్ అందుతుంది. మాంసాహారులు- గుడ్లు, చేపలు, చికెన్, కాలేయం వంటివి తమ ఆహారంలో చేర్చుకోవాలి.

ఇది చేసే మేలు

ఐరన్ శరీరానికి చాలా అవసరం. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి పెరగడంలో సహాయపడుతుంది. శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ సవ్యంగా చేరేలా చేస్తుంది. అలసట బలహీనతలను తగ్గిస్తుంది. మెదడుకు మేలు చేస్తుంది. ఏకాగ్రత పెరుగుతుంది. జ్ఞాపకశక్తి తగ్గకుండా తోడ్పడుతుంది. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ఐరన్ ఎంతో అవసరం. గర్భిణీలలో రక్తహీనతను నివారిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చర్మం పొడిబారకుండా, ముడతలు పడకుండా కాపాడుతుంది. కుదుళ్లకు దృఢత్వాన్ని అందించి, జుట్టు రాలకుండా సాయపడుతుంది. ఐరన్ ఉన్న ఆహారాలతో పాటు సి-విటమిన్ విస్తారంగా ఉన్న నారింజ, ఉసిరి, నిమ్మకాయ వంటివి తీసుకుంటే ఐరన్ లోపించడం అనే సమస్య ఉత్పన్నం కాదు. ఐరన్ అధికంగా ఉన్న పదార్థాలను తీసుకోవడంతో పాటు కాఫీ, టీలకు దూరంగా ఉండటం వల్ల మరింత ప్రయోజనం ఉంటుంది.

ఇవి సూపర్ డూపర్ ఇంటి స్నాక్స్!



చెఫ్ స్పెషల్

ప్యాకెట్లలో అమ్మే చిప్స్ వంటివి పిల్లలు మరీమరీ ఇష్టపడతారు. కానీ వాటిల్లో ఉపయోగించే ప్రిజర్వేటివ్‌లు ఆరోగ్యకరం కాదు కాబట్టి అలాంటివి ఇంట్లోనే చేసుకోవడం మంచిది. మీ కోసం 'చీజ్ మసాలా క్రంచీ స్టిక్స్' రెసిపీ..

కావలసినవి

మొక్కజొన్న పిండి - కప్పు, బియ్యప్పిండి, చీజ్ - అర కప్పు చొప్పున, మైదా - పావు కప్పు, ధనియాల పౌడర్, కారం - స్పూన్ చొప్పున, మిరియాలు, జీలకర్ర పొడులు, గరం మసాలా, చీజ్ పౌడర్ - అర స్పూన్ చొప్పున, అల్లం ముద్ద - ముప్పావు స్పూన్, ఉప్పు - రుచికి తగినంత, వెన్న - రెండు టేబుల్ స్పూన్లు, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ

చీజ్‌ను తురిమి ఉంచాలి. ఒక వెడల్పాటి గిన్నెలో మొక్కజొన్న పిండి, బియ్యప్పిండి, మైదా వేసి బాగా కలపాలి. అందులో చీజ్, ఉప్పు, ధనియాలు, మిరియాలు, జీలకర్ర పొడులు, గరం మసాలా, కారం, గార్లిక్ పౌడర్, కొన్ని నీళ్లు జతచేసి కలపాలి. ఇప్పుడు వెన్న కూడా జోడించి మెత్తటి పిండి తయారయ్యేలా మళ్లీ మళ్లీ కలిపి.. పక్కనుంచాలి. ఒక పావుగంట నానిన తర్వాత.. చిన్న చిన్న భాగాలుగా చేసి.. మందమైన రొట్టెల్లా ఒత్తుకోవాలి. ఒక్కో రొట్టెను చాకుతో పొడుగ్గా స్టిక్స్‌లా కట్ చేయాలి. అన్ని రొట్టెలూ ఒకే మందంతో ఉంటే.. సమంగా వేగుతాయి. కడాయిలో నూనె వేడి చేసి.. ఈ స్టిక్స్‌ను బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. వాటిని టిష్యూ మీదికి తీస్తే.. అదనపు నూనెను పీల్చేసుకుంటాయి. స్టిక్స్ వేడిగా ఉండగానే చీజ్ పొడి చల్లి ఎగరేసినట్లు చేస్తే.. మంచి ఫ్లేవర్ వస్తుంది. పూర్తిగా చల్లారిన తర్వాత గాలి చొరబడని డబ్బాలో భద్రం చేయాలి. వారం రోజులు నిలవుండే ఈ చిరుతిండి పిల్లలకే కాదు.. పెద్దలకూ నచ్చేయడం ఖాయం.

తులసాకులతోనూ క్యాండీలు!

తులసి పేరు చెబితే.. పూజలూ, వ్రతాలూ గుర్తొస్తాయి. వీటిని నీళ్లలో మరిగించి తాగితే.. జలుబు, గొంతునొప్పి వంటివి తగ్గుతాయి. అంతేకాదు.. తులసాకులతో క్యాండీలు చేయొచ్చు తెలుసా..



కావలసినవి

తులసి ఆకులు - కప్పు, పంచదార - కప్పుంబావు, పంచదార పొడి - ముప్పావు స్పూన్, నీళ్లు - అర కప్పు, అల్లం రసం - స్పూన్, నెయ్యి - రెండు స్పూన్లు

తయారీ

తులసి ఆకులను కడిగి నీడలో ఆరబెట్టాలి. అవి చక్కగా ఎండిన తర్వాత గ్రైండ్ చేయాలి. పంచదారలో నీళ్లు పోసి కలియతిప్పుతూ వేడిచేయాలి. తీగ పాకం వచ్చాక.. తులసాకుల పొడి, అల్లం రసం జతచేసి.. కలుపుతుండాలి. చిక్కగా అయ్యాక.. ఒకటిన్నర స్పూన్ల నెయ్యి జోడించి దించేయాలి. పళ్లెంలో మిగిలిన నెయ్యి రాసి సమంగా సర్దాలి. చల్లారిన తర్వాత.. నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కట్ చేసుకోవాలి. వాటి మీద పంచదార పొడి చల్లితే.. ఒకదానికొకటి అంటుకోవు. ఇక తడిలేని సీసాలో భద్రం చేసుకుంటే.. ఆరోగ్యానికి మేలుచేసే తులసి క్యాండీలను ఆస్వాదించవచ్చు.

యాపిల్, ఆరెంజ్ జ్యూస్‌లకు భిన్నమైన పానీయం తాగాలనుకుంటున్నారా?! అయితే రోజ్ కాన్సంట్రేట్ చేసి చూడండి.. ప్రత్యేకమైన రుచితో అలరిస్తుంది..

వహ్వారే రోజ్ కాన్సంట్రేట్!



కావలసినవి

తాజా గులాబీ రేకలు - కప్పు, నీళ్లు - రెండు కప్పులు, పంచదార - ఒకటిన్నర కప్పులు, నిమ్మరసం - రెండు టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి - పావు స్పూన్, రోజ్ ఎసెన్స్ - కొన్ని చుక్కలు, బీట్‌రూట్ - చిన్నది

తయారీ

బీట్‌రూట్‌ను చెక్కు తీసి తురమాలి. గులాబీ రేకలను కడిగి ప్యాన్‌లో వేయాలి. అందులో రెండు కప్పుల నీళ్లు, బీట్‌రూట్ తురుము జతచేసి సన్న సెగ మీద మరిగించాలి. సుమారు పావు కప్పు నీళ్లు ఆవిరైపోయాక దించేయాలి. చల్లారిన తర్వాత వడకట్టాలి. ఆ నీళ్లలో పంచదార, యాలకుల పొడి వేసి మళ్లీ వేడిచేయాలి. చిక్కగా అయ్యాక.. సెగ తీసేసి నిమ్మరసం, రోజ్ ఎసెన్స్ కలిపితే చిక్కటి గులాబి పానీయం తయారైపోతుంది. పూర్తిగా చల్లారిన తర్వాత తడి లేని సీసాలోకి తీసి, రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకుంటే రెండు మూడు వారాలు నిలవుంటుంది. తాగదలచినప్పుడు గ్లాసు నీళ్లలో రెండు స్పూన్ల రోజ్ కాన్సంట్రేట్, అర స్పూన్ సబ్జా గింజలు కలిపితే సరిపోతుంది. పిల్లలకు పాలలో కలిపి ఇవ్వొచ్చు. బీట్‌రూట్ వేయడం వల్ల ఫుడ్ కలర్ వేయాల్సిన అవసరం లేకుండా పానీయానికి ఆకర్షణీయమైన రంగు వస్తుంది.

పులావ్ మసాలా పౌడర్ ఇలా..



పులావ్ ఇష్టపడనివాళ్లుండరు. కానీ అందులో వేసే మసాలా నూరడమే కొంచెం శ్రమతో కూడిన పని. అది గనుక సిద్ధంగా ఉంటే సులువుగా పులావ్ చేసేయొచ్చు. మీకోసం ఈ మసాలా పౌడర్ రెసిపీ..

ఇందుకోసం.. లవంగాలు - పది, యాలకులు - 8, షాజీరా - రెండు స్పూన్లు, జాపత్రి - కాస్త, జాజికాయ - చిన్న ముక్క, దాల్చిన చెక్క - నాలుగంగుళాల ముక్క, బిర్యానీ ఆకులు - 3, బిర్యానీ పువ్వు - కొద్దిగా, స్టార్ మొగ్గ - 1, ధనియాలు - టేబుల్ స్పూన్, కుంకుమపువ్వు - చిటికెడు, మిరియాలు, సోంపు - ఒకటిన్నర స్పూన్ల చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. కడాయిలో దాల్చిన చెక్క, స్టార్ మొగ్గ, బిర్యానీ ఆకులు, యాలకులు, మిరియాలు, జాపత్రి, జాజికాయ, లవంగాలు, ధనియాలు, సోంపు, షాజీరా, బిర్యానీ పువ్వు.. ఒక్కొక్కటిగా వేసి నూనె లేకుండా సన్న సెగ మీద వేయించాలి. అవి చక్కగా వేగి మంచి వాసన రాగానే సెగ తీసేయాలి. చల్లారాక.. మెత్తగా గ్రైండ్ చేసి కుంకుమపువ్వు జోడించాలి. ఈ పౌడర్‌ను తడి లేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకుంటే అవసరానికి సిద్ధంగా ఉంటుంది. దీన్ని రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే.. చాన్నాళ్లు నిలవుంటుంది. కప్పు బియ్యానికి ముప్పావు స్పూన్ పులావ్ మసాలా సరిపోతుంది. ఈ ఇన్‌స్టంట్ పౌడర్‌తో పనీర్, మష్రూమ్, నవాబీ పులావ్.. ఏదైనా చేసుకోవచ్చు. మసాలా దినుసులను మరీ ఎక్కువ వేయిస్తే చేదు వస్తుంది కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.

భక్తితో.. అనురక్తితో..

చిత్రంగా..

ఇవాళ మహా శివరాత్రి. ఎటు చూసినా పూజలు, శివస్తోత్రాలు వినిపిస్తూ వాతావరణం దివ్యంగా ఉంటుంది. పరమేశ్వరుడి మీద భక్తికి, అనురక్తికి చిహ్నంగా ఆహార పదార్థాలను శివలింగాలుగా పేర్చారు. చూసి తరించండి!



వసుంధర

vasundhara@eenadu.in

అలాంటి దుస్తులు వేసుకోలేనా?

నా తోటి ఉద్యోగినులు అందరూ చాలా స్టైలిష్‌గా రెడీ అవుతారు. నాకూ వారిలా తయారవ్వాలనిపిస్తుంది. స్లీవ్‌లెస్ దుస్తులు ప్రయత్నిద్దాం అనుకుంటే అండర్ ఆర్మ్స్ నల్లగా కనిపిస్తాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ నలుపుదనం పోవడం లేదు. ఇక ఎప్పటికీ అలాంటివి వేసుకోలేనా?

– మోహన, విశాఖపట్టణం.

బాహుమూలల్లో నలుపునకు చాలా కారణాలే ఉండొచ్చు. ప్రాథమికంగా ఒకదాన్ని ఎకాంథోసిస్ నైగరికన్స్ అని పిలుస్తారు. ఊబకాయం, అధిక బరువు, ఇంకేదైనా మెటబాలిక్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నా... చేతుల కింద, మెడ, తొడల దగ్గర చర్మం మందంగా, నల్లగా మారుతుంది. ఇలాంటప్పుడు ముందుగా బరువుని అదుపులో ఉంచుకోవాలి. అలానే, మెటబాలిక్ సమస్యలు అంటే.... ఇన్సులిన్ రెసిస్టెన్స్, పీసీఓఎస్ వంటివి ఉంటే వాటిని సరిదిద్దుకోవాలి. అప్పుడు ఎకాంథోసిస్ వల్ల వచ్చే నలుపు తగ్గుతుంది. ఆపై గ్లైకోలిక్ యాసిడ్, శాల్సిలిక్ యాసిడ్ ఉన్న క్రీములతో పాటు లైటెనింగ్ క్రీముల్నీ వాడితే కొంతవరకూ పరిస్థితి మెరుగుపడుతుంది.



డియర్ వసుంధర

- సూరపనేని పద్మావతి, డెర్మటాలజిస్ట్

ఈ సమస్యకు మరో కారణం చెమట, రాపిడి. వెంట్రుకలు మందంగా ఉండటం, బిగుతైన దుస్తులు ధరించడం, చెమట ఎక్కువగా పట్టడం వల్ల రాసు కుని నల్లగా మారొచ్చు. తేమ ఎక్కువై పంగల్ ఇన్ఫె క్షన్లు వచ్చి తగ్గాక కూడా నల్లగా మారొచ్చు. వదులైన కాటన్ దుస్తుల్ని ధరించడం, వెంట్రుకలు, రాపిడి లేకుండా చూసుకోవడం తప్పనిసరి. ఇందుకోసం అండర్ ఆర్మ్స్‌ని ఎప్పటికప్పుడు ట్రిమ్ చేసుకోవాలి. ఫంగల్ ఇనెక్షన్ తగ్గించే క్రీములతో పాటు... అజలేయిక్ యాసిడ్, కోజిక్ యాసిడ్ వంటి స్కిన్‌లైటెనింగ్ ఏజెంట్స్ ఉన్న రకాల్ని వాడితే కొంత ఫలితం ఉంటుంది. లేదంటే... డెర్మటాలజిస్ట్‌ని సంప్రదించండి. సున్నితంగా ఉండే ఆ చర్మానికి కొన్ని రకాల పీల్స్ చేస్తారు. మరీ డీప్‌గా ఉంటే... పిగ్మెంట్ రిడక్షన్, క్యూస్విచ్ లేజర్ లాంటివాటితో తగ్గిస్తారు.



రమ్య

మంటల్లో పడ్డా... ఫొటోపైనే ధ్యాసంతా!

క్షణాల్లో మారిపోయే దృశ్యాల్ని... క్లిక్ మనిపించి, కథగా మలచడమే మోషన్ ఫొటోగ్రఫీ. అలాంటి విభాగంలో రాణించాలని కలలు కన్నారు రమ్య శ్రీరామ్. ఇందుకు ఆమె ఎంపిక చేసుకున్న థీమ్... కనుమరుగవుతున్న సంప్రదాయ పండుగలు. అలా ఆమె తీసిన ఓ ఫొటో 'నాట్ జియో ఇండియా వరల్డ్‌వైడ్-2025' పోటీకి ఎంపికై అంతర్జాతీయ గుర్తింపు దక్కించుకుంది.

కాంతార సినిమా వచ్చినప్పట్నుంచీ... కేరళలోని పండుగలకు ప్రాధాన్యం పెరిగింది. స్థానికులు, పర్యటకులు ఇక్కడి సంప్రదాయ పండుగల వెనక అంతరార్థాన్ని వెతకడం, తెలుసుకోవడం మొదలుపెట్టారు. ఉత్తర కేరళలోని కన్నూర్, కాసరగోడ్, వయనాడ్, కోజికోడ్ ప్రాంతాల్లో జరుపుకొనే తెయ్యం కూడా ఆ కోవకు చెందినదే. రాత్రుళ్లు, తెల్లవారుజాముల్లో జరుపుతారీ ఉత్సవాన్ని.



మాది చెన్నై. నాన్నకు ఫొటోగ్రఫీ అంటే ఇష్టం. ఆయన దగ్గర వింటేజ్ కెమెరా ఉండేది. దాంతో ఫొటో తీసేటప్పుడు క్లిక్‌మనే షట్టర్ శబ్దం వచ్చేది. అది వినడానికే నాన్న ఎప్పుడు ఫొటో తీస్తారా అని చూసేదాన్ని. అలా ఫొటోగ్రఫీ మీద ఆసక్తి పెరిగింది. నాన్న దగ్గరే మెలకువల్నీ నేర్చుకున్నా. కానీ దీన్ని ప్యాషన్‌గానే భావించా. చదువు పూర్తిచేసుకుని మానవ వనరుల విభాగంలో ఉద్యోగం సంపాదించా. అలా ఎల్ అండ్ టీ, బ్లూ స్టార్, సదర్లాండ్ వంటి కంపెనీల్లో హెచ్‌ఆర్‌గా సేవలందించా. కుటుంబ అవసరాల రీత్యా 2007లో ఉద్యోగం మానేశా. ఖాళీ సమయాల్ని సమాజ సేవకు కేటాయించాలని నిర్ణయించుకున్నా. అలా స్థానిక గ్రామాలు, మురికివాడలు తిరుగుతూ వాళ్లనీ, సమస్యల్నీ ఫొటోలు తీసి డాక్యుమెంటరీలు చేసేదాన్ని. ఈ క్రమంలోనే రకరకాల సంప్రదాయాల్ని తెలుసుకునేదాన్ని. కొన్ని ఇప్పటికీ పాటిస్తుంటే... కొన్ని అంతరించే దశలో ఉన్నాయని చెప్పేవాళ్లు. భవిష్యత్తు తరాలకూ, బయటి ప్రపంచానికీ వీటి వైభవాన్ని చెప్పాలనిపించింది. మోషన్ ఫొటోగ్రాఫర్‌గా మారింది అలానే.

ఓపికకు పరీక్ష...

ఈ తరహా ఫొటోగ్రఫీకి వేగం, సమయం, స్థిరత్వం చాలా అవసరం. కదలికల్ని వీలైనంత సహజంగా చూపించగలగాలి. ఏ కాస్త అటూఇటూ అయినా మళ్లీ ఆ సందర్భమో, పండుగో వచ్చే వరకూ వేచిచూడాల్సిందే. ఇప్పటి వరకూ తీసిన ఫొటోలకంటే... ఇదో సవాలుగా అనిపించింది. అందుకే ఆసక్తిగా నేర్చుకున్నా. గంగానది తీరాన హారతి, సాధువుల జీవనశైలి, ముంబయిలో గణపతి ఊరేగింపు వంటి చాలా ఫొటోలనే తీశా. తర్వాత తమిళనాడు పండుగల మీదకి దృష్టి మళ్లింది. ఇక్కడి ఆలయాలు, ఉత్సవాలు, కళాకారుల ఫొటోలని తీయడం మొదలుపెట్టా. కేరళలోని తెయ్యం ఉత్సవాన్ని క్యాప్చర్ చేయాలనుకోవడమూ అందులో భాగమే.

కాలిన గాయాలతోనే...

గ్రామదేవతల్నీ, తమ తెగ కోసం పోరాడి మరణించిన వీరుల్నీ తలుచుకుంటూ చేస్తారీ ఉత్సవాన్నీ. ప్రత్యేక వేషధారణ, భారీ మేకప్, పెద్ద కిరీటాల్ని పెట్టుకుని తయారవుతారు నృత్యకారులు. ప్రదర్శనలో పాల్గొనే కళాకారులను దేవతా రూపాలుగా భావిస్తారు. వాళ్లు నృత్యం చేస్తూ తమ తెగ సుఖసంతోషాల కోసం దేవతల్ని ప్రార్థిస్తారు. మంటల్లో నడుస్తూ విన్యాసాలు చేయడమూ దీనిలో భాగమే. దాన్నే క్యాప్చర్ చేయాలనుకున్నా. నేను అనుకున్న ఘట్టం వచ్చేసరికి... డోలు మోతలు మొదలయ్యాయి. నిప్పు కణికలు మీద పడతాయేమో అన్న భయంతో జనం ఒక్కసారిగా కదిలారు. ఈ తొక్కిసలాటలో ముందుకు పడిపోవడంతో నాకూ మంటలు అంటుకున్నాయి. దుస్తులు కాలి చేతులకు గాయాలయ్యాయి. అయినా వెంటనే లేచి, క్యాప్చరింగ్ మొదలుపెట్టినా... ఏదో అసంతృప్తి. ఇంటికి చేరేవరకూ ఫొటో వచ్చిందా లేదా అన్న సంశయమే. కాలిన గాయాలతో ఉన్న నన్ను చూసి అందరూ భయపడుతుంటే... నా ధ్యాస మాత్రం రీల్ చూడాలనే. ఐదు ఫొటోల్లో ఒక్కటి మాత్రం పర్ఫెక్ట్ షాట్ వచ్చింది. నా ఆనందానికి అవధుల్లేవు. దాన్ని చూసి గాయాల్ని మరచిపోయా. 'నేషనల్ జియోగ్రఫిక్ 2025'కు ఎంపికై, క్యాప్చర్ ఇన్ మోషన్ విభాగంలో చోటు దక్కించుకుందీ ఆ ఫొటోనే. దీన్ని నేషనల్ జియోగ్రఫిక్ క్యాలెండర్, వాళ్ల అంతర్జాతీయ మ్యాగజైన్లలో ప్రచురిస్తారు. ఇలాంటి ఫొటోలు మరిన్ని తీసి, కనుమరుగవుతున్న సంప్రదాయాల్ని భవిష్యత్తు తరాలకు పరిచయం చేయాలన్నదే నా ఆశ అంటున్న రమ్యకు మనమూ ఆల్ ది బెస్ట్ చెప్పేద్దామా.



నివేదిత

పెళ్లి ఖర్చులు తగ్గాలని..!

జీవితంలో ఒక్కసారి చేసుకునే వేడుక పెళ్లి అంటూ ఆర్థిక పరిస్థితిని లెక్కచేయకుండా వివాహాన్ని ఆడంబరంగా చేసుకుంటున్నారు. అంతేనా, కొన్ని గంటలు మాత్రమే కట్టుకునే చీరలు, లెహంగాలు, షేర్వాణీలు, నగలకి రూ.లక్షలు ఖర్చుచేస్తున్నారు. ఇవి తర్వాత కుటుంబానికి ఆర్థిక భారంగా మారుతున్నాయి. దానికో పరిష్కారాన్ని కనిపెట్టారు ఫ్యాషన్ డిజైనర్ నివేదిత నరుల అదేంటంటే...

నివేదిత భువనేశ్వర్‌కి చెందిన ఫ్యాషన్ డిజైనర్. భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి విభాగంలో పనిచేశారు. ఆ సమయంలో మహిళలు పెళ్లి తరవాత ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితుల్ని గమనించారు. అందుకే పెళ్లి బట్టల కోసం చేసే ఖర్చుల్ని తగ్గించేందుకు 'ఏక్ ఔర్ బార్' పేరుతో షోరూమ్ ప్రారంభించారు. ఇందులో వధూవరులకి పెళ్లి, ప్రీ- వెడ్డింగ్, పోస్ట్-వెడ్డింగ్, హల్దీ, రిసెప్షన్ వంటి వేడుకలకి బట్టల్ని తక్కువ ధరకు అద్దెకు ఇస్తారు. లక్షల రూపాయలు ఖర్చుచేసే కంటే రూ.10-15వేలకి మంచి డిజైనర్ దుస్తుల్ని ఆమె షోరూమ్‌లో తీసుకోవచ్చు. వీటిని అద్దెకు ఇవ్వడం వల్ల మధ్యతరగతి కుటుంబాలు కూడా తక్కువ ధరలోనే ఖరీదైన బట్టలు కట్టుకోవచ్చు. 'దీన్ని మొదలుపెట్టడం వల్ల సామాన్య కుటుంబాల వారికి పెళ్లి ఖర్చులు తగ్గుతున్నాయి. కొందరికి ఉపాధినీ ఇవ్వగలుగుతున్నా. పెళ్లి రోజు తరవాత ఒకటిరెండుసార్లు కట్టే దుస్తులకోసం ఎంతో డబ్బు వృథా అవుతుంది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా. ఒడిశాలో దీన్ని మేమే ముందు మొదలుపెట్టాం. ప్రస్తుతం మా డిమాండ్ పెరుగుతోంది. మా రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ మాకు కస్టమర్లు ఉన్నారు. ఏటా 600 మందికి పైగా దుస్తులను అద్దెకు తీసుకుంటున్నారంటున్నారు నివేదిత.

ఈటీవీ భారత్

చిరుధాన్యాలతో... చిరుతిళ్లు



ఈరోజుల్లో మనం తినే ఏ ఆహారంలోనూ పోషక విలువలుండటం లేదు. దీనికితోడు పిజ్జాలు, బర్గర్ల వంటి ఫాస్ట్‌ఫుడ్ వినియోగమూ పెరిగింది. దాంతో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయి. అందుకే ప్రజలకు ఆహారంతోపాటు ఆరోగ్యాన్నీ అందించాలనుకున్నాం అంటారు మారుతీ మిల్లెట్స్ నిర్వాహకురాలు పైడి నాగమణి. మిల్లెట్స్‌తో స్నాక్స్ తయారుచేస్తూ తనతోపాటు మరికొంతమందికి ఉపాధిని కల్పిస్తున్నారు.



మాది శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలోని తాళ్లవలస గ్రామం. 20మంది స్వయం సహాయక సంఘాల సభ్యులం కలిసి ఈ మారుతీ మిల్లెట్స్‌ని రెండేళ్ల కిందట మొదలుపెట్టాం. ఒకప్పుడు ఇంటి ఆర్థిక అవసరాలు తీర్చడం కోసం మాలో చాలామంది టైలరింగ్ చేసేవారు. కానీ ఆ పనికి సరిపడా ఆదాయం వచ్చేది కాదు. నాబార్డు సహకారంతో బెజ్జిపురం యూత్ క్లబ్ అందించే ఉచిత శిక్షణ గురించి తెలుసుకున్నాం. అక్కడ చిరుధాన్యాలతో స్నాక్స్ తయారుచేయడం నేర్చుకున్నాం. అంతేకాదు, శిక్షణ అనంతరం సొంతంగా వ్యాపారం మొదలుపెట్టాలనుకున్నవారికి రుణ సౌకర్యం కూడా కల్పించిందీ క్లబ్. ఆహార పదార్థాల తయారీకి అవసరమైన పిండి కలిపే యంత్రాలు మాకు ఉచితంగా అందించింది. మరికొంతమందికి రాయితీతో మెషినరీని కూడా సరఫరా చేసింది. ఇంటి వద్దే ఉంటూ ఊదలు, రాగులు, కొర్రలు, సామలు, జొన్నలు, నువ్వులతో గవ్వలు, అరిసెలు, చెక్కలు... వంటి చిరుతిళ్లను తయారుచేస్తున్నాం. మొదట్లో మార్కెటింగ్‌లో అనుభవం లేక వీటిని అమ్మడంలో ఇబ్బందులు పడ్డాం. అప్పుడు మార్కెట్లు, ఎగ్జిబిషన్లు, సంతల్లో చిన్న చిన్న స్టాల్స్ ఏర్పాటుచేసి విక్రయించడం మొదలుపెట్టాం. అప్పటి నుంచి మా వ్యాపారానికి డిమాండ్ పెరిగింది. కస్టమర్లకు రుచి, నాణ్యత నచ్చడంతో మళ్లీ మళ్లీ వచ్చి కొనేవారు. బయట నుంచి ఆర్డర్లు రావడం కూడా మొదలయ్యాయి. దాంతో ప్రస్తుతం అన్ని ఖర్చులు పోను నెలకు రూ.40-50వేలు ఆదాయం వస్తుంది. మాతోపాటు పరోక్షంగా మరికొన్ని కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించగలుగుతున్నాం. ప్రస్తుతం లావేరు, రణస్థలం ఇంకా చుట్టుపక్కల గ్రామాల మహిళలకు కూడా శిక్షణ ఇవ్వగలుగుతున్నాం. భవిష్యత్తులో మిల్లెట్స్‌తో మరిన్ని వెరైటీలు తయారుచేసి మా మార్కెట్‌ను పెంచుకునే దిశగా అడుగులువేస్తున్నాం.

– మీసాల లక్ష్మునాయుడు, లావేరు

గోకులంలో గోపేశ్వరుడై..!



'చిదానంద రూపః శివోహం శివోహం...' అని జపిస్తూ ఆ శివయ్యను ధ్యానిస్తుంటారు. శివతత్వ సారాన్నీ అర్ధనారీశ్వర తత్వాన్నీ అర్థం చేసుకునేందుకూ ప్రయత్నిస్తుంటారు శివ భక్తులు. కానీ భక్తి పారవశ్యంతో ఆ మహాదేవుడే స్వయంగా గోపికలా మారాడనీ ఆ రూపంలో పూజలూ అందుకుంటున్నాడనీ తెలుసా..!

బృందావన్... పేరు వినగానే గుర్తొచ్చేది రాధాకృష్ణులూ గోపికల నృత్యాలే. శ్రీకృష్ణుడు ఆడిపాడిన ఆ ప్రదేశంలో పరమశివుడికీ ఓ ఆలయం ఉందనీ అక్కడ ఆయన్ని స్త్రీ రూపంలో కొలుస్తారనీ చాలామందికి తెలియదు. అదే గోపేశ్వర్ మహాదేవ్ ఆలయం. ఈ మందిరంలో శివుడు గోపికా రూపంలో దర్శనమిస్తాడు. అత్యంత పురాతనమైన ఈ గుడిని కృష్ణుడి మునిమనవడైన వజ్రనాభుడు నిర్మించాడనేది స్థల పురాణం.

కైలాస పర్వతంమీద ధ్యానముద్రలో ఉన్న పరమశివుడికి శ్రీకృష్ణుని వేణునాదం వీనులవిందుగా వినిపించిందట. దానికి పరవశించిన శివుడు ఆ వేణునాదాన్ని ఆస్వాదించేందుకు బృందావన్‌కి చేరుకుంటాడు. ఆ సమయానికి అక్కడ కృష్ణుడు గోపికలతో రాసలీలకు సిద్ధమవుతున్నాడట. ఆ దృశ్యం చూసిన శివుడు తానూ ఆ నృత్యంలో పాల్గొనాలి అనుకుంటాడు. కానీ పురుషులకు ప్రవేశం లేదని యోగమాయ చెప్పడంతో శివుడు వృందాదేవిని ఆశ్రయిస్తాడట. ఆమె సలహాతో గోపిక వేషంలో రాసలీల జరిగే ప్రదేశానికి వెళ్లి అందరితో కలిసి నృత్యం చేస్తూ ఆనందిస్తుంటాడు. గోపికలందరితోనూ నృత్యం చేస్తున్న శ్రీకృష్ణుడు శివుడిని గుర్తించి... 'గోపేశ్వర్' అని నవ్వుతూ సంబోధించి, మహాదేవుని పూజించి, గోపిక రూపంలో ఆ ప్రాంతంలో కొలువై ఉండమని కోరాడట. ఆ అభ్యర్థనను మన్నించిన పరమేశ్వరుడు అక్కడ కొలువయ్యాడనేది పౌరాణిక కథనం. అదే గోపేశ్వర మహాదేవ్ ఆలయం. అక్కడున్న లింగాన్ని ఉదయం వేళలో శివరూపంలో పూజిస్తే, సాయంత్రం వేళలో గోపికగా అలంకరించి కొలుస్తుంటారు. సృష్టిలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమే అన్నదాన్ని సూచిస్తూ ఆ జగన్మాతకు తన శరీరంలోనే చోటిచ్చి అర్ధనారీశ్వర తత్వాన్ని బోధించిన పరమేశ్వరుడు... బృందావన్‌లో గోపికలా మారి, గోపేశ్వరుడుగానూ భక్తులకు దర్శనమిస్తున్నాడు!

శివరాత్రికి సింఘాడా!

సింఘారా/సింఘాడా... పేరు ఏదైనా ఇది పోషకాలకు చిరునామా. మహాశివరాత్రి రోజున ఉపవాసం చేసేవాళ్లు చాలామందే. అయితే, ఈ సమయంలో ఇతర పదార్థాలేవీ తీసుకోకపోయినా సింఘాడాతో చేసిన ఆహారాన్ని తీసుకుంటుంటారు కొందరు. ఉత్తరాదిన దీన్ని ఆచారంగానూ భావిస్తుంటారు. ఇంతకీ ఏంటిది? ఎందుకు దీన్ని తింటారనేదే కదా మీ సందేహం?



మహాశివరాత్రి నాడు ధాన్యం (బియ్యం, గోధుమలు) వంటి వాటిని అన్నంగా భావించి తీసుకోరు. కానీ, పండ్లను మాత్రం ఫలహారంగా తీసుకుంటారు. వాటిల్లో సింఘారా ఒకటి. దీనికే వాటర్ ఫ్రూట్, చెస్ట్‌నట్‌గానూ పేరు. ధాన్యం కాదు కాబట్టి వీటిని పిండిగా పట్టించి పూరీలు, రొట్టెలు, హల్వా... వంటివి చేసుకుని తింటుంటారు.

సింఘారాలు తక్షణ శక్తిని ఇవ్వడంతోపాటు శరీరాన్నీ చల్లబరుస్తాయి. దీంతో శరీరం డీహైడ్రేట్ కాదు. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఉపవాస వేళల్లో ఆకలి నియంత్రణలో ఉంటుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగానూ ఉంటుంది. పైగా ఇందులో సోడియం తక్కువ, పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యానికీ మేలు. డయాబిటీస్ ఉన్నవారూ తినొచ్చు. ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించి, క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణకు సహాయపడుతుంది. కాబట్టి ఈ పిండిని ఉపవాసంలోనే కాకుండా రోజువారీ ఆహారంలో భాగంగానూ చేసుకోవచ్చు.

శివుడే పురుడు పోశాడు..!



శివుడంటే పుర్రెలు, ఎముకలు ధరించి... చితాభస్మాన్ని పూసుకుని శ్మశానంలో తిరుగుతుంటాడు అని పురాణాల్లో చదవడంతోపాటు వినీ ఉంటాం. కానీ, భక్తులకోసం ఆయన స్త్రీ రూపం దాల్చాడనీ, ఓ తల్లిలా పురుడు పోశాడనీ తెలుసా? ఆయనే తిరుచ్చిలోని థాయుమాన్‌స్వామి!

ఆ శివయ్యను థాయుమాన్‌స్వామి (తల్లిగా మారిన శివుడు)గా కొలిచే ఆలయం తమిళనాడు, తిరుచ్చి పట్టణంలో ఉంది. అక్కడ 273 అడుగుల ఎత్తైన కొండపై ఉన్న ఈ ఆలయంలో శివయ్యను పురుడు పోసిన తల్లిగా కొలుస్తుంటారు. పూర్వం రత్నావతి అనే స్త్రీ నెలలు నిండి ప్రసవం దగ్గర పడటంతో పొరుగూరులో ఉన్న తల్లిని తోడుగా రమ్మని కోరిందట. కానీ ఆ సమయంలో కావేరి నదికి భారీ వరదలు రావడంతో సమయానికి ఆమె కూతురి దగ్గరకు చేరుకోలేకపోయిందట. ప్రసవ వేదన తట్టుకోలేని రత్నావతి శివుడిని ప్రార్థించిందట. అప్పుడు శివుడే స్వయంగా ఆమె తల్లి రూపంలో వచ్చి పురుడు పోశాడట. ఆలస్యంగా వచ్చిన అమ్మను చూశాక... అంతకుముందు వచ్చింది శివుడే అని గ్రహించిందట రత్నావతి. అప్పటి నుంచి అక్కడి భక్తులు స్వామివారిని థాయుమాన్‌స్వామి, మాతృభూతేశ్వర్‌గా కొలుస్తారు. నేటికీ భక్తులు తమ కుమార్తెలకు సుఖ ప్రసవం జరగాలని స్వామిని ప్రార్థించి అరటి చెట్టుని సమర్పిస్తుంటారు.

ఆవిరిపడితే జిడ్డు పోతుంది!



పంటగట్టు, పొయ్యి వెనకాల జిడ్డు... ఓ పట్టాన వదలవు. అలాగని వీటిని సులువుగా పోగొట్టడానికి కఠిన రసాయనాలున్న క్లీనర్లు వాడుతున్నారా? అస్సలు అలా చేయొద్దు. ఈ అలవాటు ఇంట్లో కాలుష్యాన్ని పెంచుతుంది. టైల్స్‌నీ పాడు చేస్తుంది. బదులుగా ఏం చేయాలనే కదా మీ సందేహం. మీకోసమే ఈ చిట్కాలు...

- పది కుంకుడుకాయల్ని చిక్కగా రసం తీసి దానిలో కాస్త బేకింగ్ సోడా కలిపి గోడలకూ, పొయ్యి చుట్టూ రాయండి. ఒక్క పది నిమిషాలు అలానే వదిలేసి తర్వాత పీచుతో రుద్దితే సరి. జిడ్డు ఇట్టే వదిలిపోతుంది. ఈగలూ, దోమలు వంటివీ ముసరకుండా ఉంటాయి.
- వంటసోడా జిడ్డుగా ఉన్న చోట చల్లి... ఆపై నిమ్మచెక్కతో రుద్దండి. తర్వాత వేణ్నీళ్లను కూడా స్ప్రే చేసి పీచుతో తోమితే మురికి ఇట్టే వదిలిపోతుంది. ఆ ప్రదేశం కొత్తగా మెరిసిపోతుంది.
- వినెగర్, వంటసోడా, సెనగపిండి కాస్త నిమ్మరసం కలిపి పేస్ట్‌లా చేయండి. పదినిమిషాలయ్యాక స్టీమర్‌తో ఆవిరిపట్టి తుడిస్తే సరి. ఇట్టే మురికి అంతా పోతుంది.

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

నైపుణ్యాల్ని పెంచే ఆటలు..!

కిడ్స్ కార్నర్

'ఏం చేసైనా సరే స్క్రీన్ సమయాన్ని తగ్గించాలి...' ఇది చాలామంది అమ్మానాన్నల ముందు అతి పెద్ద సవాల్. దీని కోసం రకరకాల పద్ధతులను అనుసరిస్తున్నారు. ఒక్కసారి ఈ ఆటల్ని పరిచయం చేసి చూడండి. ఆటా, వినోదం రెండూ అందించిన వాళ్లవుతారు.




శారీరక వ్యాయామంగా...




ఆరు బయట ఆటలకు పిల్లలు క్రమంగా దూరమవుతున్నారు. దీంతో వారికి శారీరక శ్రమ క్రమంగా తగ్గుతోంది. ఎదుగుదలలో లోపాలూ పెరుగుతున్నాయి. అలాంటి చిన్నారులకు ఈ 'హ్యాంగింగ్ టెన్నిస్ ట్రైనర్'ను బహుమతిగా ఇచ్చి చూడండి. ఇందులో మాగ్నటిక్ వైర్‌కి ఓ బాల్ ఉంటుంది. రెండు బ్యాట్‌లు ఇస్తారు. ఆట ప్రారంభానికి ముందు టెన్నిస్ సెట్‌ని ద్వారానికి అతికిస్తే చాలు. బటన్ నొక్కితే బాల్ బయటకు వస్తుంది. ఇరువైపులా ఆటగాళ్లు ఉండి, బ్యాట్‌తో కొట్టొచ్చు. ఏకాగ్రత, కంటికీ చేతికీ మధ్య సమన్వయాన్ని పెంచుతుందీ ఆట.

గప్.. చుప్..

ట్రెజర్ హంట్ ఆటను ఇష్టపడని పిల్లలు ఉంటారా? దేన్నైనా దాచిపెట్టి వెతికి తీసుకురమ్మంటే ఎంతో ఆసక్తిగా పాల్గొంటారు. అలాంటి వారికి ఈ 'డక్ మినియేచర్స్' బహుమతిగా ఇవ్వండి.



ఇందులో 20 నుంచి 40 రకాల బాతు బొమ్మలు ఉంటాయి. వాటిని జతగా, నాలుగు లేదా ఐదే బొమ్మల్ని ఓ చోట దాచిపెట్టి, కనిపెట్టడమే గేమ్. దీంతో వాళ్లకు విసుగూ ఉండదూ.. తెరల నుంచి దూరమవుతారు కూడా. కాగ్నిటివ్ సామర్థ్యాలూ మెరుగవుతాయి.





అతికించి.. తీయొచ్చు!

కాస్త వయసొచ్చాక పిల్లలకు వారాలూ, నెలలూ, తేదీలూ నేర్పిస్తుంటాం కదా. వీటిని పలకా బలపంతో నేర్చుకోమని చెబితే అదేదో భారంగా భావిస్తారు. 'మై ఫస్ట్ క్యాలెండర్'ని ఇచ్చి చూడండి. ఇందులో రోజులు, నెలలు, సమయం, రుతువులు చిన్న చిన్న డయాస్‌ల మీద ఉంటాయి. వాటిని అతికించే బోర్డు కూడా ఉంటుంది. పిల్లలకు ఏ నెల, ఏ తేదీ, ఏ సమయం నేర్పాలి అనుకుంటారో ఆ డయాస్‌ను ఇచ్చి అతికించమంటే సరి. ఆటగా అన్నీ నేర్చుకుంటారు.



బంగారం - వెండి



14న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,59,740	1,45,000	2,54,360
విజయవాడ	1,55,685	1,44,600	2,60,400
ప్రొద్దుటూరు	1,58,000	1,45,360	2,55,000
రాజమహేంద్రవరం	1,57,750	1,44,600	2,80,000
విశాఖపట్నం	1,57,750	1,44,600	2,55,000
తమిళనాడు	-----	1,45,600	2,80,000

రూపాయి డాక్టర్ శంకరం

రూపాయి ఇస్తే చిన్నపిల్లలు కూడా తీసుకోని ఈ రోజుల్లో.. ఒడిశాకు చెందిన డాక్టర్ శంకర్ రామచందాని కేవలం ఒక్క రూపాయి ఫీజుతో పేదలకు ఆరోగ్య పరీక్షలతోపాటు వైద్య సేవలు అందిస్తున్నారు. సంబల్‌పుర్ జిల్లాలోని బుర్లాలో గల 'విమ్సర్' ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ శంకర్ పనిచేస్తున్నారు. కళాశాల విధులు ముగిసిన తర్వాత..



బుర్లా మార్కెట్ ప్రాంతంలోని క్లినిక్‌లో ప్రతి రోజూ సాయంత్రం ఆరింటి నుంచి రాత్రి 9 గంటల వరకు పేదలకు వైద్యం చేస్తారు. ఈసీజీ, నెబులైజర్ వంటి సేవలతోపాటు బీపీ రీడింగ్‌లను పరీక్షించే స్పైరోమీటర్, ఎముకల బలాన్ని గుర్తించే బీఎండీ వంటి టెస్టులు సైతం ఇక్కడ ఒక్క రూపాయికే చేస్తున్నారు. "నాన్న క్యాన్సర్ బారిన పడినప్పుడు మా కుటుంబం ఎంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందించాలని ఆనాడే సంకల్పం తీసుకున్నా. కొవిడ్ తర్వాత నా తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ఈ క్లినిక్ ప్రారంభించా" అని డాక్టర్ శంకర్ తెలిపారు. దంతవైద్యురాలైన డాక్టర్ శిఖా రామచందాని సైతం భర్త అడుగుజాడల్లో నడుస్తూ ఇదే క్లినిక్‌లో పేదలకు వైద్యం చేస్తున్నారు.

పదినెలల ఈ చిన్నారి.. నలుగురికి జీవనదాత

కేరళకు చెందిన ఈ చిన్నారి చిరుప్రాయంలోనే నలుగురికి జీవనదాతగా మారింది. పతనంతిట్ట ప్రాంత వాసులైన అరుణ్ అబ్రహం, షెరిన్ ఆన్‌జాన్ దంపతులు తమ కుమార్తె అలిన్ షెరిన్ (10 నెలలు)తో కలిసి ఫిబ్రవరి 5న కొట్టాయం నుంచి కారులో వెళుతుండగా రోడ్డుప్రమాదం జరిగింది. స్పృహ కోల్పోయిన పాపను వెంటనే ఆస్పత్రికి తరలించారు. కొచ్చిన్‌లోని అమృత ఆస్పత్రిలో వారం రోజులపాటు నిపుణులైన వైద్యులు ఎంతగా ప్రయత్నించినా చిన్నారి ప్రాణాన్ని కాపాడలేకపోయారు. పాప బ్రెయిన్ డెడ్ అని వైద్యులు నిర్ధారించడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. అంతటి విషాదంలోనూ కుమార్తె అవయవాలను ఇతరులకు దానం చేయడానికి ముందుకొచ్చిన అబ్రహాం దంపతులను కేరళ ఆరోగ్యమంత్రి వీణా జార్జ్ అభినందించారు. చిన్నారి అవయవాలను ఇతరులకు అమర్చేందుకు పోలీసులు ట్రాఫిక్ గ్రీన్ చానెల్ ఏర్పాటు చేశారు. తిరువనంతపురంలో చికిత్స పొందుతున్న ఓ చిన్నారికి అలిన్ షెరిన్ మూత్రపిండాలు, ఇంకొకరికి గుండె కవాటం, ఆరు నెలల మరో బిడ్డకు ఊపిరితిత్తులను ఏర్పాటు చేశారు. కార్నియాలను కొచ్చిన్‌లోని అమృత ఆసుపత్రి రోగులకు అందించనున్నారు. అలిన్ షెరిన్‌కు ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి.



ఈటీవీ భారత్

ఇరాన్‌కు త్వరలో కొత్త పాలకులు: ట్రంప్

ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్‌పై సైనిక చర్య తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఆ దేశంలో పరిపాలన చేతులు మారితేనే అక్కడి పరిస్థితులు చక్కబడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరలోనే అక్కడ పాలకులు మారే అవకాశం ఉన్నట్లు తెలిపారు. 47 ఏళ్లుగా చర్చల పేరుతో వారు మాట్లాడుతూనే ఉన్నారని.. ఈలోగా ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ట్రంప్ అన్నారు. ఇకపై ఈ విషయంలో ఆలస్యం చేయదలుచుకోలేదన్నారు. ఇరాన్ ప్రజలే కొత్త పాలకులను ఎన్నుకుంటారని తెలిపారు. అణు ఒప్పందంపై ప్రస్తుతం ఇరాన్‌తో జరుగుతున్న చర్చలు విజయవంతమవుతాయని తాను భావిస్తున్నానని.. చర్చలు విఫలమైన రోజు ఇరాన్ చరిత్రలో ఓ చెడు రోజుగా నిలిచిపోతుందని ట్రంప్ పేర్కొన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సూచించినట్లు తెలిపారు. అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమాన వాహక నౌక ఇరాన్ వైపు తరలివస్తున్న సమయంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడంతో..ఏ క్షణాన ఏం జరుగుతుందోనని పశ్చిమాసియా దేశాలు ఆందోళన చెందుతున్నాయి.





తీరిక దొరికినప్పుడే పని చేస్తే..

మనకు సమయం దొరికినప్పుడో, ఉత్సాహం కలిగినప్పుడో, ఏం చేయాలో తోచక బోర్ కొట్టినప్పుడో చేసే పనులు మన జీవితాన్ని ఉన్నతంగా మార్చలేవు. ఉత్సాహం, ఆసక్తులతో సంబంధం లేకుండా ప్రతిరోజూ క్రమం తప్పకుండా సమయం కేటాయించుకొని మరీ పని చేసినప్పుడే మన భవిష్యత్తును మార్చుకోగలం.
– టోనీ రాబిన్స్, మోటివేషనల్ స్పీకర్



అస్సాంలో బ్రహ్మపుత్ర నదిపై నిర్మించిన 'కుమార్ భాస్కర్ వర్మ సేతు'ను ప్రారంభించిన అనంతరం వంతెనను పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

ఈశాన్య భారతంలో చరిత్రాత్మక ఘట్టం

- అస్సాంలో తొలి 'ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ' ప్రారంభం
- జాతీయ రహదారిపై దిగిన ప్రధాని మోదీ విమానం
- రన్‌వేను తాకి వెళ్లిన సుఖోయ్, రఫేల్ యుద్ధ విమానాలు

గువాహటి: దేశ రక్షణ వ్యూహంతో పాటు బహుళ ప్రయోజనాలు ఇమిడి ఉన్న ఒక చరిత్రాత్మక ఘట్టం శనివారం ఆవిష్కృతమైంది. ఈశాన్య రాష్ట్రమైన అస్సాం దానికి వేదికైంది. దిబ్రూగఢ్ జిల్లాలోని జాతీయ రహదారి-37పై ఏర్పాటు చేసిన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ(ఈఎల్‌ఎఫ్)ని ప్రధాని మోదీ ప్రారంభించారు. మోరాన్ బైపాస్ వద్ద రూ.వంద కోట్లతో తీర్చిదిద్దిన ఈఎల్‌ఎఫ్‌పై సి-130జె విమానంలో మోదీ ల్యాండయ్యారు. చైనాతో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఈశాన్య భారతంలో నిర్మించిన తొలి వ్యూహాత్మక రన్‌వే ఇది. పౌర, సైనిక అవసరాలను తీర్చేలా దీనిని రూపొందించారు. అత్యవసర పరిస్థితుల్లో దిబ్రూగఢ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయంగానూ ఉపయోగపడనుంది. ప్రకృతి విపత్తులు, సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు, విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌కు ఇది ఎంతో అనుకూలం. ఇప్పటికే పశ్చిమ, ఉత్తర, మధ్య భారత్‌లో ఇటువంటివి ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో ఇదే మొట్టమొదటిది. దిబ్రూగఢ్-మోరాన్ జాతీయ రహదారిపై ఉన్న రన్‌వే.. భారత్-చైనా సరిహద్దుకు దగ్గరగా ఉండటంతో కీలక, వ్యూహాత్మక ప్రదేశంగా మారింది. చైనా సరిహద్దుకు 300 కి.మీ; మయన్మార్‌కు 200 కి.మీ. దూరంలో ఈఎల్‌ఎఫ్ ఉంది.

ఆకట్టుకున్న ఎయిర్ షో

అస్సాం ఈఎల్‌ఎఫ్ రన్‌వేపై.. రఫేల్, సుఖోయ్, సీ-17 గ్లోబ్‌మాస్టర్ వంటి యుద్ధ విమానాలతో శనివారం ఎయిర్‌షో నిర్వహించారు. ప్రధాని మోదీ, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ తదితరులు తిలకించారు. అస్సాంలో ఈఎల్‌ఎఫ్ ప్రారంభం తనకెంతో గర్వంగా ఉందని ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.
■ అస్సాం పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ శనివారం బ్రహ్మపుత్ర నదిపై నిర్మించిన ఆరు వరుసల భారీ వంతెన(కుమార్ భాస్కర్ వర్మ సేతు)ను ప్రారంభించారు. అనంతరం దానిపై కొద్ది సమయంపాటు నడిచారు. ఈ వంతెన నిర్మాణానికి రూ.3,030కోట్లను వెచ్చించారు. ఐఐఎం-గువాహటి, హైటెక్ డేటా సెంటర్‌ను కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు.

కాంగ్రెస్‌తో దేశ భద్రతకు ముప్పు

దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనే వారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేయాలని నినాదాలు చేసే వారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని ప్రధాని మోదీ విమర్శించారు. గువాహటిలో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ఆరోపించారు.

ఏఐపై రేపటి నుంచి శిఖరాగ్ర సదస్సు

20 దేశాల నుంచి నేతల రాక

దిల్లీ: దక్షిణార్ధగోళ దేశాలకు కృత్రిమ మేధ (ఏఐ) అందుబాటులోకి తీసుకురావడం, ఉన్నతస్థాయి సాంకేతికతల్ని ప్రజాస్వామీకరించేందుకు మార్గాలు అన్వేషించడం ధ్యేయంగా ఐదు రోజులపాటు జరిగే శిఖరాగ్ర సదస్సు సోమవారం దిల్లీలో ప్రారంభం కానుంది. ప్రజలు, భూగోళం, పురోగతి అనే మూడింటిపై ఆధారపడి చర్చలు సాగే ఈ సదస్సుకు 20 దేశాల నుంచి నేతలు, విధాన రూపకర్తలు, నిపుణులు వస్తున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులాడసిల్వా, స్పెయిన్ అధ్యక్షుడు సాంచెజ్ పెరెజ్ కాస్టెజాన్, అబుధాబీ యువరాజు ఖలీద్ బిన్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఐరాస సెక్రటరీ జనరల్ గుటెరస్ తదితరులు హాజరుకానున్నారు. ప్రపంచ దిగ్గజ కంపెనీల నుంచి 40 మంది సీఈవోలు కూడా వస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

కప్ప విషంతో నావల్నీ హత్య

రష్యాపై 5 ఐరోపా దేశాల ఆరోపణలు

లండన్: రష్యా ప్రతిపక్ష నాయకుడు అలెక్సీ నావల్నీని రష్యా ప్రభుత్వం.. డార్ట్ ఫ్రాగ్ అనే ఒక జాతి కప్ప విషంతో చంపిందని ఐదు ఐరోపా దేశాలు ఆరోపించాయి. నావల్నీ శరీర నమూనాల విశ్లేషణ ఆధారంగా దీన్ని నిర్ధారించినట్లు తెలిపాయి. ఈ మేరకు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నెదర్లాండ్స్ విదేశాంగ మంత్రులు శనివారం ఆరోపించారు. నావల్నీ మృతదేహాన్ని పరిశీలించినప్పుడు ఎపిబాటిడిన్ అనే పదార్థం కనిపించిందన్నారు. ఇది ఒక రకం న్యూరోటాక్సిన్ అని, దక్షిణ అమెరికాలో కనిపించే డార్ట్ ఫ్రాగ్ చర్మంలో ఉంటుందని వారు ఒక ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. నావల్నీ.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు బద్ధ వ్యతిరేకి. ప్రభుత్వంలో అవినీతికి వ్యతిరేకంగా భారీ నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. 2024 ఫిబ్రవరి 16న ఆయన కారాగారంలో చనిపోయారు. ఆయనది సహజసిద్ధ మరణమేనని రష్యా అధికారులు వాదిస్తున్నారు.

ఇక జనరల్ బోగీల్లోనూ నిరంతరం శుభ్రత

- తొలి దశలో 80 రైళ్లలో ప్రారంభం
- మూడేళ్లలో అన్నింటికీ విస్తరణ



అశ్వినీ వైష్ణవ్

ఈనాడు, దిల్లీ: రైల్వే శాఖలో కొత్త సంస్కరణల్లో భాగంగా ఇకమీదట రిజర్వ్ బోగీలతోపాటు జనరల్ బోగీల్లోనూ ప్రతి గంటకోసారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఆయన శనివారం సాయంత్రం ఇక్కడి రైల్‌భవన్‌లోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. తొలివిడతలో భాగంగా... దేశవ్యాప్తంగా 80 రైళ్లల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీటిలో దక్షిణ మధ్య రైల్వే నుంచి 5 రైళ్లను ఎంపిక చేశారు. ఆరునెలల తర్వాత ఈ సౌకర్యాన్ని మరో 80 రైళ్లకు విస్తరిస్తామని, క్రమేణా మూడేళ్లలో అన్ని రైళ్లలోని జనరల్ బోగీలనూ శుభ్రపరిచే దిశగా వెళ్తామని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. రైలు బయలుదేరిన చోటునుంచి గమ్యస్థానం చేరే వరకు రద్దీగా ఉండే సమయాల్లో ప్రతి గంటకోసారి, మిగతా సమయాల్లో గంటన్నరకోసారి శుభ్రత కార్యక్రమాలు కొనసాగించబోనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ప్రయాణికులపై అదనపు ఛార్జీల భారమేమీ వేయబోమని స్పష్టంచేశారు. శుభ్రత కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రతి రైలులో ఒక ప్రొఫెషనల్ బృందాన్ని, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఈ కంట్రోల్‌రూం ద్వారా రైళ్ల పరిశుభ్రతకు సంబంధించిన ఫొటోలను ఎప్పటికప్పుడు ఏఐ ఆధారంగా పరిశీలించి సేవల నాణ్యతను మదింపుచేయనున్నట్లు చెప్పారు. రైళ్లలో దిండ్లు, దుప్పట్ల సరఫరాతోపాటు, చిన్న చిన్న రిపేర్ పనులన్నింటినీ ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామని వెల్లడించారు. రైళ్ల పరిశుభ్రత కోసం నియమించే సిబ్బందికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీచేయనున్నారు. ఈ పనులను పర్యవేక్షించే సూపర్‌వైజర్ కనీసం 12వ తరగతి లేదంటే ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు.

షేక్ హసీనా అప్పగింతకు న్యాయ ప్రక్రియే కీలకం

- బంగ్లాదేశ్ నూతన నేత తారిఖ్ రెహమాన్ వెల్లడి



ఢాకా: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన బీఎన్‌పీ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ శనివారం దేశ ప్రజలను ఉద్దేశించి తొలి ప్రసంగం చేశారు. తన తొలి ప్రాధాన్యం దేశ ప్రయోజనాలకేనని స్పష్టంచేశారు. భారత్‌లో తలదాచుకున్న మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పగింత న్యాయ ప్రక్రియపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. హసీనాను అప్పగించాల్సిందిగా భారత్‌ను కోరాలని బీఎన్‌పీ సీనియర్ నేతలు పలువురు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో తారిఖ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలే దేశ విదేశాంగ విధానాన్ని నిర్ణయిస్తాయి' అని తారిఖ్ రెహమాన్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో శాంతి భద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని స్పష్టంచేశారు. ప్రతి ఒక్కరి అభిప్రాయం తీసుకొని దేశాన్ని పునర్నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. మరోవైపు కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షహాబుద్దీన్ మరో నాలుగు రోజుల్లో తారిఖ్ రెహమాన్ ఏర్పాటు చేయనున్న మంత్రివర్గం చేత పదవీ స్వీకార ప్రమాణం చేయించే అవకాశం ఉందని అభిజ్ఞవర్గాలు తెలిపాయి.

భారత్‌తో నిర్మాణాత్మక అనుబంధం


భారత్‌తో నిర్మాణాత్మక అనుబంధాన్ని కొనసాగిస్తామని బీఎన్‌పీ అధినేత తారిఖ్ రెహమాన్ శనివారం స్పష్టంచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనను అభినందిస్తూ సోషల్ మీడియాలో చేసిన పోస్టుకు స్పందిస్తూ ఆయన ఈ విషయం వెల్లడించారు. బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య విలువలకు, అందరి పురోగతికి, ప్రగతిశీల అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన ప్రకటించారు.

సోమవారం ఐచ్ఛిక సెలవు

ఈనాడు, అమరావతి: మహాశివరాత్రి మరుసటి రోజు సోమవారాన్ని ప్రభుత్వం ఐచ్ఛిక సెలవుగా ప్రకటించింది. ఈ మేరకు సీఎస్ విజయానంద్ శనివారం ఉత్తర్వులిచ్చారు. ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగ సంఘం ఛైర్మన్ వినతి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనిపై ఏపీ జేఏసీ అమరావతి నేతలు హర్షం వ్యక్తంచేశారు. ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

4 గ్రాముల బంగారం కోసం వృద్ధుడి దారుణ హత్య!

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఘటన



రమణారెడ్డి

చిల్లకూరు, న్యూస్‌టుడే: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. పశువులను మేపేందుకు వెళ్లిన వృద్ధుడి చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని తస్కరించేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ఆయన్ను దారుణంగా హతమార్చారు. పోలీసుల వివరాల మేరకు.. చిల్లకూరు మండలం నెలబల్లిరెట్టపల్లి గ్రామానికి చెందిన ఏడెం రమణారెడ్డి(84) పశువులను మేపుకొచ్చేందుకు రోజూ మాదిరిగానే ఓడూరు పరిధిలోని పొలాల్లోకి శుక్రవారం ఉదయం వెళ్లారు. సాయంత్రం పశువులు మాత్రమే ఇంటికి వచ్చాయి. రమణారెడ్డి రాకపోవడంతో పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం జామాయిల్ తోటలో ఆయన విగతజీవిగా పడి ఉండటాన్ని కొందరు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి తలపై గాయం ఉండడం, చేతిలోని నాలుగు గ్రాముల బంగారు ఉంగరం మాయం కావడంతో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి బంగారం దొంగిలించినట్లు ప్రాథమికంగా వారు అంచనాకు వచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే యాలి వరలక్ష్మి మృతి



కొబ్బరితోట (తాడేపల్లిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే యాలి వరలక్ష్మి (80) వయోభారం, అనారోగ్యంతో శుక్రవారం రాత్రి తమ స్వగృహంలో మృతి చెందారు. శనివారం ఆమె అంత్యక్రియలు తూర్పు గోదావరి జిల్లాలోని గోదావరి ఒడ్డున నిర్వహించారు. ఆమె భర్త యాలి ఆంజనేయులు మున్సిపాలిటీ ఛైర్మన్‌గా, శాసనసభ్యుడిగా, దేవాదాయశాఖ మంత్రిగా పనిచేశారు. భర్త ఆకస్మిక మరణంతో 1983లో ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఉప ఎన్నికల్లో తెదేపా తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత 1985లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1987 ఉపఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి గెలుపొందారు. 1989లో ఓటమి పాలయ్యారు. యాలి దంపతులకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు.

గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాల దర్యాప్తునకు సిట్

- సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ నేతృత్వంలో ఏర్పాటు
- హైకోర్టు ఆదేశాల మేరకు నియమించిన ప్రభుత్వం
- మార్చి 16లోపు నివేదిక ఇవ్వాలని సిట్‌కు నిర్దేశం

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ప్రధాన పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అక్రమాల నిగ్గు తేల్చడానికి హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌ను సిట్ అధిపతిగా, సీఐడీలోని ఆర్థిక నేరాల విభాగం ఎస్పీ కె.చక్రవర్తిని సభ్యుడిగా నియమించింది. దర్యాప్తు అవసరాన్ని బట్టి ఏ శాఖవారినైనా సిట్‌లో సభ్యులుగా నియమించుకునే స్వేచ్ఛ సిట్ అధిపతికి కల్పించింది. మార్చి 16లోగా హైకోర్టుకు నివేదిక సమర్పించాలని నిర్దేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నిర్వహణ లోపం నుంచి నిధుల దుర్వినియోగం వరకూ..

◆ ఏపీపీఎస్సీ 2018 డిసెంబరు 31న 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. 2019 మేలో ప్రిలిమ్స్, 2022 డిసెంబరులో మెయిన్స్ నిర్వహించింది. మెయిన్స్ పరీక్షకు సంబంధించిన జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయనే కారణంతో పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని 2024 మార్చి 13న హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారు. దాన్ని సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందినవారు, పొందనివారు ధర్మాసనం ముందు అప్పీళ్లు వేశారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల అభ్యర్థన మేరకు అప్పీళ్లపై ధర్మాసనం ప్రస్తుతం పునర్విచారణ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ మూల్యాంకనం వ్యవహారంలో నిధుల దుర్వినియోగం, నిర్వహణ లోపం, ఇతర అక్రమాలు తదితరాలపై దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేయాలని ఈ నెల 11న హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించగా.. ప్రభుత్వం శనివారం దీనిపై నిర్ణయం తీసుకుంది.
◆ ఉద్యోగాలకు ఎంపికైన, ఎంపిక కాని అభ్యర్థుల జవాబు పత్రాలను హైకోర్టు ఆదేశాల మేరకు సిట్ అధికారులు ఫోరెన్సిక్ నిపుణులతో విశ్లేషణ చేయించనున్నారు. పేపర్లు, సిరా తయారీ ఎప్పుడు జరిగిందో తేల్చడం, బార్‌కోడ్‌లతో సరిపోల్చటం, కొట్టివేతలు, రాతలను పరిశీలించడం వంటివి చేయనుంది.
◆ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జవాబు పత్రాలు సక్రమంగా ఉన్నాయా? ఏమైనా తారుమారు చేశారా? జవాబు పత్రాలపై ఉన్న బార్ కోడ్‌లు, ఒరిజినల్ ఓఎంఆర్ షీట్లు.. విజయవాడలో జరిగిన మూల్యాంకనంలో ఉపయోగించిన ఓఎంఆర్ షీట్లపై ఉన్న బార్‌కోడ్‌లు ఒకేలా ఉన్నాయా లేదా అనే అంశాలతో పాటు ఉద్యోగాలకు ఎంపిక కాని అభ్యర్థుల జవాబు పత్రాల్ని పరిశీలించనుంది.

విజయవాడలో ఇప్పటికే కేసు

గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాల వ్యవహారంపై ఏపీపీఎస్సీ నాటి కార్యదర్శి రాజాబాబు ఫిర్యాదు మేరకు గతేడాది 25న విజయవాడలోని సూర్యారావు పేట పోలీసు స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. అప్పట్లో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా పనిచేసిన ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుతో పాటు కామ్‌సైన్ మీడియా యాజమాన్యంపై కేసు నమోదు చేసింది. పీఎస్ఆర్‌తో పాటు కామ్‌సైన్ యజమాని పమిడికాల్వ మధుసూదన్ అరెస్టయ్యారు. ఏసీపీ స్థాయి అధికారి ఈ కేసు దర్యాప్తు బాధ్యతలు చూస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలు కూడా సిట్ తీసుకుంటుందా లేదా అనేదానిపై స్పష్టత లేదు.

పర్యాటక రంగానికి సర్కారు వెన్నుదన్ను

- సదస్సులో ఏఎస్‌హెచ్‌ఏ ప్రతినిధులు

విశాఖపట్నం (పీఎంపాలెం), న్యూస్‌టుడే: పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ఏఎస్‌హెచ్‌ఏ) ప్రతినిధులు స్వాగతించారు. పీఎంపాలెం వైజాగ్ కన్వెన్షన్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రోత్సాహంతో అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా (ఏడీటీఓఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఏపీ ట్రావెల్ మార్ట్ రెండు రోజుల జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏఎస్‌హెచ్‌ఏ సభ్యుల ప్రత్యేక సమావేశం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి.స్వామి అధ్యక్షతన జరిగిన భేటీలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20కి పైగా స్టార్ హోటళ్ల యజమానులు పాల్గొన్నారు. పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.3 కోట్లతో ట్రావెల్ మార్ట్ నిర్వహించడంపై అసోసియేషన్ సంతోషం వ్యక్తం చేసింది. ఇటీవల జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా సుమారు రూ.22 వేల కోట్ల పెట్టుబడులు, 130 ఒప్పందాలు రావడం విశేషమని సభ్యులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ల నేతృత్వంలో ఏపీ పర్యాటక రంగం ఆర్థిక శక్తిగా మారుతోందని కొనియాడారు. జీఎస్టీ 2.0లో హోటల్ రంగానికి 'ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్' (ఐటీసీ) తొలగించడం వల్ల భారీ నష్టం వాటిల్లుతోందని ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఐటీసీని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.మూర్తి చిట్టూరి, కోశాధికారి శివ, ఉపాధ్యక్షుడు వెంకట్, సంయుక్త కార్యదర్శి పవన్‌కార్తీక్, వివిధ హోటల్ గ్రూపుల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.స్వామి, తదితరులు

కొలకలూరి పురస్కారాలకు 5 గ్రంథాల ఎంపిక

- ఈ నెల 26న హైదరాబాద్‌లో ప్రదానం

ఈనాడు, హైదరాబాద్: కొలకలూరి పురస్కారాలు-2026కు అయిదు గ్రంథాలు ఎంపికయ్యాయి. ఆ వివరాలను నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విజేతలకు ఈ నెల 26న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

ఎంపికైన గ్రంథాలు.. రచయితలు: ఏకలవ్య కాలనీ-పలమనేరు బాలాజీ, నల్ల బంగారం-స్వర్ణ కిలారి, ఏకుదారం-డాక్టర్ బి.నాగశేషు, చెమట చెక్కిన వాక్యం-కెంగార మోహన్, విస్తార-ఎంవీ రామిరెడ్డి

కృష్ణా నది తీరంలో 'అమరావతి మెరీనా'

పీపీపీ విధానంలో 33 ఏళ్ల లీజుకి స్థలం కేటాయింపు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి ప్రాంతంలో కృష్ణా నది వద్ద ఎకరా భూమిలో 'అమరావతి మెరీనా' ప్రాజెక్టు ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అనుమతించింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో 33 ఏళ్లకు లీజుపై భూమి కేటాయించనున్నారు. ఈ మేరకు ప్రాజెక్టు ప్రతిపాదనలను రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) 57వ అథారిటీ సమావేశం ఆమోదించింది. దీనికి ప్రభుత్వం కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ శనివారం జారీ చేశారు. ప్రాజెక్టు ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టే ప్రైవేట్ సంస్థలను ఆహ్వానించేందుకు టెండర్లు పిలవాలని ఏపీ అమరావతి గ్రోత్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థను (ఏపీజీఐసీఎల్) ప్రభుత్వం ఆదేశించింది. ప్రాజెక్టు ఏర్పాటు చేసే సంస్థ ఆ ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విలువ ప్రకారం ఎకరా భూమి విలువపై 1% లీజు రుసుము చెల్లించాలి. ప్రతి మూడేళ్లకు లీజు రుసుము 5% చొప్పున పెంచనున్నారు. కేటాయించిన భూమిలో శాశ్వత నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదని ప్రభుత్వం నిబంధనలు విధించింది.

న్యాయవ్యవస్థలో కృత్రిమమేధ వినియోగంపై పరిశోధన అవసరం

కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్



డీఆర్‌డీవో ఛైర్మన్ సమీర్ వి. కామత్‌కు డాక్టరేట్ అందజేస్తున్న కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్. చిత్రంలో సతీష్‌కుమార్, మణిమంగై, సత్యనారాయణన్, టీఆర్ పారివేందర్, ఈడీ ఆచార్య నారాయణరావు

ఈనాడు, అమరావతి-న్యూస్‌టుడే, తుళ్లూరు: 'న్యాయవ్యవస్థలో కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగించడంలో ఇబ్బందులున్నాయి. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులను తగ్గించడానికి కృత్రిమ మేధను పక్కాగా ఎలా వినియోగించుకోవచ్చన్నదానిపై పరిశోధనలు అవసరం. యువత దానిపై దృష్టి సారించాలి' అని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ పిలుపునిచ్చారు. అమరావతిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన ప్రత్యేక స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి. కామత్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఏడుగురు రీసెర్చ్ స్కాలర్లకు పీహెచ్‌డీలు అందించారు. అనంతరం అర్జున్‌రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ కృత్రిమ మేధ మనకు విసురుతున్న సవాళ్లను సమర్థంగా స్వీకరించాలన్నారు. కొత్త సాంకేతిక రంగాలైన క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధ, స్మార్ట్ మెటీరియల్‌పై పరిశోధనలకు యువ శాస్త్రవేత్తలను ఆహ్వానిస్తూ ప్రత్యేక ప్రయోగశాలలు ఏర్పాటు చేసినట్లు డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వ్యవస్థాపక ఛాన్సలర్ టీఆర్ పారివేందర్, ప్రో ఛాన్సలర్ పి. సత్యనారాయణన్, వైస్ ఛాన్సలర్ సీహెచ్ సతీష్‌కుమార్, ట్రస్టీ మెంబర్ మణిమంగై, రీసెర్చ్ గ్రూప్ ఈడీ డి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

520 కేజీల కొమ్ముకోనం

కాకినాడ సముద్ర తీరంలో మత్స్యకారుల వలకు శనివారం భారీ కొమ్ముకోనం చేప చిక్కింది. 12 అడుగుల పొడవుతో ఏకంగా 520 కిలోలు ఉంది. క్రేన్‌తో కుంభాభిషేకం రేవుకు తరలించారు. ఈ బాహుబలి చేపను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు. ఇంత పెద్ద చేపను చూడడం ఇదే తొలిసారని మత్స్యకారులు తెలిపారు. దీన్ని ఓ వ్యాపారి రూ.65 వేలకు వేలంలో కొనుగోలు చేశారు. కోల్‌కతా, ఈశాన్య రాష్ట్రాల్లో ఈ చేపకు మంచి డిమాండ్ ఉంటుందని తెలిపారు.



– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

EENADU Vol: 52, Issue: 186 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్ వారాంతం

విస్తరణ బాటలో అన్విత గ్రూపు



కార్యక్రమంలో పాల్గొన్న బాలకృష్ణ, అచ్యుతరావు


ఈనాడు, హైదరాబాద్: స్థిరాస్తి రంగంలోని అన్విత గ్రూపు దేశంలోని, వివిధ ప్రాంతాలతోపాటు, అమెరికా, దుబాయ్‌లకూ తమ ప్రాజెక్టులను విస్తరించే ప్రణాళికల్లో ఉంది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలో ఒక్కో ప్రాజెక్టును ప్రారంభించబోతున్నట్లు శనివారం సంస్థ ప్రచారకర్త, సినీనటుడు నందమూరి బాలకృష్ణతో కలిసి అన్విత గ్రూపు ఛైర్మన్ బొప్పన అచ్యుత రావు తెలిపారు. 10/90 స్కీమ్ కింద ఫ్లాట్ ధరలో 10% చెల్లిస్తే, ఇల్లు చేతికి వచ్చాకే ఈఎమ్ఐ ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. కొల్లూరు వద్ద హై-9 పేరుతో 31 అంతస్తుల 9 టవర్లను నిర్మిస్తున్నట్లు, తద్వారా 2,200 యూనిట్లు అందుబాటులోకి రాబోతున్నట్లు వెల్లడించారు. అమెరికాలోని డాలస్‌లో 17 ఎకరాల్లో గృహ సముదాయ నిర్మాణాన్ని కంపెనీ ప్రారంభించినట్లు అచ్యుత రావు తెలిపారు. ఈ ఏడాదిలో దుబాయ్‌లోనూ స్థిరాస్తి ప్రాజెక్టు రాబోతున్నట్లు వెల్లడించారు. తమ సంస్థలో ప్రస్తుతం 300 మంది ఉద్యోగులున్నారని, మూడేళ్లలో వీరి సంఖ్య 1,000కి చేరుతుందని పేర్కొన్నారు.

మార్చిలో భారత విపణిలోకి నాట్కో సెమాగ్లుటైడ్

ఈనాడు, హైదరాబాద్: టైప్-2 మధుమేహం, ఊబకాయం చికిత్సలో వాడుతున్న సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్‌ను మార్చిలో భారత విపణిలోకి నాట్కో ఫార్మా విడుదల చేయనుంది. జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్‌ను తయారు చేసి, విక్రయించేందుకు నాట్కో ఫార్మాకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జీఎల్‌పీ-1 తరగతికి చెందిన ఈ ఔషధం.. ఇప్పటికే భారత విపణిలో ఒజెంపిక్, వెగోవీ, రైబెల్సస్ బ్రాండ్లపై డెన్మార్క్‌కు చెందిన నొవో నార్డిస్క్ సరఫరా చేస్తోంది.

వచ్చే 12-18 నెలలు మార్కెట్‌కు మంచి రోజులు

- మిడ్, స్మాల్ క్యాప్‌లలో 20% వరకు ర్యాలీ ఉండొచ్చు
- సెన్సెక్స్ లక్ష పాయింట్ల స్థాయికి చేరే అవకాశాలు



ఈనాడు ఇంటర్వ్యూ

హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ఎండీ, సీఈఓ ధీరజ్ రెల్లి

గత ఏడాదిన్నరగా ఒడుదొడుకులకు లోనవుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు, ఇకపై కోలుకునే అవకాశముందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ఎండీ, సీఈఓ ధీరజ్ రెల్లి విశ్లేషించారు. అంతర్జాతీయ పరిస్థితులు కుదుటపడటం, కంపెనీల షేర్ల ధరలు సహేతుకంగా ఉండటంతో రానున్న 12-18 నెలల కాలం మార్కెట్లకు ఎంతో ఆశాజనకంగా ఉంటుందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో డెరివేటివ్స్‌పై పన్ను పెంపు ప్రభావం, కొత్తతరం మదుపరుల ధోరణి, ఐటీ షేర్లపై ఏఐ ప్రభావం, భవిష్యత్తులో రాణించే రంగాలపై ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. ఆ వివరాలు..

? మార్కెట్ పరిస్థితిని ఎలా విశ్లేషిస్తారు

గత 18 నెలల్లో భారతీయ మార్కెట్లు, ప్రపంచ మార్కెట్లతో పోలిస్తే కాస్త వెనుకబడ్డాయి. ఇందుకు ప్రధాన కారణం విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐలు) నిధులు వెనక్కి తీసుకోవడం, ఏఐ ఆధారిత పెట్టుబడి అవకాశాలు మన దగ్గర తక్కువగా ఉండటం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు. ఇప్పుడు చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి. షేర్ల వాల్యుయేషన్లు (22 పీఈ నిష్పత్తి వద్ద) దీర్ఘకాలిక సగటుతో పోలిస్తే సహేతుకంగా ఉన్నాయి. కరెన్సీ విలువలోనూ పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. అందుకే ఎఫ్‌పీఐలు మళ్లీ భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కాబట్టి, రానున్న 12-18 నెలలు మార్కెట్లకు మంచి రోజులు అనిపిస్తోంది.

? సెన్సెక్స్, నిఫ్టీపై అంచనాలు ఎలా ఉన్నాయి

వచ్చే ఏడాది కంపెనీల ఆదాయ వృద్ధి 14-15% ఉండొచ్చు. కీలక సూచీలు (నిఫ్టీ, సెన్సెక్స్) 12-15%, మిడ్, స్మాల్ క్యాప్‌లలో 18-20% వృద్ధిని ఆశించొచ్చు. ఈ లెక్కన సెన్సెక్స్ లక్ష మార్కునూ, నిఫ్టీ 29,000-30,000 స్థాయిని చేరొచ్చు. అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కచ్చితంగా మేలే చేస్తుంది.

? కొత్తతరం (జెన్ జీ) మదుపర్ల ధోరణి ఎలా ఉంది

యువ మదుపరులు, ముఖ్యంగా 'జెన్-జీ'లు ధరల విషయంలో చాలా స్పష్టంగా ఉంటున్నారు. తక్కువ రుసుముతో, అత్యుత్తమ సాంకేతికత కలిగిన ప్లాట్‌ఫామ్‌లను ఆశ్రయిస్తున్నారు. డిస్కౌంట్ బ్రోకర్ల వైపు మొగ్గు చూపిస్తున్నారు. అందుకే హెచ్‌డీఎఫ్‌సీ నుంచి స్కైని ప్రారంభించాం. ఇందులో ఈక్విటీ, డెరివేటివ్స్, ఈటీఎఫ్‌లు, కమొడిటీలు, అంతర్జాతీయ పెట్టుబడులు వంటి సేవలు లభిస్తాయి.

? పెట్టుబడుల నిర్ణయంలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్ర ఎంత వరకూ ఉంటోంది

ప్రస్తుతం రీసెర్చ్ విశ్లేషణలో, ఎక్కువ కంపెనీలను ట్రాక్ చేయడంలో మాలాంటి సంస్థలకు ఏఐ ఎంతో సాయం చేస్తోంది. భవిష్యత్తులో ఏ షేరును ఎంచుకోవాలి? పోర్ట్‌ఫోలియోను ఎలా నిర్మించుకోవాలి, ఏ మ్యూచువల్ ఫండ్ పథకం బాగుంటుంది వంటి విషయాల్లో ఏఐ సూచనలు కీలకం కానున్నాయి.

? సంప్రదాయ పెట్టుబడుల నుంచి మదుపరులు ఈక్విటీల వైపు మళ్లుతున్నారా

కొవిడ్ అనంతరం ఈక్విటీని ఒక ప్రధాన ఆస్తిగా మదుపరులు గుర్తించారు. స్వల్పకాలంలో మార్కెట్లు పడినా, దీర్ఘకాలంలో రెండంకెల రాబడి వస్తుందని యువ మదుపరులు అర్థం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈక్విటీ విస్తరణ 3% నుంచి 15 శాతానికి పెరిగింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 40-60% ఉంది కాబట్టి ఇక్కడ వృద్ధికి ఆస్కారం ఉంది. పసిడి, వెండి ఈటీఎఫ్‌ల్లోనూ పెట్టుబడులు పెడుతున్నారు.

? బడ్జెట్‌లో ఎఫ్ అండ్ ఓలపై ఎస్‌టీటీ పెంపును ఎలా చూడొచ్చు

సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ)ను పెంచడం వల్ల స్పెక్యులేటర్లు తగ్గి, దీర్ఘకాలిక మదుపరులు పెరుగుతారు. కాకపోతే ఎక్స్ఛేంజీల ఆదాయం-లావాదేవీల పరిమాణంపై ప్రభావం ఉండొచ్చు. బ్రోకింగ్ సంస్థలు ఇకపై మ్యూచువల్ ఫండ్లు, క్యాష్ మార్కెట్, మార్జిన్ ట్రేడింగ్(ఎంటీఎఫ్)లపై దృష్టి సారిస్తాయి.

? ఏయే రంగాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి

ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు బలంగా ఉన్నాయి. ప్రజల తలసరి ఆదాయం 3,000 డాలర్ల (సుమారు రూ.2.7 లక్షలు) నుంచి 6,000 డాలర్ల (దాదాపు రూ.5.4 లక్షలు)కు పెరిగే క్రమంలో ద్విచక్రవాహనాలు, ఎలక్ట్రానిక్స్, ట్రావెల్స్, వాహన రంగాలు బాగుంటాయి. జీవిత బీమా కంపెనీలకు జీఎస్‌టీ సమస్యలున్నా, జనరల్, ఆరోగ్య బీమా కంపెనీలు మంచి వృద్ధిని సాధించొచ్చు. రక్షణ రంగం ఆకర్షణీయమే అయినా, షేర్ల ధరలు కాస్త అధికంగా కనిపిస్తున్నాయి. ఐటీ, ఫార్మా రంగాలను ఆచితూచి ఎంచుకోవాలి. సీడీఎంఓ విభాగంలోని కంపెనీలు ఆసక్తికరంగా కనిపిస్తున్నాయి.

? ఐపీఓల్లో మదుపరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి

అన్ని తొలి పబ్లిక్ ఆఫర్లూ (ఐపీఓ) లాభదాయకం కాకపోవచ్చు. ఎస్ఎంఈ ఐపీఓల విషయంలో సరైన అవగాహన లేకుండా పెట్టుబడి పెట్టొద్దు. కొత్తతరం సాంకేతికత సంస్థలు, బహుళజాతి సంస్థలు మార్కెట్లో నమోదు కావడం మంచి పరిణామం. ఇలాంటి వాటిలో మదుపు చేస్తే దీర్ఘకాలంలో ఫలితాలు బాగుంటాయి. - ఈనాడు, హైదరాబాద్

అంతరిక్షంలో డేటా సెంటర్లు

- ఉపగ్రహాల సమాచార మార్పిడి
- కక్ష్యలో కీలకంగా మారుతున్న ఏఐ
- భారతీయ అంకురాల ముందడుగు



భూమిపై చిన్న చెత్త ముక్క పడి ఉందనుకోండి. పెద్ద ప్రమాదమేమీ లేదు. కానీ, అంతరిక్షంలో పరిస్థితి వేరు. అక్కడ చిన్న శకలం వేగంగా దూసుకొచ్చి ఢీకొడితే పెను ప్రమాదమే సంభవిస్తుంది. రూ.వేల కోట్ల విలువైన ఉపగ్రహాలు, అంతరిక్ష యాత్రలు క్షణాల్లో బూడిదయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. అంతరిక్ష రంగాన్ని రక్షించుకునేందుకు ఇప్పుడు కృత్రిమ మేధ (ఏఐ) కీలకంగా మారుతోంది. ఫిబ్రవరి 16-20 వరకూ దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో భాగంగా కీలకమైన అంతరిక్ష రంగంపైనా చర్చ జరగనుంది.

10 లక్షల వ్యర్థ శకలాలు..

ప్రస్తుతం భూకక్ష్యలో సెంటీమీటరు, అంతకంటే పెద్ద పరిమాణంలో ఉన్న పది లక్షలకు పైగా వ్యర్థ శకలాలు (స్పేస్ డెబ్రిస్) తిరుగుతున్నాయి. వీటిని నిశితంగా గమనించకపోతే భారీ వ్యయంతో కూడిన అంతరిక్ష ప్రయోగాలు ప్రమాదంలో పడే అవకాశముంది. ఈ క్రమంలో భారతీయ స్పేస్ ఇంజినీర్లు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు ఏఐ సాయంతో ఈ వ్యర్థాల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

గణాంకాల స్థానంలో ఏఐ

'50 కిలోల బరువున్న చిన్న ఉపగ్రహానికి ఏడాదిలో కనీసం 15 సార్లు ప్రమాద హెచ్చరికలు వస్తుంటాయి. అంతరిక్షంలో చురుగ్గా ఉన్న ఉపగ్రహాలు, పనిచేయనివి, విడిపోయిన శకలాలు, ఆఖరికి గ్రహశకలాలనూ ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం చాలా ముఖ్యం' అని దిగంతర ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ అనిరుధ్ శర్మ తెలిపారు. సాధారణంగా ఉపగ్రహాలు, వ్యర్థాల గమనాన్ని అంచనా వేసేందుకు ఇప్పటివరకూ గణాంక సమూనాలను వాడుతున్నారు. వారం రోజుల తర్వాత ఒక వస్తువు ఎక్కడ ఉంటుందో కచ్చితంగా అంచనా వేసేందుకు, కక్ష్యలో మార్పులను గుర్తించేందుకు తాము ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసినట్లు అనిరుధ్ వివరించారు. 'కక్ష్యలో రద్దీ పెరుగుతున్న వేళ, ఏఐ అనేది కేవలం ఒక అవసరం మాత్రమే కాదని, ఇది భద్రతకు అత్యవసరమని' ఇండియన్ స్పేస్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ ఏకే భట్ స్పష్టం చేశారు.

కచ్చితమైన సమాచారంతో..

బెంగళూరుకు చెందిన స్టార్టప్ 'పిక్సెల్ స్పేస్'.. ఉపగ్రహ చిత్రాల విశ్లేషణలో ఏఐని విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొంది. సంస్థ సీఈఓ అవైస్ అహ్మద్ మాట్లాడుతూ.. 'ఉపగ్రహాల నుంచి వచ్చే పెటాబైట్ల కొద్దీ డేటాను వ్యక్తులు విశ్లేషించడం అసాధ్యం. అందుకే, మేం ఏఐని వాడుతున్నామ'న్నారు. సరిహద్దు భద్రత, వ్యవసాయం, పంట దిగుబడి, ఇంధన లీకేజీలు, కాలుష్యం వంటి అంశాలపై మా ఏఐ మోడల్స్ కచ్చితమైన సమాచారాన్ని ఇస్తాయని తెలిపారు.

స్వయంచాలకంగా...

భవిష్యత్తులో ఉపగ్రహాలు తమకు తామే ప్రమాదాలను పసిగట్టి, ఢీకొనకుండా తప్పించుకునే 'అటానమస్ శాటిలైట్ ఆపరేషన్స్'పై దిగంతర దృష్టి సారించింది. వచ్చే అయిదేళ్లలో ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తుందని అనిరుధ్ శర్మ వెల్లడించారు. ఉపగ్రహాలు ఒకదానితో ఒకటి సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటూ, ప్రమాదాల నుంచి బయటపడతాయని వివరించారు.

- సుహోరా టెక్నాలజీస్ వంటి సంస్థలు మేఘాల అడ్డంకులు తొలగించి, స్పష్టమైన చిత్రాలను అందించేందుకు ఏఐ అల్గారిథమ్‌లను వాడుతున్నాయి. కేవలం జరిగిన విషయాన్ని చెప్పడమే కాకుండా, భవిష్యత్తులో ఏం జరగబోతోందో అంచనా వేసే 'ప్రిడిక్టివ్ మోడల్స్'ను తాము అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ సీటీఓ రూపేష్ కుమార్ తెలిపారు.
- రూ.150 కోట్ల పెట్టుబడితో 'జీఐఎస్ అండ్ ఏఐ కాంపిటెన్సీ సెంటర్'ను ఏర్పాటు చేసినట్లు ఎస్రీ ఇండియా ఎండీ అగేంద్ర కుమార్ తెలిపారు. ఇక్కడ డేటా సైంటిస్టులు, ఏఐ నిపుణులు కలిసి సంక్లిష్టమైన సమాచారాన్ని విశ్లేషిస్తారని పేర్కొన్నారు.

మూలం నుంచే పరిష్కరించేలా

'అంతరిక్షాన్ని సురక్షితంగా, సుస్థిరంగా మార్చాలంటే సమస్యను కేవలం పర్యవేక్షిస్తే సరిపోదు. దాన్ని మూలాల నుంచే పరిష్కరించాల్సిన సమయం ఆసన్నమైంది. అంతరిక్షంలో ఒక వస్తువును గుర్తించి, దాని వద్దకు అత్యంత సమర్థమైన మార్గంలో చేరుకోవడానికి మేం ఏఐని విస్తృతంగా వినియోగిస్తున్నాం' అని అంటున్నారు ఇస్రో మాజీ శాస్త్రవేత్త, కాస్మోసర్వ్ స్పేస్ వ్యవస్థాపకుడు, సీఈఓ చిరంజీవి ఫణీంద్ర. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఈ సంస్థ అంతరిక్ష వ్యర్థాలను నేరుగా తొలగించే పరిష్కారాలను రూపొందిస్తోంది. కంప్యూటర్ సిములేషన్ల ద్వారా రూపొందించిన సింథటిక్ చిత్రాలు, ల్యాబ్‌లలో సేకరించిన వాస్తవ డేటాతో ఏఐ మోడళ్లకు శిక్షణ ఇస్తున్నట్లు చిరంజీవి వెల్లడించారు. అంతరిక్షంలో వెలుతురు ఎప్పుడు ఎలా ఉంటుందో ఊహించలేం.. ఇలాంటి పరిస్థితుల్లోనూ వ్యర్థాల స్థానాన్ని, వాటి దశను కచ్చితత్వంతో గుర్తించడంలో మా ఏఐ సాంకేతికత పనిచేస్తుందని వివరించారు.

కోడి గుడ్లు

15న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	515
వరంగల్	517
విజయవాడ	525
తూ/ప గోదావరి	510
విశాఖపట్నం	510
చిత్తూరు	583

జియో, ఆంథ్రోపిక్ వంటి 15 కంపెనీలతో కూటమి ఏర్పాటు



దిల్లీ: జియో ప్లాట్‌ఫామ్స్, ఆంథ్రోపిక్, ఎరిక్సన్‌తో పాటు సెమీ కండక్టర్లకు క్లౌడ్ మౌలిక సదుపాయాలు, అనుసంధానత అందించే రంగంలో సారూప్యత కలిగిన అంతర్జాతీయ సంస్థలు విశ్వసనీయ సాంకేతిక కూటమి (టీటీఏ)ని ఏర్పాటు చేయడానికి చేతులు కలిపాయి. మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో ఆఫ్రికా, ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికాల నుంచి 15 కంపెనీలు సరిహద్దులను దాటి పని చేయడానికి కలిసి రావడంతో ఈ కూటమి ప్రారంభమైంది. అనుసంధానత, క్లౌడ్ మౌలిక సదుపాయాలు, సెమీ కండక్టర్ల నుంచి సాఫ్ట్‌వేర్, ఏఐ వరకు విశ్వసనీయ సాంకేతిక పరిజ్ఞానం కోసం ఉమ్మడి సూత్రాల ఆధారంగా ఇది జరిగింది. సరఫరాదారు జాతీయతతో సంబంధం లేకుండా, ఈ కూటమిలోని కంపెనీలు పారదర్శకత, భద్రత, డేటా రక్షణ వంటి వాటికి కట్టుబడి ఉంటాయని నిర్ధారించడానికి ఈ సూత్రాలు రూపొందించారు. ఇవి నమ్మకాన్ని పెంచడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు సాంకేతికత ప్రయోజనాలను అందిస్తాయి. అపూర్వమైన సాంకేతిక మార్పు, పెరుగుతున్న సంక్లిష్ట వాతావరణానికి అనుగుణంగా దేశాలు, వినియోగదార్లు, టెక్నాలజీ ప్రొవైడర్లు వారు అందించే సేవల్లో విశ్వసనీయత, స్థితిస్థాపకతను కోరుకుంటున్నారు. ఇదే సమయంలో డిజిటల్ సాంకేతికతలు, వ్యక్తులు, సమాజాలపై వాటి ప్రతికూల ప్రభావం గురించి సందేహాలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ సమస్యలను పరిష్కరించడానికి ఆయా కంపెనీలు కలిసి ముందుకు రావడం చాలా ముఖ్యం. టీటీఏ సభ్యులు ప్రభుత్వాలు, వినియోగదార్లతో కలిసి పని చేసి నమ్మకమైన వర్ధమాన సాంకేతికతల ప్రయోజనాలను ప్రజలకు అందించడమే కాకుండా ఉద్యోగాల సృష్టి, ఆర్థిక వృద్ధికి తోడ్పడాల్సి ఉంది.

ఇవీ కంపెనీలు: ఆంథ్రోపిక్, ఏడబ్ల్యూఎస్, కసావా టెక్నాలజీస్, కోహియర్, ఎరిక్సన్, గూగుల్ క్లౌడ్, హన్వా, జియో ప్లాట్‌ఫామ్స్, మైక్రోసాఫ్ట్, నోకియా, ఎన్‌స్కేల్, ఎన్‌టీటీ, రాపిడస్, సాబ్, ఎస్ఏపీ వంటి కంపెనీలు ప్రస్తుతానికి ట్రస్టెడ్ టెక్ అలయన్స్(టీటీఏ)లో సంతకాలు చేసిన వాటిలో ఉన్నాయి.

వేతన పెంపులు.. తగ్గేదేలే

ఐటీ ఇంక్రిమెంట్లపై కాస్త ప్రభావం



కొత్త లేబర్ కోడ్‌లను అమలు చేయడం వల్ల అధిక వేతన బిల్లులు చెల్లించాల్సి వస్తున్నప్పటికీ.. చాలా వరకు కంపెనీలు వేతన పెంపులను తగ్గించే ప్రయత్నం చేయకపోవచ్చని హెచ్‌ఆర్ అధిపతులు, వేతన నిపుణులు అంటున్నారు. అయితే కొన్ని రంగాల్లో ముఖ్యంగా ఐటీలో ఇంక్రిమెంట్లపై కాస్త ప్రభావం పడొచ్చని భావిస్తున్నారు. అమలుతో తగ్గిన లాభాలు నవంబరు 2025 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త కార్మిక స్మృతులతో ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఓవర్‌టైం, బోనస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి ప్రయోజనాలు పెరిగాయి. దీంతో కంపెనీల వ్యయాలపైనా ఒత్తిడి పడింది. చాలా వరకు సంస్థలు ముఖ్యంగా భారీ సిబ్బంది ఉన్న ఐటీ కంపెనీలు వన్ టైం కేటాయింపులు, అమలు సంబంధిత వ్యయాల వల్ల గత త్రైమాసికంలో తక్కువ లాభాలను నమోదు చేసిన సంగతి తెలిసిందే.

వలసల భారం కంటే పెంపే మేలు..

'వేతన వృద్ధి అనేది నిబంధనల వ్యయాల కంటే కూడా కార్మికుల గిరాకీ, నైపుణ్యాలు, ఉత్పాదకతపై ఎక్కువగా ఆధారపడతాయి. అందువల్ల వేతనాలు తగ్గిస్తే అధిక వలసలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అది మరింత వ్యయాలకు దారి తీస్తుంద'ని విశ్లేషకులు అంటున్నారు. లేబర్ కోడ్ అమలు భారాల నిర్వహణకు కంపెనీలు వేర్వేరు విధానాలను అనుసరిస్తున్నాయి. కొన్ని కంపెనీలేమో ఈ వ్యయాలకు విడిగా బడ్జెట్‌ను కేటాయించగా.. మరికొన్ని మొత్తం వేతన పూల్ నుంచే ఖర్చుచేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ముందుగానే ఈ వ్యయాలను ఊహించి, బఫర్ ఉంచుకున్నాయి. మొత్తం మీద 2026లో వేతన ఇంక్రిమెంట్లు 9 శాతం వరకు ఉండొచ్చని అంచనా.

నిపుణులకు ఇబ్బంది లేదు..

అత్యంత మెరుగైన పనితీరును ప్రదర్శించే, కీలక హోదాల్లో ఉన్న వారికి కంపెనీలు ఏ లోటూ చేయడం లేదు. స్పెషలైజ్డ్ స్కిల్స్ ఉన్న వారికి గిరాకీ ఎక్కువగా ఉండడం ఇందుకు నేపథ్యం. అయితే మార్జిన్‌ల విషయంలో ఇబ్బంది పడే ఐటీ సంస్థలు, కొన్ని ఎన్‌బీఎఫ్‌సీ(బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ)లలో మాత్రం ఇంక్రిమెంట్లు కాస్త తక్కువగా ఉండొచ్చని అంచనా. అలాగే ఆదాయంలో ఉద్యోగుల వ్యయాల వాటా అధికంగా ఉండే కంపెనీలు కూడా వేతన పెంపు విషయంలో ఆచితూచి అడుగులు వేయొచ్చు. అటువంటి సంస్థలకు 8-9% పెంపు చేయడం సవాలుగా మారొచ్చు.

ఉద్యోగులతో బంధం ముఖ్యం

లేబర్‌కోడ్‌ల ప్రభావం పడింది కదా అని కంపెనీలు వేతన పెంపులను ఆపలేవు. మార్కెట్‌తో పాటే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కాస్తంత ఇంక్రిమెంట్లే చేస్తే అది ఉద్యోగులతో ఉన్న బంధంపై ప్రభావం చూపుతుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కంపెనీలు సమయం తీసుకుని లేబర్‌కోడ్‌లను మరింతగా విశ్లేషించి, తమ వేతన నిర్మాణాలను పునర్ నిర్మించే అవకాశం కనిపిస్తోంది. ఉద్యోగుల సంఖ్య, అవుట్‌సోర్సింగ్, ఆటోమేషన్ వంటి ప్రణాళికలపై కంపెనీలు పునరాలోచించుకునేలా ఈ కొత్త లేబర్ కోడ్‌లు చేస్తున్నాయి.

భారత్‌లోని విమానాశ్రయ ప్రాజెక్టుల్లో భాగస్వామ్య అవకాశాలను పరిశీలిస్తున్నాం

ఛాంగి ఎయిర్‌పోర్ట్ ఛైర్మన్



లిమ్ మింగ్

దిల్లీ: భారత్‌లోని విమానాశ్రయ ప్రాజెక్టుల్లో భాగస్వామిగా చేరేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఛాంగి ఎయిర్‌పోర్ట్ గ్రూపు ఛైర్మన్ లిమ్ మింగ్ యాన్ తెలిపారు. స్థానిక భాగస్వాములతో జట్టు కట్టడం ద్వారా ఉభయులూ ప్రయోజనం పొందాలన్నదే తమ ఆలోచనగా ఉందని ఆయన చెప్పారు. సింగపూర్‌లో ఛాంగి ఎయిర్‌పోర్ట్‌ను ఈ గ్రూపు నిర్వహిస్తోంది. 'భారత విపణిలో వృద్ధికి అవకాశాలు ఉన్నాయనే విషయాన్ని కాదనలేం. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఉన్న పరిస్థితులను మేం నిశితంగా గమనిస్తున్నాం. ఇక్కడి విమానాశ్రయ ప్రాజెక్టుల్లో మేం ఎలా భాగస్వాములు కావొచ్చనే విషయాన్ని పరిశీలిస్తున్నామ'ని ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ యాన్ చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ విమానాశ్రయంలో ఛాంగి ఎయిర్‌పోర్ట్ గ్రూపునకు పెట్టుబడులు ఉన్నాయి. దుర్గాపూర్ విమానాశ్రయం మెరుగైన పనితీరును కనబరుస్తోందని.. ఈ విమానాశ్రయం చిన్నదైనప్పటికీ, సాంకేతిక సహకారం ద్వారా దీనికి మరింత విలువను జోడిస్తున్నామని ఆయన తెలిపారు. 'వ్యాపారంలో కొంత వాళ్లు చూసుకుంటే.. మా వరకు మేం బలంగా ఉన్న విభాగంలో సహకారం అందిస్తాం. అప్పుడే ఇరువురికి ప్రయోజనం ఉంటుంద'ని యాన్ తెలిపారు.

అవకాశవాదానికి మేం దూరం: ఆకాశ ఎయిర్ సీఈఓ

విమానాల నిర్వహణలో క్రమశిక్షణ, ప్రణాళికకు తాము ప్రాధాన్యం ఇస్తామని, అవకాశవాదంతో ఎప్పుడూ ఆలోచన చేయబోమని ఆకాశ ఎయిర్ సీఈఓ వినయ్ దూబే తెలిపారు. విమాన సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా.. విమానాల సంఖ్యను సమర్థంగా నిర్వహించడమే ఆకాశ ఎయిర్ బలమని చెప్పారు. విమాన ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్నప్పుడు ఒకలా.. తక్కువగా ఉన్నప్పుడు మరోలా విమానాలను అద్దెకు తెచ్చుకోవడం లేదంటే తిరిగి పంపించేయడం లాంటివి చేయబోమని తెలిపారు. 2022 ఆగస్టులో కార్యకలాపాలు ప్రారంభించిన ఆకాశ ఎయిర్ వద్ద ప్రస్తుతం 33 విమానాలు ఉన్నాయి. త్వరలో వీటికి మరోటి జత చేరనుంది.

ట్రెన్స్‌లో 60% వాటా కొనుగోలు: ఇక్సిగో

లావాదేవీ విలువ రూ.125 కోట్లు

ixigo

దిల్లీ: స్పెయిన్‌లోని రెండో అతి పెద్ద రైలు బుకింగ్ ప్లాట్‌ఫామ్ ట్రెన్స్‌లో 60 శాతం వాటాను 11.70 మిలియన్ యూరోలకు (రూ.125 కోట్లకు పైగా) కొనుగోలు చేయడానికి బోర్డు బైండింగ్ ఒప్పందాల అమలుకు ఆమోదం తెలిపినట్లు ట్రావెల్ అగ్రిగేటర్ ఇక్సిగో వెల్లడించింది. ట్రెన్స్ కొనుగోలుతో, రైలు ప్రయాణానికి ప్రపంచ ప్రమాణంగా పరిగణించే ఐరోపాలోకి ఇక్సిగో వ్యూహాత్మక ప్రవేశానికి మార్గం సుగమం అవుతుంది. ఈ కొనుగోలుతో ఐరోపాలో కొత్త వృద్ధి అవకాశాలను అన్‌లాక్ చేయడం, మెరుగైన వినియోగదారు అనుభవం అందించడం కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. స్క్వాడ్ యాజ్ సర్వీస్ ఎస్.ఎల్., స్పెయిన్ (స్క్వాస్)లో 45.02 శాతం వాటాను 0.45 మిలియన్ యూరోల (సుమారు రూ.4.83 కోట్ల)తో కొనుగోలు చేసేందుకు కూడా ఇక్సిగో బోర్డు ఆమోదం తెలిపింది.

అక్విజిషన్ రుణ పరిమితి 75 శాతానికి

తుది మార్గదర్శకాల్లో పెంచిన ఆర్‌బీఐ

ముంబయి: కంపెనీలు చేపట్టే కొనుగోళ్లకు బ్యాంకులిచ్చే రుణాలపై (అక్విజిషన్ ఫైనాన్స్) తుది మార్గదర్శకాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసింది. కొనుగోలు ఒప్పందం విలువలో 75 శాతం వరకు రుణం ఇచ్చేందుకు ఇందులో వీలు కల్పించింది. ప్రతిపాదిత ముసాయిదా మార్గదర్శకాల్లో ఈ పరిమితి 70 శాతంగానే ఉన్న సంగతి తెలిసిందే. కొత్త కంపెనీలను ఏర్పాటు చేసే సమయంలో ప్రమోటర్ల వాటా కొనుగోలుకు సైతం నిధులు అందించేందుకు బ్యాంకులకు వీలు కల్పించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. అయితే మొత్తం రుణ పరిమితి కొనుగోలు విలువలో 75 శాతానికి మించరాదని పేర్కొంది. అలాగే కొనుగోలు విలువను బ్యాంకులే స్వతంత్రంగా మదింపు చేయాలని సూచించింది.

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ రావట్లేదు

దిల్లీ: ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిన ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్, తన భారత పర్యటనను రద్దు చేసుకున్నారని ఒక ఉన్నతాధికారి వెల్లడించారు. కొన్ని అనివార్య పరిస్థితుల కారణంగానే ఆయన తన సందర్శనను రద్దు చేసుకున్నారని, అయితే వారి ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపుతున్నారని తెలిపారు. వేగవంతమైన ప్రాసెసింగ్ జీపీయూ సర్వర్ల కారణంగా ఏఐ వ్యవస్థలో ఆధిపత్యం కొనసాగిస్తున్న కంపెనీల్లో ఎన్‌విడియా ఒకటిగా ఉంది. దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 16-20 తేదీల్లో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ జరగనుంది. మన దేశంలోని అసాధారణ ఏఐ పరిశోధకులు, అంకురాలు, డెవలపర్లు, ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్న భాగస్వాములు పాల్గొంటున్న సమ్మిట్‌లో ఎన్‌విడియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జయ్ పురి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పాల్గొననుంది.

మణప్పురంలో వాటా కొనుగోలుకు బెయిన్ క్యాపిటల్‌కు ఆర్‌బీఐ అనుమతులు

దిల్లీ: పసిడి రుణాల సంస్థ మణప్పురం ఫైనాన్స్‌లో 41.66 శాతం వాటాను బెయిన్ క్యాపిటల్ కొనుగోలు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతులు ఇచ్చింది. ఆ మేరకు మణప్పురం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. మార్చి 20, 2025న కుదిరిన ఒప్పందం ప్రకారం.. మణప్పురంలో 18% వాటాను రూ.4,385 కోట్లకు కొనుగోలు చేయడానికి బెయిన్ క్యాపిటల్ అంగీకరించింది. ఈ లావాదేవీ వల్ల ప్రజల నుంచి 26% వాటా కొనుగోలుకు తప్పనిసరి ఓపెన్ ఆఫర్ చేయాల్సి వస్తుంది. కాగా, ఆర్‌బీఐ తాజా అనుమతులతో కంపెనీలో ప్రమోటరుగా బెయిన్ క్యాపిటల్ మారుతుంది. ప్రస్తుత ప్రమోటర్లతో పాటు బెయిన్‌కు సైతం మణప్పురం ఫైనాన్స్‌పై నియంత్రణ లభిస్తుంది. బెయిన్ క్యాపిటల్ నుంచి నామినీ డైరెక్టర్లు చేరుతారు. ఓపెన్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఆధారంగా పెట్టుబడుల అనంతరం బెయిన్‌కు 18 శాతం నుంచి 41.7 శాతం వరకు వాటా ఉంటుందని మణప్పురం ఫైనాన్స్ తెలిపింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
జువారీ ఇండస్ట్రీస్	(26.42)	(25.23)	301.48	274.00
కామధేను	21.00	12.45	175.59	172.65
అనుపమ్ రసాయన్	61.00	54.21	512.44	390.14
సదరన్ పెట్రోకెమికల్స్ ఇండస్ట్రీస్	54.07	38.50	778.39	823.23

ఐఓబీ నుంచి మరిన్ని స్టార్టప్ బ్యాంకింగ్ శాఖలు

చెన్నై: ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) తన 90వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని 'స్టార్టప్ బ్యాంకింగ్' నెట్‌వర్క్‌ను విస్తరించింది. చెన్నైలో తమ తొలి స్టార్టప్ బ్యాంకింగ్ శాఖ విజయవంతం కావడంతో దిల్లీ, ముంబయి, బెంగళూరులోనూ ప్రత్యేక స్టార్టప్ బ్యాంకింగ్ శాఖలను ప్రారంభించినట్లు ఐఓబీ మేనేజింగ్ డైరెక్టరు, సీఈఓ అజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను దరిచేర్చే ఉద్దేశంతో 'ఐఓబీ గ్రామ్ స్వీకార్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా తమిళనాడులోని 14 జిల్లాల వ్యాప్తంగా, కేరళలోని తిరువనంతపురంలో కలిపి మొత్తం 90 గ్రామాల్లో రుణ మంజూరును పెంచడం, బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించడం, తాము అందిస్తున్న ఆర్థిక ఉత్పత్తులు, సేవల ప్రచారంపై దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతిలో తమ వంతు సహకారం అందించేందుకు వినూత్నతకు, సేవల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని ఐఓబీ కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.

ఈనాడు సినిమా

నాకు వర్షంలా.. సంతోశ్‌కి కపుల్ ఫ్రెండ్లీ: ప్రభాస్



'కపుల్ ఫ్రెండ్లీ' అందమైన ప్రేమకథా చిత్రమని కథానాయకుడు ప్రభాస్ ప్రశంసించారు. తనకు 'వర్షం' సినిమాలా.. సంతోశ్‌కి ఇది గుర్తుండి పోయే చిత్రమవుతుందని చెప్పారు. సంతోశ్ శోభన్ - మానస వారణాసి జంటగా నటించిన ఈ సినిమాని అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కిం చిన సంగతి తెలిసిందే. యూవీ క్రియేషన్స్ సమర్పణలో పి.అజయ్ కుమార్ రాజు నిర్మించారు. ఇది తాజాగా థియేటర్ల లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిం చారు. ఈ సినిమా చూడటాన్ని తాను చాలా ఎంజాయ్ చేశా నని తెలిపారు. సంతోశ్ - మానస జోడీ అద్భుతంగా ఉందని.. అశ్విన్ ఎంతో గొప్పగా తెరకెక్కించారని ప్రశంసించారు. ఇలాంటి మంచి కథల్ని తెరపైకి తీసుకొచ్చిన నిర్మాత అజయ్‌కు.. యూవీ క్రియేషన్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇక హైదరాబాద్‌లో ఈ చిత్ర సక్సెస్‌మీట్‌లో హీరో సంతోశ్ శోభన్ మాట్లాడుతూ.. "వాలెంటైన్ డే సీజన్‌లో వచ్చిన పర్ఫెక్ట్ ప్రేమకథా చిత్రమిది. దీన్ని ప్రభాస్ చూసి.. ప్రశంసించడం నేను గెలి చానన్న అనుభూతిని కలిగించింది" అన్నారు. ఈ కార్యక్రమంలో మానస, ధీరజ్ మొగిలినేని, అశ్విన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద క్షణాలతో సాగే 'మై హూ'

ఈ వాలెంటైన్స్ డేకి మీ హృదయాన్ని 'మై హూ' గీతంతో.. ప్రేమ అనుభూతి చెందనివ్వండి అంటోంది నటి చిత్రాంగద సింగ్. ఆమె సల్మాన్ ఖాన్ జంటగా నటిస్తున్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. అపూర్వ లఖియా దర్శకుడు. ఈ సినిమాకి సల్మాన్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ సినిమాలోని రొమాంటిక్ గీతాన్ని చిత్రబృందం సామాజిక మాధ్యమాల వేదికగా ఆవిష్కరించింది. ఈ పాట ఓ సైనికుడి కుటుంబ జీవితంలోని ఆనందక్షణాల తోపాటు.. వారు విధులు నిర్వర్తించడానికి వెళ్లిన పుడు భావోద్వేగాలతో పోరాడుతున్న భార్య నేపథ్యంలో సాగే సన్నివేశాలతో ఆసక్తికరంగా ఉంది. భార్యాభర్తలుగా సల్మాన్, చిత్రాంగదల కెమిస్ట్రీతో ఈ ప్రేమగీతం ఆకట్టుకుంటోంది. ఈ గీతాన్ని అయాన్ లాల్ స్వరపరుస్తూ శ్రేయా ఘోషల్‌తో కలిసి ఆలపిం చారు. అలానే అయాన్.. షబీర్ అహ్మద్‌తో కలిసి సాహిత్యం కూడా అందించారు. గల్వాన్ లోయలో భారత్, చైనా జవాన్ల మధ్య చోటుచేసుకున్న తీవ్ర ఉద్రిక్త తల నేపథ్యంలో రూపొం దుతున్న చిత్రమిది.



సల్మాన్, చిత్రాంగద


జార్జియాలో యాక్షన్!

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్‌ఎస్ రాజమౌళి కలయికలో రూపొందు తోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'. కేఎల్ నారాయణ, ఎస్‌ఎస్ కార్తికేయ నిర్మిస్తు న్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలు పోషిస్తు న్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా హైదరాబాద్ షెడ్యూల్‌ను ముగించి.. తదుపరి షెడ్యూల్ కోసం జార్జియాకు పయనం కానున్నట్లు సమాచారం. ఈ నెలాఖరు నుంచి మొదలు కానున్న ఆ కొత్త షెడ్యూల్‌లో మహేశ్‌తో పాటు మిగి లిన ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ ఘట్టాలు తెరకెక్కించనున్నట్లు తెలు స్తోంది. ఈ ఫాంటసీ మైథలాజి కల్ సినిమాలో రుద్ర.. రాము డిగా రెండు విభిన్న పాత్రల్లో కను విందు చేయనున్నారు మహేశ్. ఇప్పటికే ఇందులోని రామాయణం ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయినట్లు రాజమౌళి ప్రకటించారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రానికి కథ: విజయేంద్రప్రసాద్, ఎస్‌ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, సంగీతం: కీరవాణి, ఛాయాగ్ర హణం: పీఎస్ వినోద్.



మహేశ్ బాబు


బ్లడీ వాలెంటైన్



'డీసీ'

'ఖైదీ', 'విక్రమ్' లాంటి హిట్ చిత్రాలతో దర్శకుడిగా మంచి క్రేజ్‌ను సంపాదించుకున్నారు లోకేశ్ కనగరాజ్. ఇప్పుడాయన హీరోగా 'డీసీ' సినిమాతో తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవు తున్నారు. లోకేశ్, వామికా గబ్బీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. శనివారం ప్రేమికుల రోజు సందర్భంగా 'బ్లడీ వాలెంటైన్' పేరుతో సామాజిక మాధ్యమాల వేదికగా ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఎలాంటి సంభాషణలు లేకుండా సాగు తున్న ఈ వీడియోలో దేవదాస్ పాత్రలో యాక్షన్ అవతారంలో కనిపిస్తూ ఆకట్టు కుంటున్నారు లోకేశ్. చంద్రగా కనువిందు చేయనుంది వామిక. ఈ రొమాంటిక్ యాక్షన్ డ్రామాలో సంజన కృష్ణ మూర్తి కీలక పాత్ర పోషిస్తున్నారు. సన్‌పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా వేసవిలో థియేట ర్లలోకి రాబోతున్నట్లు తెలుస్తోంది.

28న విష్ణు విన్యాసాలు



శ్రీవిష్ణు

రెండు రోజుల వ్యవధిలో వరుసగా రెండు కొత్త సినిమాలతో సందడి చేయనున్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా నటించిన 'విష్ణు విన్యాసం' చిత్రాన్ని ఈ నెల 28నే ప్రేక్ష కుల ముందుకు తీసుకొస్తున్నట్టు శనివారం ప్రకటిం చాయి సినీ వర్గాలు. 27వ తేదీనే ఆయన 'మృత్యుంజయ్' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. రెండు సినిమాల ప్రచార కార్యక్ర మాలు ఊపందుకున్నాయి. యదునాథ్ మారుతిరావు దర్శకత్వంలో తెరకెక్కిన సినిమానే 'విష్ణువిన్యాసం'. నయన్ సారిక కథానాయిక. సుమంత్ నాయుడు.జి నిర్మించారు.

ఆ మాట వాస్తవం కాదు

"కడుపుబ్బా నవ్విస్తూనే మన సుల్ని హత్తుకునే సినిమా 'హే భగవాన్'" అన్నారు నిర్మాత వంశీ నందిపాటి. 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' విజయాల తర్వాత ఆయన.. బన్నీవాస్ సంయుక్తంగా తెరపైకి తీసుకొస్తున్న ఈ చిత్రంలో సుహాస్, శివానీ నాగారం జంటగా నటించారు. గోపీ అచ్చర తెర కెక్కించారు. నరేశ్, స్రవంతి కీలక పాత్రలు పోషించారు. బి. నరేంద్ర రెడ్డి నిర్మాత. ఈ సినిమా ఈ నెల 20న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు నిర్మాత వంశీ.

❑ "ఇది ఆద్యంతం వినోదాత్మ కంగా సాగే సినిమా. కథలో ఓ కొత్తదనముంది. ఇందులో హీరో తండ్రి చేసే బిజినెస్ అనేది ఓ కీల కాంశమే. అది అతను తన తండ్రి గురించి అర్థం చేసుకోవడానికి ఉపయో గపడుతుంది. ఈ సినిమా సుహాస్ కెరీ ర్‌లో ఓ మైలురాయిలా నిలుస్తుంది. గత కొన్నాళ్లుగా విజయం కోసం ఎదురు చూస్తున్న తను ఈ చిత్రంతో మంచి కమ ర్షియల్ సక్సెస్‌ను అందుకోనున్నాడు. ఇందులో శివాని పాత్రకు చాలా ప్రాధా న్యత ఉంటుంది".

❑ "ప్రస్తుతం నేను ఈటీవీ విన్‌తో కలిసి ఓ ప్రాజెక్ట్ చేయబోతున్నా. దాన్ని ఈ నెల 27న ప్రకటిస్తాం. దీనితో పాటే విన్ కోసం మరికొన్ని ప్రాజెక్ట్‌లు చేస్తున్నా. శివాజీ నటించిన 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' చిత్రానికి డిస్ట్రిబ్యూటర్‌గా చేస్తున్నా. అది వచ్చే నెల 6న థియేటర్లలోకి రానుంది. అలాగే 'పొలిమేర 3' చిత్ర పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగు తున్నాయి. ఏప్రిల్ లేదా మేలో చిత్రీకరణ ప్రారంభిస్తాం".



వంశీ నందిపాటి

❑ "ఈమధ్య చిన్న సినిమాల ప్రొడక్షన్ తగ్గిపోయిందనే మాట వాస్తవం కాదు. 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' విజయాల తర్వాత చిన్న సిని మాలు పెరిగాయి. ఇటీ వల ఛాంబర్‌లో ఒకే నెలలో 300 సినిమా టైటిల్స్ రిజిస్టర్ అయ్యాయి. అంతేకాదు ప్రస్తుతం కేవలం ఓటీటీ కోసమే చేసే సినిమాల సంఖ్య కూడా రెట్టింపయ్యింది. నాకు దర్శకత్వం చేయాలన్న ఆలోచనేమీ లేదు. నిర్మాతగా మంచి సిని మాల్ని అందించాలనేదే నా లక్ష్యం".

'సరస్వతి' వచ్చింది



వరలక్ష్మీ శరత్ కుమార్

విలక్షణ పాత్రలతో ప్రేక్ష కులకు దగ్గరైన వరలక్ష్మీ శరత్ కుమార్ ఇప్పుడు 'సరస్వతి'గా అలరించేం దుకు సిద్ధమవుతోంది. ఇది ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ స్వయంగా తెరకెక్కించిన సినిమా. తన సోదరి పూజా శరత్ కుమార్‌తో కలిసి నిర్మించింది. జీవా, ప్రకాశ్ రాజ్, నాజర్, ప్రియమణి, రాధిక తది తరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను నటి సమంత విడుదల చేసింది. అందులో వరలక్ష్మి ఎరుపు రంగు చీరలో ధైర్యంగా నడిచొస్తూ కనిపించింది. "ఇదొక విభిన్నమైన హై కాన్సెప్ట్ థ్రిల్లర్. బలమైన భావోద్వేగాలతో నిండి ఉంటుంది. చిత్రీక రణ పూర్తయింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: ఎడ్విన్ సకాయ్.

ఏమో ఏమో ఇది...



రోషన్, ప్రీతి

ప్రేమికుల రోజుని పురస్కరించుకుని ఓ సరి కొత్త ప్రేమకథా చిత్రాన్ని అధికారికంగా ప్రక టించాయి నిర్మాణ సంస్థలు సితార ఎంటర్ టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్. 'ఏమో ఏమో ఇది' పేరుతో రూపొంద నున్న ఆ చిత్రంలో... ఇటీవల 'ఛాంపి యన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొ చ్చిన రోషన్ మేకా కథానాయకుడిగా నటిస్తున్నారు. ప్రీతి ముకుందన్ కథానా యిక. శైలేశ్ కొలను దర్శకుడు. సూర్యదే వర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శని వారం ఓ ప్రత్యేకమైన వీడియోతో సినిమాని ప్రకటించింది చిత్ర బృందం. ఆధునికమైన ఈ ప్రేమకథలో అభయ్ అనే యువకుడిగా రోషన్... అపూర్వ అనే యువతిగా ప్రీతి ముకుందన్ కనిపించను న్నారు. 'లవ్‌స్టోరీలో కూడా ట్విస్టులు, టర్న్‌లు, మసాలా అన్నీ ఉంటాయి...' అనే సంభాషణతో ఈ సినిమా కథపై స్పష్టతని చ్చాయి చిత్రవర్గాలు. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ చిత్రం దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ఛాయాగ్రహణం: వంశీ పచ్చిపులుసు.

గుర్తుండిపోయే 'బ్యాండ్ మేళం'



హర్ష్ రోషన్, శ్రీదేవి

"జీవితాంతం గుర్తుండిపోయే సినిమాగా 'బ్యాండ్ మేళం' నిలుస్తుంది" అన్నారు నిర్మాత కోన వెంకట్. ఆయన నిర్మా ణంలో హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన ఈ చిత్రాన్ని సతీశ్ జవ్వాజీ తెరకెక్కించారు. ఇది మార్చి 13న థియే టర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర గ్లింప్స్‌ను దర్శకుడు త్రివిక్రమ్ శనివారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. అనంతరం హైదరా బాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు బాబీ, రచయిత బీవీఎస్ రవి అతిథులుగా పాల్గొన్నారు. "తాళి కట్టడం కలిసి ఉండటం కోసమే అయితే.. మధ్యలో విడిచి పెట్టిన దానికి కాదురా.. చిన్నప్పటి నుంచి నాతోనే ఉన్న వీడికి కట్టాలి రా' అనే డైలాగ్‌తో మా గ్లింప్స్‌ను విడు దల చేశాం. ఆ ఒక్క డైలాగ్ విన్న తర్వాతే ఈ సినిమా చేయాలని నిర్ణ యించుకున్నా. ఈ కథ విన్నప్పుడే నాకు రోషన్, శ్రీదేవి కనిపించారు. ఆ ఇద్దర్నీ ఒప్పిస్తేనే సినిమా చేస్తానని దర్శకుడికి చెప్పేశా" అన్నారు నిర్మాత కోన వెంకట్. ఈ కార్యక్రమంలో హర్ష్ రోషన్, శ్రీదేవి, సతీశ్ జవ్వాజీ, బెక్కం వేణుగోపాల్, విజయ్ బుల్గానిన్ తదితరులు పాల్గొన్నారు.

'అదుర్స్ 2' కథ సన్నాహాలు

ఎన్టీఆర్‌తో 'అదుర్స్ 2' చేయడానికి సిద్ధంగానే ఉన్నట్లు నిర్మాత కోన వెంకట్ వెల్లడించారు. ఇప్ప టికే దానికి సంబంధించి అరగంట కథ సిద్ధమైం దని.. ప్రస్తుతం తారక్ చేతిలో ఉన్న రెండు సినిమాలు పూర్తయ్యే నాటికి దాన్ని పూర్తిగా సిద్ధం చేసి, ఆయనకు వినిపించాలన్న ఆలోచ నతో ఉన్నట్లు తెలిపారు.

చాటు నుంచి చూడటం దేనికో!

పవన్‌కల్యాణ్ బత్తుల కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'పురుష:'. హాసిని సుధీర్, రాయంచ కొక్కురి, విశిక, సప్తగిరి, రాజ్‌కుమార్ కసిరెడ్డి ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. వీరు ఉలవల దర్శకత్వం వహిస్తున్నారు. బత్తుల కోటేశ్వరరావు నిర్మాత. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'చాటు చాటు చాటు నుంచి చూడడాలు దేనికో...' అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని ఇటీవల విడుదల చేశారు.



హాసిని, పవన్

'క్వీన్' పోరాటం

తను ప్రేమించిన వ్యక్తి కలను నిజం చేస్తూ... అతని కలకు చట్టబద్ధమైన గుర్తింపు తీసుకొచ్చేందుకు ఓ అమ్మాయి చేసిన పోరాటం ఎలాంటిదో తెలియాలంటే 'క్వీన్' చూడాల్సిందే. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ యామిని ఈఆర్ కథానాయికగా పరిచయం అవుతున్న చిత్రమిది. రతన్ రిషి దర్శకత్వం వహిస్తున్నారు. వన్ సర్కిల్ సంస్థ నిర్మిస్తోంది. కాలకేయ ప్రభాకర్, అజయ్ ఘోష్, భాయ్ నవీన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రేమికుల రోజును పురస్కరించుకుని శనివారం ఈ సినిమా ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. 'రాళ్ల మీద పేర్లతో మిగిలిపోయిన ప్రేమకథలు కొన్ని... తాజ్‌మహల్ గుర్తులుగా వెలిగిపోయిన కథలు కొన్ని... కానీ ఈసారి దేశపు మనుగడను మార్చే దారిలో... కొత్త శాసనంగా ఈ ప్రేమకథ' అని సూచిస్తూ సాగే ప్రచార చిత్రం సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రంలో ఓ సీనియర్ కథానాయకుడు హీరోయిన్‌కి తండ్రిగా నటించనున్నారని, ఆ పాత్ర ఎంతో ప్రత్యేకంగా ఉంటుందని సినీ వర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సరస్, సంగీతం: యతీశ్.



యామిని

వేసవికి నేను రెడీ



హవీశ్, కావ్య థాపర్

హవీశ్, కావ్య థాపర్ జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'నేను రెడీ'. త్రినాదరావు నక్కిన దర్శకుడు. ఈ సినిమాని హార్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌పీ పతాకంపై రూపొందిస్తు న్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల దశలో ఉన్న ఈ చిత్రాన్ని వేసవికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ప్రేమికుల రోజుని పురస్కరించుకుని చిత్రబృందం ఓ పోస్టర్‌ని ఆవిష్కరించింది. ఈ సినిమాలో బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, మురళీ శర్మ, రోహిణి, హరి తేజ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి స్వరకర్త. యువతకు స్ఫూర్తినిచ్చే కథాంశంతో హాస్యాన్ని మేళవించి ఈ సినిమాని రూపొంది స్తున్నట్లు చిత్రబృందం తెలిపింది.


కావాల్సిందల్లా ఒక్క రోజు

'నాకు తెలియదు నీ మనసుని గెలు చుకోగలనా లేదా అనేది!' అంటూ ప్రియురా లితో తన సందేహాన్ని ఇటీవలే విడుదలైన టీజర్‌లో వ్యక్తం చేశాడు నటుడు జునైద్ ఖాన్. మరి గెలుచుకు న్నాడా లేదా తెలియాలంటే 'ఏక్ దిన్' సినిమా చూడా ల్సిందే. 'వన్ లవ్ వన్ ఛాన్స్' అనేది ఉపశీర్షిక. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ సరసన సాయిపల్లవి కథానాయికగా నటించిన చిత్రమిది. రొమాంటిక్ లవ్ స్టోరీగా ఈ సినిమాని సునీల్ పాండే తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్, మన్సూర్ ఖాన్, అపర్ణ పురోహిత్ సంయుక్తంగా నిర్మిస్తు న్నారు. వేసవి కానుకగా ఈ సినిమా మే 1న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఇన్ స్టాలో ఈ సినిమా నుంచి కొత్త పోస్ట ర్‌ని విడుదల చేసింది. 'దీనికి కావా ల్సిందల్లా ఒక్క రోజు'అనే క్యాప్షన్‌ని జోడించింది. ఈ పోస్టర్‌లో సాయిప ల్లవి చేతిలో మఫిన్‌పై ఉన్న కొవ్వొత్తి వెలుగులో.. చూపుల తోనే తన ప్రియుణ్ని కట్టిప డేస్తూ ఆకట్టుకునేలా ఉంది. ఈ సినిమాలో ఆమె మీరా పాత్రలో ప్రేక్ష కుల్ని అలరించ నుంది.



సాయిపల్లవి, జునైద్ ఖాన్

దర్శకుడు రామానంద్ సాగర్ కుమారుడు ఆనంద్ సాగర్ మృతి



'రామాయణ' (1987 టీవీ సిరీస్) ఫేమ్ దర్శ కుడు రామానంద్ సాగర్ కుమారుడు ఆనంద్ సాగర్ చోప్రా(84) కన్నుమూ శారు. కొన్నేళ్లుగా అనా రోగ్యంతో బాధపడు తున్న ఆయన శుక్రవారం మరణించినట్లు ఆనంద్ భార్య నిషా సాగర్ చోప్రా తెలిపారు. "ఆనంద్ ప్రశాంతంగా వెళ్లి పోయారు. కానీ ఇది మా అందరికీ పెద్ద నష్టం. గత 25ఏ ళ్లుగా నా భర్త పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆ స్థితిలో కూడా 2008లో 'రామాయణం' తీశారు. కానీ రెండే ళ్లుగా ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. ఇక కోలుకోలే కపోయారు" అని ఆమె ఓ ప్రకటనలో వెల్లడించారు. పలు చిత్రాలకు నిర్మాతగా కూడా వ్యవహరించిన ఆనంద్ సాగ ర్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలు వురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

కలలో కనిపించిన వ్యక్తి ఇంటికి వస్తే..?



కలలో కనిపించిన వ్యక్తులు నిజ జీవితంలో ఎదురవుతారా? అంటే అవుననే అంటోంది ఓ అమ్మాయి. కలలో ఆకుపచ్చ కళ్లతో కనిపించి భయపెట్టిన ఓ వ్యక్తి తన ఇంటికే అతిథిలా వచ్చాడని చెప్తుంది. మరి ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు? తన వల్ల ఆ అమ్మాయికి పొంచి ఉన్న ప్రమాదమేంటి? అనేది తెలుసుకోవాలంటే 'రోస్లిన్' సిరీస్ చూడాల్సిందే. నటి మీనా, వినీత్, సంజన దీపు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. 'దృశ్యం', 'నేరు' లాంటి సినిమాలతో అలరించిన దర్శకుడు జీతు జోసెఫ్ ఈ సిరీస్‌కు రన్నర్‌గా వ్యవహరిస్తు న్నారు. సుమేశ్ నందకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ ట్రైలర్‌ను విడు దల చేసింది ఓటీటీ సంస్థ జియోహాట్ స్టార్. రోస్లిన్ అనే అమ్మాయి చుట్టూ ఈ సిరీస్ కథ తిరుగుతుందని ట్రైలర్‌తో స్పష్టమవుతోంది. ఈ సైకలాజికల్ థ్రిల్లర్ సిరీస్ ఈ నెల 27న రానుంది.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ భారత మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
జ: స్జోర్డ్ మారిజ్నే (నెదర్లాండ్స్‌కు చెందిన ఈ అంతర్జాతీయ కోచ్ గతంలో భారత మహిళల హాకీ జట్టుకు కోచ్‌గా పనిచేశాడు. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ నాలుగో స్థానంలో నిలవడంలో కీలక పాత్ర పోషించాడు.)

◆ బీమా కంపెనీల్లో ఎంత శాతం ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు)ని అనుమతించే తుది నియమాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఇటీవల ప్రకటించింది? (గతంలో ఇది తొలుత 26%, తర్వాత 49%, ఆ తర్వాత 74% ఉండేది.) జ: 100%

◆ యూరోపియన్ యూనియన్‌లోని ఏ దేశం ఇటీవల తన జాతీయ కరెన్సీగా 'యూరో'ను స్వీకరించింది? (తద్వారా యూరో జోన్‌లో 21వ సభ్య దేశంగా అవతరించింది. 1881 నుంచి ఈ దేశ జాతీయ కరెన్సీగా లెవ్ ఉంది.)
జ: బల్గేరియా

◆ ఏ దేశ వ్యాపార ప్రయాణికుల కోసం భారతదేశం ఇటీవల ఈబీ-4 వీసాను ప్రవేశపెట్టింది? (ఈబీ-4 అనేది కొత్త ఎలక్ట్రానిక్ వ్యాపార వీసా. దీని కోసం రాయబార కార్యాలయాన్ని సందర్శించకుండానే పూర్తిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ వీసా సాధారణ వాణిజ్య సందర్శనల కోసం కాకుండా ఉత్పత్తి, పెట్టుబడి, సాంకేతిక వ్యాపార కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా రూపొందించారు. ఈ వీసా ఈ దేశీయులను భారతదేశంలో ఆరు నెలల వరకు ఉండటానికి అనుమతిస్తుంది.)
జ: చైనా

మరింత సమాచారం

TENTH Social Studies — Nationalism in India

1. Evaluate the varying motivations, hopes, and struggles of the diverse social groups that participated in the Non-Cooperation Movement of 1921. Choose any three groups and assess how their specific aspirations influenced their engagement with the movement. **8 Marks**

A: **i)** Middle-class people, Peasants, Plantation workers, and Tribal people participated in the Non-Cooperation Movement. **ii)** Middle-class people in the cities, i.e., students, headmasters, teachers, lawyers, merchants, and traders, participated in this movement.

iii) Peasants: In Awadh, the peasants demanded
★ To reduce taxes, ★ To abolish begar,
★ To social boycott the landlords.
In many places, local leaders told peasants no need to pay taxes and land will to redistributed among the poor.

iv) Plantation workers: ★ For plantation workers in Assam, freedom meant the right to move freely in and out of the plantations. ★ They hoped that they would be given land in their own villages.

Final Exams-2026 IMPORTANT Q & A

v) Tribal people: ★ They felt that their traditional rights were denied. ★ The British forced them to contribute begar for road building. ★ They hoped that they would get traditional rights over the forest lands.

2. Evaluate the various ways in which the First World War contributed to the growth and intensification of the National Movement in India.

A: i) War increased taxes, custom duties, and income tax, causing economic hardship. ii) Prices of essential goods rose sharply, creating widespread inflation. iii) Shortages and famine-like conditions generated public dissatisfaction. iv) British forced villagers into the army, causing resentment against colonial rule. v) Indian soldiers who fought bravely received no political rights, creating anger. vi) The growth of industries during the war created new workers who became politically active. vii) Leaders like Gandhi and Tilak used the situation to mobilize masses against British policies. viii) Overall, war exposed British exploitation and gave strong momentum to the national movement.

More Imp Q & Ans



Writer: KSV Krishna Reddy

ఖర్చు తక్కువ.. కచ్చితత్వం ఎక్కువ!

ఇస్రో మిషన్‌లు ప్రత్యేకతలు-విజయాలు

(పీఎస్ఎల్‌వీ)

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అమ్ములపొదిలో అత్యంత నమ్మకమైన అస్త్రం పీఎస్ఎల్‌వీ (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్). దీనిని కేవలం ఒక రాకెట్‌గానే కాకుండా, ఇస్రో 'వర్క్ హార్స్ (నమ్మకమైన గుర్రం)' గా పిలుస్తారు. 1990ల్లో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఈ వాహక నౌక, వరుస విజయాలతో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. ఘన, ద్రవ ఇంధన దశలను (నాలుగు దశల లాంచ్ వెహికల్) మేళవించి సిద్ధం చేసిన మొదటి భారతీయ రాకెట్ ఇది. చంద్రయాన్-1, మంగళయాన్ తదితర ప్రతిష్ఠాత్మక ప్రయోగాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టడమే కాకుండా, ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపి ప్రపంచ రికార్డు సృష్టించిన ఘనత పీఎస్ఎల్‌వీ సొంతం. తక్కువ ఖర్చుతో, అత్యంత కచ్చితత్వంతో ఉపగ్రహాలను ప్రయోగించడంలో ఈ వాహకనౌకకు సాటిలేదు.

అంతరిక్ష సాంకేతికతను సామాన్యుడి చెంతకు చేర్చాలనే లక్ష్యంతో ఇస్రో రూపొందించిన అద్భుత సృష్టి పీఎస్ఎల్‌వీ. తక్కువ ఖర్చుతో, అత్యంత కచ్చితత్వంతో వందలాది స్వదేశీ, విదేశీ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ప్రపంచ అంతరిక్ష వాణిజ్య రంగంలో భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టింది ఈ వాహక నౌక. శాటిలైట్ కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, వాతావరణ అంచనాలకు అవసరమైన కీలక ఉపగ్రహాలను నింగిలోకి మోసుకెళ్లింది. చంద్రయాన్-1 ద్వారా చంద్రుడిపై నీటి జాడను కనుక్కోవడంలోనూ, మొదటి ప్రయత్నంలోనే అంగారకుడి కక్ష్యలోకి చేరిన మంగళయాన్ జైత్రయాత్రలోనూ ఈ వాహక నౌకదే ప్రధాన పాత్ర. విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన పీఎస్ఎల్‌వీ సాధించిన చారిత్రక విజయాలపై పోటీ పరీక్షార్థులు అవగాహన కలిగి ఉండాలి. ప్రయోగ తేదీలతో సహా అంతరిక్ష రంగంలో ఇది సృష్టించిన విప్లవంపై అవగాహన పెంచుకోవాలి.



1) పీఎస్ఎల్‌వీ-డీ2-మిషన్
దీనిలో భాగంగా పీఎస్ఎల్‌వీ-డీ2 వాహక నౌక ద్వారా ఐఆర్ఎస్-పీ2 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. 1994, అక్టోబరు 15న ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. పీఎస్ఎల్‌వీ వాహక నౌక ద్వారా విజయవంతంగా ప్రవేశపెట్టిన మొదటి ఉపగ్రహం ఐఆర్ఎస్-పీ2.

2) పీఎస్ఎల్‌వీ-సీ2-మిషన్
దీనిని 1999, మే 26న నిర్వహించారు. పీఎస్ఎల్‌వీ-సీ2 వాహక నౌక ద్వారా ఐఆర్ఎస్-పీ4 అనే భారతదేశ ఉపగ్రహాన్ని, రెండు విదేశీ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. పీఎస్ఎల్‌వీ వాహక నౌకను ఉపయోగించి వేరే దేశాల ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టడం దీనితోనే ప్రారంభమైందని చెప్పొచ్చు. ఐఆర్ఎస్-పీ4 అనే ఉపగ్రహాన్ని ఓషన్‌శాట్-1 అని కూడా పిలుస్తారు.

3) పీఎస్ఎల్‌వీ-సీ4-మిషన్
ఈ ప్రయోగాన్ని 2002, సెప్టెంబరు 12న నిర్వహించారు. మెట్‌శాట్-I ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఈ ఉపగ్రహానికి మరొక పేరు కల్పనా-I. ఇది వాతావరణ పరిశీలనా ఉపగ్రహం.

4) పీఎస్ఎల్‌వీ-సీ5-మిషన్:



దీనిని 2003, అక్టోబరు 17న నిర్వహించారు. ఈ వాహక నౌక ద్వారా ఐఆర్ఎస్-పీ6 అనే ఉపగ్రహాన్ని కక్ష్యలో ఉంచారు. ఈ ఉపగ్రహాన్నే రిసోర్స్‌శాట్-1 అంటారు. ఇది ఆధునిక రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం.

5) పీఎస్ఎల్‌వీ-సీ11-మిషన్:
2008, అక్టోబరు 22న నిర్వహించిన ఈ ప్రయోగంలో ఇస్రో మొదటిసారిగా పీఎస్ఎల్‌వీ-ఎక్స్ఎల్ రకాన్ని వినియోగించింది. దీని ద్వారా చంద్రయాన్-1 ఉపగ్రహాన్ని విజయవంతంగా చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఇదే భారత మొదటి చంద్రమండల యాత్ర. ఆధునిక రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహమైన చంద్రయాన్-1ను మొదట చంద్రుడి 100 కి.మీ.ల కక్ష్యలో ప్రవేశపెట్టి తిరిగి 200 కి.మీ. కక్ష్యలో స్థిరీకరించారు. ఇందులో 5 భారత్, 6 విదేశీ పరికరాలు ఉన్నాయి. చంద్రుడి ఉపరితలాన్ని పరిశీలించడానికి, జాబిల్లి గురించి అనేక విషయాలను తెలుసుకోవడానికి ఇది ఉపయోగపడింది.

జనరల్ స్టడీస్ సైన్స్ అండ్ టెక్నాలజీ

6) పీఎస్ఎల్‌వీ-సీ17 మిషన్: 2011, జులై 15న పీఎస్ఎల్‌వీ-ఎక్స్ఎల్ ఉపయోగించి జీశాట్-12 ఉపగ్రహాన్ని సబ్ జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టారు. సాధారణంగా పీఎస్ఎల్‌వీ ద్వారా రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలను లోఎర్త్ ఆర్బిట్ దిగువ భూకక్ష్యలో ప్రవేశపెడతారు. కానీ జీశాట్-12 సమాచార ఉపగ్రహాన్ని సబ్ జియోసింక్రోనస్ కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఈ ప్రయోగంలో తొలిసారి దేశీయంగా డిజైన్, అభివృద్ధి చేసిన ఆన్‌బోర్డ్ కంప్యూటర్‌ను, విక్రమ్-1601 ప్రాసెసర్‌ను వాడారు. ఇది వాహక నౌక నావిగేషన్‌కు, దిశానిర్దేశానికి, నియంత్రణకు ఉపయోగపడుతుంది.

7) పీఎస్ఎల్‌వీ-సీ18 మిషన్
ఈ ప్రయోగాన్ని 2011, అక్టోబరు 12న నిర్వహించారు. పీఎస్ఎల్‌వీ-సీ18 వాహక నౌక ద్వారా మెగాట్రాపిక్స్ అనే ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఇది ఇండో-ఫ్రెంచ్ సంయుక్త శాటిలైట్ మిషన్. దీనిద్వారా నీటిచక్రం, శక్తి మార్పిడి, ఉష్ణమండల వాతావరణం గురించి తెలుసుకోవచ్చు. ఉష్ణమండల వాతావరణ పరిశోధనపై దీన్ని ప్రత్యేకమైన ఉపగ్రహంగా చెప్పొచ్చు.

8) పీఎస్ఎల్‌వీ-సీ22 మిషన్: దీనిని 2013, జులై 1న నిర్వహించారు. ఈ ప్రయోగంలో భాగంగా ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఏ ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ కక్ష్యలో ప్రవేశపెట్టారు. భారతదేశ నావిగేషన్ అయిన ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టంలో భాగంగా ప్రయోగించిన మొదటి ఉపగ్రహం ఇది. దీనిలో రుబీడియం పరమాణు గడియారాన్ని ఉంచారు.


9) పీఎస్ఎల్‌వీ-సీ25 మిషన్ అంగారక గ్రహకక్ష్యలోకి రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాన్ని చేర్చే ప్రయోగమిది (మార్స్ ఆర్బిటర్ మిషన్). 2013, నవంబరు 5న నిర్వహించారు. దీనిని ఇస్రో పీఎస్ఎల్‌వీ-సీ25 ద్వారా విజయవంతంగా నిర్వహించింది. భారతదేశ మొదటి గ్రహాంతర మిషన్‌గా పిలిచే ఈ ప్రయోగంతో అంగారక కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపిన 4వ దేశంగా భారత్ నిలిచింది. దీని ద్వారా అంగారక గ్రహ ఉపరితలాన్ని, వాతావరణాన్ని పరిశీలించవచ్చు.

10) పీఎస్ఎల్‌వీ-సీ30 మిషన్ 2015, సెప్టెంబరు 28న చేపట్టిన ఈ మిషన్‌లో భాగంగా పీఎస్ఎల్‌వీ-సీ30 వాహక నౌకను ఉపయోగించి ఆస్ట్రోశాట్ ఉపగ్రహాన్ని 650 కి.మీ. కక్ష్యలో ప్రవేశపెట్టారు. దానిని అంతరిక్ష ఖగోళ పరిశీలనా ఉపగ్రహం లేదా ఆస్ట్రానమీ ఉపగ్రహం అంటారు.

11) పీఎస్ఎల్‌వీ-సీ37-మిషన్ 2017, ఫిబ్రవరి 15న ప్రయోగించారు. దీనిలో భాగంగా పీఎస్ఎల్‌వీ-సీ37 అనే వాహన నౌకను ఉపయోగించి 104 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఒకే వాహక నౌకతో అత్యధిక ఉపగ్రహాలను ప్రవేశపెట్టడం ఇస్రోకు ఇదే మొదటిసారి.

12) పీఎస్ఎల్‌వీ-సీ57 మిషన్ దీనిని 2023, సెప్టెంబరు 2న నిర్వహించారు. ఈ ప్రయోగంలో పీఎస్ఎల్‌వీ-సీ57 రాకెట్‌ను ఉపయోగించి ఆదిత్య-ఎల్1 అనే స్పేస్‌క్రాఫ్ట్ (ఉపగ్రహం)ను సూర్యుడు, భూమి మధ్య ఉన్న లాంగేరియన్ పాయింట్ (ఎల్1)లో ప్రవేశపెట్టారు. ఆదిత్య-ఎల్1 ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన క్రోమోస్ఫియర్, కరోనా, కరోనల్ ఉష్ణం, సౌరగాలులపై అధ్యయనం చేయవచ్చు.

13) పీఎస్ఎల్‌వీ-సీ60 మిషన్ దీనిని 2024, డిసెంబరు 30న చేపట్టారు. స్పాడెక్స్ మిషన్‌గా పిలుస్తారు. స్పాడెక్స్-ఎ, స్పాడెక్స్-బి అనే ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టి డాకింగ్, అన్-డాకింగ్ నిర్వహించారు. ఇది భారత అంతరిక్ష కేంద్రం నిర్మాణానికి పునాది లాంటిది.




రచయిత: డాక్టర్ బి.నరేష్

అనిశ్చితిలోనూ ప్రగతిపథంలో భారత్!

ఆర్థిక సర్వే 2025-26

ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి పరిస్థితులు నెలకొన్న వేళల్లోనూ భారత్ స్థిరమైన, వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తోందని దాదాపు ఇరవై ఏళ్ల క్రితమే ఒక ఆర్థిక సర్వే వెల్లడించింది. ఏటా కేంద్ర బడ్జెట్‌కు ముందు దేశ ఆర్థిక స్థితి, దృక్పథాన్ని ప్రకటించే ఆర్థిక సర్వేను కేంద్రం విడుదల చేస్తుంది. ఈ సంవత్సరానికి తాజాగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల పార్లమెంటులో ఆ నివేదికను ప్రవేశపెట్టారు. భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు ఆధ్వర్యంలో ఆర్థిక మంత్రిత్వశాఖలోని ఆర్థిక విభాగం ఈ సర్వే నిర్వహిస్తుంది. దేశంలో నిర్మాణాత్మక సంస్కరణలు, మౌలిక సదుపాయాల విస్తరణ, తక్కువ ద్రవ్యోల్బణం తదితరాలు వృద్ధి పథానికి దోహదపడుతున్నాయని ప్రస్తుత నివేదిక పేర్కొంది. దేశీయ తయారీని ప్రోత్సహించడం, ప్రపంచ సరఫరా గొలుసులో భారత్ వ్యూహాత్మక భాగస్వామిగా మారడం మొదలైన లక్ష్యాలను నిర్దేశించింది. దేశ ఆర్థిక స్థితి, పనితీరు, వివిధ రంగాల ధోరణులు, సవాళ్లు, అవకాశాలను సమీక్షించే ఆ ఆర్థిక సర్వేలోని ప్రధానాంశాలను డేటాతో సహా పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. అధిక వృద్ధి, స్థితిస్థాపకతతో కూడిన ఆర్థిక వ్యవస్థ వైపు దేశం పయనిస్తున్న తీరును అర్థం చేసుకోవాలి.



1. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం 2027 ఆర్థిక సంవత్సరంలో నిజమైన స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు అంచనా?
   1) 6.5% - 7.0%
   2) 6.8% - 7.2%
   3) 6% - 8%
   4) 9%




2. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని చేరుకోవడానికి కిందివాటిలో ఏ అంశంపై భారత్ దృష్టి సారిస్తుంది?
   1) వ్యవసాయం
   2) వ్యవసాయానికి రాయితీలు తగ్గించడం
   3) సమ్మిళిత, తయారీ రంగాన్ని బలోపేతం చేయడం
   4) పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన
3. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం 2026 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణ రేటు అంచనా?
   1) 1.7% 2) 2.4% 3) 2.8% 4) 3.1%
4. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 5%-6% స్థిరమైన వృద్ధి రేటును ప్రదర్శించిన వాటిని గుర్తించండి.
   1) ఉద్యానవనాలు - మత్స్య సంపద
   2) పశు - మత్స్య సంపద
   3) పశు సంపద - గనులు
   4) మత్స్య సంపద - కోళ్ల పెంపకం
5. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం తయారీ రంగంలో వృద్ధిరేటు పెరిగింది. దీనికి ప్రధాన కారణంగా పేర్కొన్న అంశం...



   1) ఎంఎస్ఎంఈల అభివృద్ధి
   2) స్టార్టప్‌ల పెరుగుదల
   3) ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం 4) ఏదీకాదు
6. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం ప్రపంచ సేవల ఎగుమతుల్లో భారతదేశం ఎన్నో స్థానంలో ఉంది?
   1) 5వ 2) 6వ 3) 4వ 4) 7వ
7. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం పారిశ్రామిక వృద్ధి రేటు..
   1) పెరిగింది 2) తగ్గింది
   3) స్థిరం 4) రుణాత్మకం
8. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం పాఠశాల విద్యలో 2030 నాటికి స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) ఎంత శాతం సాధించాలన్నది లక్ష్యం?
   1) 50% 2) 100% 3) 75% 4) 65%
9. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం ఆరోగ్య సూచికలకు సంబంధించి కింది వాటిలో సరైంది?
   1) ప్రసూతి మరణాల రేటు 86 శాతానికి తగ్గింది.
   2) నవజాత శిశుమరణాల రేటు 70 శాతానికి తగ్గింది.
   3) శిశు మరణాల రేటు 37 శాతానికి తగ్గింది.
   4) పైవన్నీ
10. ఆర్బీఐ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ ఇండెక్స్ దేశ ఆర్థిక పురోగతిని కొలవడానికి 97 సూచికల డేటాను తీసుకున్నారు. కింది అంశాల్లో ఆ డేటాలో లేనిది గుర్తించండి.
   1) బ్యాంకింగ్
   2) పెట్టుబడులు
   3) బీమా
   4) మౌలిక వసతులు




11. 2025 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో ప్రభావమంతమైన మూలధన వ్యయం ఎంతశాతం పెరిగింది?
   1) 3.6% 2) 4% 3) 4.6% 4) 2%
12. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం 2025లో కేంద్ర ప్రభుత్వ ఆదాయం జీడీపీలో ఎంత శాతానికి మెరుగుపడింది?
   1) 8.2% 2) 9.2% 3) 7.9% 4) 9.8%
13. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం స్టార్టప్‌లకు సంబంధించి సరైంది గుర్తించండి.
   1) స్టార్టప్‌లు కేవలం ఐటీ రంగానికే చెంది ఉన్నాయి.
   2) భారతదేశం 10వ పెద్ద స్టార్టప్ ఇకోసిస్టంగా నమోదు.
   3) భారత్ ప్రపంచంలో 3వ అతిపెద్ద స్టార్టప్ ఇకోసిస్టం.
   4) స్టార్టప్‌లకు ప్రభుత్వ సహాయం లేదు.
14. 2025, నవంబరులో ప్రభుత్వ ఈ మార్కెట్ ప్లేస్ (జీఈఎమ్) ద్వారా క్రేత సంవాద్ పరస్పర చర్య కార్యక్రమాన్ని ఏ నగరంలో నిర్వహించారు?
   1) గ్వాలియర్ 2) భోపాల్
   3) ఇండోర్ 4) హైదరాబాద్
15. 2030 నాటికి 7.3 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేసిన భారత జీడీపీ ఎన్నో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించనుంది?
   1) 4వ 2) 3వ 3) 5వ 4) 6వ
16. 2026, జనవరి నాటికి ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన అసంఘటిత కార్మికుల సంఖ్య?
   1) 38 కోట్లు
   2) 31 కోట్లు
   3) 48 కోట్లు
   4) 30 కోట్లు



17. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం సేవలు, ఎగుమతుల్లో ఎంత శాతం వృద్ధి నమోదైంది?
   1) 14.2% 2) 13.6% 3) 12.4% 4) 8.7%
18. UNCTAD (అన్‌కాడ్) వాణిజ్యం, అభివృద్ధి నివేదిక 2025 ప్రకారం వాణిజ్య భాగస్వామ్య వైవిధ్యీకరణలో భారతదేశం గ్లోబల్ సౌత్‌లో ఎన్నో స్థానంలో నిలిచింది?
   1) 6వ 2) 3వ 3) 4వ 4) 8వ
19. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం ఉన్నత విద్యలో స్థూల నమోదు రేటు (జీఈఆర్) ఎంత శాతం లక్ష్యం?
   1) 100% 2) 50% 3) 75% 4) 60%

ఇండియన్ ఎకానమీ

20. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా గ్రీన్‌ఫీల్డ్ పెట్టుబడుల్లో భారతదేశ స్థానం?
   1) 4వ 2) 6వ 3) 3వ 4) 5వ
21. వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఐపీఓ) 2024 ప్రకారం పారిశ్రామిక డిజైన్లలో భారతదేశ స్థానం?
   1) 5వ 2) 4వ 3) 7వ 4) 3వ



22. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం మహిళా నిరుద్యోగం గణనీయంగా...
   1) తగ్గింది 2) పెరిగింది
   3) స్తబ్దంగా 4) ఎలాంటి మార్పు లేదు
23. 2025-26 ఆర్థికసర్వే ప్రకారంటెలీడెన్సిటీ శాతం?
   1) 99.9% 2) 86.76%
   3) 79.64% 4) 90.67%
24. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం ప్రొడక్షన్ లింక్డ్ ఇనీషియేటివ్ (పీఎల్ఐ)కు సంబంధించి సరైంది?
   1) ఈ పథకం రూ.2 లక్షల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించింది.
   2) రూ.18.7 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తి సాధించింది.
   3) ఈ పథకం ద్వారా 12.6 లక్షల ఉద్యోగాల సృష్టి జరిగింది. 4) పైవన్నీ
25. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం ద్రవ్య విలీనం, ద్రవ్య నిర్వహణకు సంబంధించి ఆర్బీఐ ద్రవ్యవిధాన కమిటీని ప్రకటించిన అంశాలకు సంబంధించి సరైంది గుర్తించండి.
   ఎ) రెపో రేటు 100 బేసిక్ పాయింట్ల వద్ద 5.25 శాతం తగ్గించింది.
   బి) నగదు నిల్వ నిష్పత్తి 100 బేసిక్ పాయింట్ల వద్ద 3% కి తగ్గించింది.
   1) ఎ సరైంది 2) బి సరైంది
   3) ఎ, బి సరికావు 4) ఎ, బి సరైనవి
26. ఆర్థిక సర్వేను బడ్జెట్ నుంచి ఏ సంవత్సరంలో వేరు చేశారు?
   1) 1976 2) 1960 3) 1950-51 4) 1964
27. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం 2025, డిసెంబరు నాటికి భారతదేశ పునరుత్పాదక ఇంధన వనరుల సామర్థ్యం?
   1) 48.50 గిగావాట్లు
   2) 38.61 గిగావాట్లు
   3) 29.60 గిగావాట్లు
   4) 50.40 గిగావాట్లు



28. 2025 నాటికి భారతీయ రైల్వే నెట్‌వర్క్ కిలోమీటర్లలో...
   1) 65,400 కి.మీ. 2) 69,439 కి.మీ.
   3) 68,540 కి.మీ. 4) 70,000 కి.మీ.
29. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం 2025, డిసెంబరు నాటికి వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు?
   1) రూ.18.9 లక్షల కోట్లు 2) రూ.17.4 లక్షల కోట్లు
   3) రూ.16.7 లక్షల కోట్లు 4) రూ.15.7 లక్షల కోట్లు
30. 2024 నాటికి ప్రపంచ వస్తు ఎగుమతుల్లో భారత్ వాటా?
   1) 1% 2) 2% 3) 1.8% 4) 3%
31. 2025, నవంబరు నాటికి భారత్ ఆకర్షించిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)?
   1) 64.7 బి.డాలర్లు 2) 68.4 బి.డాలర్లు
   3) 60.5 బి.డాలర్లు 4) 66.50 బి.డాలర్లు
32. అంతరిక్ష మౌలిక సదుపాయాల సామర్థ్యం పెంపు, స్వయంప్రతిపత్తి ఉపగ్రహ డాకింగ్ (స్పాడెక్స్)లో భారతదేశం ఎన్నో స్థానంలో ఉంది?
   1) 7వ 2) 6వ 3) 4వ 4) 8వ
33. 2024 ఆర్థిక సంవత్సరంలో వార్షిక పరిశ్రమల సర్వే (ఏఎస్ఐ) ప్రకారం వ్యవస్థీకృత తయారీ రంగంలో ఉపాధి సంవత్సరానికి ఎంత శాతం పెరుగుతుందని అంచనా?
   1) 7% 2) 6% 3) 5% 4) 4%
34. 2025, డిసెంబరులో అమలు చేసిన సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి చట్టం-2025) కింది అంశానికి సంబంధించింది?
   1) అణువిద్యుత్తును ఉపయోగించడం
   2) అణు సామర్థ్యం పెంచడం
   3) అణు ముడిసరకులను విస్తృతం చేయడం
   4) ఏదీకాదు



35. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం SVAMITVA (స్వమిత్వ) కింది అంశానికి సంబంధించింది?
   1) గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన
   2) గ్రామీణ అక్షరాస్యత పెంపొందించడం
   3) 3.28 లక్షల గ్రామాలను మ్యాపింగ్ చేయడం
   4) గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులను విస్తరింపజేయడం
36. ఏటా ఆర్థిక సర్వే రూపొందించడంలో ఎవరు నాయకత్వం వహిస్తారు?
   1) కేంద్ర ఆర్థికమంత్రి 2) ప్రధాన ఆర్థిక సలహాదారు
   3) ప్రధానమంత్రి 4) కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి
37. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం మూలధన మార్కెట్‌లోని ప్రత్యేక పెట్టుబడిదారుల్లో మహిళా పెట్టుబడిదారుల శాతం?
   1) 25% 2) 30% 3) 35% 4) 20%
38. 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ వినియోగం వాటా ఎంత?
   1) 65.4 2) 60.8 3) 61.5 4) 54.8

సమాధానాలు


1-2, 2-3, 3-3, 4-2, 5-3, 6-4, 7-1, 8-2, 9-4, 10-4, 11-2, 12-2, 13-3, 14-2, 15-2, 16-2, 17-2, 18-2, 19-2, 20-1, 21-3, 22-1, 23-2, 24-4, 25-4, 26-4, 27-2, 28-2, 29-2, 30-3, 31-1, 32-3, 33-2, 34-2, 35-3, 36-2, 37-1, 38-3.

ఈనాడు ప్రతిభ

■ e-mail: support@epratibha.net

20

ఆదివారం ఫిబ్రవరి 15, 2026



ఆదేశిక సూత్రాలు భారత రాజ్యాంగ లక్షణాల్లో ముఖ్యమైనవి. రాజ్యాంగంలోని IVవ భాగంలో 36 - 51 వరకు ఉన్న నిబంధనలు ఆదేశిక సూత్రాల గురించి తెలియజేస్తాయి. వీటిని ఐర్లాండ్ దేశం నుంచి గ్రహించారు. భారతీయులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయపరమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, న్యాయం అందించేందుకు ఆదేశిక సూత్రాలు దోహదపడతాయి. సంక్షేమ రాజ్య స్థాపనే లక్ష్యంగా ఆదేశిక సూత్రాలను, ప్రాథమిక విధులను పొందుపరిచారు. ప్రభుత్వాలకు చట్టాలు, విధానాల రూపకల్పనలో ఇవి ఉపయోగపడతాయి.

న్యాయ సంరక్షణ లేనివి.. పాలనలో ప్రధానమైనవి!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

ఆదేశిక సూత్రాలు

సామాన్య ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేరేలా, ప్రయోజనాలు చేకూర్చే లక్ష్యంతో వీటిని రాజ్యాంగంలో పొందుపర్చారు. భారతదేశాన్ని సంక్షేమ రాజ్యంగా తీర్చిదిద్దడమే ఈ ఆదేశిక సూత్రాల ప్రధాన ఆశయం. కాబట్టి ఆదేశిక సూత్రాల అమలు ద్వారా సాధించే ప్రగతిపైనే ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. ఇవి నిరుద్యోగం, నిరక్షరాస్యత, పేదరికం, అనారోగ్యం, వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వానికి మార్గదర్శకాలుగా పనిచేస్తాయి.

ఆదేశిక సూత్రాల లక్షణాలు

ఆదేశిక సూత్రాలు దేశపాలనకు ప్రధానమైనవి. ఇవి సమాజ సమష్టి ప్రయోజనం కోసం ఉద్దేశించినవి. వివిధ ప్రభుత్వాలు ఆర్థిక వనరుల లభ్యత మేరకు వీటిని అమలు చేస్తాయి. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో, పరిపాలనలో ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. ఆదేశిక సూత్రాలు స్వభావసిద్ధంగా న్యాయరక్షణ లేనివి. వీటిని వెంటనే అమలు చేయాల్సిందిగా ఎవరూ ఆదేశించలేరు. వీటి అమల్లో ప్రభుత్వాలకు విచక్షణాధికారాలు ఉంటాయి. భారతదేశంలో రాజకీయ ప్రజాస్వామ్యం, ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయాన్ని పెంపొందించడమే వీటి ఆశయం. ఇవి అమలు కావాలంటే ప్రభుత్వాలు తప్పనిసరిగా చట్టాలు చేయాల్సి ఉంటుంది. వ్యక్తి ప్రగతి కంటే సామాజిక శ్రేయస్సును పెంపొందించడమే వీటి ప్రధాన లక్ష్యం.

నిబంధనలు - వర్గీకరణ

రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలకు స్పష్టమైన వర్గీకరణ లేనప్పటికీ ప్రభుత్వ పాలనా సౌలభ్యం కోసం ఆదేశిక సూత్రాలను 3 రకాలుగా వర్గీకరించారు. అవి:

1. సామ్యవాద సూత్రాలు 2. ఉదారవాద సూత్రాలు
3. గాంధేయ సూత్రాలు

36వ నిబంధన

రాజ్యం అనే పదాన్ని ఈ నిబంధన నిర్వచిస్తుంది. రాజ్యం అంటే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వం అని అర్థం.

37వ నిబంధన

ఆదేశిక సూత్రాలను అమలు చేయాలని ఏ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేయదు/ఆదేశిక సూత్రాలకు న్యాయ సంరక్షణ లేదు.

38వ నిబంధన

దీని ప్రకారం ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పెంపొందించేందుకు తగిన సాంఘిక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

◆ **38(1):** ప్రజలందరి మధ్య సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని పెంపొందించే ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

ఈ 38వ నిబంధనను 44వ రాజ్యాంగ సవరణ ద్వారా 1978లో 38(1) నిబంధనగా మార్చారు.

◆ **38(2):** విభిన్న ప్రాంతాల ప్రజలు, హోదాలు, వృత్తుల మధ్య ఉండే తారతమ్యాలను తొలగించి అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. ఈ క్లాజును 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

39వ నిబంధన

ప్రభుత్వం తన విధాన రూపకల్పనలో కింది మార్గదర్శక ఆదేశ సూత్రాలను దృష్టిలో పెట్టుకోవాలని ఈ నిబంధన తెలియజేస్తుంది.

39 (A): ప్రజలందరికీ ఉచిత న్యాయసేవ సహాయాన్ని అందించడం.

◆ **39 (a):** స్త్రీ, పురుషులకు సమానంగా జీవన సదుపాయాలు కల్పించడం.

◆ **39 (b):** సంపద, సహజ వనరులను ప్రజలందరి సమష్టి ప్రయోజనం కోసం వినియోగించడం.

◆ **39 (c):** దేశ సంపద, ఆర్థిక వ్యవస్థ, ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవకుండా చూడటం.

◆ **39 (d):** స్త్రీ, పురుష తేడా లేకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం.

◆ **39 (e):** కార్మికులు, బాలబాలికల ఆరోగ్యం, శక్తి, దుర్వినియోగం కాకుండా చూడటం, ఆర్థిక అవసరాల రీత్యా వయసుకు, శక్తికి మించిన పనుల్లోకి బలవంతంగా వెళ్లకుండా చూడటం.

◆ **39 (f):** బాలబాలికల అభివృద్ధికి తగిన అవకాశాలు, సౌకర్యాలు కల్పించడం, బాల్యం, యవ్వనం, వృద్ధాప్యంలో ఎలాంటి పీడనానికి గురికాకుండా చూడటం.

40వ నిబంధన

భారతదేశంలో స్థానిక స్వపరిపాలనా సంస్థలను ఏర్పాటు చేయడంలో భాగంగా పంచాయతీరాజ్ సంస్థలను నెలకొల్పాలి.

41వ నిబంధన

ప్రభుత్వాలు తమ ఆర్థిక స్థోమతకు లోబడి నిరుద్యోగులు, వృద్ధులు, వికలాంగులకు జీవనభృతిని కల్పించాలి. పని హక్కు, విద్యా హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి.

42వ నిబంధన

కార్మికులు ఆరోగ్యకరమైన వాతావరణంలో పనిచేసే విధంగా అనువైన శ్రామిక వాతావరణాన్ని కల్పించాలి. స్త్రీల ఆరోగ్య సంరక్షణ కోసం తగిన చర్యలు తీసుకుని, ప్రసూతి సౌకర్యాలు కల్పించాలి.

43వ నిబంధన

గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా కుటీర పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వాలు కృషి చేయాలి. ఉత్తమ జీవన ప్రమాణాలు కల్పించడంతోపాటు కార్మికులకు కనీస జీవన వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

43 (ఎ): పరిశ్రమల నిర్వహణ యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలి.

43 (బి): ప్రభుత్వాలు సహకార సంఘాల స్థాపనను ప్రోత్సహించాలి.

44వ నిబంధన

భారతదేశంలో నివసించే పౌరులందరికీ వర్తించేలా ఒకేరకమైన ఉమ్మడి పౌరస్మృతిని రూపొందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

45వ నిబంధన

ఆరేళ్లలోపు వయసున్న బాలబాలికల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయడంతో పాటు వారికి పూర్వ ప్రాథమిక విద్యనందించడానికి రాజ్యం చర్యలు తీసుకోవాలి. దీన్ని 2002లో 86వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా మార్చారు. అంతకుముందు ఈ నిబంధనలో 14 ఏళ్ల బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్యా సదుపాయాలు కల్పించాలని పేర్కొంది.

46వ నిబంధన

సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి.

47వ నిబంధన

ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగించే మద్యపానం, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిషేధానికి తగిన చర్యలు తీసుకోవాలి.

48వ నిబంధన

శాస్త్రీయ ప్రాతిపదికన వ్యవసాయం, పాడి పరిశ్రమలను అభివృద్ధిపరుస్తూ పశుసంపద సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలి. గోవధను నిషేధించాలి.

48(ఎ): పర్యావరణ పరిరక్షణకు, వన్య మృగ సంరక్షణకు, అడవుల పెంపకానికి ప్రభుత్వాలు కృషి చేయాలి. ఈ నిబంధనను 1976లో 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చారు.

49వ నిబంధన

భారత ప్రాచీన సంస్కృతికి, పౌరసత్వానికి చిహ్నాలైన చారిత్రక కట్టడాలను పరిరక్షించాలి.

50వ నిబంధన

న్యాయవ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించడంలో భాగంగా కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖను వేరుచేయాలి.

51వ నిబంధన

అంతర్జాతీయ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలి. ఇతర దేశాలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, అంతర్జాతీయ ఒప్పందాలను గౌరవించాలి.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

922 Word of the Day

Redundant

Telugu meaning: అనవసరమైన, అవాంఛిత

English meaning: Redundant (రిడన్డెంట్) is an adjective that describes something that is unnecessary or repeated more than required.

Synonyms: Superfluous, Excessive

Antonyms: Essential, Necessary

Usage: **1.** The report contained several redundant points that could have been removed to make it more precise and effective.

2. Using double negatives in a sentence often makes the meaning redundant and grammatically incorrect.

Current Affairs



The Bangladesh Nationalist Party (BNP) is set to form the next government after sweeping the 13th national parliamentary election and crossing the two-thirds majority mark. According to official results released by the Election Commission for 297 seats, the BNP has won 209 seats on its own, comfortably crossing the 151-seat threshold required to form a government in the 300-member Parliament. BNP chairman Tarique Rahman is expected to become the next prime minister.



The Defence Acquisition Council, chaired by Defence Minister Rajnath Singh, on 12 February 2026 accorded Acceptance of Necessity (AoN) for capital acquisition proposals worth approximately Rs.3.60 lakh crore. The proposals include 114 Rafale fighter jets from France for the Indian Air Force (IAF) and six P-8I long-range maritime reconnaissance aircraft from the United States for the Indian Navy.

Aishwary Pratap Singh Tomar set a new world record en route to winning the gold medal in the men's 50 metre rifle 3 positions event at the Asian Shooting Championships 2026 in New Delhi on 12 February 2026. He defended his title with a score of 362.0 in the final. India completed a clean sweep of the podium in the event, with Niraj Kumar claiming silver with 361.8 and Akhil Sheoran taking bronze with 343.5.

India's export to the United States on agricultural commodities is set to witness a significant jump as 75 percent of such exports will now be at zero tariff, according to a report by SBI. The report said that India has a trade surplus of $1.3 billion in agricultural trade with the US. It noted that India's export of $1.36 billion worth of agricultural commodities will receive zero additional US duty access, which will significantly help Indian farmers and exporters scale up shipments.

For more Current Affairs: Scan QR code

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

శీతోష్ణస్థితి

అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ఒక ప్రదేశ ఉనికి, ఉష్ణోగ్రత, శీతోష్ణస్థితిని అంచనా వేస్తారు. భారతదేశం దక్షిణాసియా ఖండంలో 8°4' - 37°6' ఉత్తర అక్షాంశాలు, 68°7' - 97°25' తూర్పు రేఖాంశాల మధ్య విస్తరించి ఉంది. మనదేశ శీతోష్ణస్థితి - దాన్ని ప్రభావితం చేసే అంశాలు, కాలాలు, వర్షపాతం మొదలైన వాటిపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి.

వాతావరణం

ఒక ప్రాంతంలో నిర్దిష్ట సమయంలోని వాతావరణ పరిస్థితులను వాతావరణం అంటారు. ఇది ప్రతిరోజూ మారుతూ ఉంటుంది.


శీతోష్ణస్థితి

ఒక విశాల ప్రాంతంలో దీర్ఘకాలం పాటు ఒక క్రమాన్ని చూపే వాతావరణ స్థితులను శీతోష్ణస్థితి అంటారు.

▮ సాధారణంగా ఒక ప్రాంత 30 ఏళ్ల వాతావరణ పరిస్థితులను అంచనా వేసి, దాని శీతోష్ణస్థితిని కనుక్కుంటారు.

అక్షాంశం

కర్కటరేఖ భారతదేశం మధ్యగా వెళ్తోంది.



▮ కర్కటరేఖ దక్షిణ ప్రాంతం ఉష్ణ మండలంలో, ఉత్తర ప్రాంతం సమశీతోష్ణ మండలంలో ఉన్నాయి.

శీతోష్ణస్థితిని ప్రభావితం చేసే అంశాలు, సమశీతోష్ణస్థితి, ఎత్తు, తొలకరి జల్లులు - స్థానిక పేర్లు, దేశంలో వర్షపాత విస్తరణ, రుతుపవనాల పుట్టుకను వివరించే సిద్ధాంతాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

మహాసముద్రాలు - విశేషాలు

స్టడీ జోన్

ఖండాల మధ్య విస్తరించిన మహా జలభాగాలను మహాసముద్రాలు అంటారు. భూ ఉపరితల వైశాల్యం సుమారు 510 మిలియన్ చ.కి.మీ. ఉండగా దానిలో జలావరణ వైశాల్యం సుమారు 361 మి.చ.కి.మీ.గా ఉంది. అంటే దాదాపు 71 శాతం భూభాగం నీటితోనే ఆవరించి ఉంది. అందులో ఎక్కువ భాగం మహాసముద్రాలే. ఇవి అపారమైన నీటితో భూగోళం అన్ని భాగాలను చుట్టి ఉంటాయి. ప్రపంచ వాతావరణాన్ని నియంత్రించడంలో, భూమిపై నీటి సమతౌల్యాన్ని కాపాడటంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. పోటీపరీక్షల కోణంలో మహాసముద్రాల గురించి తెలుసుకుందాం..!



మహాసముద్రాలు

మహాసముద్రాలు ఎన్నంటే మనం వెంటనే అయిదు అని చెప్పేస్తాం. కానీ, భూఉపరితలాన్ని కప్పిఉన్న మొత్తం జలభాగాన్ని వాస్తవంగా నాలుగు మహాసముద్రాలుగా విభజించారు. అవి: పసిఫిక్, అట్లాంటిక్, హిందూ, ఆర్కిటిక్. అయిదో మహాసముద్రంగా పిలిచే అంటార్కిటికా లేదా దక్షిణ మహాసముద్రం అనేది ఒక భౌగోళిక ఊహ మాత్రమే.

పసిఫిక్ మహాసముద్రం

☛ మహాసముద్రాల్లోకెల్లా అతి పెద్దది, లోతైంది. ప్రపంచ విస్తీర్ణంలో 1/3వ వంతును ఆక్రమించింది. సగటు లోతు 5,000 మీటర్లు. ఇది త్రిభుజాకారంలో ఉంటుంది.

☛ దీనికి ఉన్న ఇతర పేర్లు: 'ప్రశాంత మహాసముద్రం', 'రింగ్ ఆఫ్ ఫైర్'.

☛ ఇది తూర్పున ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా దేశాల సరిహద్దుల వెంబడి విస్తరించి ఉంది. పశ్చిమాన ఆస్ట్రేలియా, ఆసియా ఖండాలకు సరిహద్దుగా ఉంది.

మహాసముద్రాల ఆవిర్భావం, వాటి ఇతర పేర్లు, విస్తరణ సహా పూర్తి సమాచారంతోపాటు గతపరీక్షల్లో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2026

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ద్వారా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన సెంట్రల్/స్టేట్ యూనివర్సిటీలు, ఐఐటీలు, ఎన్ఐటీలు, ఆర్ఐఈలు, ప్రభుత్వ కళాశాలల్లో 4 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ)లో ప్రవేశానికి పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ద్వారా దేశవ్యాప్తంగా 64 జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో మొత్తం 6,000 సీట్లలో ఐటీఈపీ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్లు పొందవచ్చు. ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో జరుగుతుంది. దరఖాస్తు ఫీజు రూ.1200. అర్హులైన అభ్యర్థులు 2026 మార్చి 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అప్రెంటిస్ ఉద్యోగాలు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) పరిధిలోని మధుర రిఫైనరీలో ట్రేడ్, టెక్నీషియన్ అప్రెంటిస్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 108. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 20 ఫిబ్రవరి 2026.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (ఫిబ్రవరి 15) చివరి తేదీ

☛ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 323 అసిస్టెంట్ కోచ్ ఉద్యోగాలు. బీఎస్సీ, ఎంఎస్సీ ఉత్తీర్ణులు అర్హులు.

☛ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 12 ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు. డిగ్రీ, పీజీ, సీఏ, ఐసీడబ్ల్యూఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ ఎగ్జిమ్ బ్యాంక్‌లో 20 డిప్యూటీ మేనేజర్స్ పోస్టులు. డిగ్రీ, సీఏ, పీజీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


Railway Exams

Reasoning


Venn diagrams

Directions (Qs. 1 - 12): *Each of these questions given below contains three elements. These elements may or may not have some inter linkage. Each group of elements may fit into one of these diagrams at (A), (B), (C), (D). You have to indicate the group of elements which correctly fits into the diagrams.*


1. Which of the following diagrams indicates the best relation between Pssassengers, Bus and Car ?




2. Which of the following diagrams indicates the best relation between Boys, Fathers and Teachers?




3. Which of the following diagrams indicates the best relation between Hospital, ICU and Stethoscope?




4. Which of the following diagrams indicates the best relation between Dancer, Singer and Doctor ?




5. Which of the following diagrams indicates the best relation between Bed, Terrace and Ladder ?




6. Which of the following diagrams indicates the best relation between Teachers, Women, Engineers?




7. Which of the following diagrams indicates the best relation between Students, Boys, Cricket Players.




8. Which of the following diagrams indicates the best relation between Lawyers, Judges, Criminals.




9. Which of the following diagrams indicates the best relation between Doctors, Surgeons, Patients.




10. Which of the following diagrams indicates the best relation between Employees, Managers, Workers



11. Which of the following diagrams indicates the best relation between Buildings, Houses, Rooms



12. Which of the following diagrams indicates the best relation between Books, Novels, Stories.



Scan the QR code for Key

These model questions were prepared by subject experts

నగరాలకు అభివృద్ధి కవచం



- కేంద్ర నిధితో అండ
- సదుపాయాల మెరుగుకు ఆర్థిక హామీ
- 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' ప్రధానాంశాలు ఇవీ

ఈనాడు, దిల్లీ: నగరాలు, పట్టణాల్లో సదుపాయాల అభివృద్ధికి కేంద్రం ప్రకటించిన కొత్త పథకం కింద చేపట్టే ప్రాజెక్టుల వ్యయంలో కనీసం 50% మొత్తాన్ని మార్కెట్ నుంచి సేకరించాల్సి ఉంటుంది. మున్సిపల్ బాండ్ల జారీ, బ్యాంకు రుణాలు, పీపీపీ విధానం ద్వారా ఈ నిధులు సేకరించుకోవచ్చు. మిగిలిన వాటాను రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థలు సమకూరుస్తాయి. 2025 అంచనాల ప్రకారం 10 లక్షలు, అంతకుమించి జనాభా ఉన్న అన్ని నగరాలు, రాష్ట్రాల రాజధానులు, లక్షకు మించి జనాభా ఉన్న ప్రధాన పారిశ్రామిక నగరాలు, కొండ ప్రాంత/ ఈశాన్య రాష్ట్రాల్లోని అన్ని పట్టణ స్థానిక సంస్థలకు పథకం వర్తిస్తుందని తెలిపింది. మొత్తంగా నగరాలన్నీ దీనికిందికి వస్తాయి.

✦ ప్రాజెక్టులను పారదర్శకంగా, ఛాలెంజ్ విధానంలో ఎంపిక చేస్తారు. ఆ నగర జీవనంపై ఎక్కువ ప్రభావం చూపే, సంస్కరణల ప్రాధాన్యం ఉన్న ప్రతిపాదనలకు ఇందులో పెద్దపీట వేస్తారు.


ఏయే పనులు చేపట్టాలి?



✦ నగరాల్లో వారసత్వంగా వస్తున్న మౌలిక వసతులను ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు మరమ్మతు చేసి మెరుగుపరచుకోవచ్చు.

✦ నగరాన్ని 'గ్రోత్‌హబ్‌'గా మార్చేందుకు వీలుగా గ్రీన్‌ఫీల్డ్/ సెమీ గ్రీన్‌ఫీల్డ్ ప్రధానమైన మౌలికవసతులు అభివృద్ధి

✦ ప్రధాన వాణిజ్య ప్రాంతాలు/ ముఖ్యమైన వారసత్వ కేంద్రాల పునరుద్ధరణ/ పునరుజ్జీవనం



✦ మురుగు నీరు, వర్షపు నీటిపారుదల వ్యవస్థల ఆధునికీకరణ. వాటర్‌గ్రిడ్‌ల నిర్మాణం.

✦ బ్రౌన్‌ఫీల్డ్ ప్రాంతాలను ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు తీర్చిదిద్దడం



✦ ట్రాన్సిట్ కారిడార్లు, అర్బన్ మొబిలిటీ సెంటర్లు, ఎకనమిక్ కారిడార్ల ఏర్పాటు

✦ మల, ద్రవ వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం. కొండల్లా పేరుకుపోయిన డంపింగ్‌యార్డుల తొలగింపు. వ్యర్థాల శుద్ధి సమీకరణ చేయడం వంటి పనులు చేపట్టవచ్చు.



✦ రిస్క్ షేరింగ్ నిబంధనలు, ప్రజలకు అందించే పౌర సేవలకు కొలమానాలు నిర్దేశించడం వంటి ఇందులో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తారు.

చిన్న నగరాలకు రుణ చెల్లింపు హామీ

ఈశాన్య, కొండ ప్రాంతాల్లో ఉన్న నగరాలు, మిగతా రాష్ట్రాల్లోని లక్షలోపు జనాభా ఉన్న చిన్న పట్టణాలు మార్కెట్‌ల నుంచి ఆర్థిక వనరులు సమీకరించుకోవడానికి వీలుగా అవి తీసుకొనే రుణాల తిరిగి చెల్లింపునకు కేంద్రం హామీ ఇస్తుంది. ఇందుకోసం రూ.5వేల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తోంది. చిన్న పట్టణాలు తొలిసారి తీసుకొనే రుణాల్లో రూ.7 కోట్లవరకు, లేదంటే తీసుకున్న రుణాల్లో 70% వరకు (ఏది తక్కువ ఉంటే అంతవరకు) కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది. తొలిసారి తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లిస్తే, ఆ తర్వాత తీసుకొనే రుణాలకు రూ.7 కోట్ల వరకు, లేదంటే రుణ మొత్తంలో 50% వరకు గ్యారంటీ ఇస్తుంది. దీనివల్ల చిన్న పట్టణాలు తొలిసారి రూ.20 కోట్ల వరకు, రెండోసారి రూ.28 కోట్లవరకూ ప్రాజెక్టులు చేపట్టడానికి అవసరమైన ఆర్థిక వనరులను మార్కెట్ నుంచి సేకరించుకోవడానికి వీలవుతుందని కేంద్రం తెలిపింది.

✦ రెండు, మూడో అంచె నగరాలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 4,223 పట్టణాల రుణ సామర్థ్యాన్ని పెంచడానికి ఇది ఉపయోగపడుతుంది.

ఏ సంస్కరణలు తీసుకురావాలి?

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద సాయం పొందాలంటే స్థానిక సంస్థలు పలు సంస్కరణలు చేపట్టాలి. అందులో ప్రధానంగా పరిపాలన, డిజిటల్, రుణ తిరిగి చెల్లింపు సామర్థ్యాన్ని పెంచుకొనేలా మార్పులు, ఆర్థిక సంస్కరణలు తీసుకురావాలి. పౌరసేవలు, విద్యుత్ రేటు లాంటి సేవల సామర్థ్యాన్ని పెంచుకోవాలి. పట్టణ ప్రణాళిక, గృహనిర్మాణం, ఉద్యోగాల కల్పనకు అనువైన సంస్కరణలు చేపట్టాలి. హరిత మౌలిక వసతులు కల్పించాలి.

✦ ఈ నిధులతో చేపట్టే ప్రాజెక్టులను 'కీలక పనితీరు సూచికలు' నిర్దేశించిన నిర్దిష్ట గడువులోగా పూర్తిచేయాల్సి ఉంటుంది. అవి నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం గడువులోగా పూర్తయ్యాయా? లేదా? అన్నది తృతీయపక్షం ద్వారా తనిఖీ చేయిస్తారు.

✦ పథకం కింద పెద్ద మొత్తంలో ప్రైవేటు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంటుందని, తద్వారా పట్టణ పరిపాలన బలోపేతం అవుతుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దీనివల్ల జాతీయ అభివృద్ధి ప్రాధాన్యాలకు అనుగుణంగా నగరాలను భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు తీర్చిదిద్దడానికి వీలవుతుందని అభిప్రాయపడింది.

✦ తెలుగు రాష్ట్రాల్లో అన్ని ప్రధాన నగరాలు ఈ పథకంలో ప్రయోజనం పొందే వీలుంది.

పీఎం రాహత్ పథకం ప్రారంభం

దిల్లీ: రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించే లక్ష్యంతో తీసుకువచ్చిన ప్రధానమంత్రి రోడ్డు ప్రమాద బాధితుల ఉపశమన, చికిత్స భరోసా(పీఎం రాహత్) పథకాన్ని కేంద్రం శనివారం అధికారికంగా ప్రారంభించింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని మొదటి గంటలోపే ఆసుపత్రిలో చేర్చిస్తే 50 శాతం మరణాల రేటు తగ్గే అవకాశం ఉందని అధ్యయనాలు తెలుపుతున్నాయని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. 'సేవ తీర్థ'లో మారిన వెంటనే ప్రధాని మోదీ మొదట సంతకం చేసిన వాటిలో రాహత్ పథకం ఒకటని పేర్కొంది. రోడ్డు ప్రమాద బాధితులు లేదా... ప్రమాద సమయంలో అక్కడున్న ఎవరైనా 112కు డయల్ చేసి సమీపంలోని ఆసుపత్రి వివరాలను, అంబులెన్సు సేవలను కోరవచ్చని తెలిపింది. ఈ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులు ప్రమాదం జరిగిన రోజు నుంచి ఏడు రోజుల వరకు రూ.1.5 లక్షల మేర నగదురహిత చికిత్స పొందేందుకు అర్హులు.

ఆ రోజుల్లో వీడియో ద్వారా వాదనలు వినిపించొచ్చు

- న్యాయవాదులకు సుప్రీం వెసులుబాటు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో ఈనెల 16 నుంచి 20 వరకు జరగనున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' నేపథ్యంలో.. ట్రాఫిక్ రద్దీ వల్ల వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాలేని న్యాయవాదులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా తమ వాదనలు వినిపించవచ్చని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన లింక్‌ను అడ్వకేట్స్ ఆన్ రికార్డ్స్ ద్వారా పంచుకోనున్నట్లు అత్యున్నత న్యాయస్థానం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకావడం ఒక ఐచ్ఛికం మాత్రమేనని, శిఖరాగ్ర సమావేశం సమయంలో అన్ని ధర్మాసనాలు హైబ్రిడ్ విధానంలో పనిచేస్తాయని పేర్కొంది. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ శిఖరాగ్ర సమావేశానికి 30 దేశాల నుంచి వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారు.

'సర్'పై అభ్యంతరాలను సుప్రీం పట్టించుకోవాలి: చిదంబరం

దిల్లీ: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాలను సుప్రీంకోర్టు పట్టించుకోలేదనీ, సర్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి న్యాయస్థానం నిర్దిష్ట ఉత్తర్వులు ఇవ్వాల్సిందని కాంగ్రెస్ నేత, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరం పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సర్ వల్ల ప్రజాస్వామ్యానికి నష్టం జరుగుతోందని బెంగాల్ ముఖ్యమంత్రి మమత వాదిస్తున్నారు. ఆ రాష్ట్రంలో ఎన్నికల బలాబలాలను మార్చడానికే సర్‌ను నిర్వహిస్తున్నారని చిదంబరం కూడా ఆరోపించారు. సర్ ప్రక్రియలో పారదర్శకతను, జవాబుదారీని నెలకొల్పడానికి సుప్రీంకోర్టు పూనుకోవాలని కోరారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు సుప్రీం ఆదేశాలు జారీచేస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య వాదం, ప్రజల చేతికి పరిపాలన అనేవి కీలకమనీ, సర్ పేరుతో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగిస్తే ప్రజా ప్రభుత్వం ఎలా ఏర్పడుతుందని చిదంబరం ప్రశ్నించారు. జనగణనకు అనుసరిస్తున్న పకడ్బందీ పద్ధతులను సర్‌కూ వర్తింపజేయాలని సూచించారు.

తప్పుడు ఫిర్యాదులపై హెచ్చరిక బోర్డుల్ని పోలీస్‌స్టేషన్ల వద్ద ఏర్పాటు చేయాలి

- సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు

దిల్లీ: అమాయక పౌరులపై తప్పుడు ఫిర్యాదులు, ఆరోపణలు చేసినా, తప్పుడు సాక్ష్యాధారాలను వ్యాపింపజేసినా శిక్షార్హ నేరమవుతుందంటూ పోలీసు స్టేషన్లు, కోర్టు ప్రాంగణాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఇలాంటి తప్పుడు ఆరోపణలు హుందాగా జీవించే హక్కుకూ, న్యాయపాలనకూ తీవ్రమైన ముప్పు అని వృత్తిరీత్యా న్యాయవాది అయిన పిటిషనర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ పేర్కొన్నారు. ఈ బెడదను నివారించడానికి భారతీయ న్యాయసంహితలోని 14వ అధ్యాయం కొన్ని నిబంధనలను విధించినా, వాటిని అమలు చేయడానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవడం లేదన్నారు. తప్పుడు కేసులు పెట్టినా, తప్పుడు సమాచారం వ్యాపింపజేసినా శిక్షలు తప్పవని ఫిర్యాదుదారుని ముందే హెచ్చరించాలన్నారు.

'బంగ్లా' ఎన్నికల్లో బోణి కొట్టిన 'బీజేపీ'!

ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఒక సీటు గెల్చుకుంది. అదేంటీ బంగ్లాదేశ్ ఎన్నికల్లో బీజేపీ గెలవడం ఏంటి? అక్కడ కాషాయ పార్టీ పోటీ చేసిందా? భారత్‌కు చెందిన పార్టీ బంగ్లాదేశ్‌లో పోటీ చేయవచ్చా? అన్న ప్రశ్నలు మీ మనసులో ఇప్పటికే మెదిలే ఉంటాయి. వివరాల్లోకి వెళితే.. తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బీఎన్‌పీ బంగ్లాదేశ్ సార్వత్రిక పోరులో ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికలో ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ ఒక సీటులో విజయఢంకా మోగించింది. బీజేపీ అంటే ఇండియాకు చెందిన భారతీయ జనతా పార్టీ కాదు. అది 'బంగ్లాదేశ్ జాతీయ పార్టీ'. ఆ పార్టీ అభ్యర్థి భోలా-1 నియోజకవర్గం నుంచి 30వేలకు పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. బీజేపీ తరఫున అందలీబ్ రెహమాన్ పోటీ చేశారు. జమాత్-ఏ-ఇస్లామీ తరఫున ఎండి నజ్రుల్ ఇస్లాం పోటీకి దిగారు. వీరిద్దరి మధ్య జరిగిన ఎన్నికల సంగ్రామంలో బీజేపీ అభ్యర్థినే విజయం వరించింది.

అంతర్జాతీయ సరిహద్దులో రూ.40 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

- పాక్ నుంచి డ్రోన్‌తో జారవిడిచినట్లు అనుమానాలు

జమ్మూ: అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారీ స్థాయిలో మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు జమ్మూ అధికారులు శనివారం వెల్లడించారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ వీటిని జారవిడిచినట్లు అనుమానిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఆర్ఎస్ పురా సెక్టార్‌లో అనుమానిత డ్రోన్ కదలికల సమాచారాన్ని అందుకున్న పోలీసులు, బీఎస్ఎఫ్ అధికారులు ఆ ప్రాంతంలో సంయుక్త తనిఖీలు చేపట్టారు. స్థానిక పొలాల్లో రూ.40 కోట్లకు పైగా విలువైన 6.5 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, కథువా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా పాక్ నుంచి హెరాయిన్‌ను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలపై ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు చెందిన జతిన్, కథువాలోని జఖ్‌బర్‌కు చెందిన డానిష్ డోగ్రాలుగా గుర్తించారు. వీరికి పాకిస్థాన్‌కు చెందిన స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఐరోపాతో అమెరికా మైత్రి శాశ్వతం

- విదేశాంగ మంత్రి మార్కో రూబియో

మ్యూనిక్: ఐరోపాతో తమ స్నేహ బంధం శాశ్వతమైనదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చిరకాల మిత్రదేశాలకు భరోసా ఇచ్చారు. అమెరికా పునాదులు యూరప్‌లోనే ఉన్నాయని ఆయన మ్యూనిక్ భద్రతా సదస్సులో ప్రసంగిస్తూ పేర్కొన్నారు. అమెరికా ఎప్పటికీ ఐరోపాతో మైత్రీబంధంలో ముడిపడే ఉంటుందని అభయమిచ్చారు. అయితే అట్లాంటిక్ కూటమితో తమ దేశ అనుబంధాన్ని పునర్నిర్వచించాలని కోరుకుంటున్నట్టు మాత్రం ఆయన స్పష్టంగా తెలియజేశారు. ఎంతో కాలంగా తనకు మిత్రదేశాలుగా ఉన్న నాటో కూటమి దేశాల పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత ఏడాదిగా కఠినంగా మాట్లాడుతున్న నేపథ్యంలో రూబియో మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

'ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చండి'

మ్యూనిక్: ఇరాన్‌లో ప్రభుత్వ మార్పిడికై ఒత్తిడి తేవాలని విదేశాల్లో తలదాచుకుంటున్న ఆ దేశ మాజీ రాజు కుమారుడు రెజా పహ్లావీ శనివారం ప్రపంచ నేతలకు పిలుపునిచ్చారు. ఇరాన్ ప్రజలకు మద్దతుగా మ్యూనిక్, లాస్ ఏంజెలెస్, టొరంటోలలో ప్రదర్శనలు నిర్వహించాల్సిందిగా ఆయన తన అనుచరులను కోరారు. 1979లో జరిగిన ఇస్లామిక్ విప్లవ నేపథ్యంలో పహ్లావీ కుటుంబం ఇరాన్ నుంచి పారిపోయి గత ఐదు దశాబ్దాలుగా బహిష్కృత జీవనం సాగిస్తోంది. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు పట్టించుకోకపోతే ఇరాన్‌లో మరెందరో మృత్యువాత పడక తప్పదని రెజా పహ్లావీ ఇటీవల తమ దేశంలో ప్రదర్శనకారులపై జరిగిన దమనకాండను ప్రస్తావిస్తూ హెచ్చరించారు.

రష్యా, ఉక్రెయిన్‌ల పరస్పర డ్రోన్ దాడులు

- ఇద్దరి మృతి

కీవ్: యుద్ధాన్ని ముగించే దిశగా వచ్చేవారం చర్చలకు సిద్ధమవుతున్న తరుణంలో ఉక్రెయిన్, రష్యాలు పరస్పరం డ్రోన్ దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో ఉక్రెయిన్‌లోని ఒడెస్సా నగరంలో ఒకరు, రష్యాలోని బ్రియాన్స్క్ రీజియన్‌లో మరొకరు మృతిచెందినట్లు అధికారులు శనివారం తెలిపారు.

బాంబు బెదిరింపుతో 4 గంటలు ఆగిన షిల్లాంగ్ విమానం

కోల్‌కతా: మేఘాలయలోని షిల్లాంగ్‌కు వెళ్తున్న ఓ విమానం బాంబు బెదిరింపు కారణంగా శనివారం కోల్‌కతా విమానాశ్రయంలో నాలుగు గంటలపాటు నిలిచిపోయింది. ఇండిగో 6ఈ 7304 విమానంలో బాంబు పెట్టినట్లు రాసి ఉన్న బెదిరింపు లేఖను సిబ్బందిలో ఒకరు టాయిలెట్‌లో గుర్తించడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించకపోవడంతో మధ్యాహ్నం 1.33 గంటల సమయంలో విమానం తిరిగి షిల్లాంగ్‌కు బయలుదేరింది.

సిబల్‌కు ఎప్‌స్టీన్ ప్రాయోజిత అవార్డు: భాజపా

దిల్లీ: అమెరికన్ లైంగిక నేరగాడు, గూఢచారి జెఫ్రీ ఎప్‌స్టీన్ అందించిన నిధులతో ఏర్పాటైన ఒక అవార్డును కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ 2010లో అందుకున్నారని భాజపా శనివారం ఆరోపించింది. దీనికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్‌చేసింది. ఆరోపణపై స్పందించిన సిబల్.. భాజపా ఆరోపణను చెత్త వాదనగా కొట్టిపారేశారు. '2010లో జెఫ్రీ ఎప్‌స్టీన్ అందించిన నిధులతో ఏర్పాటైనట్టుగా ఆరోపణలున్న ఒక అవార్డును గాంధీ కుటుంబంతో ఎంతోకాలంగా అనుబంధం ఉన్న కపిల్ సిబల్ అందుకున్నారు" అని భాజపా జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. కాంగ్రెస్ విదేశీ విభాగం అధినేత శామ్ పిట్రోడాకు కూడా ఆ వర్గాలతో సాన్నిహిత్యం ఉందని భండారీ ఆరోపించారు. కపిల్ సిబల్ 2022లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. తదనంతరం సమాజ్‌వాదీ పార్టీ మద్దతుతో రాజ్యసభ సభ్యునిగా ఎన్నికయ్యారు.

మేడతో పోటీగా ఎదిగిన బెండ

ఈటీవీ భారత్: సాధారణంగా బెండ మొక్క నాలుగైదు అడుగుల ఎత్తు ఎదుగుతుంది. పశ్చిమబెంగాల్‌లో బీర్‌భూం జిల్లా బోల్‌పుర్‌లోని మహమ్మద్ జమీరుల్ హక్ అనే న్యాయవాది ఇంటి ఆవరణలో అనూహ్యంగా పెరిగింది. ఇంటి యజమానికి రెండంతస్తుల భవనం ఉండగా.. ఆ మేడ ఎత్తుతో పోటీ పడుతున్నట్లుగా బెండ మొక్క ఎదిగింది. దీనికి తగ్గట్టుగా కాండం లావుగా ఉండటంతో మొక్క కాస్తా చెట్టు ఆకారాన్ని సంతరించుకుంది. చెట్టు పై నుంచి కింది వరకు బెండకాయలు కాస్తున్నాయి. ఇది మాల్వేసి జాతికి చెందిన మొక్కగా నిపుణులు చెబుతున్నారు.



ప్రేమికుల రోజు ట్రంప్ సరికొత్త ప్రచారం

ఇంటర్నెట్ డెస్క్: తన రాజకీయ నిర్ణయాలు, చర్యలకు ప్రచారం కల్పించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక వినూత్న పంథాను ఎంచుకున్నారు. ఇందులో భాగంగా శ్వేత సౌధం ప్రేమికుల రోజు సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ కార్డుల్ని సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధికారం చేపట్టిన నాటి నుంచి ట్రంప్ తీసుకున్న రాజకీయ నిర్ణయాలకు ప్రచారం కల్పించడానికి ఈ పోస్టును ఉపయోగించుకుంది.

✦ 'ఇది మీ కోసం మాత్రమే' అనే శీర్షికతో ఉన్న ఈ సోషల్ మీడియా పోస్టులోని మొదటి కార్డులో వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురో కళ్లకు గంతలు కట్టి, చేతులకు సంకెళ్లు వేసిన దృశ్యాన్ని చిత్రించారు. దానిపై 'మీరు నా హృదయాన్ని గెలుచుకున్నారు' అని రాసి ఉంది.

✦ 'ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 4547' అని రాసి ఉన్న పత్రాన్ని ట్రంప్ చూపిస్తున్నట్లుగా ఉన్న చిత్రాన్ని మరో కార్డుపై ముద్రించారు. ఈ ఆర్డర్ ద్వారా అమెరికాలోని ట్రాన్స్‌జెండర్‌లు మహిళల క్రీడల్లో పాల్గొనకుండా ట్రంప్ నిషేధించారు. ఈ కార్డుపై 'యూ ఆర్ మై వాలెంటైన్' అనే సందేశం రాసి ఉంది.



✦ మూడో కార్డులో డెమోక్రటిక్ సెనేటర్ క్రిస్ వాన్ హోలెన్, ఎంఎస్-13 ముఠా సభ్యుడు కిల్మార్ అబ్రెగో గార్సియాతో మాట్లాడుతున్న దృశ్యం కనిపిస్తోంది. దాని పైన 'మీపై నాకున్న ప్రేమ అక్రమ వలసదారుల పట్ల డెమోక్రాట్ల ప్రేమంత బలంగా ఉంటుంది' అని వ్యంగ్యంగా రాసి ఉంది.

✦ చివరి కార్డులో హృదయం ఆకారంలో గ్రీన్‌లాండ్ పటం చిత్రించి ఉంది. 'మనం ఎటువైపో నిర్ణయించుకునే సమయం ఇదే' అన్న వ్యాఖ్య ఆ చిత్రంపై కనిపిస్తోంది. శ్వేతసౌధం పంచుకున్న ఈ డిజిటల్ కార్డులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.

ఫీజు వాపసు ప్రకటించిన ఫిట్‌జీ

దిల్లీ: విద్యార్థులకు కొన్ని కేంద్రాల్లో ఆఫ్‌లైన్ తరగతులకు విఘాతం కలగడంపై ఫిట్‌జీ విద్యాసంస్థ విచారం వ్యక్తంచేసింది. తరగతులు జరగనంత మేరకు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజు వాపసు చేస్తామని పునరుద్ఘాటించింది. తరగతులకు విఘాతం కలిగిన నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల పట్ల జవాబుదారీతనంతో ఈ ప్రకటన వెలువరిస్తున్నట్టు సంస్థ పేర్కొంది. తన నియంత్రణలో లేని అసాధారణ ప్రతికూల పరిస్థితుల కారణంగా తరగతులకు విఘాతం కలిగిందని, తల్లిదండ్రుల విశ్వాసాన్ని సడలింపజేసినందుకు తామెంతో చింతిస్తున్నామని తెలిపింది. తరగతుల నిర్వహణలో సవాళ్లు ఎదురైనప్పటికీ తాము బోధన ప్రక్రియ యథావిధిగా కొనసాగించడంపైనే దృష్టి కేంద్రీకరించామని వివరించింది. ఆఫ్‌లైన్ తరగతులకు విఘాతం కలిగిన వెంటనే ఫిట్‌జీ ఈ-స్కూలు ద్వారా ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించామని, దీని సాయంతో గణనీయ సంఖ్యలో విద్యార్థులు చదువుల్ని కొనసాగించారని సంస్థ పేర్కొంది. తరగతులకు ఆటంకం కలిగినంత మేరకు తొలి దశలో ఫీజు వాపసు పొందలేకపోయిన విద్యార్థులకు ఈ సంవత్సరంలో చెల్లింపులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. చెల్లింపులు ఈ సంవత్సరం జూన్ మాసాంతంలో మొదలవుతాయని, పారదర్శకత, ఏకరూపత కోసం చెల్లింపులన్నీ తమ సంస్థ దిల్లీ కార్యాలయం నుంచి జరుపుతామని స్పష్టం చేసింది. చెల్లింపుల సమాచారం జూన్ 15 నాటికి తెలియని పక్షంలో తల్లిదండ్రులు సంస్థ అధికారిక ఈమెయిల్ అడ్రసుకు లేఖ రాయవచ్చని వివరించింది. ఆఫ్‌లైన్ తరగతులకు కలిగిన విఘాతం అనుకోకుండా జరిగిన పరిణామాల పర్యవసానమని, ఎవరికీ ఇబ్బంది కలిగించడం తమ అభిమతం కాదని సంస్థ మీడియా నిర్వాహక బృందం ఒక ప్రకటనలో తెలిపింది.

రాజస్థాన్ భాజపా ఎంపీ రేంజ్‌రోవర్ కారులో మంటలు

- త్రుటిలో బయటపడ్డ లుంబారాం చౌధరి

ఇంటర్నెట్ డెస్క్: రాజస్థాన్‌కు చెందిన భాజపా ఎంపీ లుంబారాం చౌధరి ప్రయాణిస్తున్న రేంజ్ రోవర్ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవరు అప్రమత్తమై కారును రోడ్డుపక్కన నిలిపివేశారు. దీంతో ఎంపీతో సహా కారులోని మిగతా వాళ్లంతా సురక్షితంగా బయటపడ్డారు. రూ.కోట్ల విలువచేసే కారు క్షణాల్లోనే మంటల్లో కాలిపోయింది. శుక్రవారం నాసిక్ సమీపంలోని గోండే ఫాటా వద్ద ఈ ఘటన జరిగింది. జ్యోతిర్లింగాన్ని దర్శించేందుకు ఎంపీ లుంబారాం చౌధరి త్రయంబకేశ్వర్‌కు బయలుదేరారు. కారు నాసిక్ సమీపంలోని గోండే ప్రాంతం దాటుతుండగా కారులో ఏదో కాలుతున్న వాసన రావడంతో డ్రైవర్ ఉలిక్కిపడ్డారు. ఎంపీతో పాటు అందరినీ కారు నుంచి బయటకు దించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చినా అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ప్రాథమిక దర్యాప్తులో ఇది ప్రమాదంగానే తేలిందని పోలీసులు తెలిపారు.



పూర్తిగా దగ్ధమైన కారు

కేరళలోనూ ఇదే తరహాలో..

కేరళ రాజధాని తిరువనంతపురంలో ఒక జంట ప్రయాణిస్తున్న కారు ఇలాగే మంటల్లో చిక్కుకుంది. వారు వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన ఆపివేశారు. సురక్షితంగా బయటకు వచ్చి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. మంటలను అదుపులోకి తెచ్చేసరికి కారు పూర్తిగా కాలిపోయింది.

అమెరికాతో వాణిజ్య ఒప్పందం మన పత్తి రైతులకు నష్టమే

- రాహుల్ గాంధీ ధ్వజం

దిల్లీ: అమెరికాతో నరేంద్ర మోదీ ప్రభుత్వం కుదుర్చుకున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందం భారత దేశ పత్తి రైతులను, జౌళి పరిశ్రమను నిలువునా ముంచేస్తుందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. అధిక సుంకాలకు మోదీ సర్కారు ఒప్పుకోవడం వల్ల లక్షల మంది పత్తి రైతులు ఆర్థిక సంక్షోభంలో పడిపోతారనీ, జౌళి రంగంపై ఆధారపడిన 5 కోట్ల మంది నిరుద్యోగులవుతారని రాహుల్ విమర్శించారు. భారతీయ జౌళి, దుస్తుల ఎగుమతులపై అమెరికా 18 శాతం సుంకాలు విధిస్తే, బంగ్లా ఎగుమతులపై అసలు సుంకమే విధించడం లేదని రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో పేర్కొన్నారు. '18 శాతం, సున్నా శాతం-దీనికి పోలిక ఎక్కడ? అమెరికా నుంచి పత్తి దిగుమతి చేసుకుంటేనే బంగ్లా దుస్తుల ఎగుమతులపై సుంకాలు రద్దు చేస్తామని ట్రంప్ సర్కారు షరతు పెట్టింది. నేను ఈ విషయాన్ని లోక్‌సభలో లేవనెత్తినపుడు మనకీ సున్నా సుంకాలు కావాలంటే అమెరికన్ పత్తిని దిగుమతి చేసుకోవలసి ఉంటుందని ఒక మంత్రి చెప్పారు. అసలు ఈ సంగతిని ఎందుకు కప్పిపెట్టారు' అని రాహుల్ నిలదీశారు. రాహుల్ వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని జౌళి మంత్రి గిరిరాజ్ సింగ్ విమర్శించారు. భారత జౌళి ఎగుమతులు కేవలం అమెరికాకే పరిమితం కావడం లేదనీ, అనేక దేశాలకు వెళుతున్నాయని ఆయన వివరించారు.

మాదక ద్రవ్యాల నౌకపై అమెరికా దాడి

- ముగ్గురి మృతి

వాషింగ్టన్: కరీబియన్ సముద్రంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న ఓ నౌకపై అమెరికా సైన్యం జరిపిన భీకర దాడిలో ముగ్గురు మరణించారు. నౌక మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మార్గం గుండా పయనిస్తుండగా ఈ చర్య తీసుకున్నామని అమెరికా సదరన్ కమాండ్ ఓ ప్రకటనలో పేర్కొంది. సముద్ర మార్గంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న పడవలపై ఇప్పటివరకూ అమెరికా 38 సార్లు దాడి చేయగా వాటిల్లో మొత్తం 133 మంది మరణించారు.

దేశవ్యాప్తంగా 466 డే కేర్ క్యాన్సర్ కేంద్రాలు

దిల్లీ: దేశవ్యాప్తంగా 466 డే కేర్ క్యాన్సర్ కేంద్రాలు (డీసీసీసీలు) పనిచేస్తున్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ వర్గాలు పేర్కొన్నాయి. జిల్లా స్థాయిలో కీమోథెరపీ సేవలు స్థిరంగా విస్తరిస్తున్న తీరుకు ఇది దర్పణం పడుతోందని వివరించాయి. మూడేళ్లలో జిల్లా ఆసుపత్రుల్లో డీసీసీసీలను ఏర్పాటు చేయనున్నట్లు 2025-26 బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. సాధారణ క్యాన్సర్ చికిత్సను వికేంద్రీకరించడానికి, కీమోథెరపీ కోసం పెద్ద ఆసుపత్రులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు కీమోథెరపీ కోసం నగరాల్లోని పెద్ద ఆసుపత్రులకు పదేపదే వెళ్లడానికి చాలా ఇబ్బందిపడాల్సి వస్తోందన్నారు.

భార్యతో గొడవ.. కత్తెరతో పసికందు హత్య

రక్షించాల్సిన తండ్రే రాక్షసుడిగా మారాడు. భార్యతో జరిగిన చిన్న గొడవకు అభం శుభం తెలియని పసికందును బలి తీసుకున్నాడు. కన్నకూతురు అని కూడా చూడకుండా, అత్యంత కిరాతకంగా కత్తెరతో పొడిచి చిన్నారిని హతమార్చాడు. ఆపై తాను కూడా ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దారుణమైన ఈ ఉదంతం రాజస్థాన్ రాజధాని నగరమైన జైపుర్‌లోని మాల్పురా గేట్ పోలీస్‌స్టేషను పరిధిలో జరిగింది. ఫిబ్రవరి 6న చిన్నారి హత్య జరగగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు కోలుకున్న తర్వాత శుక్రవారం పోలీసులు అరెస్టు చేసినట్లు జైపుర్ ఈస్ట్ డీసీపీ సంజీవ్ నైన్ తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన షాదాబ్ మహమ్మద్ పుణెలో పనిచేస్తున్నాడు. అతని భార్య 8 నెలల కుమార్తె షెహనాజ్‌తో కలిసి జైపుర్‌లోని తన పుట్టింటికి వచ్చింది. ఆమె వచ్చిన రెండు రోజులకు ఫిబ్రవరి 6న పుణె నుంచి భర్త షాదాబ్ కూడా వచ్చాడు. అదేరోజు భార్యాభర్తల మధ్య గొడవ జరిగి.. దారుణానికి దారి తీసింది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



పోలీసుల అదుపులో నిందితుడు షాదాబ్ మహమ్మద్



పశ్చిమ బెంగాల్ బీర్‌భూమ్ జిల్లాలో అజోయ్ నది తీరాన రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి మోర్టార్ షెల్‌ని వెలికితీస్తున్న ఆర్మీ సిబ్బంది. అనంతరం దాన్ని పేల్చివేయడంతో ఎగసిపడిన దట్టమైన పొగ (ఇన్‌సెట్లో)

ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నా ప్రజల శ్రేయస్సే కూటమి లక్ష్యం –జీవీ ఆంజనేయులు, చీఫ్ విప్

"ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నా ప్రజాసంక్షేమానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కీలక రంగాలకు భారీగా కేటాయింపులు చేశారు. యువతను భావిపౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యాశాఖకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించారు. వైకాపా ప్రభుత్వంలో గాడితప్పిన వ్యవస్థల పునర్నిర్మాణంలో ఇదో కీలక ఘట్టం"



జీఎస్‌డీపీ 10.75% పెరిగింది –సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

గతేడాదితో పోలిస్తే రాష్ట్ర జీఎస్‌డీపీ 10.75 శాతం పెరిగింది. తలసరి ఆదాయం వృద్ధి చెందింది. ఈ సారి కీలక శాఖలకు తగిన ప్రాధాన్యమిచ్చారు. వ్యవసాయం, దాని అనుబంధ విభాగాలకు రూ.13,598 కోట్లు, జలవనరుల శాఖకు రూ.18,224 కోట్లు, రాజధాని అమరావతికి రూ.6 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామం. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రంలో రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. ఇదంతా సీఎం చంద్రబాబు పాలనాదక్షతకు నిలువుటద్దం.

మౌలికం.. పెట్టుబడుల ఆకర్షణకు మార్గం

- రాష్ట్రంలో పోర్టులు..రైలు.. రోడ్డు మార్గాల అనుసంధానం
- కొత్తగా 6 విమానాశ్రయాల ఏర్పాటుకు ప్రతిపాదన
- 175 ఎంఎస్ఎంఈ పార్కులు
- 20 క్లస్టర్ విధానంలో పారిశ్రామిక అభివృద్ధి
- ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు.. ప్రోత్సాహకాలు



అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో మంత్రులు, అధికారులు

ఈనాడు, అమరావతి: కీలక రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణకు 'పాలసీ 4.0' విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. దీనిద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం, ఎగుమతులు పెంచడం.. రాష్ట్ర స్థూల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అందులో భాగంగా కీలక రంగాలైన ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రోప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, లైఫ్‌సైన్సెస్ (బల్క్ డ్రగ్స్), టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, ఈవీలు, ఐటీ, ఆరోగ్యం లాంటి రంగాలను గుర్తించింది. విశాఖ-చెన్నై (వీసీఐసీ) కారిడార్ అభివృద్ధి చేయడం.. ప్లగ్ అండ్ ప్లే క్లస్టర్ల (ఎంఎస్ఎంఈలకు సిద్ధంగా మౌలిక సదుపాయాలు) కల్పించడంపై దృష్టిపెట్టింది. మల్టీమోడల్ సరకు రవాణా నెట్‌వర్క్ అభివృద్ధి చేయడం, సహాయక విధాన ఫ్రేమ్‌వర్క్, గ్లోబల్ ప్రొడక్షన్ నెట్‌వర్క్‌ల అనుసంధానంతో సులభతరమైన రవాణా సేవలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్/స్మార్ట్ ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధి.. క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించేలా కార్యాచరణ చేపట్టింది.

నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ (నిక్‌డిక్ట్) భాగస్వామ్యంతో.. విశాఖ-చెన్నై (వీసీఐసీ), చెన్నై-బెంగళూరు (సీబీఐసీ), హైదరాబాద్-బెంగళూరు (హెచ్‌బీఐసీ) పారిశ్రామిక కారిడార్లలో పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. సూక్ష్మ, చిన్న పారిశ్రామికవేత్తల కోసం క్లస్టర్ డెవలప్‌మెంట్ స్కీం కింద కేంద్ర సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్లు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సుల లాంటి మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా పెట్టుబడులు ఆకర్షించాలన్నది లక్ష్యం.

రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు

సహజవనరులు, నిపుణులైన యువత, ఓడరేవులు.. ఇవన్నీ పెట్టుబడుల ఆకర్షణ రాష్ట్రానికి ఉన్న బలం. గత 20 నెలల్లో రూ.8.74 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యాయి. మరో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నాయి. కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టింది. రాష్ట్రం మొత్తాన్ని మూడు జోన్లుగా.. 20 క్లస్టర్లుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించింది. ప్రాంతాలవారీగా ఉన్న వనరుల ఆధారంగా.. ఆయా రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది.

మూడు పారిశ్రామిక కారిడార్లు

రాష్ట్రంలో మూడు పారిశ్రామిక కారిడార్లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో వీసీఐసీ, సీబీఐసీ, హెచ్‌బీఐసీ పారిశ్రామిక కారిడార్ల ద్వారా కృష్ణపట్నం నోడ్, ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌ల అభివృద్ధికి కేంద్రం నిధులు సమకూర్చుతోంది.

- సీబీఐసీ పరిధిలోని నెల్లూరు క్రిస్ సిటీని రూ.621 కోట్లతో నిక్‌డిక్ట్ భాగస్వామ్యంతో రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది.
- హెచ్‌బీఐసీలో ఓర్వకల్లు నోడ్‌ను (హెచ్‌బీఐసీ) నిక్‌డిక్ట్ భాగస్వామ్యంతో రూ.1014 కోట్లతో రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది.
- వీసీఐసీ కింద వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తి నోడ్ (వీసీఐసీ)ను రూ.872 కోట్లతో ప్రతిపాదించింది.

ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో.. ఒక్కో పారిశ్రామిక పార్కును ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. వాటిద్వారా ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలన్నది లక్ష్యం. ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త అనే ఆలోచనకు అనుగుణంగా చిన్న పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు వీలుగా పార్కులను ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే 50కి పైగా పార్కులు శంకుస్థాపనలు పూర్తిచేసింది. మిగిలినవాటికి భూములు గుర్తించింది. ఇలాగే ప్రైవేటు పార్కుల అభివృద్ధికి ప్రత్యేక పాలసీని ప్రకటించింది. ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కుల్లో ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.100 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. ఎంఎస్ఎంఈల పునరుజ్జీవనానికి రూ.5.70 కోట్లు.. ఏపీ క్రెడిట్ గ్యారంటీ స్కీం కింద రూ.10 కోట్లు కేటాయించడం ద్వారా ఎంఎస్ఎంఈలను బలోపేతం చేయనుంది.

ప్రభుత్వం ఎంచుకున్న సూత్రాలు

- ప్రపంచంలోని అత్యుత్తమ లాజిస్టిక్ విధానాలు
- విద్యుత్ ధరలను వీలైనంతగా తగ్గించడం
- నాణ్యమైన ఉత్పత్తి
- అన్ని రంగాల్లో డీప్‌టెక్ వినియోగం

లక్ష్యం సాధించేందుకు.. విధానాలు-4.0

- పారిశ్రామికాభివృద్ధి పాలసీ 4.0
- ఎంఎస్ఎంఈ, ఆంత్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ
- ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ
- ఎలక్ట్రానిక్స్ పాలసీ
- ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్స్ పాలసీలు తీసుకొచ్చింది

వాటిద్వారా తయారీ, ఎలక్ట్రానిక్స్, ఈవీలు, పునరుత్పాదక విద్యుత్, ఐటీ, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, ఏరోస్పేస్, డిఫెన్స్, గ్రీన్ హైడ్రోజన్ లాంటి రంగాలపై ప్రభుత్వం దృష్టిపెట్టింది.

రవాణా భారాన్ని తగ్గించడంపై దృష్టి

- రాష్ట్రంలో మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణాన్ని చేపట్టింది. కాకినాడ సెజ్ పోర్టును ప్రైవేటు సంస్థ అభివృద్ధి చేస్తోంది.
- దుగరాజపట్నం దగ్గర పోర్టు, షిప్‌బిల్డింగ్, మరమ్మతుల కేంద్రం ఏర్పాటు ప్రతిపాదన సిద్ధం చేసింది.
- కొత్తగా ఆరు విమానాశ్రయాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది.
- విశాఖ, అనంతపురం, విజయవాడలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేయనుంది.
- ప్రధాన రైల్వేలైన్ల నుంచి అన్ని పోర్టులు అనుసంధానిస్తూ కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు
- జాతీయ రహదారుల నుంచి పోర్టుల అనుసంధానం

అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

–యనమల రామకృష్ణుడు, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు

ఈ బడ్జెట్‌లో అభివృద్ధి, పెట్టుబడుల సాధనకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పెరుగుతున్న రాష్ట్ర రుణభారాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు. సామాజిక న్యాయం దిశగా అన్ని వర్గాల సంక్షేమానికీ ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయించారు.

స్వర్ణాంధ్ర లక్ష్యానికి బలమైన పునాది..

–వల్లూరు జయప్రకాశ్ నారాయణ, భాజపా రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర అభివృద్ధి దిశను స్పష్టంగా చూపిస్తున్న ఈ బడ్జెట్ సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యతను సూచిస్తోంది. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యానికి బలమైన పునాది వేస్తుంది. మూలధన వ్యయం రూ.54 వేల కోట్లకు పెరగడం ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చినట్లు అయింది. రోడ్లు, లాజిస్టిక్స్, పారిశ్రామిక కారిడార్లు, డిజిటల్ మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు రాష్ట్ర భవిష్యత్తుకు పునాది వేస్తాయి.

ఇది చేతల బడ్జెట్

–వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

"రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం, మెరుగైన భవిష్యత్తు దిశగా ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. రాష్ట్ర ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే విజన్ డాక్యుమెంట్. గత బడ్జెట్‌తో పోలిస్తే ఎన్నో కీలక రంగాలకు అధిక కేటాయింపులు చేశారు"

బడ్జెట్‌లో సమతుల్యత పాటించారు

–భీశెట్టి బాబ్జి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు

బడ్జెట్ కొంతమేర సమతుల్యత పాటించినట్లు కనిపిస్తోంది. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ప్రధాన కేంద్రాలుగా ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి కేంద్రాల ఏర్పాటు కోసం రూ.28వేల కోట్లు, రాయలసీమను ప్రత్యేక గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రూ.30వేల కోట్లు ప్రకటించడం, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సైబర్ క్రైం పోలీసు స్టేషన్ల ఏర్పాటుకు చొరవ తీసుకోవడం శుభపరిణామం. మూలధనం లోటు రూ.53,915 కోట్లు, రెవెన్యూ లోటు రూ.22వేల కోట్లు ఉన్నప్పటికీ అమరావతికి రూ.6వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.6,600 కోట్లు కేటాయించారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

– తాండవ యోగేష్, న్యాయవాది

100 కొత్త కోర్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. న్యాయ వ్యవస్థకు రూ.349 కోట్ల విలువైన పనులు మంజూరు చేయడం చిన్న విషయం కాదు. కొత్త కోర్టు భవనాల నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులివ్వాలని గతేడాది హైకోర్టులో పిల్ దాఖలు చేసి, న్యాయపోరాటం చేస్తున్నా. ఈ అంశంపై అనుమతులివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ గత నవంబరులో హైకోర్టు ఉత్తర్వులిచ్చింది.

బడ్జెట్‌లో సాంస్కృతిక రంగం ఊసే లేదు

–ప్రజానాట్యమండలి

"బడ్జెట్‌లో సాంస్కృతిక రంగం ఊసే లేదు. కళాకారులు, కళాసంస్థలు, నాటక సమాజాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల ప్రస్తావన లేదు. సాంస్కృతిక రంగానికి కనీసం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి. నంది నాటకోత్సవాల్ని ప్రతి ఏటా నిర్వహించాలి"

బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం శనివారం ఉదయం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో జరిగింది. బడ్జెట్, వ్యవసాయ బడ్జెట్‌లకు ఇందులో ఆమోదం తెలిపారు. కేవలం బడ్జెట్‌కు ఆమోదం తెలపడం కోసమే ఈ సమావేశం నిర్వహించారు.

బాసూ.. నింగిలో నేనే రాజు



ఇక్కడ ఆహారం కోసం తీక్షణంగా చూస్తూ వెళ్తున్న ఈ పక్షి పేరు పెరెగ్రిన్ ఫాల్కన్. డేగ జాతికి చెందిన ఈ మాంసాహార పక్షి.. పావురాలు, చిలుకలు, ఉడుతలు, ఎలుకలు వంటి వాటిని వేటాడుతుంది. 320 కి.మీ.ల వేగంతో దూసుకెళ్తూ.. ప్రపంచంలోనే అత్యంత వేగమైన పక్షిగా పేరు తెచ్చుకుంది. అందుకే దీనిని 'కింగ్ ఆఫ్ స్కై'గా పేర్కొంటారు. మంచిర్యాల జిల్లా కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని కిష్టాపూర్ చెరువు సమీపంలో కనిపించగా.. హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ఉత్తర తెలంగాణ ప్రాంతీయ సమన్వయకర్త డా.వెంకట్ ఎనగందుల, అటవీ డివిజినల్ అధికారి రామ్‌మోహన్ తమ కెమెరాల్లో బంధించారు. –న్యూస్‌టుడే, జన్నారం

కత్తులతో పొడిచి న్యాయవాది దారుణ హత్య

- రెండో వివాహంపై ఆగ్రహంతో బావమరుదుల ఘాతుకం



ఖదీర్

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: ఓ న్యాయవాదిని తన సొంత బావమరుదులే కత్తులతో పొడిచి దారుణంగా హతమార్చిన ఘటన హైదరాబాద్‌లో శనివారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, ప్రత్యక్ష సాక్షుల వివరాల మేరకు.. అత్తాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని సులేమాన్‌నగర్‌లో నివసించే మహ్మద్ సులేమాన్, బేబీబేగం రెండో కుమారుడు మహ్మద్ ఖదీర్(36) జూనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. తమ దగ్గరి బంధువు కుమార్తె తబసుమ్‌ను ఎనిమిదేళ్ల కిందట వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 7 నెలల క్రితం ఖదీర్ మరో బంధువు కుమార్తె సిమ్రాన్‌ను రెండో వివాహం చేసుకొని, మొదటి భార్యను, పిల్లలను పట్టించుకోవడం లేదు. దీనిపై భార్య తబసుమ్‌తోపాటు ఆమె సోదరులు అబ్దుల్‌కరీం, అబ్దుల్ హనీఫ్ పలుమార్లు అతనితో గొడవపడ్డారు. తాజాగా మరోసారి మాట్లాడటానికి శనివారం మధ్యాహ్నం ఖదీర్ సులేమాన్‌నగర్‌లోని అతడి చిన్న బావమరిది హనీఫ్ దగ్గరికి వెళ్లారు. అక్కడ ఇద్దరు బావమరుదులు, వారి స్నేహితులు ఖదీర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటామాట పెరగడంతో.. కత్తులతో ఖదీర్‌ను విచక్షణారహితంగా పొడిచి పరారయ్యారు. తీవ్ర గాయాలతో ఖదీర్ అక్కడికక్కడే మృతిచెందారు. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితులు అబ్దుల్‌కరీం, అబ్దుల్ హనీఫ్‌లు నేరుగా అత్తాపూర్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం.

ఆర్థిక భారంపై స్పష్టత ఏదీ?

ఈనాడు-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రాబోయే ఆర్థిక సంవత్సరంలో రూ.98,065 కోట్ల మేర రుణాలు తీసుకుంటానని బడ్జెట్‌లో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కన్నా తక్కువ మొత్తంలోనే ఈ రుణాలు అవసరమవుతాయని చెబుతోంది. ఇందులో బహిరంగ మార్కెట్ ద్వారా రూ.76,182 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.19,133.41 కోట్లు, ఇతర రుణాలు రూ.2,000 కోట్లు. డిపాజిట్లు ఇతర రూపాల్లో రూ.2,000 కోట్లు రుణంగా తీసుకుంటామని ప్రస్తావించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో రూ.1,04,382 కోట్ల రుణం తీసుకుంటామని పేర్కొన్నా సవరించిన అంచనాల ప్రకారం రూ.1,03,631 కోట్లు మాత్రమే అవసరమయ్యాయని ప్రస్తావించింది. బహిరంగ మార్కెట్ నుంచి రూ.80,456 కోట్ల రుణం అవసరమని పేర్కొన్నా రూ.79,456 కోట్లు మాత్రమే తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల నుంచి రుణాలు తీసుకుంటున్నా ఆ రుణాలను వివిధ రూపాల్లో ప్రభుత్వం తన బడ్జెట్ నుంచే చెల్లిస్తున్నా ఆ భారాన్ని రుణాల్లో కలిపి చూపడం లేదు. వచ్చే ఆర్థిక సంవత్సరం(2026-27)లో రూ.3,32,205.33 కోట్లకు బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించింది. ఇందులో రెవెన్యూ రాబడి ద్వారా రూ.2,34,140.14 కోట్లని అంచనా వేసిన ప్రభుత్వం మిగిలిన మొత్తాన్ని అప్పుల రూపంలోనే సేకరిస్తామని పేర్కొంది.

ప్రజా రుణం అంచనా రూ.7,11,094 కోట్లు

ప్రజా రుణం 2026-27 చివరి నాటికి రూ.7,11,094 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. జీఎస్‌డీపీలో దీని వాటా 36 శాతంగా పేర్కొంది. 2023-24లో ఇది 35శాతంగా ఉంటే 2024-25, 2025-26, 2026-27 లెక్కల ప్రకారం 36 % ఉంటుందని పేర్కొంది. ప్రభుత్వ శ్వేతపత్రం విడుదల చేసిన సందర్భంలో కార్పొరేషన్ల అప్పులను కూడా కలిపి మొత్తం అప్పుల భారం వెల్లడించింది. దీనికి తోడు పెండింగ్ బిల్లుల భారమూ వివరించింది. ప్రభుత్వం పేర్కొంటున్న ప్రజా రుణంలో ఆ వివరాలు లేవు.

కార్పొరేషన్ల గ్యారంటీలు రూ.3,11,182 కోట్లు

ప్రస్తుతం వివిధ కార్పొరేషన్ల పేరుతో తీసుకున్న రుణాలకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీ రూ.3,11,182.27 కోట్లు. ఇందులో ఇంకా రూ.1,44,899 కోట్లు అసలు చెల్లించాల్సి ఉందని, వడ్డీ రూపంలో రూ.42,140 కోట్లు చెల్లించాలని పేర్కొంది. 2025 డిసెంబర్ నెలాఖరు నాటికి ఉన్న సమాచారంగా దీన్ని పేర్కొన్నారు.

పెండింగు బిల్లులు ఎంత?

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగు బిల్లులు రూ.1,35,224 కోట్లు ఉన్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ అధికారులు ఇంకా అప్పుడు కొన్ని పెండింగు బిల్లుల వివరాలు ఇవ్వలేదని సమాచారం. ప్రస్తుతం బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి రూ.24,811 కోట్లు పెండింగు బిల్లులు చెల్లించినట్లు పేర్కొన్నారు. పాత ప్రభుత్వానికి సంబంధించి ఇంకా ఎన్ని బిల్లులు పెండింగులో ఉన్నాయి? ప్రస్తుత ప్రభుత్వం చేసిన ఖర్చులో ఇంకా ఎంత పెండింగు బిల్లులు ఉన్నాయనే లెక్కలు తేలితేనే ప్రభుత్వంపై మొత్తం ఆర్థిక భారం ఎంత ఉందనేది తేలుతుంది. ప్రభుత్వం పేర్కొంటున్న ప్రజారుణానికి ఇంకా పెండింగు బిల్లులు, బడ్జెటేతర రుణాలు, ఇతరత్రా మరికొన్ని చేర్చాల్సి ఉంది. అప్పుడే ఈ ప్రభుత్వంపై ఎంత ఆర్థిక భారం ఉందో స్పష్టంగా తేలుతుంది.

అధికారిక లెక్కల ప్రకారం... ప్రజారుణం ఇలా ఉంది...

ఆర్థిక సంవత్సరం	ప్రజారుణం (రూ.కోట్లలో)	జీఎస్‌డీపీలో దాని వాటా...
2020-21	3,50,557	36 %
2021-22	3,78,087	33 %
2022-23	4,29,526	33 %
2023-24	4,91,734	35 %
2024-25	5,68,623	36 %
2025–26 సవరించిన లెక్కలు	6,35,177	36 %
2026–27 (అంచనాలు)	7,11,094	36 %

ఇంత తక్కువ రెవెన్యూ లోటు సాధ్యమా?

- రూ.22,002 కోట్లకు పరిమితం చేస్తామంటూ హామీ

ఈనాడు, అమరావతి: ఆర్థిక వ్యవస్థ చక్కగా ఉండాలంటే రెవెన్యూ లోటును, ద్రవ్యలోటును తగ్గించుకోగలగాలి. బడ్జెట్ ప్రతిపాదనల సమయంలో ఆర్థిక మంత్రులు ఈ మేరకు హామీ ఇచ్చినా వాస్తవంలో అవి కొండలా పేరుకుపోతున్నాయి. రెవెన్యూ రాబడి కన్నా రెవెన్యూ ఖర్చులు పెరిగిపోవడమే రెవెన్యూ లోటు. బడ్జెట్‌కు అవసరమైన ఖర్చుల కోసం బయటి నుంచి తెచ్చుకునే రుణాలే ద్రవ్యలోటు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.22,002.50 కోట్లకు రెవెన్యూ లోటును పరిమితం చేస్తామని ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.33,185.97 కోట్లకు రెవెన్యూ లోటు పరిమితం చేస్తామని గత బడ్జెట్‌లో చెప్పారు. 2025 డిసెంబరు నెలాఖరు వరకు కాగ్ వెల్లడించిన గణాంకాల ప్రకారమే రూ.60,480 కోట్ల మేర ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెవెన్యూ లోటు ఉంది. అంచనాల కన్నా 182 % అదనంగా రెవెన్యూ లోటు 9 నెలల కాలానికే ఏర్పడింది. మరో మూడు నెలల లెక్కలు ఇంకా తేలాలి. అలాంటిది సవరించిన అంచనాల్లో రెవెన్యూ లోటును రూ.41,118.36 కోట్లకు పరిమితం చేస్తామంటున్నారు.

రెవెన్యూ రాబడులు పెరగకుండా..

మరోవైపు రెవెన్యూ రాబడులు ఆశించినంత మేర పెరగడం లేదు. బడ్జెట్‌లో భారీ స్వరూపం చూపేందుకు, ఎక్కువ ఆశలు, ఆకాంక్షలు ప్రస్తావించే క్రమంలో రెవెన్యూ రాబడిని ఎక్కువ చేసి చూపుతున్నారు. అదే సమయంలో రెవెన్యూ ఖర్చులను నియంత్రించడం సాధ్యం కావడం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ రాబడులు 2024-25 ఆర్థిక సంవత్సరం కన్నా 4% మాత్రమే పెరుగుతున్నాయని లెక్కలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ రెవెన్యూ లోటును పరిమితం చేయడం అంత సులభం కాదు.

రాబడి సాధించడమే అసలు సవాల్..

ఈనాడు-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రూ.3,32,205.34 కోట్ల మేర బడ్జెట్‌ను సమర్పించి, అందులో రూ.2,34,140.14 కోట్ల రెవెన్యూ రాబడి ద్వారా సాధిస్తామని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తోంటే ఆ స్థాయిలో రాబడి సాధించడమే అసలు సవాల్. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.2,17,976.53 కోట్లు రెవెన్యూ రాబడి అంచనా వేశారు. సవరించిన అంచనాల్లో అది రూ.1,96,903.53 కోట్లకే పరిమితం చేశారు. జనవరి నెలాఖరు వరకు ఉన్న లెక్కల ప్రకారం రూ.1.40 లక్షల కోట్లే రెవెన్యూ రాబడి అని ప్రభుత్వమే పేర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాలను చేరుకోవడమూ కష్టమే. అలాంటిది వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.2.34 లక్షల కోట్లు ఎక్కడి నుంచి వస్తాయనేది ప్రశ్నార్థకమే! ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి నెలాఖరు వరకు కేంద్ర పన్నుల్లో వాటాలు రూ.46,127 కోట్లు, ఆర్థిక సంఘం గ్రాంట్లు రూ.4,099 కోట్లు మాత్రమే వచ్చాయి. రాష్ట్ర సొంత రాబడి రూ.75,909 కోట్లు సాధించాం. మొత్తం మీద ప్రత్యేక మార్జిన్‌తో సహా జనవరి నెలాఖరు వరకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ రాబడి రూ.1,40,540 కోట్లుగా అధికారిక లెక్కలే తెలియజేస్తున్నాయి. అలాంటిది వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.2.34 లక్షల కోట్లు ఆశిస్తున్నారు.

గత ఆర్థిక సంవత్సరం అంచనాలకు, రాబడికి మధ్య ఉన్న వ్యత్యాసం ఇలా ఉంది.. మరి వచ్చే ఆర్థిక సంవత్సరం అంచనాలు సాధించడం సాధ్యమా?

(అంకెలన్నీ రూ.కోట్లలో)

	2025–26		2026–27
	అంచనాలు	సవరించిన అంచనాల ప్రకారం వచ్చేది	రాబడి అంచనాలు
కేంద్ర పన్నుల్లో వాటాలు	57,566.31	56,741.18	64,362.16
రాష్ట్ర పన్నుల రాబడి	1,09,006.78	98,025.18	1,25,845.78
పన్నేతర రాబడి	19,119.04	14,324.18	11,473.98
కేంద్ర గ్రాంట్లు	32,284.40	27,812.99	32,458.22

న్యాయశాఖకు రూ.1,352 కోట్ల బడ్జెట్

- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడంలో న్యాయశాఖ కీలకపాత్ర పోషిస్తుందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయ పాలన కోసం 2026-27 బడ్జెట్‌లో రూ.1,352.49 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. న్యాయశాఖకు సంబంధించి గత బడ్జెట్‌లో రూ.1222.03 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో అదనంగా రూ.130.46 కోట్లు కేటాయించారన్నారు. హైకోర్టు భవన పనుల నిమిత్తం రూ.30 కోట్లు, న్యాయవాదుల సంక్షేమ సంఘాల కోసం రూ.32 కోట్లు, బాధితుల పరిహార పథకం కోసం రూ.2 కోట్లు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కోర్టు భవనాల నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం రూ.180.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో 27 కోర్టు హాళ్లు, 15 నివాస గృహసముదాయాల నిర్మాణానికి రూ 216.27 కోట్ల పరిపాలన అనుమతులు ఇవ్వడంతో పాటు మృతిచెందిన 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలకు రూ.46 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. న్యాయాధికారులు వృత్తి నైపుణ్యం పెంచుకోవడానికి జ్యుడీషియల్ అకాడమీ ద్వారా 19 శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, అందులో 3,998 మంది పాల్గొన్నారని వెల్లడించారు.

ఒకటో తరగతి నుంచి ఒకటే ఉద్యోగం వరకు..





ఇద్దరిదీ ఒకటే ఊరు.. ఒకటే బడి.. ఒకే కళాశాల.. ఉద్యోగమూ ఒకే శాఖలో.. ప్రస్తుతం కొలువూ కలిసిమెలిసే. వారే పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం సల్కునూరు గ్రామస్థులైన వీరు పదో తరగతి వరకు గ్రామకూడలిలోని శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో చదువుకున్నారు. ఇంటర్, డిగ్రీలను మిర్యాలగూడలో పూర్తిచేశారు. డిగ్రీ అనంతరం పోలీసుశాఖలో ఎస్ఐ ఉద్యోగాలకు దరఖాస్తు చేసి 2007 బ్యాచ్‌లో ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం నగరంలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. అనుకోకుండా ఇద్దరూ ఉప్పల్ ట్రాఫిక్ ఠాణాకు ఏడాదిన్నర క్రితం బదిలీ అయ్యారు. అక్కడ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు, ఆర్ఐ (రిజర్వ్ ఇన్‌స్పెక్టర్)గా మల్లేశ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాము చిన్ననాటి స్నేహితులమనే విషయం ఎవరికీ తెలియదని నవ్వుతూ చెప్పారు. – ఈనాడు హైదరాబాద్

తెలంగాణలో గెలుపుపై పవన్ హర్షం

ఈనాడు-అమరావతి: తెలంగాణ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో ఒక కౌన్సిలర్, ఒక కార్పొరేటర్ స్థానంలో జనసేన అభ్యర్థులు గెలవడంపై ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. జనసేన ఉద్భవించిన తెలంగాణలో పార్టీ తొలి అడుగు పడిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

తిరోగమన బడ్జెట్: సీపీఎం


ఈనాడు, అమరావతి: రాష్ట్ర బడ్జెట్ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయానికి తోడ్పడే విధంగా లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. "వికసిత ఆంధ్రప్రదేశ్ మాటల్లో గొప్పగా.. చేతల్లో శూన్యంలాగా ఉంది. సూపర్ సిక్స్‌లో భాగమైన మహిళలకు నెలకు రూ.1,500, నిరుద్యోగ భృతి గురించి పట్టించుకోలేదు. రూ.75 వేల కోట్ల లోటు పూడ్చుకోవడానికి ప్రజలపై అదనపు భారం పడే ప్రమాదం ఉంది. మొత్తం మీద ఈ బడ్జెట్ తిరోగమన దిశలో ఉంది" అని విమర్శించారు.

యువత, మహిళలకు మొండిచేయి: సీపీఐ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి కేటాయింపులు శూన్యమని.. యువత, మహిళలకు మొండిచేయి చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. "బడ్జెట్ ప్రసంగం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు పొగడ్తలతోనే సరిపోయింది. నిరుద్యోగులు, మహిళలు, రైతులు, ఉద్యోగులను ఈ బడ్జెట్ మోసగించింది. ప్రధానంగా ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెలా మహిళలకు రూ.1,500 ఇచ్చే పథకం ప్రస్తావనే లేదు" అని పేర్కొన్నారు.

రాహుల్‌కు ఆర్థికవ్యవస్థపై అవగాహన లేదు

• కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



ముంబయి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి భారత ఆర్థికవ్యవస్థపై అవగాహన లేదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఎద్దేవా చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ప్రధాన ప్రతిపక్ష నేత తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ రైతులను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌పై శనివారం ముంబయిలో విలేకరులతో మాట్లాడిన గోయల్.. రాహుల్‌గాంధీ సత్యానికి చాలా దూరంలో ఉన్నారన్నారు. విశ్వసనీయత కల్గియున్న ఆయనలాంటి నేతలు ఎంత ప్రయత్నించినా దేశానికి ప్రధాని మోదీ చేసే సేవలను అపలేరన్నారు. పత్తి సాగు, వ్యవసాయానికి సంబంధించి భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందంపై రాహుల్ గాంధీ చేసిన విమర్శలపై ఆయన మండిపడ్డారు. "భారతదేశ అవసరాలు రెండింతలు పెరుగుతున్నాయి. దేశం మొత్తం ఎగుమతుల్లో వస్త్రాల దాదాపు రూ.3.60 లక్షల కోట్ల వాటా కలిగి ఉన్నాయి. ఇది రాజీవ్ గాంధీ రెట్టింపు కంటే ఎక్కువ ఉంటుంది. అమెరికా ఏటా దాదాపు రూ.9 లక్షల కోట్ల విలువైన వస్త్ర ఉత్పత్తులను కొనుగోలు చేస్తోంది. అంతర్జాతీయ ఖాదీయ వస్తువులపై పరస్పర సుంకాలను ముసుపటి 50% నుంచి 18 శాతానికి తగ్గించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌పై ఈ భారం అతి తక్కువ" అని పీయూష్ గోయల్ అన్నారు.

సుప్రీంకోర్టులో 19 ఏళ్ల విద్యార్థి వాదనలు



అథర్వ్ చతుర్వేది

ఇంటర్నెట్‌డెస్క్: సుప్రీంకోర్టులో వెనుకబడిన వర్గాల కోసం ఓ 19 ఏళ్ల కుర్రాడు చేసిన వాదనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అతడి ప్రయత్నాన్ని గుర్తించిన సర్వోన్నత న్యాయస్థానం.. 10 నిమిషాల వాదన అనంతరం అతడికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్‌కు చెందిన లాయర్ మనోజ్ చతుర్వేది కుమారుడు అథర్వ్ చతుర్వేది. అతడు రెండుసార్లు నీట్ రాసి, 530 స్కోర్‌తో పాసయ్యాడు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఏదో ఒక ప్రైవేట్ కాలేజీలో సీటు కచ్చితంగా వస్తుందని ధీమాగా ఉన్నాడు. అయితే ల్యాక్‌రౌండ్ కౌన్సెలింగ్‌లో కూడా అతడికి సీటు రాలేదు. తమ రాష్ట్రంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేయకపోవడం వల్లే తనకి సీటు రాలేదని గ్రహించాడు. తనలాంటి ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని భావించి, గత 6న స్వయంగా తయారు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశాడు. 10 నిమిషాల సమయాన్ని అర్థించి.. తన వాదన వినిపించాడు. అతడికి సీటు రాకపోవడాన్ని అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ప్రైవేటు కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటాను రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేయనందున అతని అడ్మిషన్‌ను తిరస్కరించకూడదని కోర్టు పేర్కొంది. 2025-2026 సెషన్‌లో అతడికి అడ్మిషన్ ఇవ్వాలని నేషనల్ మెడికల్ కమిషన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

పన్నూ హత్యకు కుట్ర కేసులో..

నేరం అంగీకరించిన భారతీయ పౌరుడు

• అమెరికా అటార్నీ కార్యాలయం వెల్లడి

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్‌లో నివసిస్తున్న ఖలిస్థానీ ఉగ్రవాది, సిఖ్ ఫర్ జస్టిస్ సంస్థ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న భారతీయుడు నిఖిల్ గుప్తా న్యూయార్క్ కోర్టులో తన నేరాన్ని అంగీకరించాడు. ఈ ఏడాది మే 29న న్యాయస్థానం శిక్షను ఖరారు చేయనుంది. ఈ విషయాన్ని అమెరికా అటార్నీ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. అమెరికా కాలమానం ప్రకారం గురువారం నిఖిల్ గుప్తా యూఎస్ మేజిస్ట్రేట్ జడ్జి సారా నెట్‌బర్న్ ముందు హాజరయ్యాడు. పన్నూను హత్య చేయడానికి కాంట్రాక్టు ఇచ్చినట్లు ఒప్పుకున్నాడు. హత్యకు ప్లాన్ చేయడంతోపాటు మనీలాండరింగ్ వంటి ఆరోపణలను కూడా అంగీకరించాడు. ఈ మేరకు నిఖిల్ గుప్తాకు సుమారు 40 ఏళ్ల జైలుశిక్ష విధించే అవకాశముందని సదరన్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్ అటార్నీ జే క్లేటన్ తెలిపారు. 2023లో భారత ప్రభుత్వ ఉద్యోగి వికాస్ యాదవ్‌తో కలిసి పన్నూను హత్య చేసేందుకు నిఖిల్ గుప్తా కుట్ర పన్నారని అమెరికా ప్రాసిక్యూటర్లు అభియోగం మోపారు. ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన భారత్ దీనిపై విచారణ జరిపేందుకు 2024లోనే స్వదేశంలో ఓ దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేసింది. అభియోగాల్లో పేర్కొన్న వికాస్ యాదవ్ ప్రస్తుతం భారత ప్రభుత్వ సర్వీసులో పనిచేయడం లేదని స్పష్టం చేసింది.

కేరళ బాలిక మృతి వెనుక 'కొరియన్ ఫ్రెండ్' కోణం

ఇంటర్నెట్ డెస్క్: దక్షిణ కొరియా ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడి, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ముగ్గురు బాలికలు ఆత్మహత్య చేసుకున్న తరహా మరో ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. గత నెలలో కేరళకు చెందిన ఓ బాలిక మృతి వెనుక కూడా కొరియన్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ప్రభావం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కొచ్చిన్‌కి చెందిన విద్యార్థిని (16) జనవరి 27న పాఠశాలకు వెళ్తున్నట్లు చెప్పి బయటకు వెళ్లింది. అనంతరం క్వారీలో శవమై కనిపించింది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఆత్మహత్య చేసుకోవడానికి ముందు బాలిక రాసిన లేఖను గుర్తించారు. అందులో తన 'కొరియన్ ఫ్రెండ్' మరణంతో తీవ్ర వేదనకు గురయ్యానని.. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పేర్కొంది. ఈ విషయాన్ని తెలుసుకోవడానికి అధికారులు బాలిక ఫోన్‌ను తనిఖీ చేయగా.. 'ఖాక్ వీనమ్' అనే ఉన్న కొరియన్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను అనుసరించినట్లు గుర్తించారు. ఈ ఘటన అనంతరం ఆ ఖాతాలోని పోస్ట్‌లను అధ్యయనం చేస్తున్నారు. దీంతో ఆ యాప్ వెనుక యువతను తీవ్ర చర్యలకు ప్రేరేపించే అసాంఘిక శక్తుల హస్తం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

తొమ్మిది రాష్ట్రాల్లో సమయానికి పూర్తికాని సర్

దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కసరత్తు పూర్తి చేయడంలో తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలు వెనుకబడ్డాయి. నిర్దిష్ట తేదీ నాటికి సవరించిన తుది ఓటరు జాబితాలను ప్రచురించలేకపోయాయి. కేంద్ర పాలిత ప్రాంతాలైన లక్షద్వీప్, పుదుచ్చేరిలు మాత్రం ఈ విషయంలో ముందంజలో ఉన్నాయి. ఈ కేంద్ర పాలిత ప్రాంతాలు రెండూ శనివారం తుది ఓటరు జాబితాలను ప్రకటించాయి. తమ తుది ఓటరు జాబితాలో 9,44,211 మంది ఓటర్లు ఉన్నారని పుదుచ్చేరి ఎన్నికల ప్రధానాధికారి ప్రకటించారు. సర్ కసరత్తు అనంతరం లక్షద్వీప్ ఓటరు జాబితాలో 57,607 మంది ఓటర్లు మిగిలారు. ప్రత్యేక ముమ్మర సవరణ రెండో దశ కసరత్తు అక్టోబరు 27న ప్రకటించారు. రెండో దశ ఈనెల 7న తుది ఓటరు జాబితా ప్రకటనతో ముగియాల్సి ఉంది. సవరించిన షెడ్యూలు ప్రకారం రాజస్థాన్, కేరళ, ఛత్తీస్‌గఢ్, గోవా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతమైన అండమాన్ దీవులు ఈనెల 21న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నాయి. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలు తుది జాబితాలను ఈనెల 17న ప్రచురిస్తాయి. పశ్చిమ బెంగాల్‌లో తుది జాబితా ఈనెల 28న, మధ్యప్రదేశ్‌లో 23న, ఉత్తర్ ప్రదేశ్‌లో ఏప్రిల్ 10న ప్రచురిస్తారు.

జవాన్ల త్యాగాన్ని భారత్ ఎన్నటికీ మరిచిపోదు

• పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన సైనికులకు మోదీ నివాళి

దిల్లీ: పుల్వామా దాడి జరిగి ఏడేళ్లయిన సందర్భంగా అమరవీరులకు ప్రధాని నరేంద్ర మోదీ, ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు శనివారం నివాళులర్పించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ జవాన్లపై ఉగ్రవాదులు భీకర దాడికి పాల్పడిన ఘటనలో 40 మంది సైనికులు మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనను మోదీ గుర్తుచేసుకుంటూ.. "జవాన్ల త్యాగాన్ని భారత్ ఎన్నటికీ మరిచిపోదు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల ధైర్యం, దేశభక్తి ప్రతి భారతీయుడికి ఇప్పటికీ స్ఫూర్తినిస్తోంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టి మన భద్రతా దళాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. మానవాళికి అతిపెద్ద శత్రువైన ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు భారత్ కట్టుబడి ఉంది" అని ఎక్స్‌లో మోదీ పోస్ట్ చేశారు. పుల్వామా ఉగ్రదాడిలో వీరమరణం పొందిన వీరుల త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల అంకితభావం, సంకల్పం, దేశ సేవలు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని అమిత్ షా పేర్కొన్నారు. నాటి ఉగ్ర దాడిలో అమరులైన మన సైనికుల చిరస్మరణీయ త్యాగం ప్రజల గుండెల్లో నిలిచిపోతుందని, వారు చేసిన అత్యున్నత త్యాగానికి దేశం ఎప్పటికీ వారికి రుణపడి ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా పుల్వామా అమరవీరులకు నివాళులు అర్పించారు. ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల కుటుంబసభ్యులు కొందరు చండీగఢ్‌లో సమావేశమై నివాళులర్పించారు.

కారులోనే ప్రేయసిని కాల్చేసి.. తనూ కాల్చుకుని..

• ప్రేమికుల రోజు నొయిడాలో ఘటన



నొయిడా: ప్రేమికుల రోజున ప్రేయసిని హత్యచేసి, ఓ వ్యక్తి తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన నొయిడాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దాద్రీ రోడ్డులో ఓ కారు చాలా సమయం నుంచి నిలిచి ఉందని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా కారు లోపల రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. వీరిని దిల్లీలోని త్రిలోక్‌పురికి చెందిన సుమిత్(32), రేఖ(26)లుగా గుర్తించారు. సుమిత్ మొదట రేఖ తలపై కాల్చి చంపి, అనంతరం ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. సుమిత్ చేతిలో ఉన్న తుపాకీ ఆధారంగా నిర్ధారణకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ మరణాలకు గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

'ఎన్సీపీ'ల విలీనం లేనట్లే

• సంజయ్ రౌత్



ముంబయి: వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్ పోటీచేసే యోచనలో ఉన్నట్లు శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ వెల్లడించారు. ఈ అంశంపై మహారాష్ట్రలో విపక్ష కూటమి మహావికాస్ అఘాడీ చర్చలు జరుపుతోందన్నారు. ఎన్సీపీలు విలీనమయ్యే అవకాశాలు దాదాపుగా లేనట్లేనని స్పష్టంచేశారు. వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేస్తానని పవార్ చెప్పారని, దీనిపై కూటమిలోని మూడు పార్టీలు నిర్ణయం తీసుకుంటాయన్నారు. వచ్చే ఏప్రిల్‌లో పవార్ సహా మరో ఏడుగురు రాజ్యసభ నుంచి పదవీ విరమణ చేయనున్నారు. మరోవైపు, ఛాతీ నొప్పితో ఆసుపత్రిలో చేరిన శరద్ పవార్.. డిశ్చార్జ్ అయినట్లు ఆయన కుమార్తె సుప్రియా సూలే వెల్లడించారు. మూడు, నాలుగు రోజులపాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు చెప్పారు.

చర్చలు ముగిశాయి: ఎన్సీపీ(ఎస్పీ)

ఎన్సీపీల విలీనంపై పార్టీ నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. విలీనానికి సంబంధించిన చర్చలు ఎన్సీపీ(ఎస్పీ)లో ఇక ముగిశాయంటూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శశికాంత్ శిందే స్పష్టంచేశారు. స్థానిక ఎన్నికల అనంతరం విలీనంపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. మరోవైపు, అజిత్‌పవార్ మరణానంతరం శశికాంత్ శిందే 'రాష్ట్రవాది' మ్యాగజైన్‌లో రాసిన ఆర్టికల్‌పైన ఎన్సీపీ నేతలు విమర్శలు గుప్పించారు. ఆ ఆర్టికల్ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని, వెంటనే శిందే క్షమాపణలు చెప్పాలని ఎన్సీపీ అధికార ప్రతినిధి ఆనంద్ పరాంజ్‌పే డిమాండ్ చేశారు.

నరవణె పుస్తకంపై వివాదం వేళ.. 20 ఏళ్ల కూలింగ్ ఆఫ్ పీరియడ్..?

ఇంటర్నెట్‌డెస్క్: భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం రాజకీయంగా వివాదాస్పదమవుతోంది. ఈ నేపథ్యంలో మిలిటరీ అధికారులు సహా అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులకు సంబంధించిన పుస్తకాల విషయంలో కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చే యోచనలో ఉంది. ఆయా అధికారులు పదవుల నుంచి విరమణ పొందిన తర్వాత 20 ఏళ్ల వరకు వారి పుస్తకాలు పబ్లిష్ కాకుండా తప్పనిసరిగా 'కూలింగ్ ఆఫ్ పీరియడ్'ను అమలుచేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆంగ్ల మీడియాలో కథనాలు వచ్చాయి.

బెర్లిన్ చిత్రోత్సవం నుంచి తప్పుకొన్న అరుంధతీ రాయ్

కళకు రాజకీయం ఉండకూడదన్న జ్యూరీ వ్యాఖ్యలపై విమర్శ

దిల్లీ: బుకర్ ప్రైజ్ విజేత, రచయిత్రి అరుంధతీ రాయ్ బెర్లిన్ చలన చిత్రోత్సవం నుంచి తప్పుకొన్నారు. గాజా సంక్షోభంపై వచ్చిన ప్రశ్నలకు జ్యూరీ సభ్యులు చేసిన వ్యాఖ్యలపై ఆమె తీవ్ర విచారం వ్యక్తంచేశారు. సినిమా, కళ అనేవి రాజకీయాలకు దూరంగా ఉండాలన్న జ్యూరీ అధ్యక్షుడు విమ్ వెండర్స్ చేసిన వ్యాఖ్యలను ఆమె తప్పు పట్టారు. మానవత్వంపై దాడులు జరుగుతున్నప్పుడు కళాకారులు మౌనంగా ఉండటం సరికాదని, కళ రాజకీయాలకు అతీతమనడం తనను విస్మయ పరిచిందని ఆమె పేర్కొన్నారు. ఇది మానవ హక్కుల ఉల్లంఘనపై చర్చను అణిచివేసే ప్రయత్నమని ఆమె విమర్శించారు.

ఆగి ఉన్న ట్రక్కును ఢీకొన్న కారు

ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు సహా డ్రైవర్ మృతి

ధమ్‌తరీ: ఆగి ఉన్న ట్రక్కును కారు ఢీకొట్టడంతో డ్రైవరు సహా ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు మృతిచెందిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకుంది. జగదల్‌పుర్-రాయ్‌పుర్ జాతీయ రహదారిపై ప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. మృతులను సీఆర్పీఎఫ్ 201 బెటాలియన్ కోబ్రా జవాన్లు సౌరభ్ తోమర్, ముఖేశ్ కుమార్, రాజ్‌కుమార్ గాడ్‌లుగా, డ్రైవర్‌ను హీరాలాల్ నగర్‌గా గుర్తించారు. జవాన్లు బస్తర్ జిల్లాలోని ప్రధాన కార్యాలయం నుంచి సెలవుపై స్వగ్రామాలకు వెళ్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు ధమ్‌తరీ జిల్లాలోని కప్రీ గ్రామానికి సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టింది.



చెడు చూడకు, చెడు వినకు, చెడు మాట్లాడకని సందేశమిస్తూ కళ్లు, చెవులు, నోరు మూసుకున్న మూడు బొమ్మలను చాలా ఏళ్లుగా చూస్తున్నాం. ప్రస్తుతం వాటి సరసన చెవి దగ్గర సెల్‌ఫోన్ పట్టుకున్న ఇంకో బొమ్మ చేరింది. ఫోన్ అతిగా వినియోగిస్తే అనేక అనర్థాలు ఉంటాయన్నది దీని సందేశం. పైగా ఇప్పుడు చెడు చూడటం, వినడం, మాట్లాడటం ఫోన్లలోనే ఎక్కువయ్యాయి. ముఖ్యంగా డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు ఫోన్ వినియోగించడం ప్రాణాలకే ప్రమాదం. దీంతో చాలామంది తమ కార్ల కాక్‌పిట్‌లో ఈ నాలుగు బొమ్మలను ఉంచుతున్నారు. నిర్మల్ జిల్లా మామడ మండలంలో ఓ అటవీ అధికారి ఇలానే తన కారులో పెట్టుకున్నారు.

- న్యూస్‌టుడే, మామడ

అంధులకు ఏఐ కళ్ల'జోడీ'



రాత్రుళ్లు కాసేపు కరెంటు పోతే ఇబ్బందిపడతాం. రోజూ తిరిగే ఇల్లు అయినా చీకట్లో నాలుగు అడుగులైనా వేయలేం. ఇక పూర్తిగా చూపు లేని వారి ఇబ్బందులు వర్ణనాతీతం. ఎక్కడికి వెళ్లాలన్నా ఎవరో ఒకరు తోడు ఉండాలి. ఈ సమస్యకు దారి చూపే ఏఐ కళ్లజోడు కనిపెట్టారు ఐఐటీ హైదరాబాద్ విద్యార్థి సోహమ్. అంధులు దీనిని ధరిస్తే సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. ఈ స్మార్ట్ కళ్లజోడు ఎదురుగా రోడ్డుపై ట్రాఫిక్, గతుకులు వంటి వాటిని ముందే చెప్పి హెచ్చరిస్తుందని చెప్పారు. ఏ బస్సు ఎక్కాలో వాటి బోర్డుపై ఉన్న పేర్లను చదివి వినిపిస్తుందన్నారు. ప్రయోగాత్మక దశలో మంచి ఫలితాలు వచ్చాయని, తొలుత తన అంధ మిత్రుడైన దీప్‌కు అందించి తర్వాత అందరికీ అందుబాటులోకి తెస్తానని ఈ ఎంటెక్ విద్యార్థి పేర్కొన్నారు. – ఈనాడు, సంగారెడ్డి

సీపీఐ అగ్రనేత గిరిప్రసాద్ సతీమణి కమలాదేవి కన్నుమూత



కమలాదేవి

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ అగ్రనేత నల్లమల గిరిప్రసాద్ సతీమణి కమలాదేవి (87) శనివారం ఉదయం 10 గంటలకు తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె భౌతికకాయాన్ని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఎంపీ, ఎమ్మెల్యేల కాలనీలో ఉన్న ఆమె పెద్ద కుమార్తె వనశ్రీ నివాసంలో సాయంత్రం 4 గంటల వరకు బంధువులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

విమానంలో ఆత్మాహుతి బాంబర్లు ఉన్నారని బెదిరింపులు

శంషాబాద్, న్యూస్‌టుడే: 'ప్రయాణికుల మాటున దిల్లీ విమానంలో ఐదుగురు ఆత్మాహుతి బాంబర్లు ప్రయాణిస్తున్నారు.. శంషాబాద్‌లో ల్యాండింగ్ కాగానే ఆ విమానాన్ని పేల్చివేస్తాం' అంటూ గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆర్జీఐఏ ఈ-మెయిల్‌కు సందేశం పంపించాడు. ఈ సంఘటన శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో చోటుచేసుకుంది. విశ్వసనీయ అధికారుల కథనం ప్రకారం.. దిల్లీ నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ 6ఇ-425 విమాన సర్వీసు ప్రయాణికులతో హైదరాబాద్‌కు టేకాఫ్ తీసుకుంది. గగనతలంలో ప్రయాణిస్తున్న ఆ విమానంలో సూసైడ్ బాంబర్లు ఎక్కినట్లు ఈ-మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన భద్రతాధికారులు ల్యాండింగ్ కాగానే ఆ విమానాన్ని నిర్జన ప్రదేశానికి తరలించారు. ఎయిర్‌సైడ్ బృందం అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేయగా.. విమానంలో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద ప్రయాణికులు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌కు ఇలాంటి బాంబు బెదిరింపు సందేశాలు రావడం ఈ వారంలో ఇది రెండోసారి. జీహెచ్ఐఏఎల్ అధికారుల ఫిర్యాదు మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'బ్లూ జెట్'తో రాష్ట్రానికి రూ.2,300 కోట్ల పెట్టుబడులు

• ఏఐ, క్వాంటమ్‌లే కాదు... మానవ సంబంధాలూ ముఖ్యమే

• మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: యలమంచిలిలో ఈనెల 28న శంకుస్థాపన చేయనున్న బ్లూ జెట్ పరిశ్రమతో రూ.2,300 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శనివారం అసెంబ్లీ లాబీలో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఏఐ, క్వాంటమ్ ఎంత ముఖ్యమో.. మానవ సంబంధాలూ అంతే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. 'రాజకీయంగా సిద్ధాంతాలు ఎంత అవసరమో నేతలతో ఆత్మీయానుబంధమూ అంతే అవసరం. ఈ విషయం ప్రధాని మోదీ నుంచి నేర్చుకున్నా. ప్రధానిగా మోదీ బిజీగా ఉన్నా.. నేతలెవరికైనా బాగోలేకపోతే వారికి ఫోన్ చేసి మాట్లాడుతారు' అని చెప్పారు. 'క్వాంటమ్, ఏఐ ముఖ్యమంత్రి చంద్రబాబు చూసుకుంటారు. నేను మానవ సంబంధాలు చూసుకుంటున్నా. అందుకే ఆత్మీయ సమావేశాలు పెడుతున్నా. రాత్రి 9:30 గంటలు దాటినా ఈ సమావేశాల నుంచి కదిలేందుకు నేతలు ఇష్టపడటం లేదు. బరువు మరీ ఎక్కువగా తగ్గుతున్నానని అందరూ నాకు చెబుతున్నారు.. కానీ, ఇంకో 2 కిలోలు తగ్గితే నా లక్ష్యం పూర్తవుతుంది' అని వివరించారు. పార్టీ పరంగా నేతలంతా ఏబీసీ(ఆల్వేస్ బీ క్యాంపెయినర్) ఫార్ములాతో నిత్యం ప్రజల్లో ఉండాలని లోకేశ్ చెప్పారు. ఒకసారి పార్టీ నిర్ణయం తీసుకున్నాక ఎవరైనా సరే దానికి కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

సభలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన వస్తోంది

• స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అమరావతి: శాసనసభా సమావేశాలను ప్రత్యక్షంగా చూసేందుకు విద్యార్థుల నుంచి విశేష స్పందన వస్తోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. చట్టసభల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలనే సభా వ్యవహారాలను ప్రత్యక్షంగా చూసే ఏర్పాట్లు చేశామన్నారు. శనివారం ఆయన విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. నాలుగు రోజుల్లోనే 22 పాఠశాలలకు చెందిన 798 మంది విద్యార్థులు అసెంబ్లీకి వచ్చారని తెలిపారు.

ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి సత్యకుమార్‌కు లోకేశ్ విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: 'ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారు డయాలసిస్ చేయించుకునేందుకు ఇచ్ఛాపురంలో సరిపడా యంత్రాలు లేవు. దీంతో 40 కి.మీ. దూరం వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవాల్సి వస్తోంది. వారి ఇబ్బందుల్ని అర్థం చేసుకుని కొత్త డయాలసిస్ కేంద్రాల్ని మంజూరు చేయండి' అంటూ ఎక్స్ వేదికగా పి.ప్రవీణ్ అనే వ్యక్తి చేసిన విజ్ఞప్తికి మంత్రి లోకేశ్ స్పందించారు. సదరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను ఆయన కోరారు. దీనిపై స్పందించిన సత్యకుమార్.. సమస్య తీవ్రతను విశ్లేషించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'ప్రజల ఆశలకు అనుగుణంగాలేని బడ్జెట్'

ఈనాడు, అమరావతి: 'వాస్తవ వార్షిక ఆదాయానికి దూరంగా.. ఆర్థిక లోటుతో బడ్జెట్ ఉంది. ప్రజల ఆశలకు అనుగుణంగా లేదు. సంపద సృష్టించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెడుతోంది. పీపీపీ, ప్రైవేటీకరణ చుట్టూ తిరుగుతూ పెట్టుబడిదారులకు అనుకూలంగా రూపొందించారే తప్ప.. పేదలు, సామాన్య, కార్మిక వర్గాలకు అనుకూలంగా లేదు' అని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గురుమూర్తి అన్నారు.

రైతుల జిరాయితీ భూములు

ఆక్రమించిన వైకాపా నేతలు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వంలో రైతుల జిరాయితీ భూముల్ని ఆక్రమించి అందులో మట్టిరోడ్డు వేసిన స్థానిక వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా రోలుగుంటకు చెందిన రామకృష్ణ, నరసింహమూర్తి కోరారు. వీరికి పోలీసులు సహకరిస్తున్నారని... ఈ అన్యాయాన్ని ప్రశ్నించిన తమను బెదిరిస్తున్నారని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ సుజయకృష్ణరంగారావు, మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. బాకీ చెల్లించినా తనఖా పెట్టుకున్న పొలం పత్రాల్ని ఇవ్వకుండా వేధిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా వెంగళాయపాలేనికి చెందిన భాగ్యలక్ష్మి కోరారు. వైకాపా సానుభూతిపరులకు మండలంలోని అభివృద్ధి పనుల్ని ఎంపీడీవో ఏకపక్షంగా కేటాయిస్తున్నారని అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన మారప్ప ఫిర్యాదు చేశారు.

సమస్య పరిష్కారంపై ఏపీఎంసీపీ హర్షం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కమ్యూనిటీ హెల్త్ అధికారు (సీహెచ్‌వో)లకు 2022 నుంచి పేరుకుపోయిన ప్రోత్సాహకాలు, అద్దెలు, బకాయిలు విడుదల చేస్తూ ఆర్థిక సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపిందని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్-కమ్యూనిటీ హెల్త్ అధికారుల అసోసియేషన్ (ఏపీఎంసీపీ) పేర్కొంది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.నిరంజన్, బి.సందీప్ కుమార్ ప్రభుత్వానికి, వైద్యారోగ్యశాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీఆర్ వైద్యసేవ బకాయిలు చెల్లించాలి

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ వైద్య సేవ కింద స్పెషాలిటీ ఆసుపత్రులకు చెల్లించాల్సిన రూ.3 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) డిమాండ్ చేసింది. నిధుల విడుదలలో జాప్యం వల్ల ఆసుపత్రుల నిర్వహణ, సిబ్బంది జీతాలకు ఇబ్బంది ఎదురవుతోందని వెల్లడించింది. ఎన్టీఆర్ వైద్య సేవకు బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయించినందున తక్షణమే బకాయిలు చెల్లించాలని ఆశా అధ్యక్షుడు డాక్టర్ కె.విజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

ప్రధాని అంకితభావాన్ని 'సేవాతీర్థ్' ప్రతిబింబిస్తోంది: సీఎం

ఈనాడు, అమరావతి: వికసిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఆధునిక, సమర్థవంతమైన పౌర కేంద్రీకృత పాలనా వ్యవస్థను నిర్మించడంలో ప్రధాని మోదీ అంకితభావాన్ని 'సేవా తీర్థ్' ప్రతిబింబిస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కొత్తగా నిర్మించిన ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో)- 'సేవా తీర్థ్' ప్రారంభోత్సవం సందర్భంగా మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి, దేశ ప్రజలకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

సహాయ కార్యదర్శి పోస్టులకు డీపీసీ ఏర్పాటుపై హర్షం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పరిపాలన వ్యవస్థలో కీలకమైన 92 రాష్ట్ర సచివాలయ సహాయ కార్యదర్శి పోస్టుల పదోన్నతులకు కమిటీ (డీపీసీ) ఏర్పాటు చేసేందుకు ఆమోదం లభించడం ఎంతో ఆనందదాయకమని ఏపీ సచివాలయ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. సచివాలయంలో పని చేసే సెక్షన్ అధికారులకు సహాయ కార్యదర్శులుగా పదోన్నతులు లభించనున్నాయి. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ పదోన్నతుల అంశాన్ని పరిష్కరించి, ఉద్యోగుల ఆశలు నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ శివరాత్రి శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: మహా శివరాత్రి శుభదినం మనందరిలో ప్రేమ, ఆప్యాయత, స్నేహం, సోదరభావం కలిగించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు శనివారం ఆయన శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిపై వెలుగు విజయాన్ని ఈ శివరాత్రి సూచిస్తుందని పేర్కొన్నారు.

మహాశివుడి అనుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పరమశివుడి అనుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అందరికీ మంచి జరగాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు ఎక్స్‌లో మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలపై పరమశివుడి అనుగ్రహం ఉండాలి: జగన్

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి జగన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ పరమభక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరిపై ఆ పరమశివుడి అనుగ్రహం ఉండాలని శనివారం ఆయన కోరుకున్నారు.

అదానీ కంపెనీకి ఊరట

• కేంద్ర సర్క్యులర్‌ను రద్దు చేసిన తెలంగాణ హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: విదేశీ వాణిజ్య విధాన అమలులో కార్యనిర్వాహక అధికారాలకు పరిమితులున్నాయంటూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ)కి తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. సర్వీస్ ఎక్స్‌పోర్ట్స్ ఫ్రం ఇండియా స్కీం (ఎస్ఈఐఎస్) కింద మంజూరైన ప్రయోజనాలను పరిమితం చేస్తూ డీజీఎఫ్‌టీ 2018లో జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేస్తూ ఇటీవల తీర్పు వెలువరించింది. ఆ సర్క్యులర్‌ను సవాలు చేస్తూ అదానీ గంగవరం పోర్ట్సు లిమిటెడ్ (ఏజీపీఎల్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ విదేశీ వాణిజ్య విధానంలో కొత్త అర్హత ప్రమాణాలను సర్క్యులర్ ద్వారా ప్రవేశపెట్టారని తెలిపారు. విధానపరమైన మార్పులు చేయాలంటే కేంద్రానికి మాత్రమే అధికారం ఉందని, డీజీఎఫ్‌టీకి లేదన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఎస్ఈఐఎస్ కింద ప్రయోజనాలను వాస్తవ ప్రొవైడర్లకే పరిమితం చేయరాదని, పాక్షిక పోర్ట్ ఆపరేటర్లకు వర్తింపజేయాలన్నారు. సర్క్యులర్ నేపథ్యంలో రూ.50 లక్షల జరిమానాతో ఏజీపీఎల్ చెల్లించిన రూ.2.95 కోట్లను వడ్డీతో సహా 4 వారాల్లో వాపసు చేయాలని ఆదేశించారు.